
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం
వెల: ₹ 8.00
సంపుటి: 18
సంచిక: 201
SUNDAY Special
ఆదివారం 12-10-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'




శుబ్ శతకం..
వెస్టిండీస్‌తో ఢిల్లీలో జరుగుతున్న రెండో టెస్టులో కెప్టెన్ శుబ్‌మన్ గిల్ అజేయ సెంచరీతో కదంతొక్కాడు. దీంతో భారత్ 518/5 స్కోరు వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. తర్వాత విండీస్ 140/4 స్కోరు చేసింది. - 14లో



శాంతి సమరం ఇంటి పాఠమే
నైతిక విలువల నుంచి సామాజిక నిబద్ధత, సాహస ప్రవృత్తి వరకు ఇంట్లో నుంచే నేర్చుకుంది నోబెల్ శాంతి పురస్కార గ్రహీత మరియా కొరినా. ఆమె కుటుంబ వారసత్వం, బంధాలు ఉద్యమ ప్రస్థానం గురించి ప్రత్యేక కథనం.. - 13లో




చైనాపై ట్రంప్ బాంబు
అమెరికాలోకి దిగుమతి అయ్యే చైనా ఉత్పత్తులపై అదనంగా 100 శాతం టారిఫ్‌లు విధించబోతున్నట్లు ట్రంప్ తేల్చిచెప్పారు.
- వివరాలు 6లో ▶



బెంగాల్‌లో మరో ఘోరం
పశ్చిమ బెంగాల్‌లోని ఓ వైద్య కళాశాల విద్యార్థినిపై గుర్తుతెలియని దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు.
- వివరాలు 6లో ▶



బిహార్‌లో తేలిన లెక్క!
బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే స్థానాలపై అధికార ఎన్డీఏ పక్షాలు ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.
- వివరాలు 6లో ▶



కిమ్ చేతిలో బ్రహ్మాస్త్రం!
ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ ఖండాంతర అణు వ్యూహాత్మక ఆయుధ వ్యవస్థ 'హసాంగ్-20'ను సిద్ధం చేశారు.
- వివరాలు 6లో ▶

కోటాపై ముందుకే!

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లపై సర్కారు నిర్ణయం
హైకోర్టు స్టేపై సుప్రీంకోర్టును ఆశ్రయించనున్న రాష్ట్ర ప్రభుత్వం

- ఉన్నత న్యాయస్థానం తీర్పు క్షుణ్ణంగా పరిశీలన
- సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, న్యాయ నిపుణుల విస్తృత చర్చలు
- రేపు స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయం
- రిజర్వేషన్లపై కసరత్తు, బిల్లుల పెండింగ్ సహా అన్ని విషయాలు వివరించాలన్న సీఎం
- త్వరలో జరిగే కేబినెట్ భేటీ ఎజెండాలో బీసీ రిజర్వేషన్లు
- సుప్రీంలో ఎలాంటి తీర్పు వస్తే ఎలా ముందుకెళ్లాలనే దానిపై చర్చించే చాన్స్



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలకు సంబంధించిన జీవోలు 9, 41, 42లను నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాల్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్న ఈ అంశంపై సోమవారం సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ వేయనుంది. హైకోర్టు తీర్పు దరిమిలా తదుపరి కార్యాచరణపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, మంత్రులు, న్యాయ నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు అన్ని కోణాల్లో చర్చించాక సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలుకే ప్రభుత్వం మొగ్గుచూపుతున్నట్లు అధికారవర్గాల సమాచారం. ఎట్టి పరిస్థితుల్లోనూ దేశంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కేలా చేయాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉన్నట్లు ఆ వర్గాలు చెబుతున్నాయి.

అన్నీ క్షుణ్ణంగా పరిశీలించాకే..
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బీసీ సంక్షేమశాఖ ఇచ్చిన జీవో నంబర్ 9తో పాటు దాని ఆధారంగా గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లలో రిజర్వేషన్ల ఖరారుపై పంచాయతీరాజ్ శాఖ జారీ చేసిన జీవోలు 41, 42ల అమలుపై హైకోర్టు స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఈ నెల 9 నుంచి అయిదు విడతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాల్లో ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్

మిగతా 2వ పేజీలో ▶



అన్నదాతలకు అభయం
ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన, తృణధాన్యాల మిషన్ ప్రారంభం
- దిగుమతులు తగ్గించుకోవాలి.. ఎగుమతులు పెంచుకోవాలి
- వికసిత్ భారత్ సాధనలో రైతన్నలదే కీలకపాత్ర
- ప్రజలకు ప్రొటీన్ భద్రత కోసం తృణధాన్యాల సాగును పెంచాలి
- ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

6 లో

ఆ 4 జిల్లాలకు ధన్‌ధాన్య
నాగర్‌కర్నూల్, నారాయణపేట, గద్వాల, జనగామ జిల్లా రైతులకు మహర్దశ
- వివరాలు 2లో ▶

Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate				
₹70	Ex Farm Live Bird	102 kg	Dressed with Skin	180 kg
	Retail Live Bird	124 kg	Skin Less	205 kg

Conditions Apply
Issued in the interest of consumers



చిరస్థాయిగా నిలిచేలా టీ స్క్వేర్
- ప్రత్యేక, వైవిధ్యమైన డిజైన్లను ఎంపిక చేయాలి
- వినోదం, పర్యాటకం, ఆహారం, వ్యాపారాల కూడలిగా రూపొందించాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

3 లో

జేఏసీగా బీసీలు!
- త్వరలో ఏర్పాటుకు బీసీ సంఘాల కసరత్తు.. నేడు హైదరాబాద్‌లో కీలక భేటీ.. పాల్గొననున్న బీసీ ప్రజాప్రతినిధులు, మేధావులు

2 లో

నకిలీ మద్యంలో ఈ ప్రశ్నలకు బదులేది?
12 లో

క్లుప్తంగా...

బీసీ రిజర్వేషన్లపై అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సాక్షి,హైదరాబాద్: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు విషయంలో హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటుచేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన నిర్వహించి, శాసనసభలో ఏకగ్రీవంగా బిల్లును రూపొందించి కేంద్రానికి పంపిస్తే, ఆరు నెలలైనా రాష్ట్రపతి నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని, రాష్ట్రపతి అయినా సరే మూడు నెలల్లోగా తేల్చాలని సుప్రీంకోర్టు చెప్పిందని గుర్తుచేశారు. మూడు నెలలు పూర్తయిన నేపథ్యంలో చట్టంగా తీసుకోవచ్చని సుప్రీంకోర్టు చెప్పినందున 42 శాతం రిజర్వేషన్స్ అమలు చేసుకునే అవకాశం ఉందని జాన్‌వెస్లీ తెలిపారు. అలా సాధ్యం కాకపోతే మొత్తం బీసీ ల రిజర్వేషన్స్ మీద కేంద్ర ప్రభుత్వంతో పోరాడి బిల్లును అమలు చేసే విధంగా 9వ షెడ్యూల్‌లో చేర్చేలా పోరాటం సాగించాలన్నారు.అఖిలపక్షం తీసుకునే నిర్ణయానికి సీపీఎం పూర్తిగా మద్దతిస్తుందన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లులపై కేంద్రం నిర్లక్ష్యం: కవిత



సాక్షి,హైదరాబాద్: తెలంగాణలో బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను రాష్ట్ర అసెంబ్లీ, శాసనమండలి ఆమోదించి ఆరు నెలలు గడిచినా, ఈ బిల్లులు రాష్ట్రపతి ఆమోదం కోసం నిరీక్షణలో ఉన్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఆందోళన వ్యక్తంచేశారు. ఈ బిల్లులకు చట్టబద్ధత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చొరవ తీసుకోలేదని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టును ఆశ్రయించి, రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వంపై న్యాయపోరాటం చేయాలన్నారు.

'రాజ్యాంగపరమైన రిజర్వేషన్లు కావాలి'

సాక్షి, హైదరాబాద్: రాజకీయపరమైన రిజర్వేషనన్లు వద్దని, రాజ్యాంగపరమైన రిజర్వేషన్లు కావాలని ప్రజా ఐక్య కూటమి కన్వీనర్, బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ అన్నారు. శనివారం సచివాలయ మీడియా పాయింట్ బయట ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పాత పద్ధతిలో స్థానిక ఎన్నికలకు వెళ్తే బీసీ సమాజం చూస్తూ ఊరుకోదన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చే బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు.

ఇదండీ సంగతి



..అంటే మీది డ్రామా అనా..!

ఆ 4 జిల్లాలకు ధన్‌ధాన్య

- నాగర్‌కర్నూల్, నారాయణపేట, గద్వాల, జనగామ జిల్లా రైతులకు మహర్దశ
- 8.75 లక్షల మంది రైతులు.. ఏటా రూ.960 కోట్లు.. 6 ఏళ్ల వరకు నిధులు
- వర్చువల్‌లో పీఎండీడీకేవైని ప్రారంభించిన ప్రధాని మోదీ
- ఈ నెలాఖరు వరకు జిల్లాల వారీగా యాక్షన్ ప్లాన్ ఖరారు



వర్చువల్‌గా ప్రధాని మోదీ మాట్లాడుతుండగా.. నారాయణపేట జిల్లా జాజాపూర్‌లో కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎంపీ డీకే అరుణ, కలెక్టర్ సిక్తపట్నాయక్ తదితరులు

పీఎండీడీకేవైకి ఎంపికైన జిల్లాల్లో సాగు విస్తీర్ణం.. రైతుల వివరాలు



జిల్లా	సాగు (ఎకరాల్లో)	రైతులు
నాగర్‌కర్నూల్	4.64 లక్షలు	3.34 లక్షలు
నారాయణపేట	4.27 లక్షలు	1.80 లక్షలు
జోగుళాంబ గద్వాల	5.42 లక్షలు	1.81 లక్షలు
జనగామ	3.40 లక్షలు	1.80 లక్షలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో వెనుకబడిన జిల్లాలను ప్రగతి బాట పట్టించేందుకు కేంద్రం ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన (పీఎండీడీకేవై)ను అమల్లోకి తెచ్చింది. ఈ పథకానికి దేశవ్యాప్తంగా 100 జిల్లాలను ఎంపిక చేయగా, తెలంగాణలో నాలుగు జిల్లాలకు చోటు దక్కింది. ఉమ్మడి పాలమూరులోని నాగర్‌కర్నూల్, నారాయణపేట, జోగుళాంబ గద్వాలతో పాటు ఉమ్మడి వరంగల్‌లోని జనగామను చేర్చడంతో ఆయా జిల్లాల్లోని రైతాంగంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా శనివారం ఈ పథకాన్ని ప్రధానమంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ నేపథ్యంలో పథకం అమలు తీరు.. రైతులకు చేకూరనున్న ప్రయోజనాలపై 'సాక్షి' కథనం.

ఒక్కో జిల్లాకు ఏటా రూ.240 కోట్లు

తక్కువ వ్యవసాయ ఉత్పాదకత కలిగిన జిల్లాలను గుర్తించిన కేంద్రం ఆయా ప్రాంతాల్లో ఉత్పత్తి పెంచే లక్ష్యంతో పీఎండీడీకేవైకి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు వంద జిల్లాలకు ఏటా రూ.24 వేల కోట్లు కేటాయిస్తుంది. ఆరేళ్ల పాటు ఈ నిధులు విడుదలవుతాయి. కేంద్రంలోని 11 మంత్రిత్వ శాఖల పరిధిలోని 36 పథకాలను సమ్మిళితం చేసి పీఎండీడీకేవైని అమలు చేస్తారు. కేంద్ర పథకాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వ పథకాల అనుసంధానం.. ప్రైవేట్ రంగాల భాగస్వామ్యంతో రైతులకు లబ్ధి చేకూరుతుంది.

పర్యవేక్షణకు నోడల్ అధికారులు

పీఎండీడీకేవై పర్యవేక్షణకు కేంద్రం పెద్దపీట వేసింది. ఎంపికైన జిల్లాలకు ఐఏఎస్ ఆఫీసర్లను నోడల్ అధికారులుగా నియమించింది. గద్వాల జిల్లాకు కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి పాసుమి బసు, నాగర్‌కర్నూల్‌కు మత్స్య శాఖ సంయుక్త కార్యదర్శి నీతూకుమారి ప్రసాద్‌ను నియమించింది. వీరిద్దరూ తెలంగాణ కేడర్ అధికారులే. నారాయణపేట జిల్లాకు బిహార్ కేడర్ ఐఏఎస్ అధికారి రమణకుమార్, జనగామ జిల్లాకు హోంశాఖ సంయుక్త కార్యదర్శిగా ఉన్న ఏజీఎంయూటీ కేడర్ అధికారిణి సుష్మా చౌహాన్ నియమితులయ్యారు.

జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో సమితులు..

పీఎండీడీకేవై అమలుకు జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిలో సమితులు ఏర్పాటుకానున్నాయి. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా ధన్ ధాన్య కృషి సమితిని ఏర్పాటు చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ముఖ్య కార్యదర్శి ఆధ్వర్యంలో రాష్ట్ర ధన్ ధాన్య కృషి సమితి, జాతీయ స్థాయిలో కేంద్ర మంత్రి, కార్యదర్శి స్థాయిలో ఏర్పాటైన సమితులు పథకం అమలును పర్యవేక్షిస్తాయి. నేల, నీటి సంరక్షణ, సహజ, సేంద్రియ సాగు విస్తరణతోపాటు మొత్తంగా వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో స్వయం సమృద్ధికి తగిన చర్యలు చేపడతారు. పండ్ల తోటలు, మత్స్య సంపద, తేనె టీగల పెంపకం, పశుపోషణ పెంపుతోపాటు పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌పై దృష్టి సారిస్తారు.

యాక్షన్ ప్లాన్‌కు కసరత్తు..

మొదటగా జిల్లా స్థాయిలో ఏర్పాటైన సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన క్షేత్రస్థాయిలో అధికారులు సర్వే నిర్వహిస్తారు. ఏ ప్రాంతంలో ఉత్పాదక లోపాలు (దిగుబడి తక్కువ), వైవిధ్యీకరణ పాటించకపోవడం (ప్రతి ఏటా ఒకే రకమైన పంట వేయడం), నీటి వనరులు, మార్కెట్ పరంగా మౌలిక సదుపాయాలు, శీతల గిడ్డంగుల కొరత, రుణాల పరిస్థితి (సగటు కంటే తక్కువ రుణాలు అందుబాటులో ఉండడం)పై పూర్తిస్థాయిలో పరిశీలిస్తారు. ఇందుకనుగుణంగా వ్యవసాయం, దాని అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేస్తారు. ఈ నెలాఖరు లేదంటే వచ్చే నెల మొదటి, రెండో వారంలోపు యాక్షన్ ప్లాన్ ఖరారు చేస్తారు.

కోటాపై ముందుకే!

▶ మొదటి పేజీ తరువాయి

(ఎస్ఈసీ) జారీ చేసిన నోటిఫికేషన్ కూడా రద్దయిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలోనే హైకోర్టు విధించిన స్టే ఎత్తివేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కోర్టు మధ్యంతర ఉత్తర్వులకు సంబంధించిన అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాకే సుప్రీంను ఆశ్రయించాలనే నిర్ణయానికి వచ్చినట్టు విశ్వసనీయ సమాచారం.

16న కేబినెట్‌లో చర్చ..

ఈ నెల 16వ తేదీన కేబినెట్ భేటీ నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. స్థానిక ఎన్నికలు, బీసీ రిజర్వేషన్ల అంశంతో పాటు, సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన ప్రాధాన్యత అంశాలు, ఏపీ చేపడుతున్న 'బనకచర్ల', ఆలమట్టి ఎత్తు పెంపు తదితర అంశాలపై చర్చించే అవకాశం ఉంది. రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టుకు వెళ్లిన తర్వాత ఎలాంటి తీర్పు వెలువడితే ఏ విధంగా ముందుకు వెళ్లాలనే దానిపై కూడా మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ జీవోలు, స్థానిక ఎన్నికల నిర్వహణతో ముడిపడిన వివిధ శాఖల మంత్రులు కూడా ఆయా అంశాలపై తమ అభిప్రాయాలను ఇప్పటికే వెల్లడించారు. మొత్తం 50 శాతం రిజర్వేషన్లతో ఈ ఎన్నికలు నిర్వహించుకోవచ్చునని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రత్యేక జీవో ద్వారా బీసీలకు అదనంగా కేటాయించిన 17 శాతం రిజర్వేషన్లను అన్ రిజర్వ్‌డ్ (జనరల్)గా పరిగణించి, పెంచిన రిజర్వేషన్లు సర్దుబాటు చేయాలని సూచించింది. ఈ నేపథ్యంలో..బీసీ రిజర్వేషన్ల పెంపుదలకు సంబంధించి చేసిన కసరత్తు, ఆ దిశలో కొన్ని నెలలుగా సాగించిన కృషిని తుదకంటా కొనసాగించాలనే నిశ్చితాభిప్రాయానికి రాష్ట్ర ప్రభుత్వం వచ్చినట్టు సమాచారం. తద్వారా స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందనే సంకేతాలు ప్రజల్లోకి వెళ్లాలన్నది ప్రభుత్వ ఆలోచన అని అంటున్నారు.

సుప్రీంలో సమర్థ వాదనలు వినిపించాలి

బీసీ రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రిజర్వేషన్ల కోసం బీసీ కమిషన్ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే, ఏకసభ్య కమిషన్ ఏర్పాటు, ఎంపిరికల్ డేటా విశ్లేషణ అనంతర నివేదికల ఆధారంగా శాసనసభలో బిల్లుల ఆమోదం, వాటిని గవర్నర్ ఆమోదం కోసం పంపించిన తీరును సుప్రీంకోర్టుకు సవివరంగా తెలియజేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను, న్యాయ నిపుణులను కోరినట్లు సమాచారం. ఎట్టి పరిస్థితుల్లోనూ స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా కల్పించిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలన్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 2018 పంచాయతీరాజ్ చట్టానికి సవరణలు, స్థానిక సంస్థల్లో 50 శాతం పరిమితికి మించి రిజర్వేషన్ల అమలుకు మొదట ఆర్డినెన్స్ ఆ తర్వాత బిల్లుల ఆమోదం వంటి కీలక అంశాలలో జరుగుతున్న జాప్యాన్ని కూడా సుప్రీంకోర్టు దృష్టికి తీసుకురావాలని, రిజర్వేషన్లకు సంబంధించిన ట్రిపుల్ టెస్ట్‌ను పకడ్బందీగా నిర్వహించిన విషయం వివరించాలని నిర్ణయించారు. అసెంబ్లీలో బిల్లులకు అన్ని రాజకీయ పార్టీలు కూడా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయన్న విషయాన్ని ప్రధానంగా ప్రస్తావించాలని భావిస్తున్నారు. రాష్ట్రపతి, గవర్నర్‌ల వద్ద 90 రోజుల పరిమితికి మించి బిల్లులు పెండింగ్‌లో ఉంటే అవి ఆమోదం పొందినట్టుగానే భావించాల్సి ఉంటుందని గతంలో సుప్రీంకోర్టు.. తమిళనాడు ప్రభుత్వం విషయంలో ఇచ్చిన ఉత్తర్వులను గురించి ప్రస్తావించనున్నట్టు తెలుస్తోంది. లక్షల మందికి పైగా ఉద్యోగులతో చేసిన సర్వే వివరాలను సుప్రీంకోర్టు ముందుంచాలని నిర్ణయించినట్లు సమాచారం.

'స్థానిక' నోటిఫికేషన్ నిలిపివేత

గెజిట్ జారీ చేసిన ఎస్ఈసీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మండల, జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు గతనెల 29న జారీ చేసిన ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్‌ను తదుపరి నోటిఫికేషన్ వచ్చే వరకు నిలిపివేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణీకుముదిని తెలిపారు. అలాగే ఆ నోటిఫికేషన్ ప్రకారం అమల్లోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఇతర ప్రక్రియలు, చర్యలు.. ఈ నెల 9న హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను అనుసరించి తదుపరి నోటిఫికేషన్ వచ్చే వరకు నిలిపి వేస్తున్నట్టు వెల్లడించారు. ఈ విషయం రాష్ట్రం లోని మండల, జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీల్లో నమోదైన ఓటర్లు గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు.

42% బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు

పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్



నిజామాబాద్ సిటీ: రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేసే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళతామని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలను నిలిపేస్తూ హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. శనివారం ఆయన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ, బీసీలపట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని, రాహుల్ గాంధీ ఆలోచనల మేరకు శాస్త్రీయ పద్ధతిలో కులగణన నిర్వహించామని వివరించారు. దేశంలో ఎన్నడూ చేయని కులగణనను రాష్ట్ర ప్రభుత్వం చేసిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేసి తీరుతామన్నారు. రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేసి గవర్నర్‌కు పంపామని, గవర్నర్ వద్ద బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికలపై హైకోర్టులో స్టే రావడానికి బీజేపీయే ప్రధాన కారణమని విమర్శించారు.

జేఏసీగా బీసీలు!

నేడు హైదరాబాద్‌లో కీలక సమావేశం

- పాల్గొననున్న బీసీ ప్రజా ప్రతినిధులు, సంఘాలు, మేధావులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల ఐక్య కార్యాచరణ సమితి ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల అంశంలో నెలకొన్న తాజా పరిస్థితుల నేపథ్యంలో బీసీ ప్రజాప్రతినిధులు, బీసీ కుల సంఘాలు, మేధావుల నుంచి జేఏసీ ఏర్పాటు డిమాండ్ వినిపిస్తోంది. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీఓపై హైకోర్టు స్టే ఇవ్వడం, స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌కు బ్రేక్ పడడం లాంటి పరిణామాలను బీసీలు జీర్ణించుకోలేక పోతున్నారు. జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలంటూ కొన్ని సంవత్సరాలుగా వస్తున్న డిమాండ్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో చేతికి అందివచ్చిన అవకాశాన్ని. .తాజా పరిణామాలు లాగేసుకున్నట్టు చేశాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని బీసీ వర్గాలు నిర్ణయించాయి.

భవిష్యత్ కార్యాచరణపై చర్చ

శనివారం రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన బీసీ కుల సంఘాల సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఆదివారం కాచిగూడలో రాష్ట్రంలోని అన్ని బీసీ కుల సంఘాల ప్రతినిధుల సమావేశాన్ని అత్యవసరంగా ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, నాయకులు, బీసీ కుల సంఘాల ప్రతినిధులు, మేధావులు పాల్గొనన్నట్లు సమాచారం. ఈ సమావేశం అనంతరం తెలంగాణ వెనుకబడిన తరగతుల ఐక్య కార్యాచరణ సమితిని ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో ఈ నెల 14న రాష్ట్ర బంద్‌కు కృష్ణయ్య పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 30 బీసీ అనుబంధ సంఘాలు ఈ బంద్‌లో పాల్గొననున్నట్లు ఆయన వెల్లడించారు.

అక్టోబర్ చివరినాటికి 'ప్రాణహిత' కొత్త డీపీఆర్

సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హనుమకొండలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో మంత్రి సీతక్క, ఎంపీ బలరాం నాయక్

సాక్షి, హైదరాబాద్/సాక్షి, యాదాద్రి/సాక్షిప్రతినిధి, వరంగల్ : ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు పనుల పునరుద్ధరణ కోసం సవరించిన సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీని వేగవంతం చేయాలని నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నీటిపారుదల శాఖపై సచివాలయంలో మంత్రి శనివారం సమీక్షించా రు. ఇటీవల తుమ్మిడిహెట్టి, సుందిళ్లను సందర్శించిన అధికారులు సమర్పించిన క్షేత్ర పరిశీలన నివేదికలను పరిశీలించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా గతంలో నిర్మించిన ప్రధాన కాలువ, ఇతర నిర్మాణాలు చాలావరకు చెక్కుచెదరకుండా ఉన్నాయని, స్వల్ప మరమ్మతుల తర్వాత ఉపయోగించుకోవచ్చని అధికారులు వివరించారు. 71 కి.మీ.లు విస్తరించి ఉన్న ప్రధాన కాలువ నెట్‌వర్క్ ఉపయోగించదగిన స్థితిలో ఉందని, రెండు ప్రధాన అక్విడక్ట్‌లు 70 శాతం పూర్తయ్యాయని అధికారులు నివేదించారు. తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మించి అక్కడి నుంచి సుందిళ్ల బరాజ్ వరకు నీటిని గ్రావిటీతో తరలించొచ్చని ఇంజనీర్లు చేసిన సూచనను ఆయన స్వాగతించారు. దీనితో కొత్త పంప్‌హౌస్ నిర్మించి బహుళ దశల్లో లిఫ్టింగ్ చేయాల్సిన అవసరం ఉండదని అధికారులు వివరించారు. సుందిళ్ల బరాజ్ నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని లిఫ్ట్ చేసుకోవచ్చని అధికారులు మంత్రికి తెలియజేశారు. తుమ్మిడిహెట్టి నుంచి 71 కి.మీ. ప్రధాన కాల్వలో 45 కి.మీ. కాల్వ తవ్వకం పూర్తయిందని, ఇతర పనులూ పాక్షికంగా పూర్తయ్యాయని క్షేత్ర స్థాయి పరిశీలనలో గుర్తించినట్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించి రెండు ప్రత్యామ్నాయాలపై సమగ్ర ప్రతిపాదనలు సమర్పిస్తే నెలాఖరులోగా తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి చెప్పారు. వచ్చే వారం మళ్లీ సమీక్షిస్తానని, అక్టోబర్ చివరి నాటికి సవరించిన డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశించారు.

ప్రాజెక్టుల స్థలాల్లో సౌర ప్లాంట్లు

సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన సాగునీటి ప్రాజెక్టుల భూములను గుర్తించాలని మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. ఉత్పత్తి చేసే విద్యుత్‌ను సాగునీటి పథకాలు, పంపింగ్ స్టేషన్ల నిర్వహణకు ఉపయోగిస్తే పెద్ద మొత్తంలో విద్యుత్ చార్జీలను ఆదా చేయొచ్చని చెప్పారు.

ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నరు

బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పదే పదే బద్నాం చేస్తున్నాడని, తమ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టుకు, ఆల్మట్టి ఎత్తు పెంపునకు పూర్తిగా వ్యతిరేకమని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటామన్నారు. గోదావరి, కృష్ణాజలాల విషయంలో తెలంగాణకు అన్యాయం చేసిందే బీఆర్‌ఎస్ పార్టీ అని పునరుద్ఘాటించారు.

ధాన్యం దిగుబడిలో తెలంగాణ అరుదైన రికార్డు

ధాన్యం దిగుబడిలో తెలంగాణ అరుదైన రికార్డు నమోదు చేసుకోనుందని మంత్రి ఎన్.ఉత్తమ్ చెప్పారు. దేశ చరిత్రలోనే అత్యధికంగా కోటీ 48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి సాధించిన రాష్ట్రంగా తెలంగాణ నిలబడుతుందన్నారు. ధాన్యం కొనుగోళ్లపై శనివారం సాయంత్రం భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్షించారు. ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర వ్యాప్తంగా 8,342 కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని, అందులో కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, సిద్దిపేట, నల్లగొండ జిల్లా కేంద్రాలలో ఇప్పటికే 1,205 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్టు వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై ఈనెల 16న హైదరాబాద్‌లో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు నీటిని ఎత్తిపోయకుండా, కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్కనీరు వాడకున్నా, తెలంగాణ వరిసాగులో రికార్డు సృష్టించిందన్నారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి మాతృవియోగం జరగ్గా.. ఆయనను పరామర్శించేందుకు మంత్రి ఉత్తమ్ శనివారం హనుమకొండకు వచ్చారు. అనంతరం మంత్రి సీతక్క, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజులతో కలిసి మీడియాతో మాట్లాడారు.

జూబ్లీహిల్స్ బరిలో కీర్తిరెడ్డి లేదా దీపక్‌రెడ్డి!

నేడో రేపో బీజేపీ అభ్యర్థి ప్రకటన

సాక్షి, న్యూఢిల్లీ: జూబ్లీహిల్స్ ఉపఎన్నిక బరిలో బీజేపీ నుంచి జూటూరు కీర్తిరెడ్డి, లంకల దీపక్‌రెడ్డిల పేర్లు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో బీజేపీ ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. రాష్ట్ర ఎన్నికల కమిటీ కసరత్తు చేసి జూటూరు కీర్తిరెడ్డి, లంకల దీపక్‌రెడ్డి, డాక్టర్ పద్మ, మాధవీలత, ఆలపాటి లక్ష్మీనారాయణ పేర్లతో ఓ జాబితాను రూపొందించింది. శనివారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఢిల్లీలో పార్టీ పెద్దలు బీఎల్ సంతోష్, సునీల్ బన్సల్‌కు ఆ జాబితాను అందచేశారు. ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు తమ అభ్యర్థులను ప్రకటించగా, బీజేపీ కుల, బల సమీకరణాల ఆధారంగా అభ్యర్థిని ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తోంది. కీర్తిరెడ్డి, లంకల దీపక్‌రెడ్డిలు పార్టీలో చురుగ్గా ఉన్నారు. ఆ ఇద్దరిలో ఒక్కరిని జూబ్లీహిల్స్ అభ్యర్థిగా బీజేపీ అధిష్టానం రెండు రోజుల్లో ప్రకటించనుంది.

బీజేపీ కమిటీల్లో పరిమితంగానే..

పెద్దసంఖ్యలో నియమించాలన్న రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ప్రతిపాదనలకు బ్రేక్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పార్టీ అనుబంధ విభాగాలు, ఇతర యంత్రాంగంలో వీలైనంత ఎక్కువ మందికి చోటు కల్పించాలనే ప్రయత్నాలకు బీజేపీ జాతీయ నాయకత్వం నో చెప్పినట్టు పార్టీవర్గాల సమాచారం. మొత్తంగా రాష్ట్ర పదాధికారులు, కార్యవర్గం, రాష్ట్ర కమిటీ వంటి వాటిలో పరిమిత సంఖ్యలో పోస్టులు ఉండాలని స్పష్టం చేసింది. అనుబంధ విభాగాల్లోనూ ఇదే సూత్రాన్ని పాటించి పరిమితంగానే నియామకాలు ఉండాలని పేర్కొంది. తెలంగాణ భౌగోళిక స్వరూపం, జనాభా, అసెంబ్లీ సీట్ల సంఖ్య తదితరాల ప్రాతిపదికన నిర్ణయించిన మేర ఆ సంఖ్యలోనే నియామకాలు చేపట్టాలని తెలిపింది. శనివారం ఢిల్లీలో జాతీయ అధ్యక్షుడు జేపీనడ్డా, ఇతర పార్టీ పెద్దలతో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో అధికార ప్రతినిధులు టీవీ చర్చల్లో పాల్గొనేందుకు ప్యానలిస్టులు, ఇలా అనేకమందిని పార్టీ యంత్రాంగంలో భాగస్వాములను చేయాలనే తన ఆలోచనను అధిష్టానం పెద్దల ముందు ఆయన పెట్టారు. అయితే కాంగ్రెస్ ఇతర పార్టీల మాదిరిగా ఎక్కువమందితో 'జంబో' కార్యవర్గాల ఏర్పాటు కాకుండా పరిమిత సంఖ్యలోనే ఆయా కమిటీలు, అనుబంధ విభాగాల నియామకాలు చేపట్టాలని రాంచందర్‌రావుకు జాతీయ నేతలు స్పష్టం చేసినట్టు సమాచారం. జూబ్లీహిల్స్ స్థానానికి పోలింగ్ నవంబర్ 11న రెండో విడతలో జరగనున్నందున, ఒకటి,రెండు రోజులు ఆలస్యంగానే పార్టీ అభ్యర్థిని ప్రకటించే అవకాశాలున్నట్టుగా తెలుస్తోంది.

బనకచర్ల అప్రైజల్‌పై మౌనం ఎందుకు?

మాజీమంత్రి హరీశ్‌రావు



మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో వద్దిరాజు, ముఠాగోపాల్

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టు తెలంగాణ పాలిట పెను ప్రమాదంగా మారబోతున్నదని మాజీమంత్రి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, డాక్టర్ కె.సంజయ్, ఎమ్మెల్సీ ఎల్.రమణతో కలిసి హరీశ్‌రావు శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కమీషన్ల కోసం, కాంట్రాక్టుల్లో వాటా కోసం రాష్ట్ర ప్రయోజనాలు కాపాడకుండా సీఎం రేవంత్ మౌనంగా ఉంటున్నాడని విమర్శించారు.

వరద జలాల మీద ప్రాజెక్టులు ఎలా?

'గోదావరి బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టు (పీఎఫ్ఆర్), సాంకేతిక, ఆర్థిక ప్రతిపాదనల మదింపు (టెక్నో ఎకనామికల్ అప్రైజల్) కోసం వచ్చిందని సీఎంకు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ లేఖ రాసి 20 రోజులు కావస్తోంది. దేశంలో వరద జలాల ఆధారంగా డీపీఆర్ అప్రైజల్, ప్రాజెక్టులు ఎలా కడతారని సీఎం కేంద్రాన్ని నిలదీయడం లేదు. కేంద్రం రాసిన లేఖలపై పొరుగు రాష్ట్రాలు స్పందిస్తున్నా, మన ప్రభుత్వం ఏం చేస్తోంది 'అని హరీశ్ ప్రశ్నించారు.

చంద్రబాబు ఒత్తిడికి బీజేపీ తలొగ్గుతోంది

పోలవరం బనకచర్ల లింకు ప్రాజెక్టు సాధ్యం కాదని సీడబ్ల్యూసీ, జీఆర్ఎంబీ, పోలవరం అథారిటీ తదితర సంస్థలు స్పష్టం చేసినా ఏపీ సీఎం చంద్రబాబు ఒత్తిడికి కేంద్రంలోని బీజేపీ తలొగ్గుతోంది. పోలవరం బనకచర్ల పేరిట అడ్డగోలుగా కాలువల సామర్థ్యం పెంచితే కేంద్రం ఎందుకు మౌనంగా ఉంటోంది. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తోపాటు కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు నోరు మెదపడం లేదు. సీఆర్ పాటిల్ లేఖ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లడం లేదు. బనకచర్ల ప్రాజెక్టు డీపీఆర్ తయారీకి ఏపీ ప్రభుత్వం టెండర్లు కూడా పిలిచింది. ఏపీ ప్రభుత్వం, బీజేపీ కలిసి తెలంగాణ గొంతు పిసుకుతున్నా కాంగ్రెస్ మౌనం పాటిస్తోంది. తెలంగాణ హక్కుల కోసం అవసరమైతే సుప్రీంకోర్టుకు కూడా బీఆర్‌ఎస్ వెళుతుంది. ఇప్పటికే కేసీఆర్ న్యాయవాదులతో మాట్లాడుతున్నాడు'అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

క్లుప్తంగా...


రాష్ట్రంలో 'ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద'

కేంద్రానికి మంత్రి రాజనర్సింహ విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు జాతీయ స్థాయి ఆయుర్వేద ఇన్‌స్టిట్యూట్‌ను మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విజ్ఞప్తి చేశారు. దేశంలో 2030 నాటికి 10 అఖిల భారత ఆయుర్వేద సంస్థలను నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, అందులో ఒకటి తెలంగాణలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర ఆయుష్, ఆరోగ్యశాఖ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్‌కు లేఖ రాశారు. ఆ లేఖను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ సంగీత సత్యనారాయణ, ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్ బాబు శనివారం హైదరాబాద్ వచ్చిన జాదవ్‌ను కలిసి లేఖను అందజేశారు. తెలంగాణ అడవుల్లో అద్భుతమైన ఆయుర్వేద సంపద ఉందని, ఔషధ గుణాలున్న మూలికలు, మొక్కల జాతులు చాలా ఉన్నాయని మంత్రి ఆ లేఖలో వివరించారు.

పీజీ మెడికల్ అడ్మిషన్ల గడువు 14 వరకు పొడిగింపు



సాక్షి, హైదరాబాద్: కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (కేఎన్‌ఆర్ యూహెచ్‌ఎస్) పీజీ మెడికల్ డిగ్రీ, డిప్లొమా కోర్సుల్లో కన్వీనర్ కోటా కింద 2025–26 విద్యాసంవత్సరానికి ఆన్‌లైన్ నమోదు గడువును పొడిగించింది. ముందుగా ఈనెల 11 వరకు దరఖాస్తులకు సమయం ఉండగా, ఇప్పుడు ఈనెల 14 (సాయంత్రం 5 గంటల దాకా) వరకు అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని యూనివర్సిటీ ఒక ప్రకటనలో తెలిపింది. కేవలం నీట్–పీజీ–2025లో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన అన్ని వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్ www.knruhs.telangana.gov.inలో అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. యూనివర్సిటీ అధికారులు విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా, ముందుగానే తమ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపింది.

చిరస్థాయిగా నిలిచేలా టీ స్క్వేర్

- ప్రత్యేకమైన, వైవిధ్యంతో కూడిన డిజైన్లను ఎంపిక చేయాలి
- ఆకర్షణీయమైన నిర్మాణంగా తీర్చిదిద్దాలి
- వినోదం, పర్యాటకం, ఆహారం, వ్యాపారాల కూడలిగా రూపొందించాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రాయదుర్గంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న టీ–స్క్వేర్‌ను చిరస్థాయిగా (ఐకానిక్) నిలిచేలా ఆకర్షణీయమైన నిర్మాణంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రత్యేకమైన, వైవిధ్యంతో కూడిన డిజైన్లను ఎంపిక చేసి ఈ ఏడాది నవంబర్ నెలాఖరుకు టీ–స్క్వేర్ అభివృద్ధి పనులు ప్రారంభించాలని సూచించారు. హైదరాబాద్ ఐటీ కార్యాలయాలకు కేంద్ర స్థానంగా ఉన్న రాయదుర్గంలో ప్రజల సందర్శన కేంద్రంగా టీ–స్క్వేర్‌ను రూపొందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సోషల్ మీడియా యుగం అవసరాలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌కు డిజిటల్ కాన్వాస్‌గా దీనిని తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. టీ–స్క్వేర్ ప్రణాళిక, పనులపై శనివారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

డిజిటల్ డిస్‌ప్లే వేదికగా టీ స్క్వేర్

'రాత్రింబవళ్లు సందర్శకులను ఆకర్షించేలా వినోదం, పర్యాటకం, ఆహారం, వ్యాపారాల కూడలిగా టీ–స్క్వేర్‌ను రూపొందించాలి. పెద్ద ఎలక్ట్రానిక్ డిస్‌ప్లేలు, డిజిటల్ ప్రకటనలు, ఆకర్షణీయమైన లైటింగ్‌తో నిండిన డిజిటల్ డిస్‌ప్లే వేదికగా దీనిని అభివృద్ధి చేయాలి. ఆపిల్ వంటి ప్రపంచ స్థాయి సంస్థలు తమ బ్రాండ్ల ఔట్‌లెట్లు ఏర్పాటు చేసేలా సౌకర్యాలు ఉండాలి. వాహనాల సులభ సంచారం కోసం పార్కింగ్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని డిజైన్లు రూపొందించాలి. వినోదం, సాంస్కృతిక కార్యక్రమాలు, వాణిజ్య కార్యకలాపాలకు ఉపయోగపడే ఈ కొత్త బహిరంగ వేదికను కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా రూపొందించాలి..' అని సీఎం సూచించారు. 'ఏఐ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు ద్వారా ఏఐ కార్యక్రమాలు, స్టార్టప్‌లు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను ఒకే గొడుగు కిందకు తేవాలి. తద్వారా ప్రపంచ స్థాయి సంస్థలు, పరిశోధనా సంస్థలు, అంతర్జాతీయ ఏఐ హబ్‌లతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకోవాలని భావిస్తు న్నాం..' అని ముఖ్యమంత్రి తెలిపారు. టీ–హబ్ 24 గంటల పాటు పనిచేసే వాతావరణం కల్పించాలని ఆదేశించారు.

ఏఐ స్టార్టప్‌ల కోసం 'ఫండ్ ఆఫ్ ఫండ్స్'

ఏఐ ఆధారిత ఆవిష్కరణలు, స్టార్టప్‌లకు మద్దతు ఇచ్చేందుకు 'ఫండ్ ఆఫ్ ఫండ్స్' సృష్టించాల్సిన అవసరముందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో వృద్ధిని సాధించేందుకు ఆవిష్కరణల ఆధారిత వ్యూహాన్ని అవలంబించాలి. 2024 నుంచి తెలంగాణను ఏఐకి ప్రపంచ స్థాయి గమ్యస్థానంగా నిలిపేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టింది. 2024 సెప్టెంబర్‌లోనే గ్లోబల్ ఏఐ సమ్మిట్; ఏఐ సిటీ ప్రాజెక్టు, తెలంగాణ ఏఐ రైజింగ్ గ్రాండ్ చాలెంజ్, ఏఐ క్యాటలిస్ట్ వంటి ప్రణాళికలు, కార్యక్రమాలు జరిగాయి. తెలంగాణలోని విద్యార్థులు, శ్రామిక శక్తికి ఏఐ నైపుణ్య శిక్షణ అందించేందుకు ప్రత్యేక ఏఐ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది..' అని మంత్రి చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేశ్ రంజన్, సంజయ్ కుమార్, సీఎం ఓఎస్‌డీ వేముల శ్రీనివాసులు, టీజీఐఐసీ ఎండీ కె.శశాంక, టీ–ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సెమీకండక్టర్ ఇన్నోవేషన్ మ్యూజియం ప్రారంభం

భారతదేశంలోనే మొట్టమొదటి సెమీ కండక్టర్ ఇన్నోవేషన్ మ్యూజియం హైదరాబాద్ కొండాపూర్‌లో ఏర్పాటు కానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం దీనిని ప్రారంభించనున్నారు. టెక్నాలజీ చిప్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్ (టీ–చిప్) ఆధ్వర్యంలో 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మితమైన ఇన్నోవేషన్ మ్యూజియం.. చిప్ టెక్నాలజీలను ప్రజలకు చేరవేసే ఇన్నోవేషన్ హబ్‌గా పనిచేస్తుంది. ప్రతి 30 రోజులకు కొత్త ఆవిష్కరణలతో '30 డేస్ ఇన్నోవేషన్ మోడల్' ద్వారా స్టార్టప్‌లు, విశ్వవిద్యాలయాలు, టెక్ కంపెనీలు తమ చిప్ ఆవిష్కరణలను ప్రదర్శిస్తాయి. ప్రతి నెలా చివర్లో 'చిప్ డెమో డే'లో ఇన్నోవేటర్స్ తమ ఆవిష్కరణలను వెంచర్ క్యాపిటలిస్టులు, ఇంక్యుబేటర్ల ముందు ప్రదర్శించి పెట్టుబడులు పొందే అవకాశం ఉంటుంది. తైవాన్, జపాన్, అమెరికా నుంచి ఆధునిక చిప్ టెక్నాలజీలు గ్లోబల్ ఇన్నోవేషన్ జోన్లలో ప్రదర్శితమవుతాయి. మొదటి ప్రదర్శనలో ఐఐటీ హైదరాబాద్ స్వదేశీ ఏఐ చిప్, హ్యూమనాయిడ్ రోబోట్లు, ఈవీ బ్యాటరీ టెక్నాలజీలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. ఈ మ్యూజియం.. భవిష్యత్తు టెక్నాలజీని ఈ రోజే చూసే ద్వారం అని టీ–చిప్ ఎండీ సందీప్‌కుమార్ మక్తాల తెలిపారు.

రాష్ట్రాన్ని ఇన్నోవేషన్ హబ్‌గా మార్చడమే లక్ష్యం

మంత్రి శ్రీధర్‌బాబు

- ఫార్మసిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం
- కాకతీయ వర్సిటీ ఫార్మా పూర్వ విద్యార్థుల సభలో మంత్రి కోమటిరెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): తెలంగాణను ఇన్నోవేషన్ హబ్‌గా మార్చాలన్నదే తమ సంకల్పమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో టి–హబ్ తరహాలో ఇంక్యుబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు. ఇందుకు సంబంధించి త్వరలోనే కాకతీయ, మహాత్మా గాంధీ విశ్వవిద్యాల యాలతో ఎంఓయూ కుదుర్చుకోనున్నట్లు తెలిపారు. శనివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో కాకతీయ విశ్వవిద్యాలయం ఫార్మా అలుమ్ని గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. సైన్స్‌కు మానవత్వాన్ని జోడిస్తే ప్రతి ఆవిష్కరణ సమాజ హితానికి బాటలు వేస్తుందన్నారు. రాష్ట్రా న్ని గ్లోబల్ ఫార్మా, లైఫ్ సైన్స్ హబ్‌గా మాత్రమే కాకుండా ఫార్మసీ ఆఫ్ పర్పస్‌గా మార్చాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. వైద్య రంగంలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. ఫార్మ సిస్టులు నాణ్యమైన మందులు తయారు చేస్తూ రాబోయే కాలానికి దిక్సూచిగా మారాలని ఆకాంక్షించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడు తూ.. ఫార్మసిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీనిచ్చారు. విదేశాలలో సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకొని వైద్య సేవలు అందిస్తున్నారని ఆ దిశగా మన రాష్ట్రంలోనూ సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాల యం వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ సైంటిఫిక్ ఎఫైర్ పల్స్ ఫార్మాస్యూటికల్ హైదరాబాద్ ప్రొఫెసర్ డి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి విమానాశ్రయం నిర్మాణంలో కీలక పురోగతి

సాక్షి, హైదరాబాద్: పెద్దపల్లి విమానాశ్రయం ప్రతిపాదనలో కీలక పురోగతి ఇది. విమానాశ్రయం నిర్మించతలపెట్టిన అంతర్‌గావ్ గ్రామంలో నిర్ధారిత స్థలం విమానాశ్రయ నిర్మాణానికి యోగ్యంగా ఉందో లేదో తేల్చేందుకు త్వరలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సిద్ధమవుతోంది. ఇందుకుగాను ప్రీ ఫీజిబిలిటీ స్టడీ చేయనుంది. ఆ స్టడీకి కావాల్సిన కన్సల్టెన్సీ చార్జీలకు మొత్తం రూ.40,52,946 విడుదల చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ ఉత్తర్వు జారీ చేశారు. రాష్ట్రంలో కొత్తగా ఆరు విమానాశ్రయాలు నిర్మించాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన విషయం తెలిసిందే. పెద్దపల్లిలోని బసంత్‌నగర్‌లో ఉన్న పాత ఎయిర్ స్ట్రిప్‌ను పునరుద్ధరిస్తూ కొత్త విమానాశ్రయాన్ని నిర్మించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. గతంలో అక్కడ ఫీజిబిలిటీ స్టడీ నిర్వహించగా ఆ స్థలం యోగ్యంగా లేదని తేలింది. దీంతో ప్రత్యా మ్నాయంగా అంతర్‌గావ్‌లో 591.24 ఎకరాల భూ మిని గుర్తించారు. ఈ కొత్త స్థలం యోగ్యమైందా? కాదా? అన్నది తేల్చేందుకు చర్యలు తీసుకోనున్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వేలాది మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని, వారి నియామకం కోసం ప్రభుత్వమే ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ చిన్నారెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ప్రైవేటు ఏజెన్సీలు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ను నియమించడం వలన ఉద్యోగులు దోపిడీకి గురువుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.



మీరేమీ చేసినను అది మనుష్యుల నిమిత్తము కాక ప్రభువు నిమిత్తమని మనస్ఫూర్తిగా చేయుడి.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.షష్ఠి రా.7.51 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** మృగశిర రా.7.45 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** రా.3.43 నుండి 5.15 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.05 నుండి 4.52 వరకు, **అమృత ఘడియలు:** ప.11.30 నుండి 1.01 వరకు.

సూర్యోదయం : 5.55
సూర్యాస్తమయం : 5.38
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

నీరవ్ మోదీ (ఖైదీ బిలియనీర్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

భారత ప్రభుత్వం అనుకున్నది అనుకున్నట్లుగా జరిగినట్లయితే ఈ ఏడాది డిసెంబరులో విజయ్ మాల్యా, వచ్చే ఫిబ్రవరిలో నేను, మే నెలలో మా మామయ్య మెహుల్ చోక్సీ... ముగ్గురం ముంబై ఆర్థర్ రోడ్ జైల్లో మా తొలి బర్త్‌డేలు జరుపుకొంటాం అనుకుంటా!

జైల్లో నేను 55 లోకి, మామయ్య మెహుల్ చోక్సీ 67లోకి, విజయ మాల్యా 70లోకి అడుగు పెడతాం. ఏడాది నుంచి ఏడాదిలోకి అడుగు పెట్టడమే కానీ, మేమిక ఆర్థర్ రోడ్ జైలు నుండి బయటికి అడుగుపెట్టడం అనేదే ఉండదని భారతీయ శిక్షా స్మృతి ప్రకారం నా మనసుకు అనిపిస్తోంది.

నేను 2019 నుండీ లండన్ జైళ్లలో ఉంటున్నాను. మాల్యా 2016 నుండీ లండన్ వీధుల్లో చల్లటి బీరు తాగుతూ బెయిల్ మీద ఉంటున్నారు. ఆయన ఒక్కసారీ జైల్లో లేరు. నాకు ఒక్కసారీ బెయిల్ రాలేదు.

మామయ్య మెహుల్ చోక్సీని ఐదు నెలల క్రితమే... బెల్జియంలో అరెస్ట్ చేసి అక్కడే జైల్లో ఉంచారు. మోచేతి కర్రతో ఆయన నడుస్తుండటం ఫొటోల్లో చూసి నా మనసు చివుక్కుమంది. విధి ఎవర్ని ఎలా నడిపిస్తుందో ఊహించలేం.

నేరం అన్నది చట్టం దృష్టిలో క్రూరమైనదే కావచ్చు, కానీ, నేరం కంటే క్రూరమైనది



చట్టం. ఈ మాటనే 2019లో ఒకసారి, 2021లో ఒకసారి ఫోన్‌లో నేను మాల్యాతో అన్నప్పుడు, రెండుసార్లూ మాల్యా ఒక్క క్షణం ఆగి, పెద్ద పెట్టున నవ్వారు.

"ఎందుకలా ఒక్క క్షణం ఆగారు మాల్యాజీ?" అని అడిగాను.

"బీరు పొలమారింది" అన్నారు.

"మరి ఎందుకలా పెద్ద పెట్టున నవ్వారు మాల్యాజీ?!" అన్నాను.

"ఇంత వయసు వచ్చినా నాకు బీరును పొలమారకుండా తాగటం రానందుకు నవ్వొచ్చింది" అన్నారు!

ఆ తర్వాతెప్పుడూ నేను చట్టం–నేరం అంటూ మాల్యాతో పిచ్చి పిచ్చిగా మాట్లాడలేదు. మధ్యలో మాల్యానే 2023లో ఒకసారి నాకు ఫోన్ చేశారు.

"ఎక్కడున్నావ్?" అన్నారు.

"ఇదిగో ఇప్పుడే సౌత్ వెస్ట్ లండన్ నుంచి, సౌత్ ఈస్ట్ లండన్‌కి వచ్చాను మాల్యాజీ" అని చెప్పాను.

"వావ్ వావ్... బెయిల్ వచ్చేసిందా!" అని చాలా సంతోషంగా అడిగారు మాల్యా. ఒకరికి మంచి జరగాలని మనస్ఫూర్తిగా కోరుకునే వారిలో మాత్రమే అంతగా సంతోషం పొంగి పొర్లుతుంది.

"బెయిల్ కాదు కానీ, బెయిల్ లాంటిదే మాల్యాజీ. కరడుగట్టిన నేరస్థులతో కిక్కిరిసి ఉండే 'హిజ్ మెజెస్టీస్ ప్రిజన్' వాండ్స్‌వర్త్ నుంచి కొంచెం శుభ్రంగా ఉండే 'హిజ్ మెజెస్టీస్ ప్రిజన్' థేమ్స్‌సైడ్‌కు నన్ను షిఫ్ట్ చేశారు" అన్నాను.

"అవునా... ఆల్ ఈజ్ వెల్ దట్ ఎండ్స్ వెల్" అన్నారు మాల్యా. కొత్త సంతోషం పాత బాధల్ని మరిపిస్తుందని!

నవంబర్ 23న వెస్ట్‌మినిస్టర్ మేజిస్ట్రేట్ కోర్టులో నా 'అప్పగింత' కేసు హియరింగ్. "నీరవ్‌ని మాకిచ్చేయండి 'ప్రేమగా' చూసుకుంటాం" అని ఇండియా అంటోంది.

మొదట నేను, నా వెనుకే మామయ్య, ఆ వెనుకే మాల్యా వరుసగా ఒక్కొక్కరం ఇండియా ప్రేమకు పాత్రులం అవక తప్పేలా లేదు.

బ్రేక్‌లో నా సెల్ నుంచి బయటికి వచ్చి మాల్యాకు ఫోన్ చేశాను.

"హా... నీరవ్! నేనే నీకు కాల్ చేద్దాం అనుకుంటున్నా... బెల్జియం నుంచి నాకొక డాజిలింగ్, రేడియంట్, సింటిలేటింగ్, గ్లిజనింగ్, లస్టస్... డైమండ్ నెక్లెస్ సెట్టును స్పెషల్‌గా తయారుచేయించి తెప్పించగలవా? ఫిబ్రవరిలో పింకీ బర్త్ డే ఉంది" అన్నారు!

పింకీ... మాల్యా గర్ల్ ఫ్రెండ్.

నేనిక్కడ జైల్లో మా ముగ్గురి 'ఆర్థర్ రోడ్' బర్త్‌డేల గురించి ఆలోచిస్తుంటే, మాల్యా అక్కడ బెయిల్లో తన గర్ల్‌ఫ్రెండ్ గ్రాండ్ బర్త్‌డే గిఫ్ట్ గురించి ప్లాన్ చేస్తున్నారు!

హాస్టళ్లా... నరక కూపాలా?



జనతంత్రం

వర్ధెల్లి మురళి



''ప్రతి బాల్యంలోనూ ఓ నందనోద్యానం ఉంటుంది. అది మెరిసిపోయే రంగులతో అల్లుకున్న మంత్రముగ్ధ నగరి. పిల్ల తెమ్మెరలక్కడ మృదువుగా హత్తుకుంటాయి. ప్రతి ఉదయమూ అక్కడ పరిమళ భరితమే'' – బాల్యం గురించి ఓ రచయిత్రి అలా వర్ణించారు. బాల్యం ఇలాగే ఉండాలి. ఈ విధంగానే ఎదగాలని చాలామంది కోరుకుంటారు. అందుకే ప్రతి నాగరిక దేశం బాలల హక్కులకు ప్రత్యేక రక్షణను ఏర్పాటు చేసింది. భారత రాజ్యాంగం కూడా అటువంటి ఏర్పాట్లు చేసింది. స్వయంగా తల్లిదండ్రులే తమ పిల్లల్ని స్వల్పంగా దండించినా సహించకుండా జైల్లో పెడతారు స్కాండినేవియన్ దేశాల్లో! ఏ జాతికైనా అమూల్య సంపద బాలలే కనుక మానవత్వం సున్నితత్వమున్న వ్యవస్థలన్నీ బాలల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటాయి. 'మనం చూడలేని కాలానికి మనం పంపించే సజీవ సందేశాలు పిల్లలే'! కనుక వారికా ప్రత్యేక హక్కులుంటాయి.

ఆచరణలో ప్రతి బాల్యం నందనోద్యానంలా ఉంటున్నదా? ఏలుతున్నవారు అలా ఉండటానికి అనుమతిస్తున్నారా? అందమైన బాల్యాన్ని అంగడి సరుకుగా మార్చడానికి దోహదపడుతున్న ప్రభుత్వాలనిప్పుడు చూస్తున్నాము. పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావాలంటే పేద పిల్లలకు కూడా ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన జరగాలని ఏపీలో జగన్ ప్రభుత్వం ఏర్పాట్లు చేసినప్పుడు మోకాలడ్డే ప్రయత్నం చేసిందెవరు? ఆ ప్రయత్నం చేసిన చంద్రబాబు కూటమే ఇప్పుడా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య కోసం జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ఎత్తివేసింది. విద్య, వైద్యం ప్రభుత్వ బాధ్యతలు కావనేది ఆయన ఫిలాసఫీ. ఆ విషయాన్ని స్వయంగా ఆయనే చెప్పుకున్నారు. కనుకనే ఆయన మళ్లీ గద్దెనెక్కగానే కొనగలిగినవారికి నాణ్యమైన విద్య... లేనివారికి నాసిరకం విద్యావిధానం అమల్లోకి వచ్చింది. ఈ విధానపు దుర్మార్గానికి పుట్టిన విషపు పుండే మొన్నటి కురుపాం ఘటన.

పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం గిరిజన బాలికల గురుకుల పాఠశాల విద్యార్థుల్లో కామెర్ల వ్యాధి ప్రబలిన నేపథ్యాన్ని గమనిస్తే ఒళ్లు జలదరిస్తుంది. లక్షలాదిమంది పేద తల్లిదండ్రులు వారి బిడ్డల భవిష్యత్తుపై పెట్టుకున్న నమ్మకాన్ని ఏపీ సర్కార్ వమ్ము చేస్తున్న వైనం దిగ్భ్రాంతికరమైనది. కురుపాం ఆశ్రమ పాఠశాలలో ఉంటున్నది ఆరొందల పైచిలుకు బాలికలే కావచ్చు. అన్ని రకాల సంక్షేమ హాస్టళ్లు, అన్ని రకాల ఆశ్రమ పాఠశాలలూ కలిపి ఏపీలో 3,800కు పైగా ఉన్నాయి. వీటిల్లో లక్షలాది మంది పేదవర్గాల పిల్లలు ప్రభుత్వం మీద భరోసాతో తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువుకుంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వపు విధానపరమైన వైఖరి ఫలితంగా కొద్దిపాటి తేడాలు తప్ప కురుపాం ఆశ్రమ పాఠశాలకు పూర్తి భిన్నమైన పరిస్థితులు ఎక్కడా లేవు. కురుపాం దారుణానికి సంబంధించిన ప్రకంపనలు తగ్గకముందే గుంటూరు జిల్లాలో బీసీ హాస్టల్ విద్యార్థులు సామూహికంగా అస్వస్థులు కావడం నివ్వెరపరిచింది. గత ఏడాది కాలంగా ఈ తరహా వార్తలు అడపాదడపా వెలుగు చూస్తున్నా ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడంతో పరిస్థితులిప్పుడు దారుణంగా దిగజారాయి.

అసలేం జరిగింది కురుపాంలో? మరొకసారి పునరాలోకనం చేసుకోవాలి. కురుపాం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆరొందల పైచిలుకు విద్యార్థినులుంటున్నారు. సగటున ఇరవై మందికో మరుగుదొడ్డి. వాటి నిర్వహణ కూడా అంతంత మాత్రమే. డ్రైనేజీ ఏర్పాట్లు సరిగా లేక మురుగునీరంతా ఒక పక్కకు చేరి అక్కడినుంచి బోర్ నీళ్లలో కలిసిపోతున్నదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. దసరా సెలవులు ప్రకటించిన తర్వాత సొంత ఊరికి వెళ్లిన అంజలి అనే బాలిక కామెర్ల లక్షణాలతో సెప్టెంబర్ 25న చనిపోయింది. తోయక కల్పన అనే టెన్త్ క్లాస్ చదువుతున్న బాలిక పది రోజులపాటు స్థానిక జిల్లా ఆస్పత్రుల్లో చికిత్స తీసుకొని నయం కాకపోవడంతో వైజాగ్ కేజీహెచ్‌లో చేరింది. సెప్టెంబర్ 29న ఆ బాలిక కూడా కామెర్ల వ్యాధి (హెపటైటిస్ ఏ)తో ప్రాణాలు కోల్పోయింది. అంటే ఆశ్రమ పాఠశాలకు సెలవులు ఇవ్వకముందే కామెర్ల లక్షణాలు బయటపడినట్టు స్పష్టమవుతున్నది.

కురుపాంలోనే మరో హాస్టల్‌లో చదువుతున్న ఇంకో ఇద్దరు బాలురు అక్టోబర్ 5, 6 తేదీల్లో ఇవే లక్షణాలతో చనిపోయారు. గిరిజన బాలికల గురుకులం నుంచి మొత్తం 170 మంది బాలికలకు కామెర్లు సోకి ఆస్పత్రుల పాలయ్యారు. వీరిలో యాభై మంది విశాఖ కేజీహెచ్ దాకా రావలసి వచ్చింది. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో బాలికలకు సురక్షిత మంచినీటి కోసం ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కొద్ది రోజుల క్రితం దానికి రిపేర్ రావడంతో పక్కన పడేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్న సమాచారం ప్రకారం డ్రైనేజీ వ్యవస్థ లేక మరుగుదొడ్ల మురుగు నీరు కలుస్తున్న బోర్ నీటినే బాలికల చేత తాగిస్తున్నారు. వంటకూ వాటినే వినియోగిస్తున్నారు. విద్యార్థుల మెడికల్ రిపోర్టులు కూడా దాన్నే నిర్ధారిస్తున్నాయి. మురుగుతో నీటి కాలుష్యం వల్లనే విద్యార్థులు 'హెపటైటిస్–ఏ' వ్యాధికి గురయ్యారని చెబుతున్నారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే నిర్వాహకులు ఏం చేస్తున్నట్టు? పిల్లల చేత మురుగునీళ్లు తాగిస్తూ ఉపాధ్యాయులు మాత్రం మినరల్ వాటర్ తెచ్చుకుని తాగేవారని గిరిజన పిల్లల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

పిల్లలు తరచూ అస్వస్థతకు గురవుతుంటే నిర్వాహకులు వారిని ఇళ్లకు పంపించి చేతులు దులిపేసుకోవడమేమిటి? పై అధికారులకు వీళ్లు రిపోర్టు చేయలేదా? చేసినా వారు పట్టించుకోవడం లేదా అన్నది తేలాల్సి ఉన్నది. యథా రాజా తథా ప్రజా అంటారు కదా! పేద పిల్లల ఆరోగ్యం సంగతి ప్రభుత్వానికే పట్టనప్పుడు తమకెందుకని అధికారులు అలక్ష్యంతో ఉంటున్నారేమో తెలియదు. విద్యాశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, ఐటీడీఏ, జిల్లా యంత్రాంగాలు, వాటి అధికార శ్రేణులు ఉన్నప్పటికీ ఇన్ని దుర్ఘటనలు ఎందుకు జరుగుతున్నాయి? సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్యం కోసం అనుసరించవలసిన ప్రోటోకాల్‌ను కూడా పాటించకపోవడం విస్మయం కలిగించే విషయం. ఆర్వో ప్లాంట్ చెడిపోతే వెంటనే ఎందుకు బాగు చేయించలేదు? నిర్ణీత కాలానికోసారి తాగునీటికి నాణ్యతా పరీక్షలు చేయడం లేదా? ఒకరిద్దరు పిల్లలు జబ్బుపడిన తర్వాత మిగిలిన పిల్లల విషయంలో వ్యాధి నిరోధక చర్యలు చేపట్టారా, లేదా? కనీసం తాగునీటిని క్లోరినేషన్ చేసినా ఇటువంటి ఘటనలు జరిగేవి కావు కదా!

సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల విద్యార్థుల ఆరోగ్య, వసతి సమస్యలపై ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా వరసగా అనేక దుర్ఘటనలు ఈ ఏడాది కాలంలో రికార్డయ్యాయి. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన సంక్షేమ హాస్టళ్ల గురుకులాల్లోనే ఈ కాలంలో 11 మంది విద్యార్థులు అనారోగ్య కారణాలతో చనిపోయారు. తిరుపతి జిల్లా నాయుడుపేట అంబేడ్కర్ సంక్షేమ గురుకులంలో పాచిపోయిన ఆహారం పెట్టడం వల్ల వందమంది విద్యార్థులు అస్వస్థులయ్యారు. ఇటువంటి ఘటనే అదే జిల్లాల్లోని జ్యోతిబా పూలే బీసీ హాస్టల్‌లో జరిగింది. కాకినాడ జిల్లా ఏలేశ్వరం, అనకాపల్లి జిల్లా రాజగోపాలపురం, నూజివీడు ట్రిపుల్ ఐటీల్లో కూడా కలుషిత ఆహారం వల్ల విద్యార్థులు జబ్బుపడిన ఘటనలు జరిగాయి. ఇలాంటి ఉదాహరణలు ఇంకా ఉన్నాయి. గుంటూరు జిల్లాలోని బీసీ హాస్టల్‌లో కలుషితాహారం తిని 50 మంది విద్యార్థులు ఆస్పత్రుల పాలయ్యారు. శనివారం నాడు వారి తల్లిదండ్రులు ఆందోళనకు దిగి తమ పిల్లల్ని హాస్టల్ నుంచి ఖాళీ చేయించారు. సంపన్నుల ఇళ్లలో జరిగే ఫంక్షన్లలో మిగిలిపోయిన ఆహారాన్ని మర్నాడు తీసుకొచ్చి హాస్టల్ విద్యార్థులకు పెట్టడం ఏపీలో ఇప్పుడో ట్రెండ్‌గా మారింది. పాచిపోయిన ఆహారం తిని పిల్లలు అస్వస్థతకు గురైన ఘటనలు పలుచోట్ల జరిగాయి.

తాజాగా కురుపాంలో జరిగిన ఘటన మానవత్వానికే సవాల్ విసురుతున్నది. ఆరొందల మందికి పైగా బాలికలు రోజుల తరబడి మురుగునీళ్లు తాగవలసిన పరిస్థితి ఎవరి పాపం? పక్కనే ఉన్న విశాఖ నగరంలో అతి ఖరీదైన భూముల్ని కారుచౌకగా లులూ భయ్యాలకూ, లల్లూ భయ్యాలకూ కట్టబెడుతున్న సర్కార్, ఏజెన్సీ గిరిజన బిడ్డలకు శుభ్రమైన మంచినీటిని కూడా ఎందుకు నిరాకరిస్తున్నట్టు? చంద్రబాబును పెత్తందారీ వర్గాల ప్రతినిధిగా పిలవడం ఇటువంటి కారణాల వల్లనే! పేదల సంక్షేమాన్ని 'పీ–4'కు అప్పగించాలని ఆయన నిర్ణయించారు. సంపన్నుల ఫంక్షన్లలో మిగిలిపోయిన, పాచిపోయిన ఆహారాన్ని పేదలకు పంచడం లాంటిదే 'పీ–4' ఫిలాసఫీ. ఇదేనా మన రాజ్యాంగం చాటిచెప్పిన సమానత్వం? ఎటువంటి వివక్షా లేకుండా అన్ని వర్గాల పిల్లలందరూ ఉచితంగా విద్యను అభ్యసించడమే కాదు, వారి ఆరోగ్య సంరక్షణ కూడా ప్రాథమిక హక్కుల్లో భాగమే. కూటమి సర్కార్ హయాంలో సంక్షేమ హాస్టళ్లలో జరుగుతున్న ఉదంతాలు కచ్చితంగా ప్రాథమిక హక్కుల ఉల్లంఘనలే. జీవించే హక్కును కూడా ఈ ప్రభుత్వం కాలరాస్తున్నట్టే!

కామెర్ల వ్యాధి ప్రబలుతున్నదని తెలిసిన తర్వాత కూడా పాఠశాల నిర్వాహకులు, అధికారులు వ్యవహరించిన తీరు జుగుప్సాకరంగానే ఉన్నది. వ్యక్తిగత పరిశుభ్రత లేకపోవడం వల్లనే విద్యార్థులకు కామెర్ల వ్యాధి సోకిందని సాక్షాత్తూ ఆరోగ్య మంత్రి వ్యాఖ్యానించడం గిరిజన ప్రజానీకాన్ని అవమానించడమే! నలతగా ఉంటున్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహించకుండా వారిని ఇళ్లకు పంపించి పాఠశాల నిర్వాహకులు చేతులు దులుపుకొన్నారు. సరైన వైద్యం అందించకుండా కాలయాపన చేసి, రోజుల తరబడి స్థానిక ఆస్పత్రుల్లో తిప్పి చివరకు మాత్రమే కేజీహెచ్‌కు తరలించినందువల్లనే కల్పన అనే బాలిక చనిపోయింది. బాలిక మరణానికి కారణం సెరెబ్రల్ మలేరియా అని రాశారట! వైద్యులు చికిత్స చేసింది కూడా దానికేనా? అధికారుల ఒత్తిడికి లొంగి వైద్యులు అలా రాయవచ్చునా? చనిపోయిన పిల్లలకు పోస్ట్‌మార్టమ్ ఎందుకు నిర్వహించలేదు? కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పిల్లల్ని వైఎస్ జగన్ పరామర్శిస్తారనే వార్తలు రాగానే వారిని బలవంతంగా డిశ్చార్జి చేయించడానికి అధికారులు ఎందుకు ప్రయాసపడినట్టు? దాచేస్తే సత్యం దాగుతుందా? విద్య, వైద్యం ఉచితంగా అందజేయడం ప్రభుత్వం విధానం కాదనేది కూటమికి నాయకత్వం వహిస్తున్న చంద్రబాబు వైఖరి. అందువలన పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య ఆయనకు ప్రాధాన్య రంగం కాదు. వారికి పోషకాహారం, వసతి సౌకర్యాలు వారి ఎజెండాలో ఉండవు. ఈ విధానానికి వ్యతిరేకంగా పోరాడటమా? లేక మౌనంగా అవమానాలు దిగమింగి అన్యాయాలను సహించడమా? ఏ మార్గం అనుసరించాలో పేద–మధ్యతరగతి వర్గాల ప్రజలు, ప్రజాస్వామ్య – రాజ్యాంగవాదులు నిర్ణయించుకోవలసి ఉంటుంది.

> సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల విద్యార్థుల ఆరోగ్య, వసతి సమస్యలపై ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా వరసగా అనేక దుర్ఘటనలు ఈ ఏడాది కాలంలో రికార్డయ్యాయి. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన సంక్షేమ హాస్టళ్ల గురుకులాల్లోనే ఈ కాలంలో 11 మంది విద్యార్థులు అనారోగ్యంతో చనిపోయారు. తిరుపతి జిల్లా నాయుడుపేట అంబేడ్కర్ సంక్షేమ గురుకులంలో పాచిపోయిన ఆహారం పెట్టడం వల్ల వందమంది విద్యార్థులు అస్వస్థులయ్యారు. ఇటువంటి ఘటనే అదే జిల్లాల్లోని జ్యోతిబా పూలే బీసీ హాస్టల్‌లో జరిగింది. కాకినాడ జిల్లా ఏలేశ్వరం, అనకాపల్లి జిల్లా రాజగోపాలపురం, నూజివీడు ట్రిపుల్ ఐటీల్లో కూడా కలుషిత ఆహారం వల్ల విద్యార్థులు జబ్బుపడిన ఘటనలు జరిగాయి. ఇలాంటి ఉదాహరణలు ఇంకా ఉన్నాయి. గుంటూరు జిల్లాలోని బీసీ హాస్టల్‌లో కలుషితాహారం తిని 50 మంది విద్యార్థులు ఆస్పత్రుల పాలయ్యారు. శనివారం నాడు వారి తల్లిదండ్రులు ఆందోళనకు దిగి తమ పిల్లల్ని హాస్టల్ నుంచి ఖాళీ చేయించారు. సంపన్నుల ఇళ్లలో జరిగే ఫంక్షన్లలో మిగిలిపోయిన ఆహారాన్ని మర్నాడు తీసుకొచ్చి హాస్టల్ విద్యార్థులకు పెట్టడం ఏపీలో ఇప్పుడో ట్రెండ్‌గా మారింది. పాచిపోయిన ఆహారం తిని పిల్లలు అస్వస్థతకు గురైన ఘటనలు జరిగాయి.

vardhelli1959@gmail.com

నీరుగారిపోతున్న ప్రజా హక్కు

అభిప్రాయం



మాడభూషి శ్రీధర్

సమాచార కమిషన్‌లో ఏర్పడే ఖాళీలను రాష్ట్ర, కేంద్ర స్థాయులు రెండింటిలోనూ భర్తీ చేయకపోవడంతో సమాచార హక్కు చట్టం నీరుగారిపోయే పరిస్థితి దాపురించింది. ముఖ్య సమాచార కమిషనర్లు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర సమాచార కమిషన్లు కెప్టెన్ లేని నావల్లా తయారయ్యాయి. ఇదిగాక, వ్యక్తిగత డేటా రక్షణ చట్టం (పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్) పౌరుల సమాచార హక్కును మరింత బలహీనపరుస్తోంది.

కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) మరోసారి ప్రధాన కమిషనర్ లేకుండా మిగిలిపోయింది. గత 11 ఏళ్లలో ప్రభుత్వ పాలనా పారదర్శకతను పర్యవేక్షించే ఈ సంస్థ 'తల' (హెడ్) లేనిదిగా మారడం ఇది ఏడవసారి. 2025 సెప్టెంబర్ 14న అప్పటి ముఖ్య సమాచార కమిషనర్ హీరాలాల్ సామరియా పదవీ విరమణ చేసినప్పటి నుంచి ఈ సంస్థ కేవలం ఇద్దరు కమిషనర్లతోనే పనిచేస్తోంది. ముఖ్య సమాచార కమిషనర్ పదవితో సహా మొత్తం తొమ్మిది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో దాదాపు 26,000 అప్పీళ్లు, ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏడాది కాలానికి పైగా విచారణకు దరఖాస్తుదారులు ఎదురు చూడాల్సి వస్తోంది. ఇటువంటి జాప్యం సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టం ముఖ్య ఉద్దేశాన్ని దెబ్బతీస్తోంది. పదవీ విరమణ తేదీలు తెలిసి కూడా, ప్రభుత్వం కావాలనే నియామకాలు చేపట్టకుండా ప్రభుత్వ పాలనలోని పారదర్శకతను ఉద్దేశపూర్వకంగా చంపుతోంది. సీఐసీకి తాత్కాలిక ముఖ్య అధికారిని నియమించడానికి ఆర్టీఐ చట్టంలో ఎటువంటి నిబంధనా లేదు.

సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి నేటికి 20 ఏళ్లు



> ◆ 2005లో ఆర్టీఐ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుండి పదవీ బాధ్యతలు చేపట్టిన 12 మంది ముఖ్య సమాచార కమిషనర్లలో, కేవలం ఐదుగురు మాత్రమే వారి పూర్వీకులు పదవీ విరమణ చేసిన మరుసటి రోజు బాధ్యతలు స్వీకరించారు. పదవీ విరమణ తేదీలు ముందుగానే తెలుస్తున్నప్పటికీ... ప్రభుత్వం సకాలంలో పోస్టులను భర్తీ చేయడంలో పదేపదే విఫలమవుతోంది.

హీరాలాల్ సామరియా 2023 నవంబర్ 6న నియమితులైన ముఖ్య సమాచార కమిషనర్. ఆయన 65 ఏళ్ల వయస్సు తర్వాత పదవీ విరమణ చేశారు. ఆయన బాధ్యతలు స్వీకరించడానికి ముందు వై.కె.సింగ్ పదవీ విరమణ చేసిన తర్వాత కూడా ఒక నెలపాటు ఆ పదవి ఖాళీగా ఉంది. 2005లో ఆర్టీఐ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుండి పదవీ బాధ్యతలు చేపట్టిన 12 మంది ముఖ్య సమాచార కమిషనర్లలో, కేవలం ఐదుగురు మాత్రమే వారి పూర్వీకులు పదవీ విరమణ చేసిన మరుసటి రోజు బాధ్యతలు స్వీకరించారు. పదవీ విరమణ తేదీలు ముందుగానే తెలుస్తున్నప్పటికీ... ప్రభుత్వం సకాలంలో పోస్టులను భర్తీ చేయడంలో పదేపదే విఫలమవుతోంది. ఇది ఖాళీలను సకాలంలో భర్తీ చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన సుప్రీంకోర్టు 2019 తీర్పును నేరుగా ఉల్లంఘించడమే అని 'అంజలీ భరద్వాజ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో పేర్కొంది. ఖాళీలు ఆర్టీఐ చట్టం పనితీరును 'తీవ్రంగా ప్రభావితం చేస్తాయనీ, ఇది ఈ చట్టం అమలులోకి రావడానికి ఉద్దేశించిన లక్ష్యాన్ని నిర్వీర్యం చేసినట్లవుతుందనీ' కోర్టు హెచ్చరించింది.

ఈ ఏడాది సెప్టెంబర్ 26న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సూర్యకాంత్, జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ముందుకు సమాచార కమిషనర్లను నియమించకపోవడంపై ఒక కేసు విచారణకు వచ్చింది. పిటిషనర్ల తరఫున వాదించిన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మునుపటి ఆదేశాలు ఉన్నప్పటికీ, కేంద్ర సమాచార కమిషన్‌లో ఖాళీలు భర్తీ కాలేదని పేర్కొన్నారు. కమిషన్‌లో కేవలం ఇద్దరు సభ్యులు మాత్రమే ఉన్నారనీ; 26,800 కంటే ఎక్కువ అప్పీళ్లు, ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయనీ తెలిపారు.

జార్ఖండ్ రాష్ట్ర సమాచార కమిషన్ మే 2020 నుండి, అంటే ఐదు సంవత్సరాల నాలుగు నెలల నుంచి నిలిచిపోయిందని కూడా కోర్టుకు తెలియజేశారు. 2025 జనవరిలో కోర్టు విధాన సభలోని అతిపెద్ద ప్రతిపక్ష పార్టీని... ముఖ్య అధికారి, కమిషనర్ల నియామకం కోసం ఎంపిక కమిటీకి తన సభ్యుడు ఒకరిని నామినేట్ చేయాలని ఆదేశించింది. ఈ విషయం తదుపరి విచారణ కోసం ఈ ఏడాది అక్టోబర్ 27కు లిస్ట్ అయ్యింది.

ఆర్టీఐ కార్యకర్త, కామన్వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇనీషియేటివ్ డైరెక్టర్ అయిన వెంకటేశ్ నాయక్ దృష్టిలో కేంద్ర సమాచార కమిషన్‌కు ప్రధాన కమిషనర్ లేకపోవడం ఒక ఇబ్బందికరమైన సమస్య. ''ఇది చట్టం అమలులో చూపిన నిర్లిప్తత, ప్రాధాన్యతా లేమికి స్పష్టమైన సూచన. విశ్వవిద్యాలయాలతో సహా వివిధ సంస్థలు నెలల తరబడి ఖాళీలను భర్తీ చేయకుండా ఉండటం రొటీన్ అయిపోయింది. పరిపాలించేందుకు ప్రభుత్వానికి సిబ్బంది లేనేలేదు'' అని ఆయన పేర్కొన్నారు.


భారతదేశంలో కేంద్ర సమాచార కమిషన్ కాక 28 రాష్ట్ర సమాచార కమిషన్లు (ఎస్ఐసీలు) ఉన్నాయి. ఆర్టీఐ చట్టం ప్రతి కమిషన్‌లో పని భారం ఆధారంగా 1 ముఖ్య సమాచార కమిషనర్, గరిష్ఠంగా 10 మంది సమాచార కమిషనర్లు ఉండాలని ఆదేశిస్తోంది. 'సతర్క్ నాగరిక్ సంఘటన్' (ఎస్ఎన్ఎస్) 2025 జనవరిలో సంకలనం చేసి ప్రచురించిన 'భారతదేశంలోని సమాచార కమిషన్ల నివేదిక కార్డు 2023–24' ప్రకారం... జార్ఖండ్, తెలంగాణ, గోవా, త్రిపుర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో సమాచార కమిషన్లు 2023 జూలై 1–2024 జూన్ 30ల మధ్య వివిధ కాలవ్యవధుల్లో పనిచేయలేక నిలిచి పోయాయి.

ఏతావతా చెప్పొచ్చేదేమిటంటే... సమాచార కమిషన్లు ఇలా నిర్వీర్యానికి గురైతే మనం ఎంతో గొప్పగా చెప్పుకుంటున్న ఆర్టీఐ చట్టం నీరుగారిపోతుంది. అదే జరిగితే ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరునికీ దఖలు పడిన సమాచారం తెలుసుకునే హక్కును నిరాకరించినట్లవుతుంది. ఇది రాజ్యాంగ విరుద్ధం కదా!

వ్యాసకర్త కేంద్ర సమాచార సంఘం మాజీ కమిషనర్

ఆమెది చెరగని సంతకం

ప్రపంచంలో ఏ తండ్రికీ రాకూడని దుస్థితి తన కన్నకూతురికి నివాళులర్పించడం! ఇవాళ సాహితీ లోకానికి 'మిడ్కో'గా లేదా 'దమయంతి'గా తెలిసిన గుముడవెల్లి రేణుక నా రెండో సంతానం. ఇద్దరు కొడుకుల మధ్య పుట్టిన ఏకైక కూతురు. ఏదో ఒకరోజు మమ్మల్ని చూడటానికి తిరిగివస్తుందనే ఆశతో దాదాపు 21 ఏళ్లు ఎదురుచూసిన మా కుటుంబానికి, 2025 మార్చి 31 'ఎన్‌కౌంటర్' వార్త ఓ అశనిపాతం అయ్యింది. 1993 నుంచి పదేళ్లకు పైగా మహిళా ఉద్యమ కార్యకర్తగా, హక్కుల న్యాయవాదిగా తిరుపతి, విశాఖ నగరాల్లో కొనసాగిన తన ప్రస్థానం... 2004 నుంచి అడవుల్లో, అజ్ఞాతంలో అనేక కష్టనష్టాల మధ్య ముందుకుసాగింది. అయితే, ఈ మొత్తం 35 ఏళ్ల కాలంలో తన సాహిత్య సృష్టి అప్రతిహతంగా, అత్యంత సృజనాత్మకంగా కొనసాగింది. ఇప్పుడు భౌతికంగా ఆమె లేకున్నా ఓ అద్భుత అక్షరశిల్పిగా, ఆచరణ శీలిగా, చైతన్య స్రవంతిగా చిరకాలం నిలిచి ఉంటుంది. ఆమె రచనా ప్రపంచాన్ని ఓ తండ్రిగానే కాకుండా, ఒక రిటైర్డ్ తెలుగు టీచరుగా కూడా పరిచయం చేయడం కోసమే ఈ ప్రయత్నం.



1994లో తన మొదటి కథ 'భావుకత'లో ''మీరు సూర్యోదయాల్ని చూస్తూ పరవశించే వేళ... మీ కోసం మేం కాఫీలు కలుపుతూ ఉంటాం'' అని ఆమె రాసినప్పుడు అదో సంచలనం. తన తొలి రెండు, మూడు కథలతోనే తెలుగు నేలలోని కథా విమర్శకుల దృష్టిని ఆకర్షించింది రేణుక. 1995లో రాసిన 'విద్దూరపు మనిషి' కథను 1900–2000 మధ్య, అంటే వందేళ్ల కాలంలో వచ్చిన ఉత్తమ కథల్లో ఒకటిగా 'విశాలాంధ్ర' గుర్తించింది.

రేణుక రాసిన ప్రతి కథలోనూ ఓ అమ్మ పాత్ర ఉంటుంది లేదా అమ్మే ప్రధాన పాత్రగా ఉంటుంది. 1990ల చివరికల్లా విప్లవోద్యమంలో చురుకైన కార్యకర్తగా మారిన రేణుక కథల్లో ఉద్యమ జీవితంలో ఉండే సంఘర్షణలు, ఆదర్శాలు, బలహీనతలు, వెనుకడుగులు... ఇలా ఎన్నో పార్శ్వాలు కథావస్తువులయ్యాయి. కథలే కాదు, కవిత్వం, వ్యాసాలు, ఉద్యమ నివేదికలు, నిర్బంధాలపై క్షేత్రస్థాయి రిపోర్టులు, పుస్తక పరిచయాలు, సినిమా సమీక్షలు... ఇలా ఎన్నెన్నో రూపాల్లో సాహితీ సృజన చేసింది.

'పచ్చని బతుకులపై నిప్పయి కురుస్తున్న రాజ్యం' నివేదికలో నీలంమడుగు అనే గ్రామంలో సల్వాజుడుం దాడి చేసి ఊరంతా కాలబెట్టిన తర్వాత ఒంటిపై కేవలం లంగాతో మిగిలిపోయిన ఓ అభాగ్యురాలి గురించి రాస్తుంది: ''ఇప్పుడామె పోలీసులు ఎత్తుకుపోయిన భర్త కోసం ఏడ్వాలా? నిలువ నీడైనా లేకుండా పోయినందుకు ఏడ్వాలా? ఒంటిని దాచుకునేందుకు గుడ్డముక్కయినా లేనందుకు ఏడ్వాలా? ...తన చుట్టూ చేరి భీతిల్లిపోయి ఏడుస్తున్న పిల్లలు ఏ క్షణాన్నో ఏడుపాపి 'అమ్మా! ఆకలి' అంటే ఏం చెయ్యాలో అర్థంకాక ఏడ్వాలా?''

రేణుక కథలను విరసం రెండు సంపుటాలుగా– 'మెట్ల మీద', 'ప్రవాహం' పేరుతో ప్రచురించింది. ఆమె ఉద్యమ రిపోర్టులన్నీ 'విముక్తి బాటలో' పేరుతో మరో సంపుటిగా వచ్చాయి. ఇంకా వివిధ పత్రికల కోసం వ్యాసాలు, స్పందనలు, స్మరణల రూపంలో రాసినవన్నీ మరో వెయ్యి పేజీలకు పైనే ఉండొచ్చని అంచనా. ఆమె 'అక్షరం ఉన్నంత వరకూ బతికే ఉంటుంది!'

– గుముడవెల్లి సోమయ్య; మిడ్కో తండ్రి, రిటైర్డ్ టీచర్

(నేడు వరంగల్‌లో రేణుక పుస్తకాల ఆవిష్కరణ, 14 తేదీన ఆమె 55వ జయంతి)

క్లుప్తంగా...

దళిత ఐపీఎస్ ఆత్మహత్యపై సీఎం దిగ్భ్రాంతి

సాక్షి, హైదరాబాద్: హరియాణాలో ఉన్నత స్థాయి అధికారుల వేధింపులను తట్టుకోలేక దళిత ఐపీఎస్ అధికారి పూరన్‌కుమార్ ఆత్మహత్యకు పాల్పడటం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. కులం పేరుతో జరుగుతున్న అకృత్యాలకు ఈ ఘటన సజీవ సాక్ష్యం అని 'ఎక్స్' వేదికగా తీవ్రంగా ఖండించారు. కులం పేరుతో అదనపు డీజీ స్థాయి అధికారే వేధింపులకు గురైతే సామాన్య ప్రజానీకం ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులను అర్థం చేసుకోవచ్చన్నారు.

ఐపీఎస్ ఆత్మహత్య విచారకరం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: ఉన్నతాధికారుల కుల వివక్ష, మానసిక వేధింపులను భరించలేక హైదరాబాద్ నగరానికి చెందిన హరియాణా కేడర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ చండీగఢ్‌లో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడటం విచారకరమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హరియాణాలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వెంటనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'మురికి' వేదన



చిగురుమామిడి(హుస్నాబాద్): గ్రామంలో మురుగును సరిగా శుభ్రం చేయడం లేదని కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్‌కు చెందిన వంగపెల్లి రవి శనివారం మురికి నీటిలో స్నానం చేసి అధికారుల తీరుపై తన నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలోని ఐదో వార్డులో రహదారి పక్కన ఏడాదికాలంగా మురికినీరు నిలిచి దుర్వా సనతో స్థానికులు ఇబ్బందిపడుతున్నారని ఆయ న ఆవేదన వ్యక్తం చేశారు. మురికి నీరు నిల్వ ఉండటంతో దోమలు, ఈగలతో స్థానికులు తరచూ జ్వరాల బారిన పడుతున్నారని తెలిపారు. మురి కినీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో అదే మురికి నీటి లో స్నానం చేసి నిరసన తెలిపి నట్లు రవి చెప్పారు.

'గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి రూపాయి ఇచ్చారా?'

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రవాస తెలంగాణీయులకు చేసిందేమీ లేదని, ఒక్క రూపాయి కూడా వారి సంక్షేమానికి ఖర్చు పెట్టలేదని టీపీసీసీ ఎన్నారై సెల్ చైర్మన్ వినోద్‌కుమార్ అన్నారు. శనివారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ జోర్డాన్‌లో జరిగిన ఘటన తమ దృష్టికి రాలేదని, తమకు తెలిసిన వెంటనే అక్కడి అధికారులతో మాట్లాడామని చెప్పారు.

మీ బీ 12 బాగుందా?



హైదరాబాద్‌లోని ఓ ఐటీ సంస్థలో పనిచేసే 33 ఏళ్ల యువకుడు దాదాపు నాలుగేళ్లుగా మతిమరుపు, చిరాకు, కాళ్లు, చేతుల తిమ్మిర్లతో బాధపడుతున్నాడు. ఇటీవల సమస్య తీవ్రత పెరగడంతో ఓ న్యూరాలజిస్ట్‌ను సంప్రదించాడు. అతని ఆహార అలవాట్ల గురించి డాక్టర్ అడగ్గా పూర్తి శాకాహారినని చెప్పాడు. దీంతో డాక్టర్ వెంటనే రోగి రక్తంలో విటమిన్ బీ12 స్థాయి ఎంత ఉందో పరీక్షించగా సాధారణంతో పోలిస్తే అతితక్కువగా ఉన్నట్లు తేలింది. వెంటనే విటమిన్ బీ12 ఇంజెక్షన్లతో చికిత్స ప్రారంభించడంతో పాటు పాల ఉత్పత్తులతో కూడిన ఆహారాలను అధికంగా తీసుకోవాలని సూచించడంతో కొన్ని వారాల్లోనే ఆ యువకుడి జ్ఞాపకశక్తి, ఏకాగ్రత మెరుగుపడింది. తిమ్మిర్ల సమస్య సైతం దూరమైంది.

ఈ విటమిన్ లోపంతో తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం

- మతిమరుపు, ఒత్తిడి, విసుగు, తిమ్మిర్ల వంటివి ఉంటే జాగ్రత్త పడాల్సిందే
- పని ఒత్తిడితో వచ్చిన సమస్యగా భావించి తేలికగా తీసుకోవద్దంటున్న వైద్యులు
- నిర్లక్ష్యం చేస్తే మెదడు, నాడీ వ్యవస్థకు శాశ్వత నష్టం జరుగుతుందని హెచ్చరిక
- శాకాహారుల్లోనే ఈ సమస్య అధికమని గుర్తింపు.. తగిన చికిత్స పొందాలని సూచన

సాక్షి, హైదరాబాద్: చాలాసార్లు సాధారణ ఆరోగ్య సమస్యలుగా కనిపించేవే తీవ్ర అనారోగ్య లక్షణాలకు సూచికలుగా మారొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. తరచూ మతిమరుపు, విసుగు, తిమ్మిర్ల వంటివి ఇబ్బంది పెడుతుంటే వాటిని పని ఒత్తిళ్ల వల్ల ఎదురవుతున్న సమస్యలుగా భావించొద్దని.. అవి శరీరంలో విటమిన్ బీ12 లోపానికి సంకేతం కావొచ్చని అంటున్నారు. ఈ తరహా లక్షణాలపట్ల అవగాహన పెంచుకొని అందుకు తగ్గట్లుగా వ్యవహరించాలని సూచిస్తున్నట్లు ముఖ్యంగా శాకాహారులు ఇలాంటి లక్షణాలతో సతమతమవుతుంటే తప్పనిసరిగా రక్తంలో విటమిన్ బీ12 స్థాయిలు తెలుసుకోవాలని చెబుతున్నారు. లక్షణాలను బట్టి వెంటనే మందులు వాడటం ద్వారా మెదడు, నరాలకు శాశ్వత నష్టం జరగకుండా నివారించవచ్చని పేర్కొంటున్నారు. ఇలాంటి స్థితిని అధిగమించేందుకు విటమిన్ బీ12 సమృద్ధిగా ఉండే లేదా బీ12ను జోడించిన ఆహారాలను తరచూ తీసుకోవడం లేదా వైద్యులు సూచించే సప్లిమెంట్లు తీసుకోవాలని సలహా ఇస్తున్నారు.

ఏమిటీ బీ12 ?

విటమిన్ బీ12 అనేది శరీరం తయారు చేసుకోలేని ఓ పోషకం. ఇది ప్రధానంగా మాంసాహారం, పాల ఉత్పత్తులు, గుడ్లు వంటి వాటి నుంచి లేదా వైద్యపరంగా సప్లిమెంట్ల రూపంలో లభిస్తుంది. మెదడు, నాడీ వ్యవస్థ చురుకుగా పనిచేసేలా చేయడంతోపాటు రక్త కణాలను ఆరోగ్యంగా ఉంచడంలో బీ12 కీలకపాత్ర పోషిస్తుంది. దీన్ని కాలేయం ఐదేళ్ల వరకు నిల్వ చేసుకోగలదు. కానీ శరీరంలో తగినంత బీ12 నిల్వలు లేకపోతే అనారోగ్య సమస్యలు ఏర్పడతాయి. ఈ విటమిన్‌లో కోబాల్ట్ అనే ఖనిజం ఉంటుంది కాబట్టి దీన్ని కోబాలమిన్ అని కూడా పిలుస్తారు. రక్త పరీక్ష ద్వారా బీ12 స్థాయిలు సాధారణంగా ఉన్నాయో లేదో తెలుసుకోవచ్చు. రక్తంలో విటమిన్ బీ12 స్థాయి 70 పీఎంఓఎల్/ఎల్ (పికోమోల్స్ పర్ లీటర్)గా ఉంటే సాధారణం కింద లెక్క.



బీ12 లోపం వల్ల తలెత్తే లక్షణాలు...

- జ్ఞాపకశక్తి తగ్గుదల, అయోమయ భావన
- ఏకాగ్రత లోపం, స్పష్టమైన ఆలోచన కొరవడటం
- కుంగుబాటు భావన, చికాకు, అలసట, బడలిక, బలహీనంగా ఉన్న అనుభూతి కలగడం
- చేతులు, కాళ్ల మొద్దుబారినట్లు, తిమ్మిరిగా, దురదగా ఉండటం
- కంటి నుంచి మెదడుకు దృశ్య సమాచారాన్ని ప్రసారం చేసే ఆప్టిక్ నాడి దెబ్బతినడం.

బీ 12 ప్రయోజనాలు...

- డీఎన్‌ఏ, ఎర్ర రక్త కణాల తయారీలో దోహదం.
- జుట్టు, గోర్లు, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది.
- కేంద్ర నాడీ వ్యవస్థ (మెదడు, వెన్నెముక) అభివృద్ధికి కీలకం.
- ఆరోగ్యకరమైన ఎర్ర, తెల్ల రక్త కణాలు, ప్లేట్‌లెట్ల తయారీకి బీ 12 అవసరం
- కొత్త ఎర్రరక్త కణాల పెరుగుదల, అభివృద్ధికి అవసరం.

ఫేస్‌బుక్‌లో దొంగనోట్ల గ్రూప్‌లు

- బిహార్‌లో తయారీ ముఠా గుట్టురట్టు చేసిన కామారెడ్డి పోలీసులు
- ప్రధాన నిందితుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: బిహార్‌లోని ఓ మారుమూల ప్రాంతం అడ్డాగా దొంగనోట్లు తయారు చేసే ముఠా గుట్టును కామారెడ్డి పోలీసులు రట్టు చేశారు. పోలీసులు బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో వివిధ రాష్ట్రాల్లో దాడులు చేసి 8 మంది నిందితులను అరెస్ట్ చేశారు. కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో ఎస్పీ రాజేశ్ చంద్ర ఆ వివరాలు వెల్లడించారు.

రెండు నోట్లతో మొదలైన కేసు..

కామారెడ్డి కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఓ వైన్స్‌లో గత నెల 23న కామారెడ్డి మండలం షాబ్దీపూర్‌కు చెందిన సిద్దాగౌడ్ మరొకరితో కలిసి రెండు రూ. 500 నోట్లు ఇచ్చి మద్యం కొనుగోలు చేశాడు. వైన్స్ క్యాషియర్ అఖిల్‌కు సిద్దాగౌడ్ ఇచ్చిన నోట్లు నకిలీవనే అనుమానం కలిగి తర్వాత సిద్దాగౌడ్ ఇంటికి వెళ్లి అడిగాడు. తన జీతం డబ్బులు ఇచ్చి మద్యం కొన్నానని సిద్దాగౌడ్ బదులివ్వగా అనుమానం తీరక అఖిల్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ జరిపి నోట్లు నకిలీవని నిర్ధారించారు. సిద్దాగౌడ్‌ను అదుపులోకి విచారణ జరపగా నేరం అంగీకరించాడు. ఫేస్‌బుక్‌లో ఫేక్ కరెన్సీ గ్రూపు ద్వారా కోల్‌కతాకు చెందిన సౌరవ్‌డేను పరిచయం చేసుకొని రూ.5 వేలు అసలు నోట్లు చెల్లించి రూ.10 వేలు దొంగనోట్లు తెప్పించుకున్నట్లు సిద్దాగౌడ్ తెలిపాడు. కామారెడ్డి నుంచి సీసీఎస్ పోలీసులు బెంగాల్ వెళ్లి సౌరవ్‌డేను పట్టుకొని విచారించగా అతడు హరినాయణ భగత్ అనే వ్యక్తితో కలిసి బిహార్‌కు చెందిన రషీద్ నుంచి దొంగ నోట్లు తెప్పించి కొరియర్ ద్వారా కస్టమర్లకు సరఫరా చేస్తున్నట్టు తేలింది. దీంతో మొత్తం వ్యవహారం బయటపడింది. నిందితులిద్దరితోపాటు సిద్దాగౌడ్, మరో కస్టమర్ అయిన కృత్తిక్ రాజు (తమిళనాడు నుంచి వలస వచ్చి కామారెడ్డి ప్రాంతంలో నివసిస్తున్నాడు) లను అరెస్టు చేసి నాలుగు రోజుల క్రితమే కోర్టుకు హాజరుపర్చినట్లు ఎస్పీ తెలిపారు.

బృందాలుగా ఏర్పడి..

దొంగనోట్ల వ్యవహారం వెలుగులోకి రాగానే కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు, సిబ్బందితో కలిపి బృందాలను ఏర్పాటు చేశారు. రషీద్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు బిహార్‌కు వెళ్లాయి. అక్కడ మారుమూల ప్రాంతంలోని ఓ ఇంట్లో దొంగనోట్లు ముద్రించే సామగ్రిని, రషీద్‌ను అదుపులోకి తీసుకున్నారు. వృత్తిరీత్యా రషీద్ ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు. కలర్స్, కెమికల్ మిక్సింగ్‌లపై అవ గాహన ఉంది. దొంగనోట్లు తయారు చేసి అక్రమంగా సంపాదించాలనే ఉద్దేశంతో అతడు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన నందు లాల్ జంగ్డే, చట్టారాం, పశ్చిమ బెంగాల్‌కు చెందిన సౌరవ్ డే, హరినారాయణ భగత్, పండిట్, యూపీకి చెందిన లక్కన్ కుమార్ దూబే, దివాకర్ చౌదరి, సత్యదేవ్‌యాదవ్, మహారాష్ట్రకు చెందిన ప్రమోద్‌కాత్రీలతో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వారిలో కొందరు ఫేస్ బుక్‌లో గ్రూపులను ఏర్పా టు చేసి ఫ్రెండ్‌రిక్వెస్ట్‌ల ద్వారా జనాన్ని పోగు చేస్తారు. వారి నుంచి ఆర్డర్‌లు తీసుకుంటారు. మరి కొందరు రషీద్ నుంచి దొంగనోట్లు తెప్పించి కొరియర్ల ద్వారా కస్టమర్లకు పంపిస్తారని రషీద్‌ను విచారించగా తేలింది. అక్కడి నుంచి పోలీసులు బృందాలుగా ఏర్పడి యూపీ, బెంగాల్, ఛత్తీస్ గఢ్, మహారాష్ట్ర ప్రాంతాల్లో దాడులు నిర్వహించి లక్కన్ కుమార్ దూబే, దివాకర్ చౌదరి, సత్యదేవ్‌యాదవ్‌లను అరెస్టు చేశారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. అంతేగాకుండా వివిధ రాష్ట్రాలకు చెందిన 23 మంది ఆన్‌లైన్ ద్వారా దొంగనోట్లు తెప్పించుకునేందుకు ఆర్డర్‌లు పెట్టి సిద్ధంగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారిలో తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి రూ. 3 కోట్ల నకిలీ నోట్లకు ఆర్డర్ పెట్టుకున్నాడని తెలిసింది. ప్రధాన నిందితుడు రషీద్ ఇంటి నుంచి రూ.3.08 లక్షల నకిలీ నోట్లు, రూ.15,300 అసలు నోట్లు, రూ.8,830 సగం ముద్రించిన నకిలీ నోట్లు, ప్రింటర్లు, కంప్యూటర్లు, కలర్లు, పేపర్లు ఇతర వస్తువులన్నింటిని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు.

పీఎస్‌ఎస్‌లో 25 శాతం కొనుగోలు సీలింగ్ ఎత్తివేయాలి

- మొక్కజొన్న, జొన్న పంటలను ఈ పథకంలో చేర్చాలి
- కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు మంత్రి తుమ్మల లేఖ



సాక్షి, హైదరాబాద్: ధర మద్దతు పథకం (పీఎస్‌ఎస్) కింద కొనుగోలు చేస్తున్న పంటలపై 25 శాతం సీలింగ్‌ను ఎత్తివేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పండించిన పంటలను 25 శాతం పరిమితితో మాత్రమే కొనుగోలు చేస్తే, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ఈ మేరకు శనివారం ఆయన కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు శనివారం లేఖ రాశారు. 'పీఎం ధన్‌ధాన్య కృషి యోజన', 'నేషనల్ మిషన్ ఆన్ పల్సెస్'పథకాలను అభినందిస్తూనే, రాష్ట్రంలో అమలవుతున్న పంటల ధర మద్దతు పథకంలో ఉన్న పరిమితులు, ప్రధాన పంటల కొనుగోలుపై కేంద్రం చూపిస్తున్న నిర్లక్ష్యం, రైతుల ఆదాయంపై ప్రభావం చూపుతున్న కేంద్ర వాణిజ్య విధానాలను ఈ లేఖలో ప్రస్తావించారు. మార్కెట్‌లో ధరలు పడిపోయిన సమయంలో రైతుల ప్రయోజనార్థం రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్, సహకార సంస్థల ద్వారా కేంద్రం విధించిన 25శాతం సీలింగ్ కంటే ఎక్కువ కొనుగోళ్లు చేయాల్సి వస్తోందని, దీని వల్ల రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందన్నారు. తెలంగాణలో వర్షాధార పంటలైన మొక్కజొన్న, జొన్న పంటలను పీఎస్‌ఎస్ పరిధిలోకి తీసుకొచ్చి, రైతులు నష్టపోకుండా చూడాలని చెప్పారు.

కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్య ఆర్థిక విధానం అవసరం

పంటలకు కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకటిస్తున్నా, దాని భారం రాష్ట్ర ప్రభుత్వాలపై పడుతోందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఎంఎస్‌పీ అమలు, మార్కెట్ జోక్యాల్లో కేంద్ర-రాష్ట్రాల మధ్య వ్యయభారం పంచుకునే ఆర్థిక విధానం రూపుదిద్దాలని మంత్రి సూచించారు.

ప్రభావం చూపుతున్న ఆ వాణిజ్య విధానాలు

కేంద్ర ప్రభుత్వం క్రూడ్ పామాయిల్‌పై కస్టమ్స్ సుంకాన్ని 27.5% నుంచి 16.5%కి తగ్గించడంతో ఆయిల్ పామ్ రైతులు పొందే తాజా ఫ్రూట్ బంచ్ (ఎఫ్ఎఫ్‌బీ) ధర టన్నుకు రూ. 20,000 కంటే తక్కువకు చేరిందని తెలిపారు. పత్తి విషయంలో సీసీఐ కొనుగోళ్లు 50-60 శాతం వరకు మాత్రమే పరిమితం అవుతున్నాయని, నాణ్యత పరమైన కారణాలు, కొనుగోళ్లలో ఆలస్యం కారణంగా రైతులకు ఎంఎస్‌పీ లభించడం లేదని తెలిపారు.

'ఎస్సార్'కు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు

- ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ వరదారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న వరదారెడ్డి

హసన్‌పర్తి: అంతర్జాతీయ స్థాయిలో ఎస్సార్ యూనివర్సిటీకి గుర్తింపు లభించినట్లు ఆ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి తెలిపారు. శనివారం యూనివర్సిటీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టీహెచ్ఈ) వరల్డ్ విడుదల చేసిన ర్యాంకింగ్స్-2026లో ఎస్సార్ యూనివర్సిటీ 801-1000 శ్రేణిలో ఉందని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ఐదు లక్షల యూనివర్సిటీలు ఉండగా, తెలంగాణలో అంతర్జాతీయ ర్యాంకింగ్ సాధించిన ఏకైక యూనివర్సిటీ ఎస్సార్ అని తెలిపారు. ఇటీవల వెలువడిన ఎన్ఐఆర్ఎఫ్-2025 ర్యాంకింగ్స్‌లో ఎస్సార్ యూనివర్సిటీ 91వ స్థానం సాధించినట్లు చెప్పారు. విశ్వవిద్యాలయ విభాగంలో 101-150 శ్రేణిలో ఉందని పేర్కొన్నారు. యూఐ గ్రీన్ మార్కెటింగ్ ర్యాంకింగ్స్‌లో దేశంలో 25వ స్థానం సాధించగా, ప్రపంచవ్యాప్తంగా 743వ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఎస్సార్ యూనివర్సిటీలో ఏటా 95 శాతం మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్‌లు సాధిస్తున్నారని వెల్లడించారు. సమావేశంలో ప్రొ. వైస్ చాన్స్‌లర్ మహేశ్, ప్రొఫెసర్ రమణారావు, రిజిస్ట్రార్ అర్చనారెడ్డి, డీన్ ప్రొఫెసర్ పీవీ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళపై హత్యాచారం

- స్తంభానికి చేతులు కట్టేసి ఉండగా, తలకు గాయమైన స్థితిలో గుర్తించిన పోలీసులు
- హుటాహుటిన మెదక్ ఆస్పత్రికి తరలింపు... మెరుగైన చికిత్సకు గాంధీకి తరలిస్తుండగా మృతి
- మెదక్ జిల్లాలో ఘటన



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న పోలీసులు

మెదక్‌జోన్/కొల్చారం(నర్సాపూర్): ఏడుపాయల పుణ్యక్షేత్ర సమీపంలో ఘోరం జరిగింది. ఆలయానికి అతి సమీపంలోని ఓ వెంచర్ పక్కన ముళ్ల పొదల్లో గిరిజన మహిళపై అత్యాచారం చేశారు. ఆపై గుర్తుతెలియని దుండగులు తీవ్రంగా కొట్టడంతో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి శివారులో శనివారం ఉదయం ఈ ఘటన వెలుగు చూసింది. మెదక్ రూరల్ సీఐ జార్జ్, బాధితురాలి భర్త తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ మండలం సంగాయిగూడ తండాకు చెందిన గిరిజన మహిళ భర్త, పిల్లలతో కలిసి జీవనం సాగిస్తోంది. దంపతులిద్దరూ అడ్డా కూలీలుగా పనిచేస్తున్నారు. భర్త రెండు రోజుల క్రితం పని ఉండటంతో గజ్వేల్‌కు వెళ్లాడు. శుక్రవారం ఉదయం ఎప్పటిలాగే ఆమె పనికోసం టిఫిన్ బాక్స్ పట్టుకొని ఇంటి నుంచి వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కొడుకు తన తండ్రికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. ఇంటికి వచ్చిన భర్త తన భార్య కోసం అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. ఇంతలోనే శనివారం ఉదయం 10 గంటల సమయంలో పోలీసుల ద్వారా విషయం తెలిసింది. ఘటనాస్థలిని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించారు. ఆ మహిళను వెంచర్‌లోని స్తంభానికి చేతులు కట్టేసి ఉంచగా, తలకు బలమైన గాయం, కుడిచేయి విరిగి ఉంది. మెడ, ఇతర చోట్ల గాయాలు ఉన్నాయి. వెంటనే పోలీసులు హుటాహుటిన మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. రాత్రి 7 గంటల వరకు చికిత్స అందిస్తున్నా స్పృహలోకి రాలేదు. పరిస్థితి విషమించటంతో వైద్యులు ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. వైద్యులు గిరిజన మహిళపై అత్యాచారం చేసిన తర్వాతే దాడి చేసి ఉంటారని చెబుతున్నారు. ల్యాబ్‌కు శాంపిల్స్ పంపామని రిపోర్టు వచ్చాక పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

బీటెక్ విద్యార్థిని బలవన్మరణం

- కాలేజీకి వెళ్లడం ఇష్టం లేక..



కీర్తన

ఎల్కతుర్తి: కాలేజీకి వెళ్లడం ఇష్టంలేక ఒక బీటెక్ విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనపై ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన జక్రిపోతుల కీర్తన (19) జేఎన్‌టీయూ వనపర్తి కళాశాలలో బీటెక్ ఫస్టియర్ చదువుతోంది. తల్లిదండ్రులకు దూరంగా ఉండి చదువుకోవడం ఇష్టం లేకపోవడం, చదువు ఒంటపట్టకపోవడంతో కీర్తన ఇటీవల కాలేజీ నుంచి ఇంటికి వచ్చింది. తండ్రి కృష్ణాకర్ ఇటీవల కుమార్తె ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ) తీసుకొని వచ్చారు. అందుబాటులో ఉన్న కాలేజీలో చేర్పిస్తామని నచ్చజెప్పారు. అయినప్పటికీ కీర్తన మనస్తాపం చెంది.. శుక్రవారం ఇంట్లో ఉరేసుకుంది. తండ్రి అరుపులు విన్న చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు పగులగొట్టి కీర్తనను కిందకు దింపారు. అప్పటికే ఆమె చనిపోయింది. మృతురాలి తండ్రి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ శనివారం తెలిపారు.

'విజిలెన్స్' ఆకస్మిక రూట్ తనిఖీ

- మోటార్ వాహన, ఇతర చట్టాల కింద కేసులు

సాక్షి, హైదరాబాద్: విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రెండ్రోజులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈనెల 9, 10న పటాన్‌చెరు శివారు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి చట్టవిరుద్ధంగా నడుపుతున్న 16 వాహనాలపై కేసులు నమోదు చేశారు. అధిక లోడ్, ట్రాన్సిట్ ఫారం లేకుండా రవాణా, రాయల్టీలు, జీఎస్టీ ఎగవేతదారులపై కేసు నమోదు చేయగా.. రూ.6,70,000 జరిమానాలు విధించారు. అలాగే 10, 11న రంగారెడ్డి జిల్లాలోని కోకాపేట్ ప్రాంతంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మోటార్ వాహన చట్ట నిబంధనలు పాటించనందుకు 19, మైన్స్ అండ్ మినరల్స్ చట్టం కింద 15 కేసులను నమోదు చేశారు. రూ.6,16,258 జరిమానాలు విధించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్‌తో పాటు మైన్స్, ఆర్టీఏ, కమర్షియల్ ట్యాక్స్ అధికారులు పాల్గొన్నారు. సహజ వనరుల పరిరక్షణ, ప్రభుత్వ నిధుల దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ వెల్లడించారు.

పిచ్చికుక్క స్వైర విహారం

- 16 మందికి గాయాలు



గాయపడిన ఇబ్రహీం

జహీరాబాద్: జహీరాబాద్ పట్టణంలోని గడి, అహ్మద్‌నగర్ కాలనీల్లో పిచ్చికుక్క స్వైరవిహారం చేసి దారిన వెళ్లే వారిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. శనివారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో గడి మహెలాల్లో పలువురిపై దాడి చేసింది. అక్కడి నుంచి అహ్మద్‌నగర్ కాలనీకి వెళ్లి పలువురిపై దాడికి పాల్పడింది. దీంతో ఆయా ప్రాంతాల్లోని 16 మంది గాయపడ్డారు. అహ్మద్‌నగర్ కాలనీకి చెందిన ఇబ్రహీం అనే యువకుడి కంటిపై, ముక్కుపై దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు.. మిగతా వారికి కాళ్లు, చేతులపై దాడి చేసి గాయపరిచింది. గాయపడిన వారు జహీరాబాద్‌లోని ఏరియా ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నారు. దాడిచేసి గాయపరిచిన పిచ్చికుక్కను కర్రలతో కొట్టి చంపేసినట్లు స్థానికులు తెలిపారు.

కిమ్ చేతిలో బ్రహ్మాస్త్రం!

ఖండాంతర అణు క్షిపణి హసాంగ్-20 సిద్ధం

ఉత్తర కొరియా మిలటరీ పరేడ్‌లో ప్రత్యేక ఆకర్షణ



మిలటరీ పరేడ్‌లో హసాంగ్-20 క్షిపణి. (ఇన్‌సెట్‌లో కిమ్)

సియోల్: ఉత్తర కొరియా నియంత పాలకుడు కిమ్ జోంగ్ ఉన్ అణ్వాయుధాలకు పదును పెడుతున్నారు. అత్యంత శక్తివంతమైన ఖండాంతర అణు వ్యూహాత్మక ఆయుధ వ్యవస్థ 'హసాంగ్-20'ను సిద్ధం చేశారు. అధికార వర్కర్స్ పార్టీ 80వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి రాజధాని పాంగ్‌యాంగ్‌లో అట్టహాసంగా జరిగిన భారీ మిలటరీ పరేడ్‌లో ఈ ఇంటర్‌కాంటినెంటల్ బాలిస్టిక్ మిస్సైల్(ఐసీబీఎం) ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ఆయుధం ప్రజలకు దర్శనమివ్వడం ఇదే తొలిసారి. కిమ్ చేతిలో ఇదొక బ్రహ్మాస్త్రమని ఉత్తర కొరియా ప్రభుత్వ మీడియా అభివర్ణించింది. అమెరికాతోపాటు ఆసియాతోని శత్రుదేశాలను భయపెట్టడమే లక్ష్యంగా 'హసాంగ్-20'ను అభివృద్ధి చేసినట్లు తెలుస్తోంది. ఈ క్షిపణిని ఇంకా పరీక్షించలేదు. మరికొన్ని రోజుల్లో టెస్టు చేయబోతున్నట్లు సమాచారం. మిలటరీ పరేడ్‌కు చైనా, రష్యా, వియత్నాం తదితర దేశాల ముఖ్యనేతలు, అధికారులు సైతం హాజరయ్యారు. ఉత్తర కొరియా ఆయుధ సంపత్తిని ప్రత్యక్షంగా వీక్షించారు. శత్రువులను మట్టికరిపించేలా తమ సైన్యాన్ని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దుతామని కిమ్ జోంగ్ ఉన్ ఈ సందర్భంగా ప్రకటించారు. అమెరికా, దక్షిణ కొరియా పేర్లను నేరుగా ప్రస్తావించలేదు. ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యాకు సహకరిస్తున్న ఉత్తర కొరియా సైనికులను కిమ్ ప్రశంసించారు. అంతర్జాతీయ న్యాయం, నిజమైన శాంతి కోసం జరుగుతున్న యుద్ధంలో వారు అద్భుతమైన పోరాట స్ఫూర్తిని కనబరుస్తున్నారని కొనియాడారు. తాము అధిగమించలేని అవరోధాలు, సాధించలేని విజయాలు ఏవీ లేవని వ్యాఖ్యానించారు. ఒక బలమైన శక్తిగా ఈరోజు ప్రపంచం ఎదుట సగర్వంగా నిలిచామని పేర్కొన్నారు. మిలటరీ పరేడ్‌లో లాంగ్-రేంజ్, షార్ట్-రేంజ్ స్ట్రాటజిక్ క్రూయిజ్ మిస్సైళ్లు, డ్రోన్ లాంచ్ వెహికల్స్, డ్రోన్లు, యుద్ధ ట్యాంక్‌లు సైతం ప్రదర్శించారు.

ఏమిటీ హసాంగ్-20?

మిలటరీ పరేడ్‌లో 11 ఇరుసుల భారీ లాంచర్ ట్రక్కుపై హసాంగ్-20 క్షిపణిని ప్రదర్శించారు. కార్బన్ ఫైబర్‌తో రూపొందించిన ఈ క్షిపణి ఇంజిన్ 1,971 కిలోన్యూటన్ల థ్రస్ట్‌ను ఉత్పత్తి చేయగలదు. సుదూరంలో ఉన్న లక్ష్యాలను సులభంగా ఛేదించగలదు. ఒకేసారి బహుళ అణు వార్‌హెడ్లను మోసుకెళ్లేలా డిజైన్ చేశారు. అమెరికా క్షిపణి రక్షణ వ్యవస్థలను తుత్తునియలు చేయగలదని అంటున్నారు. భవిష్యత్తులో అమెరికా నుంచి ఎదురయ్యే ముప్పును తిప్పికొట్టడానికి హసాంగ్-20ని అభివృద్ధి చేసినట్లు తెలుస్తోంది. ఈ మిస్సైల్ కనీస రేంజ్ ఏకంగా 15,000 కిలోమీటర్లు(9,300 మైళ్లు) కావడం గమనార్హం. ఉత్తర కొరియా నుంచి అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీ మధ్య దూరం దాదాపు 11,000 కిలోమీటర్లు. అంటే హసాంగ్-20తో అమెరికా రాజధానిని టార్గెట్ చేయొచ్చు.

అమెరికాలో మళ్లీ కాల్పుల మోత

రెండు వేర్వేరు ఘటనల్లో ఆరుగురి మృతి

హీడెల్‌బర్గ్/లేలాండ్: అమెరికాలో తుపాకులు మరోసారి గర్జించాయి. మిసిసిపీ రాష్ట్రంలో రెండు వేర్వేరు కాల్పుల ఘటనల్లో మొత్తం ఆరుగురు మరణించారు. 12 మందికిపైగా గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మిసిసిపీ రాజధాని జాక్సన్ సిటీకి 190 కిలోమీటర్ల దూరంలోని చిన్నపట్టణం లేలాండ్‌లో శుక్రవారం రాత్రి ఫుట్‌బాల్ మ్యాచ్ సందర్భంగా గుమికూడిన గుర్తుతెలియని వ్యక్తి కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోయారని, 12 మంది గాయపడ్డారని స్థానిక మేయర్ జాన్ లీ చెప్పారు. ఇక్కడ ప్రతిఏటా హైస్కూల్ ఫుట్‌బాల్ హోంకమింగ్ గేమ్ నిర్వహిస్తుంటారు. ఇదే స్కూల్‌లో గతంలో చదువుకున్న విద్యార్థులు పోటీపడుతుంటారు. జాక్సన్ సిటీకి 137 కిలోమీటర్ల దూరంలోని హీడెల్‌బర్గ్ టౌన్‌లో శుక్రవారం రాత్రి ఫుట్‌బాల్ మ్యాచ్ సందర్భంగా జరిగిన కాల్పుల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. స్కూల్ క్యాంపస్‌లో జరిగిన కాల్పుల ఘటనకు సంబంధించి 18 ఏళ్ల అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. లేలాండ్, హీడెల్‌బర్గ్‌లో జరిగిన కాల్పులకు సంబంధం ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదాతకు అభయం

- ఆహార దిగుమతులు తగ్గించుకోవాలి, ఎగుమతులు పెంచుకోవాలి
- వికసిత్ భారత్ సాధనలో రైతన్నలదే కీలకపాత్ర
- ప్రజలకు ప్రొటీన్ భద్రత కోసం తృణధాన్యాల సాగును పెంచాలి
- ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- పలు వ్యవసాయ ప్రాజెక్టులు ప్రారంభం.. మరికొన్నింటికి శంకుస్థాపన

ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన, తృణధాన్యాల మిషన్ ప్రారంభం



భారత వ్యవసాయ పరిశోధన సంస్థలో రైతులతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: దేశంలో తృణధాన్యాల ఉత్పత్తిని భారీగా పెంచడంతోపాటు దేశవ్యాప్తంగా 100 జిల్లాల్లో సాగును ప్రోత్సహించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు కీలక పథకాలకు శ్రీకారం చుట్టారు. రూ.24,000 కోట్లతో అమలు చేసే ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన(పీఎం–డీడీకేవై)తోపాటు రూ.11,440 కోట్లతో అమలయ్యే 'మిషన్ ఫర్ ఆత్మనిర్భర్ ఇన్ పల్సెస్'ను లాంఛనంగా ప్రారంభించారు. అలాగే వ్యవసాయం, పశుపోషణ, మత్స్య, ఆహార శుద్ధి రంగాలకు సంబంధించి రూ.5,450 కోట్ల విలువైన ప్రాజెక్టులు సైతం ప్రారంభించారు. రూ.815 కోట్ల విలువైన మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధన సంస్థలో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆహారం విషయంలో దిగుమతులపై ఆధారపడడం తగ్గించుకోవాలని, ఎగుమతులు పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు. గతంలో అధికారం చెలాయించిన కాంగ్రెస్ ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే వ్యవసాయ రంగం వెనుకంజలో ఉందని ఆరోపించారు. వ్యవసాయం, దాని బంధాల రంగాలపై కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఏనాడూ ఒక వ్యూహం గానీ, లక్ష్యం గానీ లేవని మండిపడ్డారు.



అంతర్జాతీయ మార్కెట్ల తలుపులు తట్టాలి

పీఎం–డీడీకేవైతోపాటు తృణధాన్యాల మిషన్ అమలుకు రూ. 35,000 కోట్లకుపైగా ఖర్చు చేయబోతున్నామని, దీనివల్ల కోట్లాది మంది రైతన్నలకు లబ్ధి చేకూరుతుందని, వారి జీవితాల్లో మార్పులు వస్తాయని ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ రెండు పథకాలను రాబోయే రబీ సీజన్ నుంచి 2030–31 దాకా అమలు చేస్తారు. 2047నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుకోవాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. వికసిత్ భారత్ సాధనలో అన్నదాతలదే కీలక పాత్ర అని తేల్చిచెప్పారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించామంటే ఆ ఘనత రైతులదేనని ప్రశంసించారు. అదే స్ఫూర్తితో వికసిత్ భారత్ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచ మార్కెట్ల అవసరాలకు తగ్గట్టుగా ఆహారం ఉత్పత్తి చేయాలని సూచించారు. అంతర్జాతీయ మార్కెట్ల తలుపులు తట్టాలని, విదేశాల్లోని డిమాండ్‌ను తీర్చే పంటలు పండిస్తే మనకు లాభదాయకమని పేర్కొన్నారు. ఆహార దిగుమతులు తగ్గించుకోవడం, ఎగుమతులు పెంచుకోవడం అనే రెండు కీలక లక్ష్యాలు కచ్చితంగా సాధించుకోవాలని వివరించారు. ఇందుకు నేడు ప్రారంభించిన రెండు కొత్త పథకాలు దోహదపడతాయని తెలిపారు.

పంటల వైవిధ్యంపై దృష్టి పెట్టాలి

కేవలం వరి, గోధుమలే కాకుండా పంటల వైవిధ్యంపై దృష్టి పెట్టాలని రైతులకు ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ప్రొటీన్ భద్రత కల్పించడానికి తృణధాన్యాల సాగును పెంచాలని చెప్పారు. తృణధాన్యాల ఉత్పత్తి, వినియోగంలో ప్రపంచంలో మన దేశమే తొలిస్థానంలో ఉందన్నారు. అయినప్పటికీ మన అవసరాల కోసం విదేశాల నుంచి దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోందని అసంతృప్తి వ్యక్తంచేశారు. 'తృణధాన్యాల మిషన్' కింద తృణధాన్యాల సాగును 2030 నాటికి 35 లక్షల హెక్టార్లకు పెంచనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఏటా 252.38 లక్షల టన్నుల తృణధాన్యాలు ఉత్పత్తి అవుతున్నాయని, 2030–31 నాటికి దీన్ని 350 లక్షల టన్నులకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించారు.

సాగులో సంస్కరణలకు పెద్దపీట

ఇక పీఎం–డీడీకేవై కింద 100 జిల్లాల్లో పంటల సాగు పెంచబోతున్నామని, వేర్వేరు శాఖలకు సంబంధించిన 36 పథకాలను మిళితం చేయబోతున్నామని ప్రధానమంత్రి పేర్కొన్నారు. పంటల ఉత్పత్తిని పెంచడం, పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడం, సాగునీరు సదుపాయం, పంటల నిల్వ సామర్థ్యం మెరుగుపర్చడం, రైతులకు రుణాలు ఇవ్వడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల వల్ల అధోగతి పాలైన వ్యవసాయ రంగాన్ని తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గాడిలో పెట్టామని గుర్తుచేశారు. ఈ రంగంలో సంస్కరణలకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. పెట్టుబడులు పెంచుతున్నామని, విత్తనాల నుంచి మార్కెట్ల దాకా సంస్కరణలు అమలు చేస్తున్నామని వెల్లడించారు. గత 11 ఏళ్లలో వ్యవసాయ బడ్జెట్‌ను ఆరు రెట్లు పెంచామని తేల్చిచెప్పారు. తమ ప్రభుత్వ చర్యల వల్ల వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు రెండు రెట్లు పెరిగాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద రైతులకు రూ.2 లక్షల కోట్లు అందజేశామని, ఇది చిన్న మొత్తం కాదని వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి వచ్చాక పదేళ్లలో రైతన్నల బాగు కోసం ఎరువులపై రూ.13 లక్షల కోట్ల రాయితీ ఇచ్చామన్నారు. తృణధాన్యాలు సాగు చేస్తున్న పలువురు రైతులతో ప్రధాని నరేంద్ర మోదీ ఈ సందర్భంగా సంభాషించారు.

చైనాపై ట్రంప్ బాంబు

అదనంగా 100 శాతం సుంకాలు

- క్రిటికల్ సాఫ్ట్‌వేర్ ఎగుమతులపైనా నియంత్రణలు
- నవంబర్ 1 లేదా అంతకంటే ముందు నుంచే అమల్లోకి..
- ఇప్పటికే అమలవుతున్న 30 శాతం సుంకాలు
- అరుదైన ఖనిజాలపై చైనా నియంత్రణల పట్ల ట్రంప్ ఆగ్రహం



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి టారిఫ్ బాంబు ప్రయోగించారు. ఈసారి డ్రాగన్ దేశం చైనాను లక్ష్యంగా చేసుకున్నారు. అమెరికాలోకి దిగుమతి అయ్యే చైనా ఉత్పత్తులపై అదనంగా 100 శాతం టారిఫ్‌లు విధించబోతున్నట్లు తేల్చిచెప్పారు. ఇవి నవంబర్ 1వ తేదీ లేదా అంతకంటే ముందే అమల్లోకి వస్తాయని స్పష్టంచేశారు. అంతేకాకుండా నవంబర్ 1 నుంచి క్రిటికల్ సాఫ్ట్‌వేర్ ఎగుమతులపై కొన్నిరకాల నియంత్రణలు విధిస్తామని తేల్చిచెప్పారు. ట్రంప్ శుక్రవారం సోషల్ మీడియాలో పోస్టుచేశారు. అరుదైన ఖనిజాల విషయంలో చైనా తీరు తనను షాక్‌కు గురిచేసిందని పేర్కొన్నారు. చైనా ఉత్పత్తులపై ఇప్పటికే 30 శాతం సుంకాలు అమలవుతున్నాయి. ట్రంప్ ప్రకటించిన అదనపు సుంకాలతో కలిపితే మొత్తం సుంకాలు ఏకంగా 130 శాతానికి చేరడం గమనార్హం. అరుదైన ఖనిజాల ఎగుమతులపై చైనా ప్రభుత్వం కొత్తగా నియంత్రణలు విధించడం పట్ల ట్రంప్ తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ప్రతీకార చర్యల్లో భాగంగానే చైనా ఉత్పత్తులపై 100 శాతం అదనపు సుంకాలు ప్రకటించినట్లు తెలుస్తోంది. అరుదైన ఖనిజాల విషయంలో అసలేం జరగబోతోందో చూద్దామని, అందుకే నవంబర్ 1వ తేదీని డెడ్‌లైన్‌గా విధించామని పేర్కొన్నారు. నియంత్రణల విషయంలో చైనా వెనక్కి తగ్గితే అదనపు టారిఫ్‌ల నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటామని పరోక్షంగా సంకేతాలిచ్చారు. త్వరలో దక్షిణ కొరియాలో జరిగే సదస్సులో చైనా అధినేత షీ జిన్‌పింగ్‌ను కలిసే ఆసక్తి లేదని తొలుత వెల్లడించిన ట్రంప్ తాజాగా మాట మార్చేశారు. జిన్‌పింగ్‌తో జరిగే భేటీని రద్దు చేసుకోలేదని పేర్కొన్నారు. కానీ, ఈ భేటీ జరుగుతుందో లేదో తనకు తెలియదన్నారు.

అదనపు టారిఫ్‌లు అమలయ్యేనా?

అరుదైన ఖనిజాల ఎగుమతులపై చైనా ప్రభుత్వం గురువారమే ఆంక్షలు విధించింది. మరుసటి రోజే చైనాపై ట్రంప్ సుంకాల మోత మోగించడం గమనార్హం. అమెరికాలో ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తికి చైనా నుంచి వచ్చే ఖనిజాలే ఆధారం. నిజానికి ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, చైనాలు పరస్పరం ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి. చైనాపై ట్రంప్ అదనపు టారిఫ్‌లు అమల్లోకి రావడం అంత సులభం కాదని నిపుణులు అంచనా వేస్తున్నారు. సుంకాల కారణంగా చైనా ఉత్పత్తుల ధరలు భారీగా పెరిగితే అమెరికన్లకే నష్టమని అంటున్నారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తొలిరోజుల్లో విదేశాలపై టారిఫ్‌లతో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. అమెరికా అవసరాలను దృష్టిలో పెట్టుకొని టారిఫ్‌లు తగ్గించారు. చైనా విధించిన టారిఫ్‌లను 145 శాతం నుంచి 30 శాతానికి తగ్గించారు. చైనా సైతం అమెరికా ఉత్పత్తులపై సుంకాలను 125 శాతం నుంచి 10 శాతానికి తగ్గించింది. ఇదిలా ఉండగా, దక్షిణ కొరియాలో ఈ నెలాఖరున ట్రంప్, జిన్‌పింగ్ మధ్య భేటీ జరుగుతుందని, అదనపు సుంకాలపై ట్రంప్ తన నిర్ణయం మార్చుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచంలో అరుదైన ఖనిజాల మార్కెట్‌లో 70 శాతం వాటా చైనాదే కావడం విశేషం.

బెంగాల్‌లో మరో ఘోరం

వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచారం

- భోజనం కోసం బయటకు వెళ్తుండగా అడ్డుకొని అఘాయిత్యం
- దుర్గాపూర్ ప్రైవేట్ మెడికల్ కాలేజీ క్యాంపస్‌లో ఘటన
- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ్ బర్ధమాన్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. వైద్య కళాశాల విద్యార్థినిపై గుర్తుతెలియని దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. దుర్గాపూర్‌లోని ప్రైవేట్ మెడికల్ కాలేజీ క్యాంపస్‌లో శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగినట్లు పోలీసులు చెప్పారు. ఒడిశాలోని జలేశ్వర్‌కు చెందిన బాధిత విద్యార్థిని ఇదే కాలేజీలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతోంది. రాత్రి సమయంలో భోజనం కోసం స్నేహితుడితో కలిసి క్యాంపస్ బయటకు వెళ్తుండగా, దుండగులు అడ్డుకొని సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాధితురాలు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసులు ఆమె స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. 2024 ఆగస్టు 9న పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఏడాది తర్వాత మళ్లీ అలాంటి సంఘటనే జరగడం చర్చనీయాంశంగా మారింది. మమతా బెనర్జీ ప్రభుత్వం అసమర్థత వల్లే బెంగాల్‌లో మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోశాయి. వైద్య విద్యార్థినిపై అత్యాచారం ఘటనను రాజకీయం చేయొద్దని అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కోరింది.

అసలేం జరిగింది?

పోలీసుల ప్రాథమిక విచారణ పూర్తిచేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బాధిత విద్యార్థిని శుక్రవారం రాత్రి 8.30 గంటల సమయంలో స్నేహితుడితో కలిసి బయటకు వెళ్లేందుకు బయలుదేరింది. గేటు వద్దకు చేరుకోగానే ముగ్గురు వ్యక్తులు వారిని అటకాయించారు. దాంతో ఆ మిత్రుడు భయంతో అక్కడి నుంచి పారిపోయాడు. ఒంటరిగా మిగిలిన బాధితురాలిని ఆసుపత్రి వెనుక భాగంలోని చెట్లపొదల్లోకి లాక్కెళ్లారు. ఆమె ఫోన్‌ను లాక్కున్నారు. ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడ్డారు. ఎవరికైనా చెబితే చంపేస్తామని హెచ్చరించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొంతసేపటి తర్వాత తేరుకున్న బాధితురాలు బయటకు వచ్చింది. అప్పటికే తీవ్రంగా గాయపడింది. ఆసుపత్రి సిబ్బంది ఆమెకు చికిత్స ప్రారంభించారు. జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సీడబ్ల్యూ) బృందం ఆసుపత్రికి చేరుకొని బాధితురాలిని పరామర్శించింది. అత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. ప్రతిపక్ష నేత సువేందు అధికారి బాధితురాలి తండ్రితో ఫోన్‌లో మాట్లాడారు. న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వైద్య విద్యార్థిపై జరిగిన దురాగతాన్ని పశ్చిమ బెంగాల్ డాక్టర్ల ఫోరం ఖండించింది. కాలేజీ క్యాంపస్‌లో కూడా రక్షణ లేకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేసింది. బీజేపీ సీనియర్ నేత అమిత్ మాలవీయ సైతం స్పందించారు. ఐక్యూ మెడికల్ కాలేజీలో అత్యాచార ఘటన జరిగిందని, వసిఫ్ అలీతోపాటు అతడి అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. విద్యార్థినిపై దుశ్చర్య పట్ల నివేదిక ఇవ్వాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను బెంగాల్ ప్రభుత్వం ఆదేశించింది.

శరణార్థి శిబిరంపై దాడి

సూడాన్‌లో 53 మంది మృతి

కైరో: సూడాన్ అంతర్యుద్ధంలో అమాయకుల ప్రాణాలు బలవుతూనే ఉన్నాయి. తాజాగా సూడాన్‌లోని ఉత్తర డార్ఫూర్ రాష్ట్రంలోని ఎల్‌ఫాషర్ నగరంలో ఒక శరణార్థి శిబిరంపై ఆ దేశ పారామిలటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ (ఆర్‌ఎస్‌ఎఫ్) జరిపిన దాడిలో 53 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 14 మంది పిల్లలు, 15 మంది మహిళలు ఉన్నారు. ఐదుగురు పిల్లలు, ఏడుగురు మహిళలుసహా మరో 21 మంది ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రాంతంపై పట్టుఉన్న సూడాన్ సైన్యంతో ఆర్‌ఎస్‌ఎఫ్ పోరాడుతోంది. దేశంలో మూడు సంవత్సరాలుగా జరుగుతున్న అంతర్యుద్ధంలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతుండడం పట్ల ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల సంఘం ప్రతినిధులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బిహార్‌లో తేలిన లెక్క!

- సీట్ల పంపకాలపై ఎన్‌డీఏ పార్టీల మధ్య అంగీకారం
- బీజేపీకి 101, జేడీ(యూ)కి 101 స్థానాలు
- చిరాగ్ పాశ్వాన్ పార్టీకి 26, మాంఝీ పార్టీకి 8, కుష్వాహా పార్టీకి 7 స్థానాలు
- నేడు అభ్యర్థులను ప్రకటించే అవకాశం

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే స్థానాలపై అధికార ఎన్‌డీఏ పక్షాలు ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. గత నాలుగు రోజులుగా జరిగిన విస్తృత చర్చల అనంతరం సీట్ల పంపకాల ప్రక్రియను కూటమి పార్టీలు పూర్తి చేసినట్లు సమాచారం. శనివారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నేతృత్వంలో ఉన్నతస్థాయి చర్చలు జరిగాయి. బీజేపీ, జేడీ(యూ)లు చెరో 101 స్థానాల్లో పోటీ చేయనుండగా, లోక్‌జనశక్తి పార్టీ (రామ్‌విలాస్) 26, హిందుస్తానీ అవామ్ మోర్చా 8, రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ 7 స్థానాల్లో పోటీ చేసేలా అంగీకారం కుదిరినట్లు ఎన్‌డీఏ వర్గాలు చెబుతున్నాయి. తమకు కనీసం 35 నుంచి 40 స్థానాలు కేటాయించాలని లోక్‌జనశక్తి పార్టీ (రామ్ విలాస్) నేత చిరాగ్ పాశ్వాన్ పట్టుబట్టగా చివరకు 26 స్థానాలకు ఒప్పించారు. గత ఎన్నికల్లో ఆయన పార్టీ 135 స్థానాల్లో పోటీ చేసి ఒకేఒక్క స్థానంలో గెలిచింది. జేడీ(యూ)కి మరో 25 స్థానాలు దక్కకుండా చేయడంలో కీలకపాత్ర పోషించింది. ఈసారి అలాంటి పరిస్థితి రాకుండా 26 స్థానాలు ఇవ్వడంతోపాటు మళ్లీ అధికారంలోకి వస్తే మంత్రి పదవి, మరో రాజ్యసభ సీటు, రెండు ఎమ్మెల్సీ స్థానాలు సైతం ఇచ్చేందుకు ఒప్పందం కుదిరినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మిత్రపక్షాలకు 41 సీట్లు

జితన్‌రామ్ మాంఝీ నేతృత్వంలోని హిందుస్తానీ అవామ్ మోర్చా గతంలోకన్నా ఒక స్థానం ఎక్కువగా ఇచ్చేందుకు బీజేపీ అంగీకరించింది. ఉపేంద్ర కుష్వాహా ఆధ్వర్యంలోని రాష్ట్రీయ లోక్ సమతా పార్టీకి ముందునుంచీ చెబుతున్నట్లుగా 7 సీట్లు కేటాయించారు. మొత్తం 243 స్థానాలకు గాను మిత్రపక్షాలకు 41 సీట్లు దక్కాయి. మిగిలిన 202 సీట్లలో జేడీ(యూ), బీజేపీలు చెరో 101 స్థానాల్లో పోటీ చేసే అవకాశం ఉంది. పోటీ చేసే స్థానాలపైనా నడ్డాతో జరిగిన భేటీలో చర్చలు జరిగాయి. ఏకాభిప్రాయం వ్యక్తమైన స్థానాలకు అభ్యర్థులను ఆదివారం ప్రకటించాలని నిర్ణయించినట్లు సమాచారం. నేడు బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ ముగిసిన వెంటనే, ఎన్‌డీఏలోని అన్ని పార్టీలు ఉమ్మడిగానే తమ అభ్యర్థులను ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.

విమానం ముందు అద్దానికి పగుళ్లు

చెన్నై విమానాశ్రయంలో సురక్షితంగా ఇండిగో ల్యాండింగ్

చెన్నై: విమానం ముందు అద్దానికి పగుళ్లు ఏర్పడిన విషయాన్ని ముందుగానే గుర్తించిన పైలట్.. సురక్షిత ల్యాండింగ్‌కు తగిన చర్యలు తీసుకోవడంతో పెను ప్రమాదం తప్పిన ఘటన ఇది. అధికార వర్గాల సమాచారం ప్రకారం, దేశీయ అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో విమానం శనివారం మదురై నుంచి 76 మంది ప్రయాణికులతో చెన్నైకి బయలుదేరింది. ల్యాండింగ్‌కు కొద్ది సేపటికి ముందు విమానం ముందు అద్దానికి పగుళ్లు ఏర్పడినట్లు పైలట్ గుర్తించారు. ఈ విషయాన్ని ఇక్కడి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌కు సమాచారం ఇచ్చారు. సమాచారం అందిన వెంటనే విమానం సురక్షితంగా ల్యాండ్ కావడానికి ఎయిర్‌పోర్ట్‌లో తగిన ఏర్పాట్లు చేశారు. అనుకున్నది అనుకున్నట్లు జరగడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. కాగా విండ్‌షీల్డ్ పగుళ్లకు కారణం తెలియలేదు. ఈ ఘటన కారణంగా మదురైకి విమానం తిరుగు ప్రయాణం రద్దయ్యింది. ఇదిలావుండగా, ఘటనపై స్పందించిన ఇండిగో, 'విండ్‌షీల్డ్ క్రాక్స్' గురించి ఎక్కడా ప్రస్తావించకపోవడం గమనార్హం. కేవలం 'ల్యాండింగ్‌కు ముందు మెయింటెనెన్స్ అవసరాన్ని గుర్తించడం జరిగింది'' అని మాత్రమే ఒక ప్రకటనలో పేర్కొంది.

భారత్‌తో బంధానికి అత్యధిక ప్రాధాన్యం

- మన భాగస్వామ్యం మరింత బలపడాలి
- అమెరికా రాయబారిగా నియమితుడైన సెర్గియో గోర్ ఆకాంక్ష
- ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ



ట్రంప్ సంతకం చేసిన చిత్రపటాన్ని మోదీకి బహూకరిస్తున్న సెర్గియో గోర్

న్యూఢిల్లీ: భారత్‌తో సంబంధాలకు అమెరికా అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని సెర్గియో గోర్ చెప్పారు. రెండు దేశాల మధ్య భాగస్వామ్యం మరింత బలపడాలన్నదే తమ ఆకాంక్ష అని వ్యాఖ్యానించారు. భారత్‌లో అమెరికా రాయబారిగా నిమితుడైన సెర్గియో గోర్ శనివారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా సంతకం చేసిన చిత్రపటాన్ని మోదీకి బహూకరించారు. రక్షణ, వ్యాపారం, వాణిజ్యం, అరుదైన ఖనిజాలు వంటి కీలక రంగాల్లో పరస్పర సహకారంపై మోదీ, సెర్గియో చర్చించారు. ఆరు రోజుల పర్యటన నిమిత్తం సెర్గియో శనివారం ఉదయం ఢిల్లీకి చేరుకున్నారు. తొలుత భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తోపాటు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీతో సమావేశమయ్యారు. ఆ తర్వాత మోదీని కలుసుకున్నారు. సెర్గియోతో మాట్లాడడం సంతోషంగా ఉందంటూ మోదీ 'ఎక్స్'లో పోస్టుచేశారు. అమెరికా రాయబారిగా ఆయన నేతృత్వంలో భారత్–అమెరికా సమగ్ర వ్యూహాత్మక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ గొప్ప నాయకుడు, మంచి మిత్రుడు అంటూ డొనాల్డ్ ట్రంప్ తరచుగా ప్రశంసిస్తుంటారని సెర్గియో గోర్ గుర్తుచేశారు. మోదీతో కీలక అంశాలపై చర్చించానని తెలిపారు. వరుస భేటీల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రక్షణ, వాణిజ్యం, టెక్నాలజీ, ఖనిజాలు సహా ద్వైపాక్షిక వ్యవహారాలపై అభిప్రాయాలు పంచుకున్నామని చెప్పారు. నరేంద్ర మోదీ, డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలో భారత్–అమెరికాలు మరింత సన్నిహితంగా మారడం ఖాయమని అన్నారు. ఇరుదేశాలు కలిసికట్టుగా పని చేయాలన్నదే తన ఆకాంక్ష అని ఉద్ఘాటించారు.



రోడ్లు ఛిద్రం.. జర భద్రం..
నగరంలోని ప్రధాన, అంతర్గత రహదారులు ఛిద్రమయ్యాయి. ట్రాఫిక్‌తో పాటు నిర్వహణ లోపాలతో భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు త్వరితంగా దెబ్బతింటున్నాయి. -10లో



కిక్ కొట్టు.. క్లబ్ సెట్టు..
నగరవాసుల్లో బైక్ రైడ్స్ హాబీ అంతకంతకూ పెరుగుతోంది. పది, ఇరవై కిలోమీటర్ల ప్రయాణాల నుంచి క్రమంగా వేల మైళ్ల ప్రయాణాలకు విస్తరిస్తోంది. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
32.0/21.0
నగరంలో ఆదివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగలు పొడి వాతావరణం నెలకొంటుంది. గరిష్ఠంగా 32, కనిష్ఠంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

నేడే పల్స్ పోలియో

డీఎంహెచ్‌ఓ వెంకటి





సాక్షి, సిటీబ్యూరో: ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు అందరూ సహకరించాలని హైదరాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి వెంకటి పేర్కొన్నారు. చిన్నారుల బంగారు భవిష్యత్‌కు పోలియో చుక్కలు ఎంతో అవసరమన్నారు. ఐదేళ్ల లోపు వారికి పోలియో చుక్కలు వేయించాలని ఆయన సూచించారు. ఆదివారం ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులతో పాటు సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్లు, అమీర్‌పేట్, ఎంజీబీఎస్, జేబీఎస్ మెట్రో స్టేషన్లు పోలియో బూత్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో మొత్తం 91 మొబైల్ టీంలు, 2,586 పోలియో బూత్‌లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఐదేళ్ల లోపు పిల్లలు జిల్లాలో మొత్తం 5,17,238 మంది ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. 11,200 మంది సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని వెంకటి తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలి: ఆర్‌వీ కర్ణన్



శిక్షణకు హాజరైన బీఎల్‌ఓలు, సెక్టార్ అధికారులు

బంజారాహిల్స్: భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక నేపథ్యంలో.. శనివారం బంజారాభవన్‌లో సెక్టార్, బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అమలయ్యేలా సహకారం అందించాలన్నారు. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావద్దని అధికారులకు సూచించారు. ఓటరు స్లిప్పుల పంపిణీ చాలా ముఖ్యమని ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. ఓటరు స్లిప్ ఇవ్వకపోతే క్రిమినల్ కేసులు పెడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, రిటర్నింగ్ అధికారి పి.సాయిరాం, చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ సునంద తదితరులు పాల్గొన్నారు. కాగా.. కర్ణన్ శనివారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ నెల 22 నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రారంభించి నవంబర్ 5 వరకు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి సాయిరాం తెలిపారు.

మట్టి ప్రమిదలు దొంతులు రెడీ



వెలుగుల పండుగ దీపావళి అరుదెంచింది. చిన్నాపెద్దా కలిసి బాణసంచా కాలుస్తారు. ఇంటింటా దొంతులు ఏర్పాటు చేస్తారు. ప్రమిదలు వెలిగిస్తారు. దీంతో మట్టి దొంతులు, ప్రమిదల తయారీలో కుమ్మరి వృతి పనివారు బిజీగా మారారు. కాప్రా సమీపంలోని నాగారంలో ప్రమిదలను తయారు చేస్తున్నారు. సికింద్రాబాద్‌లో దొంతులకు వినియోగించే గురుగులకు రంగులు అద్ది అందంగా తీర్చిదిద్దుతుండగా 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.



ప్రయాణానికి నిరీక్షణ

- రైళ్లకు భారీ డిమాండ్
- వందల్లో వెయిటింగ్ లిస్ట్
- శబరి ఎక్స్‌ప్రెస్‌లో నో బెర్త్..
- పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు
- ఫ్లైట్ చార్జీలు సైతం పైపైకి..
- సిటీ నుంచి పెరగనున్న రద్దీ

పండుగలు, పెళ్లిళ్లు, సెలవులు

సాక్షి, సిటీబ్యూరో

వందల్లో రైళ్లు. వేలల్లో బెర్తులు. అయినా తప్పని నిరీక్షణ. పండుగలు, పెళ్లిళ్లు, వరుస సెలవులు, శుభకార్యాలు, అయ్యప్ప భక్తుల శబరి పర్యటనల రద్దీతో రైళ్లకు అనూహ్యంగా డిమాండ్ పెరిగింది. హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే అన్ని రెగ్యులర్ రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ వందల్లోకి చేరింది. కొన్ని రైళ్లలో 'నో రూమ్' దర్శనమిస్తోంది. సాధారణ రోజుల్లో కంటే ప్రత్యేక సందర్భాల్లో హైదరాబాద్ నుంచి ప్రయాణికుల రద్దీ సహజంగానే రెట్టింపవుతోంది. ఇందుకనుగుణంగా వివిధ మార్గాల్లో దక్షిణమధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తోంది.

అదనంగా సుమారు 150 రైళ్లు..

దీపావళి, క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు, సంక్రాంతి వంటి పండుగలు, వరుస సెలవుల దృష్ట్యా అన్ని రెగ్యులర్ రైళ్లలో భారీ డిమాండ్ నెలకొంది. సికింద్రాబాద్, చర్లపల్లి, నాంపల్లి, కాచిగూడ స్టేషన్‌ల నుంచి విశాఖ, కాకినాడ, తిరుపతి, కర్నూలు, కోల్‌కతా, చెన్నై, శబరి, దానాపూర్, పటాఌ, ఢిల్లీ తదితర నగరాలకు రాకపోకలు సాగించే అన్ని రెగ్యులర్ రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల జాబితా గణనీయంగా పెరిగింది. మరోవైపు ఎప్పటికప్పుడు ఈ డిమాండ్ అధికమవుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు ప్రత్యేక రైళ్ల నిర్వహణకు ప్రణాళికలను రూపొందించారు. వివిధ మార్గాల్లో సుమారు 150 రైళ్లను అదనంగా నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

సంక్రాంతి ప్రయాణం కష్టమే..

- సంక్రాంతికి 25 లక్షల నుంచి 30 లక్షల మంది సొంతూళ్లకు వెళ్తారని అంచనా. రైళ్లు, ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులతో పాటు సొంత వాహనాల్లోనూ ఎక్కువ మంది బయలుదేరుతారు. కాగా.. ఇప్పటికే కొన్ని రూట్లలో డిమాండ్ మేరకు అధికారులు ప్రత్యేక రైళ్లను ప్రకటించారు. అయినా రోజురోజుకూ ప్రయాణికుల డిమాండ్ పెరుగుతూనే ఉంది. సికింద్రాబాద్, చర్లపల్లి స్టేషన్‌ల నుంచి బయలుదేరే విశాఖ, ఫలక్‌నుమా, కోణార్క్, నాందేడ్ సూపర్‌ఫాస్ట్, ఈస్ట్‌కోస్ట్, గరీబ్‌రథ్, దురంతో తదితర రైళ్లలో 100 నుంచి 150 వరకు వెయిటింగ్ లిస్ట్ నమోదు కావడం గమనార్హం.

విమాన చార్జీల మోత..



మరోవైపు దీపావళి సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు ఎయిర్ లైన్స్ చార్జీలను రెట్టింపు చేశాయి. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఢిల్లీ, జైపూర్, కోల్‌కతా, నాగ్‌పూర్ తదితర నగరాలకు చార్జీలు అనూహ్యంగా పెరిగినట్లు సమాచారం. సాధారణంగా హైదరాబాద్ నుంచి ఢిల్లీకి రూ.6000 వరకు చార్జీలు ఉంటే ఈ నెల 18, 19, 20 తేదీల్లో రూ.9000 నుంచి రూ.12000 వరకు పెంచారు. జైపూర్ రూ.7000 నుంచి ఏకంగా రూ.15000 వరకు చార్జీలు పెరిగాయి. కోల్‌కతాకు రూ.5000 నుంచి రూ.7000 వరకు ఉంటుంది. దీపావళి దృష్ట్యా ప్రస్తుతం రూ.12000 వరకు పెరిగినట్లు ట్రావెల్స్ సంస్థల ప్రతినిధులు చెప్పారు.

- కాకినాడ వైపు వెళ్లే గౌతమి, నర్సాపూర్ తదితర రైళ్లలోనూ వెయిటింగ్ లిస్ట్ 100 వరకు నమోదైంది. సికింద్రాబాద్ నుంచి దానాపూర్ వరకు వెళ్లే ఎక్స్‌ప్రెస్‌కు దీపావళి రద్దీ పోటెత్తింది. ఈ మార్గంలో సికింద్రాబాద్ నుంచి ముజఫర్‌నగర్‌కు కొత్తగా అమృత్‌భారత్‌ను ప్రవేశపెట్టినప్పటికీ దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణికుల డిమాండ్ ఏ మాత్రం తగ్గలేదు. దీపావళి వేడుకల కోసం నగరం నుంచి యూపీ, బిహార్ తదితర రాష్ట్రాల్లోని సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికులు రైళ్ల కోసం ఇప్పటి నుంచే పడిగాపులు కాస్తున్నారు. క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలకూ దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌కు రద్దీ భారీగానే ఉండనుందని అధికారులు భావిస్తున్నారు.



రెండో వైపూ బోర్డు పెట్టేశారు!



తెలంగాణ తల్లి ఫ్లైఓవర్‌కు ఇప్పటికే ఒకవైపు బోర్డును ఏర్పాటు చేసిన జీహెచ్‌ఎంసీ అధికారులు.. ప్రస్తుతం రెండో వైపు (లోయర్ ట్యాంక్ బండ్) కూడా బోర్డును ఏర్పాటు చేశారు. – సాక్షి, సిటీబ్యూరో

మీకు తెలుసా?

జూబ్లీహిల్స్‌లో 80 శాతం బస్తీలే..



శ్రీరాంనగర్ బస్తీ

జూబ్లీహిల్స్ నియోజకవర్గం అంటే సంపన్నులు, బడాబాబులు ఉండే నియోజకవర్గం అని చాలా మంది అనుకుంటారు. కానీ జూబ్లీహిల్స్‌లో, బంజారాహిల్స్ లాంటి ఖరీదైన ప్రాంతాలు ఈ నియోజకవర్గ పరిధిలోకి రావన్న సంగతి తెలియదు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాలు ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో ఉంటాయి. మైసూర్ పాక్‌లో మైసూర్ లేనట్టే.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జూబ్లీహిల్స్ ఉండదు. 20 శాతం కాలనీలు, అపార్ట్‌మెంట్స్, గేటెడ్ కమ్యూనిటీలు ఉంటే 80 శాతం బస్తీలే ఉంటాయి. పేద, మధ్యతరగతి వర్గాలే అధికం. కేవలం శ్రీనగర్ కాలనీ, మధురానగర్ కాలనీ ప్రాంతాలు, రాజీవ్‌నగర్ కాలనీ, సారథినగర్ సొసైటీ, కళ్యాణ్‌నగర్, మోతీనగర్‌లో కొంత ప్రాంతం కాలనీలు ఉండగా, బ్రిగేడ్ గేటెడ్ కమ్యూనిటీ, కల్పతరు, వాసవి బృందావన్, జనప్రియ అపార్ట్‌మెంట్స్ లాంటి కమ్యూనిటీలు ఉన్నాయి. అధికంగా మైనార్టీలు మెజారిటీ ఉండగా తదుపరి బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, ఓసీలు ఉన్నారు. కాగా.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో వెరైటీగా ఆరున్నర డివిజన్లు ఉన్నాయి. ఎర్రగడ్డ, బోరబండ, రహమత్‌నగర్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్ ప్రధానంగా ఉండగా ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని సోమాజిగూడ డివిజన్‌లోని ఎల్లారెడ్డిగూడ, శ్రీనగర్ కాలనీ ఉంటాయి. జూబ్లీహిల్స్‌లో జూబ్లీహిల్స్ లేనట్లు నియోజకవర్గంలో వెరైటీగా ఆరున్నర డివిజన్లు ఉండటం కూడా ఓ విచిత్రమే. – శ్రీనగర్‌కాలనీ

ప్రార్థన మందిరం వద్ద ఎన్నికల ప్రచారం చేశారని..

జూబ్లీహిల్స్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, ఆమె కూతురుపై కేసు నమోదు

బంజారాహిల్స్: మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ)ను ఉల్లంఘించి ప్రార్థన స్థలాల వద్ద అనుమతులు తీసుకోకుండా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, ఆమె కూతురు మాగంటి అక్షర, యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్‌తో పాటు మరో నలుగురిపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, ఆమె కూతురు అక్షరతో పాటు కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, బీఆర్‌ఎస్ నేతలు ఆజం అలీ, అంజద్ అలీఖాన్, ఫయీం, షఫీ తదితరులు పార్టీ కండువాలు వేసుకుని వెంకటగిరిలోని ఓ ప్రార్థన మందిరం వద్ద శుక్రవారం మధ్యాహ్నం కరపత్రాలతో కనిపించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ డిప్యూటీ తహసీల్దార్ ఫ్రాన్సిస్ గమనించి సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో మాగంటి సునీతతో పాటు ఆమె కూతురు, ఇతర నేతలు చేతుల్లో కార్డులు పట్టుకొని ప్రార్థనలు చేసి వచ్చిన వారిని ప్రభావితం చేసే కార్యక్రమాలు చేపడుతున్నట్లు గుర్తించారు. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళికి పూర్తి విరుద్ధమని, మతపరమైన ప్రాంతాల్లో రాజకీయ పార్టీల ప్రచారాలు చేయకూడదని ఎన్నికల నిబంధనలు ఉన్నట్లు గుర్తించిన ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ అధికారి ఫ్రాన్సిస్ తెలిపారు. వీరిపై చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓటరు స్లిప్‌లోనే సీరియల్ నెంబర్

పోలింగ్ కేంద్రాల వద్ద ఉచిత మొబైల్ డిపాజిట్ కౌంటర్లు

- ఆన్‌లైన్ ద్వారా నామినేషన్లు
- 'సాక్షి'తో జీహెచ్‌ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్





సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు తమ రాజకీయ భవిష్యత్ చిత్రానికి సూచికగా భావిస్తున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఉప ఎన్నిక జరుగుతోంది ఒక్క నియోజకవర్గానికి మాత్రమే అయినప్పటికీ, గ్రేటర్ హైదరాబాద్ ప్రజలతో పాటు రాష్ట్రమంతా ఈ ఎన్నిక ఉత్కంఠ రేకెత్తిస్తోంది. గతంలో హుజూరాబాద్, మునుగోడు నియోజకవర్గాల ఉప ఎన్నిలను తలపిస్తున్నాయన్న వ్యాఖ్యానాలూ వినిపిస్తున్నాయి. నవంబర్ 11న జరగనున్న జూబ్లీహిల్ ఉప ఎన్నికకు రేపటి (సోమవారం) నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు చేసిన ఏర్పాట్లు, తీసుకున్న జాగ్రత్తలు తదితరాలపై హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ 'సాక్షి' ప్రతినిధితో మాట్లాడారు. ఆయన ఏం చెప్పారంటే..

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు..

ఎన్నికలకు సర్వం సిద్ధం చేశాం. నామినేషన్ల నుంచి ఫలితాల వెల్లడి వరకు ఎవరికీ, ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇచ్చాం. ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్, ఓట్ల లెక్కింపు, తదితరమైనవి యూసఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కరరెడ్డి స్టేడియంలో జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం.

ఓటర్లకు కల్పించిన సదుపాయాలు

ఓటర్లు ప్రశాంతంగా ఓట్లు వేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నాం. నవంబర్ 11వ తేదీన పోలింగ్ జరగనుండగా, 5వ తేదీనాటికి ఓటర్లందరికీ ఓటరుస్లిప్‌ల పంపిణీ పూర్తవుతుంది. గతంలో లేని విధంగా ఈసారి ఓటరు స్లిప్‌లోనే ఓటరు సీరియల్‌నెంబర్ కూ డా ఉంటుంది. దాంతో పోలింగ్ కేంద్రంలోని సిబ్బంది సైతం ఓటరును వెంటనే గుర్తించగలుగుతారు. ఎంతో సమయం కలిసి వస్తుంది.

పోలింగ్ శాతం పెరిగేందుకు..

ఎప్పటిలాగే ఓటర్లకు అవగాహన, చైతన్యం కల్పించే కార్యక్రమాలు ఇప్పటికే జరుగుతున్నాయి. మొబైల్ ఫోన్లను అనుమతించరు. దీంతో ఫోన్‌ను ఎక్కడ ఉంచాలో తెలియదంటూ పోలింగ్‌కు దూరంగా ఉంటున్నవారున్నారు. పోలింగ్‌కు వెళ్లేవారు ఓటు వేసి వచ్చేంత వరకు మొబైల్ ఫోన్లను భద్రపరిచేందుకు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఫోన్ డిపాజిట్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. ఓటర్లకు ఈ సదుపాయం ఉచితంగానే లభిస్తుంది. ఎలాంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదు.

ఎన్నికల విధుల్లో సిబ్బంది

పోలీసు విభాగం కాకుండా మూడు వేల మంది సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు. అన్ని చోట్లా పోలింగ్ సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు పక్కాగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. ఎప్పటి లాగే అన్ని అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు, వయోవృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తాం.

ఆన్‌లైన్ ద్వారా నామినేషన్లు

సువిధ పోర్టల్ ద్వారా నామినేషన్లు స్వీకరించే సమయం నుంచి ఆన్‌లైన్ ద్వారా నామినేషన్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకొని, ఆన్‌లైన్‌లోనే వివరాలు నమోదు చేయవచ్చు. అయితే, ఆన్‌లైన్ ద్వారా భర్తీ చేసినప్పటికీ, స్వయంగా హాజరు కావాల్సి ఉంటుంది. సంతకం, ప్రమాణం కోసం తప్పనిసరి. నామినేషన్ల స్వీకరణ గడువు సమయం ముగిసేలోగా హాజరు కావాలి.

ఈవీఎంలలో అభ్యర్థుల కలర్ ఫొటో ఉంటుంది. మిగతావన్నీ ఎప్పటిమాదిరిగానే , అన్ని అసెంబ్లీ ఎన్నికల్లాగే నిర్వహించనున్నట్లు కర్ణన్ తెలిపారు.

చిట్టీల పేరుతో రూ.30 లక్షల మోసం

– నిందితుడి అరెస్ట్



రాంచందర్

హస్తినాపురం: మాంగళ్య షాపింగ్ మాల్‌లో ఉద్యోగిగా పనిచేస్తూ సహోద్యోగుల నుంచి చిట్టీల పేరుతో రూ. 30 లక్షలు మోసం చేసి పరారైన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వనస్థలిపురం ఎస్‌ఐ గిరీష్‌కుమార్ తెలిపిన మేరకు.. అబ్దుల్లాపూర్ మెట్ మండలం మునుగనూర్‌కు చెందిన బజ్జూరి రాంచందర్ (47) గతంలో మాంగళ్య షాపింగ్ మాల్‌లో ఉద్యోగం చేస్తూ గత సంవత్సరం నుంచి చిట్టీలు నిర్వహిస్తున్నానని సహోద్యోగులను నమ్మించాడు. దీంతో షాపింగ్ మాల్‌లో పనిచేసే 20 మంది ఉద్యోగులు అతని వద్ద చిట్టీలు వేశారు. ఆ తరువాత తర్వాత రాంచందర్ దాదాపు 30 లక్షలు వసూలు చేసి ఉద్యోగం మానేసి ఇల్లు ఖాళీచేసి పరారయ్యాడు. ఎల్‌బీనగర్ శివగంగాకాలనీకి చెందిన బుక్కీ బాలక్రిష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు శనివారం రాంచందర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ గిరీష్‌కుమార్ తెలిపారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

● త్వరలో ఎక్స్ ట్రా మైల్ రివార్డ్ కార్యక్రమం ● హైదరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనర్



సాక్షి, సిటీబ్యూరో: "విధి నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవు. కొందరు సిబ్బంది చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే క్షమించబోను'' అని హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్ హెచ్చరించారు. పోలీసు సిబ్బంది శాఖకు వెన్నెముక లాంటి వారు ప్రజలతో మమేకమై, మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శనివారం తొలిసారిగా హైదరాబాద్ సిటీ పోలీసులోని అన్ని విభాగాలు, పోలీస్ స్టేషన్ల (లా – ఆర్డర్, ట్రాఫిక్) అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. దేశంలోనే అతి పురాతనమైన, ఎంతో పేరున్న హైదరాబాద్ కమిషనరేట్ ప్రతిష్టను మరింత పెంచాలన్నారు. మనమందరం సమన్వయంతో పనిచేస్తే తెలంగాణ రాష్ట్రానికి కూడా మంచి పేరు వస్తుందన్నారు. ఫిర్యాదుదారుల పట్ల సరైన రీతిలో స్పందించినప్పుడే ప్రజలకు మనపై మంచి అభిప్రాయం, నమ్మకం కలుగుతాయన్నారు. మన ప్రవర్తనే డిపార్ట్‌మెంట్ ఇమేజ్‌ను నిర్ణయిస్తుంది. వృత్తి నైపుణ్యంతో, ప్రామాణిక కార్యాచరణ విధానాలను పాటిస్తూ పనిచేయాలని ఆయన సూచించారు.

త్వరలోనే ఎక్స్‌ట్రా మైల్ రివార్డ్...

విధి నిర్వహణతో పాటు మానవతా దృక్పథంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందే సిబ్బందిని ప్రోత్సహించడానికి 'ఎక్స్‌ట్రా మైల్ రివార్డ్' అనే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తున్నామని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి శనివారం ఉత్తమ సిబ్బందిని గుర్తించి, ప్రశంసాపత్రం, రివార్డుతో ఘనంగా సన్మానిస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను డ్రగ్ రహిత నగరంగా మార్చడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, డ్రగ్స్ కేసులను లోతుగా దర్యాప్తు చేసి, దోషులకు కఠిన శిక్షలు పడేలా చూడాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారుల జోలికి వస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవనే భావన నేరస్తులలో కలిగే విధంగా అన్ని విభాగాలతో పాటు షీ టీమ్స్ కూడా పని చేయాలని తెలిపారు. నగరంలో ప్రయాణ సమయాన్ని తగ్గించడానికి ట్రాఫిక్ పోలీసులు వినూత్న ఆలోచనలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ (లా – ఆర్డర్) తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీ (అడ్మిన్) పరిమళ హనా నూతన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

14న రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇవ్వండి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న బీసీ నేతలు ఆర్.కృష్ణయ్య తదితరులు

కాచిగూడ: స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు ఏకపక్షంగా స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన చేపట్టనున్న రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీ నేతలు శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. బీసీ రిజర్వేషన్ల సాధనకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల సమస్య పరిష్కారానికి కృషి చేయాలని వారు కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీ కమీషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్, గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, టి.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యాధుల నివారణపై మిల్లెట్ మీట్



సాక్షి, సిటీబ్యూరో: మిల్లెట్స్ నేషనల్ మీడియా పోర్టల్ చొరవ మేరకు హెల్త్, న్యూట్రిషన్ అంబాసిడర్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నగరం వేదికగా జాతీయ మిల్లెట్ హెల్త్ అండ్ ఇండస్ట్రీ మీట్ నిర్వహించారు. మాదాపూర్ మినర్వాలో శనివారం నిర్వహించిన ఈ జాతీయ స్థాయి సమావేశంలో ప్రముఖ వైద్యులు, మిల్లెట్ తయారీదారులు పాల్గొన్నారు. మిల్లెట్ ఆధారిత పోషణ ద్వారా ఆరోగ్యం కల్పించడం, వ్యాధులను నివారించడంపై అవగాహన కల్పించారు. సమావేశంలో మిల్లెట్స్ నేషనల్ మీడియా పోర్టల్ చైర్మన్ శ్రీనివాస్ సరకడమం మాట్లాడుతూ వైద్య వృత్తి, మిల్లెట్ పరిశ్రమను ఒకచోటికి చేరదీసి సుస్థిర, ఆరోగ్య పరిష్కారాలను అందించడంపై కృషి చేస్తున్నామని తెలిపారు. మిల్లెట్లు కేవలం ఆహారం కాదని, ఇవి దీర్ఘకాలిక వ్యాధులను నివారించే జీవనశైలి ఎంపికని అని అన్నారు. దేశ వ్యాప్తంగా 80 మందికి పైగా మిల్లెట్ తయారీదారులను ఆహ్వానించి, డయాబెటీస్ కేర్, హృదయ ఆరోగ్యం వంటి ప్రత్యేక ఆరోగ్య లక్ష్యాలకు సరిపోయే హెల్త్–స్పెసిఫిక్ మిల్లెట్ ప్యాక్స్ రూపొందించామని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎన్ఏ కౌన్సిల్ కోఆర్డినేటర్ డా. మోనికా స్రవంతి, నేషనల్ మిల్లెట్ మాన్యుఫ్యాక్చరింగ్ మిషన్ కోఆర్డినేటర్ శ్రేష్టా గౌశికా, స్టేట్ పార్ట్‌నర్స్ హెడ్ డాక్టర్ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ వలలో తండ్రీకూతురు

ఇద్దరి నుంచి రూ.2 లక్షల కాజేసిన నేరస్తులు

నాగోలు : నకిలీ ఇన్వెస్ట్ మెంట్ లింక్ పంపిన సైబర్ నేరస్తులు తండ్రి, కూతురును మోసం చేశారు. వేర్వేరుగా ఇద్దరి నుంచి రూ.2 లక్షలు కాజేశారు. ఈమేరకు రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ లో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. ఎల్బీ నగర్ లోని మదీనా లైన్ లో నివాసం ఉంటున్న రామకృష్ణ ఆగస్టు 26న తన స్నేహితుడి మొబైల్ నుంచి రామకృష్ణ కు 'ఎల్ఎఫ్ వర్క్' అనే ఇన్వెస్ట్‌మెంట్ యాప్ లింక్ వచ్చింది. ఈ యాప్ లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని సందేశం సారాంశం. దీంతో రామకృష్ణ ఎల్ఎఫ్ యాప్ ను తన మొబైల్ లో ఇన్‌స్టాల్ చేసి, పెట్టుబడి పెట్టడం ప్రారంభించాడు. మొదట్లో యాప్ లో చిన్న అమౌంట్ పెట్టుబడులపై రాబడిని చూపించింది. దీంతో అత్యాశ పడిన బాధితుడు పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టడం మొదలుపెట్టాడు. పలు దఫాలుగా మొత్తం మీద రూ.1,35,210 మొత్తాన్ని పెట్టుబడి పెట్టాడు. అయితే దీనిపై వచ్చిన రాబడి సొమ్మును ఉపసంహరించుకోవడానికి ప్రయత్నించాడు. కానీ విత్‌డ్రా సాధ్యంకాలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కూతురు మిథాలీ కూడా..

ఇదే తరహాలో రామకృష్ణ కూతురు ఎం మిథాలీ కూడా సైబర్ నేరస్తుల వలలో చిక్కింది. గత నెల 5న మిథాలీ కుటుంబ స్నేహితుడి నుంచి ఆమెకు ఎల్ఎఫ్ యాప్ లింక్ వచ్చింది. ఇన్‌స్టాల్ చేసిన మిథాలీ పలు దఫాలుగా రూ.86,220 పెట్టుబడులు పెట్టింది. యాప్ లో కనిపించే రాబడి సొమ్మును విత్‌డ్రా చేయలేకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రశేఖర్ కుటుంబానికి అండగా ఉంటాం

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



చంద్రశేఖర్ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు శ్రీధర్‌బాబు, లక్ష్మణ్‌కుమార్, మల్‌రెడ్డి రాంరెడ్డి

ఎల్‌బీనగర్: అమెరికాలో దుండగుల కాల్పుల్లో మృతి చెందిన పోలే చంద్రశేఖర్ మృతదేహం శనివారం ఉదయం బీఎన్‌రెడ్డినగర్‌లోని టీచర్స్‌కాలనీకి చేరుకుంది. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆర్టీసీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిలు మృతుడి నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. టెక్సాస్ రాష్ట్రంలోని డల్లాస్‌లో ఓ పెట్రోల్ బంక్‌లో పార్ట్‌టైమ్‌గా ఉద్యోగం చేస్తున్న చంద్రశేఖర్ గత శుక్రవారం రాత్రి దుండగుల కాల్పుల్లో మృతి చెందాడు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం తరుపున చంద్రశేఖర్ కుటుంబానికి అండగా ఉంటామని హామి ఇచ్చారు. మృతిని కుటుంబానికి రూ. 5లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతుడి సోదరులకు ఔట్ సోర్సింగ్ ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామి ఇచ్చారు. వీరితోపాటు ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కూడా నివాళులర్పించారు.

ముగిసిన అంత్యక్రియలు

అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని సొంతూరైన కోహెడ గ్రామంలో చంద్రశేఖర్ అంత్యక్రియలు శనివారం సాయంత్రం నిర్వహించారు. టీచర్స్‌కాలనీకి చెందిన కాలనీ అధ్యక్షులు శివముదిరాజ్‌తోపాటు కాలనీ వాసులు, స్నేహితులు, కుటంబ సభ్యులతోపాటు బంధువులు పాల్గొన్నారు.

తిరుపతిలో శంషాబాద్ భక్తుల ఇబ్బందులు

- ఓ కుటుంబం లగేజీ మాయం
- స్పందించిన రాజేంద్రనగర్ ఆర్‌డీఓ
- శంషాబాద్‌కు పయనమైన కుటుంబం



తిరుపతి రైల్వే స్టేషన్‌లో బాధిత కుటుంబసభ్యులు

శంషాబాద్: తిరుమలలో శంషాబాద్‌కు చెందిన ఓ కుటుంబం లగేజీ మాయం కావడంతో నాలుగు రోజులు అక్కడ ఇబ్బంది పడింది. చివరకు అధికారుల సహకారంతో నగరానికి బయలుదేరారు. వివరాలు.. తిరుమలలో ఐదుగురు సభ్యులుగా కుటుంబం స్వామివారి దర్శనం చేసుకుంది. ఆ తరువాత వారి లగేజీ మొత్తం దొంగలు కొట్టేశారో.. లేక పోగొట్టుకున్నారో తెలియదు కానీ అయోమయంతో కొండ కిందికి చేరుకుని రైల్వేస్టేషన్‌కు వచ్చారు. నాలుగురోజులుగా వారిని గమనిస్తున్న రైల్వేపోలీసులు ఏం జరిగిందని ప్రశ్నించినా సరైన సమాధానం రావడం లేదు. వృద్ధురాలికి, ఆమె కుమారుడికి మాటలు రావడం లేదు. ఓ మహిళ మాట్లాడినా అర్థం కావడం లేదు. పిల్లలు ఎంత అడిగా సరిగా మాట్లాడడం లేదు. అధికారులు కాగితం పెన్ను ఇవ్వడంతో శంషాబాద్ హీ హీరోహోండా షాపు, పైన లగేజీలు పోయాయని రాసింది. దీంతో మూడు రోజులుగా రైల్వేపోలీసులే వారి భోజనం సమకూరుస్తున్నారు. ఆ కుటుంబాన్ని పంపేందుకు రైల్వేపోలీసులు సాక్షిని సంప్రదించి శంషాబాద్ డీసీపీ, రాజేంద్రనగర్ ఆర్‌డీఓ వెంకట్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు.. ఆర్‌డీఓ స్పందించి వారి రాకకోసం ఏర్పాట్లు చేయడంతో శనివారం రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరే బస్సులో వారిని రైల్వే పోలీసులు పంపారు.

సహస్ర కుటుంబాన్ని ఆదుకోండి

జగిత్యాల్ జిల్లా కలెక్టర్‌కు సూచించిన హక్కుల కమిషన్

సిటీ కోర్టులు : మరణించిన చిన్నారి తల్లికి ఉద్యోగం కల్పించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని జగిత్యాల్ జిల్లా కలెక్టర్‌కు రాష్ట్ర మానవహక్కుల కమిషన్ ఆదేశించింది. వివరాలు.. ఫిబ్రవరి 10, 2020లో నులిపురుగుల నివారణ మందు (అల్బెండజోల్ టాబ్లెట్) ఇచ్చినందుకు జగిత్యాల్ జిల్లా ధర్మపురిలో సహస్ర(7) అనే బాలిక మరణించిందని మీడియాలో వార్త ప్రచురితమైంది. దీంతో రాష్ట్ర మానవహక్కుల కమిషన్ సుమోటోగా కేసు స్వీకరించి విచారణ చేపట్టింది. బాలిక తల్లి రజిత వాదనలు వినిపించారు. మాత్ర వేసిన తర్వాత మధ్యాహ్నం తన కూతురు తరగతి గదిలో పడిపోయిందని కమిషన్‌కు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం సాయి గణేష్ ఆసుపత్రికి తరలించగా వారు చేర్చుకోవడానికి నిరాకరించడంతో జగిత్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని.. అప్పటికే చిన్నారి మరణించినట్లు తెలిపారన్నారు. అయితే ఆ మాత్ర వల్ల బాలిక చనిపోలేదని జిల్లా వైద్యాధికారి వాదనలు వినిపించారు. ఇరువురి వాదనలు విన్న కమిషన్.. బాలిక తల్లి రజితకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల్లో ఉద్యోగ బాధ్యతను కల్పించి ఆ కుటుంబానికి అండగా నిలువాలని జగిత్యాల జిల్లా జిల్లా కలెక్టర్‌కు సూచిస్తూ ఈ కేసును కొట్టివేస్తున్నట్లు తెలిపింది.

మద్యం మత్తులో గొడవ.. ఒకరు మృతి



దామోదర్ (ఫైల్)

మూసాపేట: మద్యం మత్తులో జరిగిన గొడవలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కూకట్‌పల్లి పోలీసులు తెలిపిన మేరకు.. శ్రీకాకుళం జిల్లా జోగిపాడు గ్రామానికి చెందిన దామోదర్ ప్రగతినగర్‌లో నివాసముంటూ సెంట్రింగ్ పనిచేస్తున్నారు. ఇతనితో పాటు మూసాపేటకు చెందిన మహమ్మద్ మొహమూద్ (50) సెంట్రింగ్ పనిచేస్తుంటాడు. మెహమూద్‌కు దామోదర్ రూ.3 వేలు ఇవ్వాల్సి ఉంది. ఇద్దరు కలిసి వైన్ షాపు వద్ద మద్యం తాగారు. తరువాత ఇద్దరి మధ్యా డబ్బు విషయం చర్చకు వచ్చింది. రోడ్డుపైనే మహమూద్.. దామోదర్ గొంతు నులిమి కడుపులో కొట్టి తోసివేయడంతో తలకు గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. పోలీసులకు ఫిర్యాదు అందడంతో మృతేదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మెహమూద్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

లిఫ్ట్ గుంతలోపడి వ్యక్తి మృతి



ఎం.నర్సింహ

రాజేంద్రనగర్: రెండో అంతస్తులోని లిఫ్ట్ కోసం వేచి ఉన్న ఓ వ్యక్తి లిఫ్ట్ వచ్చిందని భావించి డోర్ తీసి కిందపడి మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు..రాజేంద్రనగర్ బుద్వేల్ కిష్టమ్మ గుట్ట ప్రాంతంలో న్యూ జెరుసలాం చర్చి ఉంది. ఈ చర్చి రెండో అంతస్తులో ఎం.నర్సింహ(47) నివాసముంటున్నాడు. చర్చిలో సేవ చేస్తూ చర్చిలోనే ఉంటున్నాడు. శనివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో రెండో అంతస్తు నుంచి కిందికి దిగేందుకు లిఫ్ట్ బటన్ నొక్కాడు. లిఫ్ట్ రాకముందే డోర్ ఓపెన్ చేసి ముందుకు వెళ్లగా... గ్రౌండ్ ఫ్లోర్ లో ఉన్న లిఫ్ట్‌పై పడి తీవ్రంగా గాయపడ్డాడు. లిఫ్ట్ రాకముందే డోర్ తెరుచుకోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సంఘటన స్థలానికి చేరుకున్న చర్చి ఫాదర్‌తో పాటు స్థానికులు నర్సింహను అత్తాపూర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా... అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

14న జాబ్‌డ్రైవ్

శ్రీనగర్‌కాలనీ: మోతీనగర్ డాన్‌బాస్కో డిగ్రీ కాలేజీలో ఈ నెల 14న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకూ జాబ్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కాలేజీ ప్రతినిధులు తెలిపారు. ఇంటర్ నుంచి పీజీ చదివిన విద్యార్థులు ఈ డ్రైవ్‌లో పాల్గొనవచ్చని, ఆయా కంపెనీల ప్రతినిధులు జాబ్‌డ్రైవ్ ద్వారా ఉపాధి అందిస్తారని చెప్పారు. వివరాలకు ఫోన్: 94940 92219, 83101 33469.

ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా..



వాకర్స్‌తో మాట్లాడుతున్న మాగంటి సునీత

శ్రీనగర్‌కాలనీ: కాలనీలు, కమ్యూనిటీల్లో సమస్యల పరిష్కారం, అభివృద్ధికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత అన్నారు. కుమారుడు వాత్సల్యనాథ్, కుమార్తె దిశిరతో కలిసి శనివారం ఉదయం బ్రిగేడ్ కల్పతరు, వాసవి బృందావన్, జనప్రియ అపార్ట్‌మెంట్స్ వద్ద మార్నింగ్ వాకర్స్‌ను కలిసి మాట్లాడారు. అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్‌తోనే నగర అభివృద్ధి సాధ్యమైందని, నగరం సుందరంగా, ప్రశాంతంగా ఉండాలంటే బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమన్నారు. కాలనీవాసులు, కమ్యూనిటీవాసులు బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలని కోరారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి

శ్రీనగర్‌కాలనీ: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి అన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు బస్తీల్లో శనివారం తిరుగుతూ కాంగ్రెస్ చేసిన మోసాలను వివరిస్తూ బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన నగర అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు.

బీజేపీకి చెర్క మహేష్ రాజీనామా

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గ మాజీ జాయింట్ కన్వీనర్, షేక్‌పేట కంటెస్టెడ్ కార్పొరేటర్ చెర్క మహేష్ బీజేపీ సభ్యత్వానికి, పార్టీ పదవులకు శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావుకు రాశారు. బీజేపీ గుట్టుచప్పుడు కాకుండా సీఎం రేవంత్‌రెడ్డితో చేతులు కలిపి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పట్ల పార్టీ విధానాలు నచ్చలేదన్నారు. దివంగత మాగంటి గోపీనాథ్ కుటుంబానికి అండగా బీఆర్‌ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు.

హైకోర్టు స్టేపై ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

బంజారాహిల్స్: బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీల బీసీ సంఘాల అఖిల పక్ష సమావేశం బంజారా హిల్స్‌లోని కళింగ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగింది. టీజేఎస్ అధ్యక్షుడు కోదండ రామ్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు సాధించుకునేందుకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. 50 శాతం రిజర్వేషన్లు అనేది రాజ్యాంగంలో లేదని కోర్టులు కూడా చెప్పలేదన్నారు. కార్యాచరణ సిద్ధం చేసి ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ ఇప్పుడు పోరాడాల్సిన సమయం వచ్చిందని, ఓసీలు, ఎస్సీలు, ఎస్టీలు కూడా బీసీల రిజర్వేషన్ల కోసం కలిసి వస్తారని అన్నారు. బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీల సమస్య తప్ప చాలా సమస్యలు ప్రధాని పరిష్కారం చేశారని, రిజర్వేషన్ల ప్రయత్నం నిరంతరం కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో నేతలు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు, బీజేపీ నేత ఆనంద్ కుమార్ గౌడ్, బండారు రవికుమార్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్: ద్విచక్ర వాహనం చోరీ అయిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన ఏ.యోగేందర్ ప్రైవేట్ జాబ్ చేస్తూ ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉంటున్నాడు. గత నెల 30వ తేదీన తన రూం వద్ద ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి స్వగ్రామం వెళ్లి తిరిగి ఈ నెల 7వ తేదీన వచ్చి చూసేసరికి కనిపించలేదు. దాంతో శనివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నామినేషన్ కేంద్రం వద్ద..

144 సెక్షన్

- 200 మీటర్ల వరకే ఊరేగింపులకు అనుమతి
- నామినేషన్ కేంద్రంతో పాటు 18 పికెటింగ్‌లు



జూబ్లీహిల్స్ నామినేషన్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నామినేషన్ కేంద్రాన్ని బంజారాహిల్స్ రోడ్డు నంబర్-2లోని షేక్‌పేట మండల కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఇప్పటికే రిటర్నింగ్ అధికారి కార్యాలయంతో పాటు సంబంధిత సిబ్బంది ఇక్కడి నుంచే విధులు నిర్వర్తిస్తున్నారు. ఈనెల 13వ తేదీ నుంచి 21వ తేదీ వరకు(ఈ నెల 19, 20 సెలవు దినాలు) నామినేషన్లు వేయనున్నారు. నామినేషన్ల స్క్రూట్నీ, నామినేషన్ల ఉపసంహరణ తదితర ప్రక్రియలు కూడా వెంటనే జరగనున్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వచ్చేనెల 11న జరగనుండగా 14న ఫలితాలు వెలువడనున్నాయి. ఉప ఎన్నిక సందర్భంగా మొత్తం 139 లొకేషన్లలో 407 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మొత్తం 3,98,982 మంది ఓటర్లు ఉండగా ఇందులో 2,07,367 మంది పురుషులు కాగా, 1,91,590 మంది మహిళలు ఉన్నారు. నామినేషన్ సందర్భంగా షేక్‌పేట మండల కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తును పెద్ద ఎత్తున ఏర్పాటు చేయనున్నారు. సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు.

నామినేషన్ కేంద్రం.. ఇదీ బందోబస్తు..

- డీసీపీ: చింతమనేని శ్రీనివాస్
- అదనపు డీసీపీ: గోవర్ధన్
- ఇద్దరు ఏసీపీలు: వెంకట్‌రెడ్డి, మురళీకృష్ణ
- ఇన్‌స్పెక్టర్లు: ఐదుగురు
- ఎస్‌ఐలు: 9 మంది
- హెడ్‌కానిస్టేబుళ్లు, ఉమెన్ పీసీలు, ఉమెన్ హోంగార్డులు: 54 మంది
- ప్లాటూన్లు: 2
- గార్డ్ 1 ప్లస్ 4
- పికెటింగ్‌లు: 18

- నామినేషన్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి తెలిపారు. బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ కేఎం రాఘవేంద్ర, సెక్టార్ ఎస్‌ఐ విజయ్‌తో కలిసి ఆయన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఎక్కడ పోలీసులు బందోబస్తులో ఉండాలి, ఎక్కడెక్కడ పికెటింగ్‌లు ఏర్పాటు చేయాలి. 100 మీటర్ల పరిధి వద్ద పోలీసు గార్డు, 200 మీటర్ల వద్ద పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేయనున్నారు.
- నామినేషన్ కేంద్రంతో పాటు చుట్టూ 18 చోట్ల పోలీసు పికెటింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ర్యాలీలు, ఊరేగింపులకు నామినేషన్ కేంద్రానికి 200 మీటర్ల వరకే అనుమతి ఉంటుంది. కేంద్రానికి 100 మీటర్ల వరకు మూడు వాహనాలు మాత్రమే అనుమతిస్తారు. అలాగే 100 మీటర్ల నుంచి అభ్యర్థితో కలిపి ఐదుగురు మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి నడుచుకుంటూ వెళ్లాలి. ఈ మొత్తం ప్రక్రియను ఇటు పోలీసులతో పాటు అటు ఎన్నికల సిబ్బంది కూడా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పకడ్బందీగా పర్యవేక్షిస్తారు. ప్రతి దృశ్యాన్నీ వీడియోలో నమోదు చేస్తారు.
- నినాదాలు ఇచ్చినా, పార్టీ జెండాలతో ర్యాలీగా వచ్చినా, పోలీసులతో పాటు ఎన్నికల సిబ్బంది విధులను అడ్డుకున్నా ఇదంతా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కిందికి వస్తుందని పోలీసులు పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో నామినేషన్లు వేసే విధంగా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అనుమానితుల కదలికలపై నిఘా పెడుతూ చుట్టూ పోలీసులను మోహరిస్తున్నారు.

కబ్జాదారులను తరిమారు.. హెచ్చరిక బోర్డు పెట్టారు



స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటు చేస్తున్న హైడ్రా అధికారులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-10లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఎదురుగా సర్వే నంబర్-403లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పార్థసారధి అనే కబ్జాదారుడు అక్రమ నిర్మాణాలను చేపట్టగా హైడ్రా అధికారులు వాటిని కూల్చివేసి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. శుక్రవారం భారీ బందోబస్తు మధ్య జలమండలికి కేటాయించిన స్థలంతో పాటు ప్రభుత్వానికి చెందిన మొత్తం ఐదెకరాల విస్తీర్ణంలో హైడ్రా స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. శనివారం ఈ స్థలంలో హైడ్రా సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. పార్థసారధి అనే కబ్జాదారుడు కొన్నేళ్ల నుంచి ఈ స్థలంలో రౌడీలను ఏర్పాటు చేసి అటు జలమండలి, ఇటు షేక్‌పేట రెవెన్యూ అధికారులు, బంజారాహిల్స్ పోలీసులకు సవాల్‌గా మారాడు. కేసులు పెట్టినా బెదరలేదు. ఎన్నిసార్లు అక్రమ నిర్మాణాలు కూల్చివేసినా తిరిగి వీరు అధికారులకు సవాల్ విసరడంతో పాటు బెదిరింపులకు పాల్పడేవారు. హైడ్రా రంగ ప్రవేశం చేయడంతో కబ్జాదారుడికి చెక్ పెట్టారు. ఐదెకరాల స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని కబ్జా స్థలానికి విముక్తి కలిగించింది. హైడ్రా హెచ్చరిక బోర్డుతో కబ్జాదారుడు ఎట్టకేలకు పరారయ్యాడు.

ఉత్సాహంగా 'స్వచ్ఛతా హీ సేవ'



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో 'స్వచ్ఛోత్సవ్'కు అనుగుణంగా 'స్వచ్ఛతా హీ సేవ-2025 కార్యక్రమాన్ని శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పరిశుభ్రత ఆధారిత కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద పక్షం రోజుల పాటు జరిగిన ఈ డ్రైవ్ ద్వారా వ్యక్తిగత, పర్యావరణ, సమాజ పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించారు. ఇందులో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ కవాతు నిర్వహించారు. అంతేగాకుండా వ్యర్థాల నిర్వహణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన మరింత పెంచే పోస్టర్ తయారీ, నినాదాల రచన, వ్యాసరచన వంటి సృజనాత్మక పోటీల్లో అన్ని తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఎం.వరలక్ష్మీ మాట్లాడుతూ స్వచ్ఛత అనేది కొంతమంది విధి కాదని, పౌరులందరూ పంచుకునే బాధ్యత అని తెలిపారు.

వడ్డెరులను ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్న పార్టీలు



మాట్లాడుతున్న వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు నారాయణస్వామి

శ్రీనగర్‌కాలనీ: వడ్డెర కులాన్ని ఓటు బ్యాంకుగానే రాజకీయ పార్టీలు చూస్తున్నాయే తప్ప వారికి సముచిత స్థానం కల్పించడంలో విఫలమయ్యాయని వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు ఎం.నారాయణస్వామి విమర్శించారు. ఎర్రగడ్డలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. వడ్డెరులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందన్నారు. కాంగ్రెస్ గెలుపులో వడ్డెరులు కీలకంగా వ్యవహరించారని తెలిపారు. వడ్డెర కులానికి సముచిత స్థానం కల్పించకుంటే రానున్న రోజుల్లో గళం ఎత్తుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ఐలమల్లు, కాంట్రాక్ట్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డేరెంగుల రామచంద్రరావు, రాష్ట్ర కార్యదర్శి వేముల నర్సింహ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య రంగం నిర్వీర్యం



మాట్లాడుతున్న వీఎస్ బోస్

హిమాయత్‌నగర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కొంతమంది డాక్టర్లు, అధికారులే ప్రభుత్వ వైద్య రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని, ఏఐటీయూసీ జాతీయ సీనియర్ నాయకుడు వీఎస్.బోస్ విమర్శించారు. చాలామంది ప్రభుత్వ డాక్టర్లకు ప్రైవేట్ ఆస్పత్రుల్లో భాగస్వామ్యం ఉండటంతో తమ స్వార్థం కోసం ఈ వ్యవస్థను నీరుగారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 5వ రాష్ట్ర మహాసభలను హిమాయత్‌నగర్ ఏఐటీయూసీలో శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యం,విద్య అందాలంటే ఈ రెండు ప్రధాన రంగాలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఇందిరా శ్రీలక్ష్మి నివేదిక ప్రవేశపెట్టారు. నాయకులు వి.వేణుకుమార్, ఉపాధ్యక్షులు ఎంసీ ఎస్ రాజు, ఎంఎస్ మూర్తి, శ్రీనివాస చారి, నర్సయ్య, శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన నవీన్‌యాదవ్



శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఆయన నివాసంలో కలిశారు. నవీన్‌యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అఖండ విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. జూబ్లీహిల్స్‌లో అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. నేతలు నాగార్జునరెడ్డి, రమేష్‌యాదవ్, నరికెళ్ల నరేష్, సోను ఉన్నారు.

ఉద్యోగం పేరుతో ఆన్‌లైన్ మోసం

వెంగళరావునగర్: ఉద్యోగం పేరుతో ఆన్‌లైన్‌లో మోసం చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఒడిశాకు చెందిన పాండ జయప్రకాశ్‌నగర్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. ఈ నెల 7వ తేదీ రాత్రి అతడికి ఫోన్ కాల్ వచ్చింది. ఆన్‌లైన్‌లో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, కొంత నగదు డిపాజిట్ చేయాలని చెప్పడంతో రూ.82,800లను పంపాడు. అనంతరం ఫోన్ చేయగా నంబర్ బ్లాక్ చేశారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు అనంతరం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై అనుమానంతో భర్త ఆత్మహత్య

వెంగళరావునగర్: భార్యపై అనుమానంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం రహమత్‌నగర్‌లో నివసించే సీహెచ్.శోభన్‌బాబు డెలివరీ బాయ్. అతడికి మూడేళ్ల క్రితం యువతితో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. ఇటీవల అతడు భార్యపై అనుమానం పెంచుకొని మానసికంగా బాధపడుతున్నాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. స్థానికుల సాయంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శోభన్‌బాబు తండ్రి ఉపేంద్ర మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాంగ్‌సైడ్ డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

పంజగుట్ట: పంజగుట్ట ఫ్లైఓవర్ కింద శనివారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ రాంగ్ సైడ్ డ్రైవింగ్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి, పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్, ఎస్సై ఆంజనేయులు స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. సుమారు 11 మంది ద్విచక్ర వాహనదారులు, ఒక ఆటో రాంగ్‌సైడ్‌లో రాగా వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి రాంగ్‌సైడ్ డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వారికి చాలానా వేసి పంపించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-36లో వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక సందర్భంగా ఫిలింనగర్, జూబ్లీహిల్స్, మధురానగర్, బోరబండ, పంజగుట్ట, టోలిచౌకి, గోల్కొండ పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఒక్కో పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అనుమానం ఉన్న వాహనాలను ఆపుతూ తనిఖీలు చేస్తున్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లతో పాటు స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లు, వీడియో రికార్డింగ్ టీమ్‌లు ఈ మొత్తం ప్రక్రియను పరిశీలిస్తున్నాయి. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-36లోని నీరూస్ చౌరస్తాలో జూబ్లీహిల్స్ పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం, సాయంత్రం వేళల్లో నిరంతరం వాహనాల తనిఖీలు చేపట్టారు.

ముగిసిన ఉడాన్ స్పోర్ట్స్ టోర్నమెంట్



ట్రోఫీలను అందజేస్తున్న ఐటీ కమిషనర్ షా నవాజ్ ఉల్ రెహమాన్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం-7లోని మెరీడియన్ స్కూల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న ఉడాన్ ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. నగరంలోని 24 పాఠశాలలకు చెందిన 200 మందికిపైగా విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొన్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ పూనంజా తెలిపారు. కార్యక్రమానికి హాజరైన ఐటీ శాఖ కమిషనర్ షానవాజ్ ఉల్ రెహమాన్ విద్యార్థులకు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమికి కుంగిపోవద్దని, విజయం కోసం ప్రయత్నిస్తూనే ఉండాలన్నారు. ఉడాన్ ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్‌లో భాగంగా చెస్, టేబుల్ టెన్నిస్, బాస్కెట్‌బాల్ క్రీడల్లో విద్యార్థులు పాల్గొన్నట్లు స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ రహత్ రషీద్ తెలిపారు.

నిజాం వారసత్వాన్ని కాపాడటం కర్తవ్యం



మాట్లాడుతున్న నవాబ్ రౌనక్ యార్ ఖాన్

పంజగుట్ట: హైదరాబాద్ ప్రజల కోసం తమ పూర్వీకులైన నిజాంలు విశ్వవిద్యాలయాలు, ఆస్పత్రులను నిర్మించారని, 1965 యుద్ధం సమయంలో భారత రక్షణకు 425 కిలోల బంగారం దానం చేశారని, వారి వారసత్వాన్ని కాపాడటం ఈ దేశం కర్తవ్యమని తొమ్మిదవ నిజాం నవాబ్ రౌనక్ యార్ ఖాన్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారి న్యాయసలహాదారు మొహమ్మద్ వేకార్ హుస్సేన్‌తో కలిసి శనివారం ఆయన మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లిలోని కంచ గచ్చిబౌలిలో సర్వే నంబర్ 25, 26లో 2,725 ఎకరాల భూమి ఏడో నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహదూర్‌కు చెందినదన్నారు. సదరు భూమి నిజాం కుటుంబ చట్టబద్ధ యాజమాన్యాన్ని రక్షించాలని, తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అనధికార ఆక్రమణను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో కేసు వేసినట్లు వారు పేర్కొన్నారు. తాము కోర్టులో కేసు సంపద కోసమో హోదా కోసమో వేసింది కాదని, న్యాయం కోసం, చరిత్ర ప్రజలకు తెలియాలని, అభివృద్ధి పేరుతో చరిత్రను అంతం చేయకుండా కాపాడేందుకే అన్నారు. కంచె గచ్చిబౌలి భూముల్లో రాష్ట్ర ప్రభుత్వం అక్రమ ఆక్రమణలు, చెట్ల నరికివేత జరుపుతూ, చారిత్రక వారసత్వానికి, పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తోందని, ఇది అభివృద్ధి పేరుతో విధ్వంసం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో అసఫ్ జాహీ రాజవంశ వారసులు నవాబ్ మిర్ మిలాద్ అలీ ఖాన్, నవాబ్ మిర్ ఉస్మాన్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను ముంచెత్తుతున్న మురుగు



వెంకటగిరి జలమండలి కార్యాలయం సమీపంలో పొంగుతున్న మురుగు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎలాగైనా గెలవాలని అధికార కాంగ్రెస్ పార్టీ కోట్లాది రూపాయలతో రెండు నెలల నుంచి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసింది. ముగ్గురు మంత్రులు నియోజకవర్గాన్ని చుట్టుముడుతూ అటు రోడ్లు, ఇటు డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శిలాఫలకాలు వేశారు. తీరాచూస్తే శంకుస్థాపనలు జరిగినా ఎక్కడా పనులు పూర్తి కాలేదు. దీంతో అడుగడుగునా మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు పొంగిపారుతూ అధికార పార్టీకి చెమటలు పట్టిస్తున్నాయి. వెంకటగిరి జలమండలి కార్యాలయానికి కూతవేటు దూరంలోనే మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు పొంగి రోడ్డును ముంచెత్తింది. రెండు రోజుల్లో ఎన్నికల ప్రచారం ప్రారంభం కావాల్సి ఉండగా పరిస్థితి ఇలా ఉంటే, ప్రజలకు ఏమి సమాధానం చెప్పాలో తెలియక మంత్రులు తలలు పట్టుకుంటున్నారు. జలమండలి డివిజన్-6 అధికారుల నిర్లక్ష్యం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అడుగడుగునా కనిపిస్తోంది.

ప్రీలాంచ్‌ల పేరుతో మోసాలు

తెలంగాణ కన్స్యూమర్ నూతన కమిటీ



నియామకపత్రాలు చూపిస్తున్న కమిటీ ప్రతినిధులు

పంజగుట్ట: రాష్ట్రంలో వినియోగదారులు ఎన్నో విషయాల్లో మోసపోతున్నారని వారికి కనీసం ఎక్కడకు వెళ్లి చెప్పుకోవాలో కూడా తెలియని పరిస్థితి ఉందని తెలంగాణ కన్స్యూమర్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కోడూరు ప్రసన్న కుమార్ రెడ్డి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కన్స్యూమర్ కమిటీ నూతన రాష్ట్ర కమిటీని ప్రకటించి సభ్యులకు శనివారం నియామకపత్రాలు అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవులపల్లి కార్తీక్ రాజుతో కలిసి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మోసాలు పెరిగిపోయాయని, ప్రీలాంచ్‌ల పేరుతో ప్రజల్ని మోసం చేస్తున్నారని వారికి కనీసం ఎక్కడ చెప్పుకోవాలో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. అలాంటి వారికి తాము సలహాలు అందజేస్తామన్నారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఆదిత్య, వర్కింగ్ ప్రసిడెంట్ ప్రశాంత్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఈశ్వర్, విష్ణులకు నియామక పత్రాలు ఇచ్చారు.

ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం

వెంగళరావునగర్: కొనుగోలు చేసిన ప్లాట్‌కు రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం దుండిగల్ ప్రాంతానికి చెందిన కె.మాల్యాద్రిరెడ్డి ప్రైవేట్ జాబ్ చేస్తుంటాడు. గతేడాది నల్లగండ్లలో ప్లాట్ అమ్మకానికి ఉందని బొల్లం మధు అనే వ్యక్తి తెలియజేశాడు. మాల్యాద్రిరెడ్డి ఆ ప్రాంతానికి వెళ్లి కొనుగోలు చేయడానికి సిద్ధమయ్యాడు. రూ.60 లక్షలు ఖరీదు అవుతుందని, చెప్పడంతో రూ.30 లక్షలు ఇచ్చాడు. విడతల వారీగా మరో రూ.30 లక్షలు చెల్లించాడు. ఎంతకీ ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయకపోగా అదనంగా రూ.40 లక్షలు డిమాండ్ చేయడంతో తాము మోసపోయానని గ్రహించి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి చందానగర్ పీఎస్‌కు బదిలీ చేశారు.

తల్లి తిట్టిందని బాలిక అదృశ్యం

వెంగళరావునగర్: బాగా చదవడం లేదని తల్లి తిట్టిందని కుమార్తె ఇంటి నుంచి అదృశ్యమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం రహమత్‌నగర్‌లో నివసించే సంధ్య కూకట్‌పల్లిలో ప్రైవేట్ జాబ్ చేస్తోంది. ఆమె 13 ఏళ్ల కుమార్తె రహమత్‌నగర్‌లోని ప్రైవేట్ స్కూల్‌లో విద్యనభ్యసిస్తోంది. సరిగ్గా చదవడం లేదని శుక్రవారం తల్లి ఆమెను తిట్టింది. దాంతో ఆ బాలిక తన స్నేహితురాలి ఇంటికి వెళ్లి వస్తానని బయటకు వెళ్లింది. సాయంత్రం తల్లికి తన సోదరి ఉంటున్న ఖమ్మంలోని గురుకుల స్కూల్‌కు వెళ్తున్నట్లు వాట్సాప్ మెసేజ్ పంపింది. తిరిగి తల్లి ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ఛ్ ఆఫ్ వచ్చింది. ఖమ్మం కూడా వెళ్లలేదు. పలుచోట్ల ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో తల్లి సంధ్య మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

15న డా.కలాం బెస్ట్ టీచర్స్ అవార్డ్స్

హిమాయత్‌నగర్: డా.ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతిని పురస్కరించుకుని డా.కలామ్ బెస్ట్ టీచర్స్ అవార్డ్స్-25 కార్యక్రమాన్ని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(ట్రస్మా) భాగస్వామ్యంతో ఈనెల 15న ఉదయం 10 గంటలకు రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించనున్నట్లు లీడ్ ఇండియా ఫౌండేషన్ స్థాపకుడు ప్రొ.ఎస్.బాలకృష్ణ సుదర్శన్ ఆచార్య తెలిపారు.

చదువుతోనే మహిళల ఉన్నతి సాధ్యం

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాల స్నాతకోత్సవంలో వెంకయ్యనాయుడు

సనత్‌నగర్: చదువు ద్వారానే మహిళలు ఉన్నతస్థానానికి చేరుకుని సమాజంలో తమకంటూ గుర్తింపు సాధిస్తారని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాల 45వ స్నాతకోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు 981 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాతృభాషను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. భారతదేశం ప్రాచీన జ్ఞానం, ఆధునిక సాంకేతికత కలయికతో ప్రపంచంలోని అగ్రగామిగా ఎదగ గల సామర్థ్యం ఉందన్నారు. స్కిల్ ఆధారిత విద్య ముఖ్యమని, పరిశ్రమకు తగ్గట్లుగా విద్యను అందించేందుకు ఎంటయాలు, విదేశీ కళాశాలలతో ఒప్పందాలు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంటాయని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా మాజీ పూర్వ విద్యార్థి, ఐపీఎస్ అధికారి దీపాలి మసిర్కర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం నిర్వహించే పోటీ పరీక్షల్లో పాల్గొనడం ద్వారా తమ ప్రతిభను ఎప్పటికప్పుడు మరింతగా ఇనుమడింజేసుకోవాలన్నారు. మహిళలు ధైర్యంగా పోరాడాలని, దృఢంగా జీవించాలని, నేర్చుకోవడాన్ని ఎప్పుడూ ఆపవద్దని అన్నారు. లక్ష్య సాధనలో పరిస్థితులను అనుకూలంగా మార్చుకోవాల్సిన అవసరాన్ని ప్రొఫెసర్ శశికాంత్ వివరించారు. గౌరవ అతిథి జీహెచ్ఎంసీ సూపరింటెండింగ్ ఇంజనీర్ రమాదేవి లంక మాట్లాడుతూ పరిశోధనలు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవకాశాలను పెంచాలన్నారు. ఆర్ట్స్ విభాగానికి చెందిన ఉమైమా ఐజాజ్ మూడు బంగారు పతకాలు, కామర్స్‌లో నంపల్లి సుప్రియా, జి.వర్ష, సైన్స్‌లో బి.అశ్విని నాలుగు బంగారు పతకాలు పొందారు. మొత్తం 58 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉమా జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీగిరి ఆలయ పునర్నిర్మాణానికి సహకరిస్తాం

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



శ్రీగిరి ప్రసన్న వెంకన్నస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి కొండా సురేఖ

చిలకలగూడ: శ్రీనివాస నగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ కమిటీ సేవలు అభినందనీయమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శ్రీగిరి వెంకన్నస్వామి ఆలయాన్ని సందర్శించిన ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ పునర్నిర్మాణ పనులను పర్యవేక్షించారు. కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టిన శ్రీగిరి ఆలయ పునర్నిర్మాణానికి తమ శాఖ తరఫున అన్నివిధాలా సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. దేవాదాయ శాఖ స్థపతి వలినాయగం, ధార్మిక సలహాదారు గోవిందహరి ఆలయ పునర్నిర్మాణ పనులను మంత్రికి వివరించారు. ఈ నెల 24 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే మహాసంప్రోక్షణ అష్టబంధన మహాకుంభాభిషేకం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని కోరగా ఆమె అంగీకరించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, డీసీ వినోద్, ఏసీ కృష్ణ, స్థపతి వలినాయగం, ధార్మిక సలహాదారు గోవిందహరి, ఆలయ ఈఓ రాజేష్‌కుమార్, పునర్నిర్మాణ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, తమ్మన వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సాగు పద్ధతులు తెలుసుకోవాలి

చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

ఏజీ వర్సిటీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీలో ప్రారంభించిన ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం, భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ(ఐసీఏఆర్), నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(నార్మ్) సంస్థలలో ఆన్‌లైన్ ద్వారా అధికారులతోపాటు రైతులు వీక్షించారు. కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హాజరై రైతులతో మాట్లాడారు. రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పర్యావరణ వ్యవస్థకు హాని కలిగించకుండా సహజ పంటలను పండించడంలో ఉత్తమ పద్ధతులను తెలుసుకోవాలని రైతులకు సూచించారు. మన స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. ప్రధానమంత్రి రైతుల కోసం రూ. 24 వేల కోట్లతో ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజనను ప్రారంభించారని తెలిపారు. వ్యవసాయ రంగం ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలు, వాటి ప్రయోజనాలు, జీఎస్టీ తగ్గింపు దీని ద్వారా ప్రజలకు కలుగుతున్న లాభాల గురించి వివరించారు. ఎస్సీ రైతులకు కుసుమ ఐఎస్ఎఫ్ 764 విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా సంస్థల అధికారులు, రైతులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్ల కోసం ఐక్య ఉద్యమాలు

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో గుజ్జ కృష్ణ తదితరులు

కాచిగూడ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఐక్య ఉద్యమాలు చేపడతామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన శనివారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో బీసీ సంఘాలు, కుల సంఘాలు, ఉద్యోగ, కార్మిక, లాయర్ల సంఘాల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా త్వరలోనే తెలంగాణ ఉద్యమ తరహాలో బలమైన బీసీ ఉద్యమాన్ని నిర్మిస్తామని అన్నారు. ఉద్యమ నిర్మాణానికి అన్ని రాజకీయ పార్టీల్లోని బీసీ నేతలతో కలిసి బీసీ రాజకీయ జేఏసీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టేకు నిరసనగా ఈ నెల 14వ తేదీన చేపట్టనున్న తెలంగాణ రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని, బీసీల సత్తా చాటాలని పిలుపునిచ్చారు. సమావేశంలో 22 బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొని బంద్‌కు మద్దతు తెలియజేశారు. ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత స్టే ఇవ్వడం సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకమన్నారు. దేశ చరిత్రలోనే ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత స్టే ఇవ్వలేదని, న్యాయచరిత్రలోనే మొదటిసారి ఇలా బీసీలపై అన్యాయంగా స్టే ఇచ్చారని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల కేసులో 30 బీసీ సంఘాలు ఇంప్లీడ్ కేసులు వేశారని, పిటిషనర్ల వాదన కూడా వినకుండా స్టే ఎలా ఇస్తారని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లను పార్టీ పరంగా ఇస్తే ఒప్పుకునే ప్రసక్తే లేదని అన్నారు. కార్యక్రమంలో గుజ్జ సత్యం, నీల వెంకటేష్, జిల్లపల్లి అంజి, పగిళ్ల సతీష్, పృథ్వీ గౌడ్, సి.రాజేందర్, అనంతయ్య, రామకోటి, నాగుల శ్రీనివాస్, సామల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారహక్కు చట్టంపై అవగాహన



సాక్షి, సిటీబ్యూరో: సమాచార హక్కు చట్టం వారోత్సవాల సందర్భంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)లో శనివారం సమాచార హక్కుచట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. 'ఆర్టీఐ చట్టం-2005' లక్ష్యం, పారదర్శకమైన పాలనావ్యవస్థ, బాధ్యతాయుతమైన ప్రభుత్వం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ నిహాంత్ ఈ చట్టంపై సమగ్రమైన వివరాలతో ప్రసంగించారు.

పిచ్చికుక్కల స్వైరవిహారం

సచివాలయంలో ఇప్పటికే నలుగురిపై దాడి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సచివాలయం మీడియా పాయింట్ ముందు పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో సచివాలయం పరిసర ప్రాంతాలకు రావాలంటే సందర్శకులు, అర్జీదారులు జంకుతున్నారు. ఒ పిచ్చికుక్క ఇప్పటికే నలుగురిని కరిసింది. శనివారం మహిళలను పిచ్చికుక్క కరువడంతో అక్కడే ఉన్న అర్జీదారులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. సచివాలయ సీ బ్లాక్ నుంచి అమ్మవారు టెంపుల్ వరకు కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. దీంతో సచివాయల మీడియా పాయింట్, సీఎంఆర్ఎఫ్, క్యాంటీన్‌కు వచ్చే అర్జీదారులు, అక్కడి నుంచి వెళ్లే పాదచారాలు బెంబేలెత్తుతున్నారు. కుక్కలు పెట్రేగిపోతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడలేదని అర్జీదారులు ప్రశ్నించారు. వెంటనే చర్యలు చేపట్టకపోతే మరింత మందికి ఇబ్బందులు తప్పవని, ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న అధికారులు దీనిపై దృష్టి సారించకపోవడం గమనార్హం.



రోడ్లు ఛిద్రం..

జర భద్రం..!

బిగ్ స్టోరీ

అడుగుకో గుంత.. బయటకు వెళ్లాలంటే చింత

ఖర్చవుతున్న రూ. కోట్లు.. ప్రజలకు తప్పని పాట్లు

తాత్కాలిక చర్యలతో మమ.. శాశ్వత పరిష్కారమేదీ ?



ఫిరోజ్‌గూడ నుంచి నర్సాపూర్ చౌరస్తా వరకు ప్రధాన రహదారిపై గుంతలు

సీఆర్ఎంపీ కింద..

- మొదటి దశ: 812 కిలోమీటర్లు
- వ్యయం: రూ. 1,839 కోట్లు
- రెండో దశ ప్రతిపాదనలు: 1,142 కిలోమీటర్లు
- అంచనా వ్యయం: రూ. 3,825 కోట్లు
- ప్రస్తుత బడ్జెట్‌లో రోడ్ల నిర్వహణకు కేటాయింపులు: రూ. 785 కోట్లు



సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్ రహదారుల సొగసు చూడతరమా! అడుగడుగునా గుంత.. వాహనదారులకు తప్పని చింత. నడక నరకప్రాయం.. అంతర్గత రహదారులతోపాట ప్రధాన రోడ్లు కూడా ఛిద్రమై దర్శనమిస్తున్నాయి. హైదరాబాద్ నగరం ఐటీ, ఫార్మాసహా వివిధ రంగాల్లో ముందడుగు వేస్తున్నప్పటికీ, దెబ్బతిన్న రోడ్లతో అధ్వాన్న నగరమనే ముద్ర పడుతోంది. వంద అడుగుల రోడ్లకూ అదే పరిస్థితి. ట్రాఫిక్‌తోపాటు నిర్వహణ లోపాలతో భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు త్వరితంగా దెబ్బతింటున్నాయి. వరుసగా కురుస్తున్న వానలు రోడ్ల సమస్యను మరింత జటిలంగా చేస్తున్నాయి. ఎప్పటికప్పుడు పాట్‌హోల్స్ పూడుస్తున్నట్లు జీహెచ్ఎంసీ గణాంకాలు వెల్లడిస్తున్నప్పటికీ, ఆగని వర్షాలతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారుతోంది. అక్కడా ఇక్కడా అని కాకుండా అన్నిచోట్ల పాట్‌హోల్స్, వాటర్ లాగింగ్స్‌తో పాదచారులతోపాటు వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. ఫ్లై ఓవర్ల మీద సైతం పగుళ్లు, గుంతలతో నీటినిల్వలు చేరి ప్రమాదకరంగా మారాయి.

> **యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్నాం**
>
> రోడ్‌సేఫ్టీ డ్రైవ్‌లో భాగంగా పాట్‌హోల్స్ పూడ్చివేత పనులు యుద్ధప్రాతిపదికన చేస్తున్నాం. వర్షాలు కురుస్తున్నప్పటికీ తెరిపినిచ్చి పొడి వాతావరణం ఉన్నప్పుడు ఆర్ఎంసీతో సీసీ ప్యాచ్ వర్క్స్ చేస్తున్నాం. పనులు చేసేందుకు వానల వల్ల అవాంతరాలు ఎదురవుతున్నా, తగిన ప్రణాళికలతో రేయింపగళ్లు పనిచేస్తున్నాం. ముఖ్యంగా తమ అవసరాల కోసం ఆయా విభాగాలు రోడ్లు తవ్వడం, మురుగునీరు పొంగిపొర్లడంతో రోడ్లు గుంతలమయంగా మారుతున్నాయి. ప్రజల ఇబ్బందుల్ని సాధ్యమైనంత మేర తగ్గించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే మంజూరైన కొత్త పనులు కూడా చేపడుతున్నాం.
>
> –సహదేవ్ రత్నాకర్, చీఫ్ ఇంజనీర్, జీహెచ్ఎంసీ



ముప్పుతిప్పలు పెడుతున్న మురుగునీరు..

ఈ సమస్యలకుతోడు మ్యాన్‌హోళ్ల మూతలు లేకపోవడం, రోడ్లపైనే పారుతున్న మురుగునీటితో ప్రజలు తిప్పలు పడుతున్నారు. పేద, మధ్య తరగతి, నివాస ప్రాంతాల్లోనే కాకుండా గచ్చిబౌలి, హైటెక్ సిటీ, మాదాపూర్, కొండాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ఐటీ హబ్స్ ప్రాంతాల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. లోతట్టుప్రాంతాలు, వంతెనల కింద, జంక్షన్లలో నీరు నిలిచిపోతుండటంతో వర్షం వచ్చిన ప్రతిసారీ వాహనదారులకు పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. పాట్‌హోల్స్‌ను ఎప్పటికప్పుడు పూడుస్తున్నప్పటికీ, తాత్కాలిక చర్యలు, ఆగని వర్షాలతో పరిస్థితి మళ్లీ మొదటికొస్తోంది.

శాశ్వత చర్యలకు ఇంకెంత కాలం ?

గతంలో సీఆర్ఎంపీ(సమగ్ర రోడ్డు నిర్వహణ పథకం) కింద ప్రధాన రహదారుల నిర్వహణ జరిగింది. ఆ పనుల కాంట్రాక్టు గడువు ముగిసి పదినెలలైనా కొత్తగా కాంట్రాక్టుకు ఇవ్వలేదు. జీహెచ్ఎంసీ చేయడం లేదు. దీంతో సమస్యలు పెరుగుతున్నాయి.

గత జూలై నుంచి జోన్లవారీగా పాట్‌హోల్స్ మరమ్మతు పనులు

జోన్	ఎల్‌బీనగర్	చార్మినార్	ఖైరతాబాద్	శేరిలింగంపల్లి	కూకట్‌పల్లి	సికింద్రాబాద్
పాట్‌హోల్స్	3010	2395	2084	1989	2276	3300
మరమ్మతులు పూర్తి	2652	1995	1723	1418	2104	2886

ఇవి అధికారుల లెక్కలోవి కాగా, లెక్కలేనివి ఇంతకంటే ఎక్కువే ఉన్నాయి.

నగర ప్రజలకు సురక్షిత ప్రయాణానికి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇంజినీర్లు చెబుతున్నారు. వరుస వర్షాలతో శాశ్వత చర్యలకు ఆస్కారం లేకుండా పోయిందంటున్నారు.





నగరంలో నేడు

- బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బాలగోపాల్ 16వ సంస్మరణ సభ కార్యక్రమంలో భాగంగా కె.బాలగోపాల్ రాసిన రాజ్యాంగాన్నని ఎలా చూడాలి? అనే పుస్తకావిష్కరణ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలతో కూడిన హైలైఫ్ బ్రైడ్ ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శివోహం పేరిట కళాకారిణి శిల్పాకాను వేసిన చిత్రాల ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఘనంగా అపోలో మెడికల్ కాలేజీ స్నాతకోత్సవం

విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం



అపోలో మెడికల్ కాలేజీ స్నాతకోత్సవంలో సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న అతిథులు

బంజారాహిల్స్: అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో అండర్ గ్రాడ్యుయేట్ బ్యాచ్ 2019, పోస్ట్ గ్రాడ్యుయేట్ బ్యాచ్-2021 విద్యార్థుల కోసం స్నాతకోత్సవాన్ని శనివారం జూబ్లీ హిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వెంకట్రాం ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి హాజరయ్యారు. విశిష్ట అతిథిగా కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పీవీ నందకుమార్‌రెడ్డి హాజరయ్యారు. వీరిద్దరూ ఎంబీబీఎస్, ఎండీ, ఎంస్ డిగ్రీలను ప్రదానం చేశారు. 100 మంది గ్రాడ్యుయేట్, 34 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు డిగ్రీలు అందుకున్నారు. ప్రతిష్టాత్మక చైర్మన్ మెడల్ డాక్టర్ ప్రతాప్ సీ రెడ్డి గోల్డ్‌మెడల్, డాక్టర్ కేవీఆర్ ప్రసాద్ స్మారక గోల్డ్ మెడల్‌ను ఉత్తమ అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థి అఫ్రీన్‌బేగంకు ప్రదానం చేశారు. ఉత్తమ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థి అవార్డు ప్రతిష్టాత్మక చైర్మన్ మెడల్ డాక్టర్ ప్రతాప్ సీ రెడ్డి గోల్డ్ మెడల్‌ను సైకియాట్రి విభాగానికి చెందిన డాక్టర్ అనుదీప్ సుబ్బారావుకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్స్ గ్రూపు జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి విద్యార్థులను అభినందించారు. డీఎన్ డాక్టర్ కె.మనోహర్, సీఓఓ అపర్ణారెడ్డి పాల్గొన్నారు.

'మీడియా క్యాపిటల్' పుస్తకావిష్కరణ



మీడియా క్యాపిటల్ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని బహుజన స్టూడెంట్స్ ఫ్రంట్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో 'మీడియా క్యాపిటల్' పుస్తకాన్ని శనివారం సాయంత్రం ఆవిష్కరించారు. డాక్టర్ పంతుకల శ్రీనివాస్ రచించిన ఈ పుస్తకాన్ని తెలంగాణ ఆర్టీఐ కమిషనర్ పీవీ శ్రీనివాస్‌రావు, మాడభూషి శ్రీధర్, ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ పూర్ణచంద్రారావు సంయుక్తంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వినోద్ పావురాల, బీఎస్ఎఫ్ అధ్యక్షుడు అంజి ఎర్రోళ్ల, కన్వీనర్ జోగు రమేష్, నాయకులు పరశురామ్, దివాకర్, రచన, ఆశ్చర్య, నవీన్, ప్రసన్న త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

మూడు విమానాల్లో సాంకేతిక లోపం

ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఒకే రోజు మూడు విమానాల్లో సాంకేతికలోపం తలెత్తగా మరో విమానానం ఇతర కారణాలతో ఆలస్యంగా బయలుదేరింది. వివరాలు ఇలా ఉన్నాయి.. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఉదయం 6 గంటలకు స్పైస్ జెట విమానం 87 మంది ప్రయాణికులతో తిరుపతికి బయలుదేరేందుకు సిద్ధమవ్వగా అందులో సాంకేతిక సమస్యను గుర్తించి నిలిపివేశారు. మరమ్మతుల అనంతరం విమానం ఇక్కడి నుంచి 9 గంటలకు బయలుదేరింది. స్పైస్‌జెట్‌కు చెందిన మరో విమానం ఎస్‌జీ 2018 విమానం శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఉదయం 7.55 గంటలకు బయలుదేరాల్సి ఉండగా అందులో సాంకేతిక సమస్య తలెత్తడంతో నిలిపివేశారు. సమస్యను పరిష్కరించిన తర్వాత ఉదయం 11.55 గంటలకు విమానం ఇక్కడి నుంచి బయలుదేరింది. నాలుగు గంటల సేపు ప్రయాణికులకు సమస్యను వివరించకపోవడంతో ఎయిర్‌లైన్స్ సిబ్బందితో గొడవపడ్డారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి శివమొగ్గ వెళ్లాల్సిన స్పైస్‌జెట్ 2703 విమానం ఆపరేషన్ కారణాలతో 9.50 గంటలకు బయలుదేరాల్సి ఉండగా మధ్యాహ్నం 12 గంటలకు ఇక్కడి నుంచి టేకాఫ్ తీసుకుంది. ఢిల్లీ నుంచి వయా శంషాబాద్ విమానాశ్రయం నుంచి తిరుపతి వెళ్లే ఎయిర్ ఇండియా ఏఐ-242 విమానంలో మధ్యాహ్నం 12 గంటల సమయంలో సాంకేతిక సమస్య తలెత్తింది. 142 ప్రయాణికులు ఇందులో ఉండగా 22 మంది ప్రయాణికులను దించి వేశారు. మరమ్మతుల అనంతరం విమానం 3 గంటలకు ఇక్కడి నుంచి తిరుపతికి బయలుదేరింది.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, ఆదివారం, 12, అక్టోబర్, 2025



కిక్ కొట్టు.. క్లబ్ సెట్టు..

* మెట్రో నగరాల్లో రైడింగ్ మానియా
* క్రమంగా పెరుగుతున్న క్లబ్స్ సంఖ్య
* నగరంలో దాదాపు పాతికపైనే గ్రూప్స్
* పోటాపోటీగా లాంగ్ రైడ్స్ నిర్వహణ
* గోవా తదితర చోట్ల జాతీయ స్థాయి ఈవెంట్స్
* ఇతర నగరాలకూ విస్తరిస్తున్న గ్రూప్స్

పాతికేళ్ల క్రితం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ సమీపంలో వాకర్స్‌గా పరిచయమైన ఇద్దరు బైకర్స్ మదిలో పుట్టిన ఆలోచన బైకర్స్ క్లబ్స్‌కి శ్రీకారం చుట్టింది. బైక్ రైడ్స్ హాబీని నగరవాసుల్లో అంతకంతకూ పెంచి ప్రస్తుతం నగరంలో ఇదో సంప్రదాయంగా స్థిరపడింది. పది, ఇరవై కిలోమీటర్ల ప్రయాణాల నుంచి క్రమంగా వేల మైళ్ల ప్రయాణాలకు విస్తరిస్తోంది. మెట్రో నగరాల్లో పెరుగుతున్న ఈ మానియా క్లబ్స్ సంఖ్యను అంతకంతకూ పెంచుకుంటోంది. పోటాపోటీగా రైడ్స్ నిర్వహిస్తూ గోవా వంటి ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ జాతీయ స్థాయి ఈవెంట్స్ నిర్వహిస్తూ రికార్డులతో దూసుకుపోతోంది. అంతేకాకుండా నగరంలోని గ్రూపుల్లో ఇతర ప్రాంతాల, నగరాల ఔత్సాహికులూ సభ్యులుగా చేరే స్థాయికి ఈ క్లబ్ చేరుతున్నాయి.

– సాక్షి, సిటీబ్యూరో

పెద్ద పెద్ద రహదారులు, భారీ ఇంజను సామర్థ్యం కలిగిన బైకులు, సాహస ప్రియులైన యువత అధికంగా ఉండే విదేశాల నుంచి పాతికేళ్ల క్రితం నగరంలో ప్రవేశించిన బైక్ క్లబ్స్ హాబీ నగర రోడ్లపై దౌడు తీస్తోంది. వందల, వేల కిలోమీటర్ల దూరం చుట్టేసే వీర'బైకా'భిమానులకు కొదవ లేదు. తమ లాంటి మరి కొందరు బైకర్స్‌ను తోడు చేసుకుని క్లబ్స్ ఏర్పాటు చేయడం సర్వసాధారణం అయ్యింది. సహజంగా యువతలో ఉండే వేగానికి విశాలమైన రహదారులు కొత్తగా మార్కెట్‌లోకి వస్తోన్న భారీ బైక్‌లు మరింత ఊపునిస్తున్నాయి.

బుల్లెట్ బైక్స్ హవా..

'ప్రపంచవ్యాప్తంగా ఉన్న బైక్‌లవర్స్ అందర్నీ ఒక్క చోట చేర్చేది రైడింగ్ మానియా. ఏ సిటీలో ఉన్నా ఆన్‌లైన్‌లోనో, మరో రకంగానో మేమంతా టచ్‌లోనే ఉంటాం' అని సిటీలో తొలిసారిగా వాండరర్స్ క్లబ్‌తో క్లబ్ ట్రెండ్‌కి తెరతీసిన లలిత్‌జైన్ చెప్పారు. ఈ క్లబ్ సభ్యులంతా రాయల్ ఎన్‌ఫీల్డ్ (బుల్లెట్) బైక్‌ని వినియోగించేవారే. 'మా క్లబ్ ఏర్పాటు చేసిన తొలి నాళ్లలో 10 మంది కూడా లేరు. ఇప్పుడు 20కి పైగా క్లబ్స్ సిటీలో ఉంటే వాటిని ప్రారంభించిన వారిలో అత్యధికులు వాండరర్స్ నుంచే ఉన్నారు' అని క్లబ్‌కు చెందిన అనిల్ రావూరి గర్వంగా చెబుతారు. వీటిలో ఒకే రకం బైకులున్న వారు కలిసి ఏర్పాటు చేసే క్లబ్స్‌తో పాటు ఏ బైక్ ఉన్నవారైనా సభ్యులుగా చేరొచ్చని ఆహ్వానించే క్లబ్స్ కూడా ఉన్నాయి. 'ఏ టూవీలర్ ఉన్నా, రైడింగ్ అభిమాని అయ్యి ఉంటే చాలు.. మా క్లబ్‌లో మెంబర్ కావచ్చు..' అని హైవే నవాబ్స్ క్లబ్ వ్యవస్థాపక సభ్యుడైన ఫిర్దోస్ చెప్పారు.



మెసేజ్.. మైలేజ్..

బైక్ ప్రియత్వంతో పాటు సమాజంలోని విభిన్న అంశాలపై, సమస్యలపై తమ వంతు అవగాహన పెంచే సందేశాలు అందిస్తారు. తరచూ వేసే లాంగ్ రైడ్స్‌కు నేపథ్యంగా ఏదో ఒక సామాజిక అంశాన్ని ఎంచుకుంటారు. రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన, సేఫ్టీ రైడింగ్, ఆడ శిశువుల రక్షణ, పర్యావరణ కాలుష్యం, బాలకార్మిక వ్యవస్థ.. వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ రాష్ట్రాలు, దేశాలు చుట్టేస్తారు. 'ఈ తరహా టూర్లకు, మంచి థీమ్ ఉన్న రైడ్స్‌కు పలు సంస్థలు ప్రోత్సాహాలు అందిస్తున్నాయి. మొత్తం టూర్ స్పాన్సర్ చేసే సంస్థలూ లేకపోలేదు.' అని 60 కేపీహెచ్ బైకర్స్ క్లబ్ మెంబర్ మంజునాథ్ చెప్పారు.

షీ రైడర్స్ హవా..

బైక్స్‌ని అభిమానించే వారు, టూర్లు, ఫీట్లు చేసే పురుషులు మాత్రమే అనుకుంటే పొరపాటు. 'నేను ఏడో తరగతి చదువుతున్నప్పటి నుంచీ బుల్లెట్ డ్రైవ్ చేస్తున్నా' అని చెప్పారు ఒమనా. బైకర్స్ క్లబ్‌లో సభ్యురాలైన ఈ మధ్య వయస్కురాలు ప్రాచీన చిత్రకళపై పరిశోధన చేస్తున్నారు. తరచూ బైక్‌పై లాంగ్ రైడ్ వెళుతుంటారు. క్లబ్స్‌లో యువతుల జోరు పెరిగింది. ఈ ట్రెండ్ నగరానికి చెందిన ది బైకర్నీస్ క్లబ్ ప్రోత్సహించింది. 'అబ్బాయిలతో కల్సి వెళ్తున్నామా.. అమ్మాయిలతో వెళ్తున్నామా అనేది ప్రధానం కాదు. ఇలాంటి స్నేహాలకు పునాది అభిరుచి మాత్రమే' అని చెప్పారు మరో బైకర్ అనిత.







సిటీలో క్లబ్స్ ఇవే..

ప్రస్తుతం నగరంలో దీపక్ శివానీ స్థాపించిన హిందూస్థాన్ రాయల్స్ బుల్లెటీర్స్ క్లబ్, బ్లాక్ జాక్ స్థాపించిన వాల్ఫ్ ప్యాక్ ఇండియా, వరుణ్ సింగ్ దేవాల్ ఆధ్వర్యంలో రోడ్ థ్రిల్, రమేష్ వెంకట్ నిర్వహిస్తున్న ది గార్డియన్స్, ప్రదీప్‌కుమార్ సారథ్యంలో ఎండ్‌లెస్ ట్రూపర్స్, విజయ్‌కుమార్ నడిపిస్తున్న హై బైకర్స్, అమృత్‌పాల్ సింగ్ ఆధ్వర్యంలోని ది ఎక్స్ ట్రీమ్ బైకర్స్, చిరాగ్ సేన్ ప్రారంభించిన ఐబీఆర్ ఇండియా బుల్ రైడర్స్, కాశ్యప్ రెడ్డికి చెందిన ఐరన్ హెడ్స్–మైల్స్ ఆన్ వీల్స్, కల్తాన్ సారథ్యంలోని ది మెటాడోర్స్, విజయ్ వారణాశి, శ్రవణ్ విండ్ చేజర్స్, అమిత్ సింగ్ ఆధ్వర్యంలో ఫ్రీమెన్ రైడర్స్, సన్నీ గాజర్, కలీమ్‌కు చెందిన ఎక్స్ బీహెచ్‌పీ ఇండియా, శ్రీధర్ నిర్వహిస్తున్న మోటో వింగ్స్, పీకే చౌహాన్ హెవోక్ బార్బేరియన్స్, రోహిత్ ఎబెల్ హైవే స్టార్స్, ప్రీత్‌పాల్ విక్కీ లోటె నడిపించే పంజాబ్ ఎన్‌ఫీల్డ్ జనరేషన్, సదాశివరెడ్డి హైవే నవాబ్స్, రాయల్ వాండర్‌లస్ట్, హార్లీ వరుణ్ వనమ్ నడిపించే డేవిడ్సన్ బైక్ క్లబ్.. వంటివి ఉన్నాయి.

రైడ్‌కి.. ఇలా రెడీ..

ఈ బైకర్స్ క్లబ్స్ నిర్వహించే లాంగ్ టూర్లన్నీ పక్కా ప్రణాళికతో ఉంటాయి. కొన్ని నెలల ముందుగానే రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తారు. సభ్యుల్లో టూర్‌కి రెడీ చెప్పే వారు కనీసం 15 మందికి తగ్గకుండా ఉంటేనే టూర్ ఫైనలైజ్ చేస్తారు. ఫస్ట్ ఎయిడ్ బాక్స్, మెడికల్ కిట్స్, అత్యవసర వస్తువులు, రహదారి మధ్యలో ఆగేందుకు హట్స్.. వంటివన్నీ వీరి వెన్నంటి ఉంటాయి. తరచూ మారుతీ వ్యాన్ లేదా మరేదైనా వాహనం తమతో పాటు తీసుకెళతారు. విభిన్న నగరాలు, ఊర్ల మీదుగా వెళ్లేటప్పుడు మార్గ మధ్యంలో ఇతర బైకర్స్ క్లబ్స్ సభ్యులు కలిసే అవకాశం ఉంటే వారికి ముందస్తు సమాచారం ఇస్తారు. టూర్‌కి కలవకపోయినా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తారు.

ఇతర సిటీలకూ విస్తరించింది..

ఢిల్లీ, డెహ్రాడూన్, ముంబయి, బీదర్, బెంగళూరు, నాందేడ్‌లో కూడా మా వాండరర్స్‌కి అనుబంధ క్లబ్స్ ఉన్నాయి. ఏడాదికి 50, 60 రైడ్స్ తప్పకుండా ఉంటాయి. దేశవ్యాప్తంగా 4వేల మంది సభ్యులు ఉన్నారు. సేఫ్టీ, నిబంధనల విషయంలో మేము చాలా కచ్చితంగా ఉంటాం. సభ్యుల ఎంపిక కూడా ఆచి తూచి చేస్తాం.

– అనిల్ రావూరి, వాండరర్స్



మిరాయ్ మెరుపులు..

నగరంలో నటి రితికా నాయక్ సందడి



సాక్షి, సిటీ బ్యూరో : నగరంలోని చందానగర్‌లో మిరాయ్ సినిమా ద్వారా టాలీవుడ్ కి పరిచయం అయిన రితికా నాయక్ సందడి శనివారం చేశారు. వెండి మెరుపులకు పోటీగా ఫోజులిస్తూ.. ఆభరణాల ప్రియులను ఆకట్టుకున్నారు. పలు రకాల డిజైన్లలో ఉన్న వెండి జ్యూవెలరీని ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెంపుల్ ట్రెడిషనల్ జ్యూవెలరీ అంటు తనకు ఇష్టమని తెలిపారు. చందానగర్‌లో వెండి ఆభరణాలకు పేరొందిన గోయాజ్ సంస్థ ఏర్పాటు చేసిన స్టోర్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అభిమానులతో ఫొటోలు, సెల్ఫీలు దిగి ఆటోగ్రాఫ్‌లు ఇచ్చి వారిని అలరించారు.

పాడెల్ టోర్నీలో భారత్ హవా..

అద్భుత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు

సాక్షి , సిటీబ్యూరో: హైదరాబాద్ వేదికగా జరుగుతున్న ఎఫ్ఐపీ సిల్వర్ రాథా టీఎంటీ ఇండియన్ ఓపెన్ పాడెల్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారుల హవా కొనసాగుతోంది. శనివారం జరిగిన మూడో రోజు పోటీల్లో పలు భారత జంటలు అద్భుత ప్రదర్శనతో క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లాయి. కేపీజీబీఏ కోర్టుల్లో జరిగిన పురుషుల, మహిళల విభాగాల్లో హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లు స్థానిక అభిమానులను ఉర్రూతలూగించాయి. మొత్తంగా నాలుగు భారత జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరడంతో టోర్నమెంట్ కీలక దశకు చేరుకుంది. వారాంతంలో జరగనున్న హోరాహోరీ పోరులో స్వదేశీ క్రీడాకారులకు మద్దతు తెలిపేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





అలరించిన కథక్ ప్రదర్శన..

శిల్పారామంలో ఆకట్టుకున్న మ్యూజిక్, డ్యాన్స్ ఫెస్టివల్

మాదాపూర్ : నగరంలోని శిల్పారామం వేదికగా ఏర్పాటు చేసిన కథక్ నృత్య ప్రదర్శన వీక్షకులను, సందర్శకులను అలరించింది. పరిచయ ఆర్ట్ ఫౌండేషన్, గురు కళామండల్ గంగానీ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వాహించిన కళాయాత్ర మ్యూజిక్, డ్యాన్స్ ఫెస్టివల్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అబ్బురపరిచాయి. జయంత్ నాయుడు హవాయియన్ స్లైడ్ గిటార్, ఫతేహ్ సింగ్ గంగానీ లయయాత్ర, తబలా జుగల్బందీ కార్యక్రమాలు అలరించాయి. ఆర్తి శంకర్ శిష్యబృందం కథక్ నృత్య ప్రదర్శన మంత్రముగ్ధులను చేసింది. తుమ్మేటి, భజన, తీన్తాల్, గురువందన అంశాలను సన్నీది, శ్రేయసి ప్రియన్షి, తన్వి, దీత్య, దియా, అలియా, ఇషితా, మోనికా, పూర్వి, నిశిత, నటాషా తదితరులు ప్రదర్శించి అలరించారు.

నగరంలోని నెహ్రూ జూ పార్క్‌కు కొత్త అతిథులు రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే అనేక రకాల జాతుల జంతువులతో అలరిస్తున్న జూ పార్కుకు మరికొన్ని జంతువులు తోడుకానున్నాయి. దేశ, విదేశాల జూల నుంచి సుమారు 16 రకాల జంతువుల జతలు రానున్నాయి.

-సాక్షి, సిటీబ్యూరో

నగర జూకు కొత్త అతిథులు..

వల్లబి, గిబ్బాన్‌తో పాటు ఇతర జంతువులు | ఇప్పటికే చేరిన జీబ్రా, మీర్ క్యాట్ | జంతు మార్పిడిలో భాగంగానే.. | దత్తతకు ముందుకొచ్చిన కార్పొరేట్ సంస్థ



జంతు మార్పిడిలో భాగంగా ఆస్ట్రేలియాలో మాత్రమే కనిపించే వల్లబి (కంగారులో ఒక రకం), దక్షిణాసియా ప్రాంతంలో ముఖ్యంగా ఇండోనేషియా, బంగ్లాదేశ్‌లో కనిపించే గిబ్బాన్, మధ్య ఆఫ్రికాలో అరుదుగా కనిపించే మాండ్రిల్ త్వరలోనే భాగ్యనగరంలో సందడి చేయనున్నాయి. అయితే మ్యాండ్రిల్ జంషెడ్‌పూర్ ప్రదర్శనశాల నుంచి, హులుక్ గిబ్బాన్ నాగాలాండ్ జూ నుంచి రానున్నాయి. ఆఫ్రికన్ జీబ్రా ఇప్పటికే జూకు చేరుకోగా మరికొద్ది రోజుల్లో తెల్ల సింహం, జీబ్రా, చింపాంజీలు జూ పార్కులో కనువిందు చేయనున్నాయి. వీటిని పోషించడానికి, ఎన్‌క్లోజర్ నిర్మాణ పనులకు అయ్యే ఖర్చును భరించేందుకు ప్రైవేటు సంస్థలు ముందుకొచ్చాయని అధికారులు చెబుతున్నారు.

183 జాతులు.. 1,860 ప్రాణులు..

380 ఎకరాల విస్తీర్ణంలో ప్రస్తుతం 183 జాతులకు చెందిన 1,860 జీవాలు ఉన్నాయి. జంతు మార్పిడిలో భాగంగా రెండు హిపోపాటమస్, రెండు ముకాన్లు, బూడిద రంగు తోడేలు, జిరాఫీల జంట, నాలుగు కింగ్ కోబ్రాలను తీసుకొచ్చారు.







ప్రతిపాదనలు పంపించాం..

జంతు మార్పిడిలో భాగంగా జూకు కొత్త జాతులను తెచ్చేందుకు కేంద్ర కార్యాలయానికి ప్రతిపాదనలు పంపాము. ప్రస్తుతం జూలో వన్యప్రాణుల ఆలనాపాలనా విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఎల్లవేళలా వాటి అవసరాలు, వాతావరణానికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నాం.

– జే.వసంత, నెహ్రూ జూ పార్క్ క్యూరేటర్



ఆకట్టుకున్న కార్ షో..

ఫాస్ట్ అండ్ క్యూరియస్ పేరిట ది జెన్ జెడ్ ఆటో ఎక్స్‌పో



సాక్షి, సిటీ బ్యూరో : యువతలో ఆటోమొబైల్ రంగంపై అవగాహన కల్పించేందుకు 'స్టూడెంట్ ట్రైబ్' సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని టీ–హబ్‌లో 'ఫాస్ట్ అండ్ క్యూరియస్ – ది జెన్ జెడ్' ఆటో ఎక్స్‌పో– 2025 ఏర్పాటైంది. ఈ ప్రదర్శనను టాలీవుడ్ హీరో సాయి ధర్మ తేజ్ శనివారం ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో రాష్ట్ర వ్యాప్తంగా 100కి పైగా కాలేజీల నుంచి 2000 మందికి పైగా విద్యార్థులు పాల్గొని ఆటోమొబైల్ ప్రపంచాన్ని సన్నిహితంగా వీక్షించారు. ఓజీ, కాంత వంటి సినిమాల్లో వాడిన స్పెషల్ వింటేజ్ కార్లు, బ్యూయిక్ –1945, మారిస్ ఆక్స్‌ఫర్డ్– 1951, ఆడి–8 వంటి హై–పెర్ఫార్మెన్స్ మోడళ్లు యువతను ఆకట్టుకున్నాయి.

విద్యార్థులకు అవగాహన..

స్టూడెంట్ ట్రైబ్ సీఈఓ చరణ్ లక్కరాజు మాట్లాడుతూ.. 'ఈ ఎక్స్‌పో విద్యార్థులకు ఆటోమొబైల్ రంగంలో కెరీర్ అవకాశాలను పరిచయం చేస్తోంది' అని తెలిపారు. ఆటోమొబైల్ రంగ నిపుణులు జెనెక్స్ నిర్వాహకుడు అమర్ మాట్లాడుతూ.. 'సినీ ప్రపంచం, టెక్నాలజీ, ఆటోమొబైల్ రంగం కలయిక ఇది' అన్నారు. కార్యక్రమంలో భాగంగా వర్క్‌షాప్‌లు, ఇంటరాక్టివ్ సెషన్ల ద్వారా విద్యార్థులు డిజైన్, ఇంజినీరింగ్, టెక్నాలజీ అంశాలపై అవగాహన పొందారు. మొత్తంగా ఈ ఎక్స్‌పో యువతకు సృజనాత్మకత, కెరీర్ అవకాశాలకు వేదికగా నిలిచింది.



నకిలీ మద్యంలో ఈ ప్రశ్నలకు బదులేది..?

కీలక నిందితుడు సురేంద్రనాయుడుకు ప్రభుత్వ పెద్దలతో సన్నిహిత సంబంధాలు

అందుకే జంట హత్యల కేసులో.. 2014 తర్వాత జీవిత ఖైదు నుంచి క్షమాభిక్ష

సాక్షి, అమరావతి:

యావజ్జీవ ఖైదీకి క్షమాభిక్ష నుంచి... తంబళ్లపల్లె టీడీపీ టికెట్ జయచంద్రారెడ్డికి ఇవ్వడం వరకు... ఏ1 జనార్దనరావు అత్యంత ధీమాగా రాష్ట్రానికి తిరిగిరావడం దాక.. నకిలీ మద్యం కేసులో అనేక ప్రశ్నలు...! వీటికి సమాధానాలు వెదుక్కుంటూ పోతే... కీలక నిందితుడు, టీడీపీ నేత సురేంద్రనాయుడుకు ముఖ్య నేతతో సన్నిహిత సంబంధాలు బయటపడుతున్నాయి... జంట హత్యల కేసులో 2014 తర్వాత ఆయనకు జీవిత ఖైదు నుంచి క్షమాభిక్ష దక్కిన విషయం విస్తుగొలుపుతోంది... 2024 ఎన్నికల్లో సీనియర్లను కాదని మరీ తంబళ్లపల్లె టీడీపీ టికెట్‌ను జయచంద్రారెడ్డికి ఇప్పించింది కూడా సురేంద్రనాయుడే అనే స్పష్టం అవుతోంది. ఇంత లోతైన సంబంధాలు ఉన్నందునే... నకిలీ మద్యం వ్యవహారం కుదిపేస్తున్నా... జయచంద్రారెడ్డిపై టీడీపీ నుంచి తూతూమంత్రం సస్పెన్షన్ తప్ప ఇప్పటివరకు అరెస్టు చేయలేదని స్పష్టమవుతోంది. వెరసి ఆఫ్రికా మోడల్ నకిలీ మద్యం డీల్ డొంక కదులుతోంది.

...రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్న నకిలీ మద్యం మాఫియా దందాలో అన్ని వేళ్లూ ముఖ్య నేత వైపే చూపిస్తున్నాయి. భారీ దోపిడీకి తెగించిన ఈ ముఠాలో పాత్రధారులు జయచంద్రారెడ్డి, టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడులు ముఖ్య నేతకు అత్యంత సన్నిహితులన్నది బహిరంగ రహస్యంగా మారింది. ఆఫ్రికా మోడల్ కల్తీ మద్యం రాకెట్‌లో జయచంద్రారెడ్డి, సురేంద్రనాయుడుతో ముఖ్య నేతకు ఉన్న 'క్షమాభిక్ష' బంధం వారి బాగోతాన్ని బయటపెడుతోంది. మొత్తం నకిలీ లిక్కర్ మాఫియాకే అది పునాదిగా నిలిచింది. ఐదేళ్లలో ఏకంగా రూ.45 వేల కోట్లు దోపిడీకి పక్కాగా పన్నిన పన్నాగం అమలులో శ్రీకాకుళం జిల్లా నుంచి అనంతపురం వరకు నకిలీ మద్యం మాఫియాను వ్యవస్థీకృతం చేసేంతగా ఎదిగింది.

ఆఫ్రికాలో డిస్టిలరీల...అవే పునాదిగా

తనకు ఆఫ్రికాలో డిస్టిలరీలు ఉన్నట్లు జయచంద్రారెడ్డి గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దీన్నిబట్టి ఎన్నికల నాటికే నకిలీ మద్యం దందాకు బీజం పడినట్లు స్పష్టమవుతోంది. ఆఫ్రికా మోడల్ నకిలీ మద్యం దోపిడీ డీల్‌తోనే... సురేంద్రనాయుడి ద్వారా టీడీపీ టికెట్ పొందినట్లు అర్థమవుతోంది. ఇక వీరు కూటమి అధికారంలోకి రాగానే ముఖ్య నేత పూర్తి అండతో మాఫియాను వ్యవస్థీకృతం చేశారు. జయచంద్రారెడ్డి, ఆయన బావమరిది గిరిధర్‌రెడ్డి, సురేంద్రనాయుడు, అద్దేపల్లి జనార్దన్‌రావు తదితరులు ముఠా కట్టి తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువు నుంచి మొదలు రాష్ట్రస్థాయిలో నకిలీ మద్యం నెట్‌వర్క్ ఏర్పాటు చేశారు. అసలు మద్యం ఏదో నకిలీది ఏదో తెలియని స్థాయిలో నకిలీ మద్యం తయారు చేసి పేదలు, మధ్య తరగతి వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

2024: ఆఫ్రికా నకిలీ మద్యం డీల్... జయచంద్రారెడ్డికి టీడీపీ టికెట్

ముఖ్య నేత క్షమాభిక్షతో దర్జాగా బయటకు వచ్చిన సురేంద్రనాయుడు ఉమ్మడి చిత్తూరు, ఉమ్మడి వైఎస్సార్ జిల్లాల్లో టీడీపీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీలో ఆయన చెప్పిందే చెల్లింది. ఈ ప్రభావం ఏస్థాయికి చేరిందంటే 2024 ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యేలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, శంకర్‌యాదవ్‌ను పక్కనపెట్టి మరీ జయచంద్రారెడ్డికి తంబళ్లపల్లె టీడీపీ టికెట్ ఇప్పించేవరకు వెళ్లింది. తర్వాత జయచంద్రారెడ్డి, గిరిధర్‌రెడ్డి, తమ అత్యంత సన్నిహితుడు అద్దేపల్లి జనార్దన్‌రావుతో జట్టు కట్టి ముఖ్య నేతతో ఆఫ్రికా మోడల్ నకిలీ మద్యం డీల్‌ను కుదిర్చారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం వస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆఫ్రికా మోడల్ నకిలీ మద్యం మాఫియాను వ్యవస్థీకృతం చేయడం ఐదేళ్ల పాటు భారీ దోపిడీకి తెగబడటం... ఇదీ డీల్.

నాడు సిండికేట్ దోపిడీ.. నేడు నకిలీ మద్యం దందా

2014–19లో టీడీపీ ప్రభుత్వం ఉండగా మద్యం సిండికేట్ ద్వారా యథేచ్ఛగా దోపిడీకి పాల్పడ్డారు. 2024–29లో ఏకంగా నకిలీ మద్యాన్ని అధికారికంగా విక్రయించి అంతకుమించి భారీ దోపిడీకి ముఖ్య నేత పన్నాగం పన్నారు. అందుకే సురేంద్రనాయుడు చెప్పినట్టు జయచంద్రారెడ్డికి తంబళ్లపల్లె టికెట్ కేటాయించారు. అది కూడా తొలి జాబితాలోనే ఆయనకు టికెట్ ఖరారు చేశారు. గమనార్హం ఏమంటే... రాయలసీమలో సీనియర్ టీడీపీ నేతలకు కూడా మొదటి జాబితాలో టికెట్ రాలేదు గానీ జయచంద్రారెడ్డికి టికెట్ కేటాయించడం. పలువురు నేతలు, కార్యకర్తలు ఆయనకు టికెట్ ఇవ్వొద్దని ఉండవల్లిలో ధర్నాలు చేసినా పట్టించుకోలేదు. అదీ ఆఫ్రికా మోడల్ నకిలీ మద్యం డీల్ పవర్..!

2024 ఎన్నికల్లో మద్యం బాధ్యత... అనంతరం నకిలీ వ్యవస్థీకృతం

సురేంద్రనాయుడు ద్వారా కుదిరిన ఆఫ్రికా మోడల్ నకిలీ మాఫియా డీల్‌ను 2024 ఎన్నికలకు ముందే ముఖ్య నేతకు రుచి చూపించారు. అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రభుత్వపరం చేసింది. మద్యం దుకాణాల ద్వారా అమ్మకాలపై నియంత్రణ విధించింది. దీంతో ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడేందుకు, విచ్చలవిడిగా మద్యం పంపిణీకి భారీస్థాయిలో మద్యం అందుబాటులో లేదు. కానీ, టీడీపీ కూటమి మాత్రం తమ అభ్యర్థులకు భారీగా మద్యం సరఫరా చేయడం గమనార్హం. దీనివెనుక జయచంద్రారెడ్డి, సురేంద్రనాయుడుతో కూడిన తంబళ్లపల్లె టీడీపీ బ్యాచ్ ఉంది. వీరు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల్లో మద్యం పంపిణీని పర్యవేక్షించారు. అప్పటికే సరిహద్దులకు అవతల కర్ణాటకలో గుట్టుచప్పుడు కాకుండా నకిలీ మద్యం యూనిట్లు ఏర్పాటు చేశారు. అక్కడినుంచి భారీగా నకిలీ మద్యాన్ని టీడీపీ అభ్యర్థులకు అందజేయగా వారు ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు పంపిణీ చేశారు.

మనం నకిలీ మద్యం పంచామా?

రాయలసీమ, ఉత్తరాంధ్ర టీడీపీ కూటమి ఎన్నికల బాధ్యతలు చూసిన పలువురు సీనియర్ నేతలు ప్రస్తుతం నకిలీ మద్యం బాగోతాన్ని గుర్తుచేసుకుంటున్నారు. జయచంద్రారెడ్డి, సురేంద్రనాయుడు బ్యాచ్ మా ద్వారా పంపిణీ చేయించింది నకిలీ మద్యమా? అని అవాక్కవుతున్నారు. ''తంబళ్లపల్లె నియోజకవర్గంలో రాజకీయంగా కనీసం పట్టు లేని జయచంద్రారెడ్డికి ఏకంగా ఎమ్మెల్యే టికెట్ ఎందుకిచ్చారో... సురేంద్రనాయుడు కింగ్ మేకర్‌గా చక్రంతిప్పడం వెనుక ఉన్నది కల్తీ మద్యం డీల్ అని మాకు ఇప్పుడు తెలుస్తోంది'' అని పేర్కొంటున్నారు.


ప్రభుత్వ మద్యం దుకాణాలను ఎత్తేసి... టీడీపీ సిండికేట్‌కు మొత్తం కట్టబెట్టిన కూటమి

2024లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక సాగిన టీడీపీ సిండికేట్ ద్వారా సాగిస్తున్న మద్యం దోపిడీ బహిరంగ రహస్యమే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణాల విధానాన్ని తొలగించి మొత్తం 3,396 ప్రైవేటు మద్యం దుకాణాలను టీడీపీ సిండికేట్‌కు కట్టబెట్టింది. పర్మిట్ రూమ్‌లకు అనుమతులిచ్చింది. 75 వేల బెల్ట్ దుకాణాలు ఏర్పాటు చేసినా ఉదాసీనంగా ఉంటోంది. 540 బార్లను (త్వరలో మరో 300 బార్లు కూడా) టీడీపీ సిండికేట్‌కు కట్టబెట్టింది. ఇలా రాష్ట్రంలో మద్యం నెట్‌వర్క్‌ను టీడీపీ సిండికేట్ గుప్పిటపట్టింది. అనంతరం జయచంద్రారెడ్డి, సురేంద్రనాయుడు, జనార్దన్‌రావు ఆధ్వర్యంలో ఆఫ్రికా మోడల్ నకిలీ మద్యం యూనిట్లను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసింది. టీడీపీ సీనియర్ నేతలకు ప్రాంతాలవారీగా పంపిణీ బాధ్యతలు అప్పగించింది. నకిలీ మద్యాన్ని ప్రభుత్వ లైసెన్స్ పొందిన ప్రైవేటు మద్యం దుకాణాలు, పర్మిట్ రూమ్‌లు, బార్లు, బెల్ట్ షాపుల్లో దర్జాగా విక్రయిస్తూ భారీ దోపిడీకి తెగబడుతోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తొలి ఏడాదిలోనే రూ.5,280 కోట్లు కొల్లగొట్టిన ఈ మద్యం మాఫియా వచ్చే నాలుగేళ్లలో మరో రూ.40 వేల కోట్లు కొల్లగొట్టేందుకు సిద్ధపడింది. అందులో 30 శాతం వాటా కరకట్ట బంగ్లాకే ముడుపులుగా చెల్లించాలన్నది డీల్. అంటే నకిలీ మద్యం మాఫియా ద్వారా సూత్రధారిగా ఉన్న ముఖ్య నేత కరకట్ట బంగ్లాకు దక్కేదే దాదాపు రూ.13,500 కోట్లు... ఇక ప్రాంతాలవారీగా పంపిణీ బాధ్యతలు చూస్తున్న టీడీపీ సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు, మద్యం సిండికేట్‌కు 50 శాతం, నకిలీ మద్యం రాకెట్ పాత్రధారులుగా జయచంద్రారెడ్డి, సురేంద్రనాయుడు, జనార్దన్‌రావులకు 20 శాతం పంచుకోవాలన్నది డీల్. అందుకే ముఖ్య నేత అండతో రాష్ట్రంలో నకిలీ మద్యం మాఫియా బరితెగించి దోపిడీకి పాల్పడుతోందన్నది స్పష్టమవుతోంది.


2014 : ముఖ్య నేత.. సురేంద్రనాయుడు.. ఇది 'క్షమాభిక్ష' బంధం

కట్టా సురేంద్రనాయుడు... ముఖ్య నేతతో లోతైన బంధం ఉన్న టీడీపీ కీలక నాయకుడు. 2002 నాటి దారుణ జంట హత్యల కేసులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న ఈయనకు 2014లో టీడీపీ ప్రభుత్వం వచ్చాక క్షమాభిక్ష దక్కింది. జంట హత్యల కేసులో సురేంద్రనాయుడుకు జిల్లా న్యాయస్థానం 2006లో యావజ్జీవం విధించింది. ఈ తీర్పును సురేంద్ర హైకోర్టులో సవాల్ చేసినా, జిల్లా కోర్టు తీర్పునే సమర్థించింది. అయితే, ముఖ్య నేతకు అత్యంత సన్నిహితుడు కావడంతో టీడీపీ సర్కారు క్షమాభిక్ష ప్రసాదించింది.

సురేంద్రనాయుడు క్రైమ్ హిస్టరీ


KATTA SURENDERA VS. STATE OF A P

నకిలీ మద్యం కేసు నిందితుడు కట్టా సురేంద్రనాయుడు నేర చరిత్రకు సంబంధించిన పత్రాలు


AFFIDAVIT TO BE FILED BY THE CANDIDATE ALONGWITH NOMINATION PAPER BEFORE THE RETURNING OFFICER FOR ELECTION TO ASSEMBLY (NAME OF THE HOUSE)FROM NO.162, THAMBALLAPALLE ASSEMBLY CONSTITUENCY (NAME OF THE CONSTITUENCY)

ఆఫ్రికాలో మద్యం వ్యాపారంలో పెట్టుబడులు ఉన్నాయని టీడీపీ తంబళ్లపల్లె అభ్యర్థి జయచంద్రారెడ్డి 2024 ఎన్నికల అఫిడవిట్‌లో స్వయంగా పేర్కొన్న భాగం(ఫైల్)

మా అమ్మాయి వివాహానికి రండి..


ఏపీ మాజీ సీఎం జగన్‌కు ఆహ్వానం



జగిత్యాల: ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్, మాధవి దంపతులు తమ కుమార్తె వివాహానికి ఆహ్వానించారు. ఈనెల 29న తమ కుమార్తె హరిణి పెళ్లి జరగనుందని, వివాహానికి రావాలని ఆహ్వాన పత్రిక అందించారు. హరిణి రిటైర్డ్ జస్టిస్ ఈశ్వరయ్య మనవరాలు. తన ఆహ్వానం మేరకు జగన్ మోహన్ రెడ్డి వివాహానికి హాజరవుతారని చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు.

నెలాఖరు కల్లా బీఏఎస్ బకాయిలు చెల్లిస్తాం

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల (బీఏఎస్)కు సంబంధించిన బకాయిలను నెలాఖరు కల్లా విడుదల చేస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. శనివారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఏఎస్ బకాయిలకు సంబంధించిన అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని, ఈ అంశంపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, బీఆర్ఎస్ నేతలు చిల్లర రాజకీయాలను మానుకోవాలని హితవు పలికారు. సమీకృత గురుకులాలకు పూర్తిస్థాయి వసతులు కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. . రెండ్రోజుల కిందట గురుకులాలకు ప్రత్యేక నిధి కింద రూ.60 కోట్లు విడుదల చేసినట్లు అడ్లూరి వెల్లడించారు.

భట్టితో టీఎస్ఈఏఈఏ ప్రతినిధుల భేటీ

సాక్షి, హైదరాబాద్: ట్రాన్స్‌కోలో ఏఈల నుంచి ఏడీలుగా పదోన్నతులు ప్రకటించడంపై తెలంగాణ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు శనివారం సాయంత్రం ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జెన్ కో, డిస్కమ్‌లలో అర్హత కలిగిన ఇంజనీర్లకు కూడా పదోన్నతి ఇవ్వాలని అభ్యర్థించారు.

గ్లోబల్ మొబిలిటీ హబ్‌గా హైదరాబాద్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కోయంబత్తూరులో యువ ఇంజనీర్లను ఉద్దేశించి ప్రసంగం
- 'నేషనల్ స్టూడెంట్ మోటార్ స్పోర్ట్స్ –2025'ప్రారంభం


సదస్సులో మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరం త్వర లో దేశ మొబి లిటీ హబ్‌గా అవతరిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఫార్ములా ఈ'రేస్ రూ.700 కోట్ల ఆర్థిక కా ర్యకలాపాలను సృష్టించడం ద్వారా అంతర్జాతీ య దృష్టిని ఆకర్షించిందన్నారు. 'ఫార్ములా ఈ' కేవలం ఒక క్రీడా కార్యక్రమం కాదని, ఆవిష్కర ణలు, క్లీన్ మొబిలిటీ, అత్యాధునిక సాంకేతికత కు తెలంగాణ కేంద్రంగా ప్రపంచ వేదికపై అడుగుపెట్టేందుకు ఒక ప్రతీకగా నిలిచిందని అన్నారు. తమిళనాడులోని కోయంబత్తూరులో శనివారం జరిగిన 10వ 'ఎఫ్ఎంఏఈ నేషనల్ స్టూడెంట్ మోటార్‌స్పోర్ట్స్ పోటీలు – 2025'కు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన దేశంలోని యువ ఇంజనీర్లు, ఆవిష్కర్తలను ఉద్దేశించి ప్రసంగించారు.

యువత రేసు కారులా దూసుకెళ్లాలి..

'మోటార్‌స్పోర్ట్స్ అంటే కేవలం వేగం కాదు, అది తమ సామర్థ్యాలను పరీక్షించుకోవడం, హద్దులను ఛేదించడం, ఎంత దూరం వెళ్లగలమో తెలుసుకోవడం. జీవితంలో యువత కూడా రేసు కారు మాదిరి దూసుకుపోవాలి. అవకాశాల కోసం ఎదురు చూడకుండా వాటిని మీరే సృష్టించుకోవాలి. పెద్ద కలలు కనడం ప్రారంభించిన తర్వాత మీ సొంత సామర్థ్యాన్ని చూసి మీరే ఆశ్చర్యపోతారు'అని కేటీఆర్ ఉద్బోధించారు. రాష్ట్ర ఏర్పాటు సాధ్యం కాదనే సందేహాలను పటాపంచలు చేస్తూ తెలంగాణ సాకారమై, 11 ఏళ్లలో దేశానికి ఆదర్శంగా నిలిచింది'అని కేటీఆర్ పేర్కొన్నారు.

'సాక్షి'పై మరో రెండు అక్రమ కేసులు

- నెల్లూరు రూరల్, కలిగిరి పీఎస్‌లలో ఎక్సైజ్ అధికారుల ఫిర్యాదు
- ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, రిపోర్టర్లపై అక్రమ కేసులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాష్ట్రంలో ప్రభుత్వ పెద్దల అకృత్యాలను వెలుగులోకి తెస్తున్న 'సాక్షి' పత్రికపై కూటమి సర్కారు కక్ష సాధింపు చర్యలు కొనసాగిస్తూనే ఉంది. అధికారులను అడ్డం పెట్టుకుని 'సాక్షి' గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోంది. ఇప్పటికే 'సాక్షి' యాజమాన్యంతోపాటు ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, రిపోర్టర్లపై అనేక అక్రమ కేసులు పెట్టించింది. విచారణ పేరుతో పోలీస్ స్టేషన్లకు పిలిచి వేధిస్తోంది. తాజాగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోనూ ఎక్సైజ్ అధికారుల ఫిర్యాదుల మేరకు 'సాక్షి' యాజమాన్యంతోపాటు ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, రిపోర్టర్లపై నెల్లూరు రూరల్, కలిగిరి పోలీసుస్టేషన్లలో రెండు అక్రమ కేసులు నమోదయ్యాయి. నకిలీ మద్యం తాగి నరసరావుపేటలో ఒకరు, శ్రీ సత్యసాయి జిల్లాలో మరొకరు, శ్రీపొట్టి శ్రీరాములు జిల్లాలోని కలిగిరి, నెల్లూరు రూరల్ మండలంలో ఇద్దరు మృతిచెందారని ఈ నెల 8వ తేదీన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఇది తమ శాఖ పరువుకు భంగం కలిగించేలా ఉందంటూ కలిగిరి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ షేక్ అబ్దుల్ జలీల్, నెల్లూరు–1 ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.రమేష్‌బాబు శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదులు చేశారు. వెంటనే పోలీసు అధికారులు 'సాక్షి' పత్రిక యాజమాన్యంతో పాటు ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, జిల్లా బ్యూరో ఇన్‌చార్జి, రిపోర్టర్లపై 353(2), 356(3) ఆర్/డబ్ల్యూ 3(5)బీఎన్ఎస్ కింద కేసులు నమోదు చేశారు.

రిపోర్టర్ ఇంట్లో 'ఎక్సైజ్' సోదాలు

అంతేకాకుండా కలిగిరి సాక్షి రిపోర్టర్ ఆర్.రాజగోపాల్‌రెడ్డి ఇంటిపై దాడి చేశారు. శనివారం ఉదయం సుమారు 10.30 గంటలకు ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి విలేకరి ఇంటికి వెళ్లారు. 'రాజా అంటే నువ్వేనా? అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నారని నీపై ఫిర్యాదులు అందాయి. మీ ఇంట్లో తనిఖీలు చేయాలి' అని చెప్పారు. ఇంట్లోకి ప్రవేశించి ఇల్లంతా సోదాలు చేశారు. ఎక్కడా మద్యం దొరక్కపోవడంతో వెనుదిరిగారు. ఎక్సైజ్ సిబ్బంది ఓవర్ యాక్షన్‌తో రాజగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. కలిగిరి ఎక్సైజ్ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా.. 'సాక్షి' పత్రికపై పెట్టిన కేసులకు సంబంధించి విచారణకు హాజ రు కావాలని శనివారం నెల్లూరు 'సాక్షి' బ్యూరో ఇన్‌చార్జి చిలకా మస్తాన్‌రెడ్డికి నెల్లూరు రూరల్ పోలీసులు బీఎన్ఎస్ఎస్ 179(1) నోటీసు అందజేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు విచారణకు హాజ రు కావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. ఇదే కేసులో 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డికి కూడా నోటీసులు అందజేసేందుకు హైదరాబాద్‌కు వెళ్తున్నట్టు సమాచారం.

రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ల క్రమబద్ధీకరణ

- జేఏసీ వినతిపై స్పందించిన సీసీఎల్ఏ
- సర్వీసు క్రమబద్ధీకరణపై కలెక్టర్లకు మార్గదర్శకాలు

సాక్షి, హైదరాబాద్: గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ)గా పనిచేస్తూ రెవెన్యూ శాఖలో విలీనమై జూనియర్ అసిస్టెంట్ హోదాలో పనిచేస్తున్న వారి ప్రొబేషన్ పీరియడ్‌పై.. భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయం స్పష్టతనిచ్చింది. వీఆర్వో, వీఆర్ఏల వ్యవస్థ రద్దు ప్రక్రియలో భాగంగా దాదాపు 2,500 మంది వీఆర్ఏలు రెవెన్యూ శాఖలోనే జూనియర్ అసిస్టెంట్లుగా నియమితుల య్యారు. 2023, ఆగస్టు 9న వీరిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, వీరి ప్రొబేషన్ పీరియడ్‌పై అప్పట్లో స్పష్టత ఇవ్వలేదు. రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని తెలంగాణ తహసీల్దార్ల సంఘం (టీజీటీఏ), తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) ప్రతినిధులు పలుమార్లు ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి నేతృత్వంలో ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ శాఖలోని జూనియర్ అసిస్టెంట్ల ప్రొబేషన్ పీరియడ్‌పై సీసీఎల్ఏ కార్యదర్శి మంద మకరంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం తెలంగాణ రాష్ట్ర సబార్డినేట్ సర్వీస్ రూల్స్, 1996 రూల్ 16 (సీ)(2) ప్రకారం.. వరుసగా రెండేళ్ల పనిచేసిన కాలంలో ఏడాది కాలాన్ని ప్రొబేషన్ కాలంగా గుర్తిస్తారని వెల్లడించింది. దీంతో ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న 2,500 మంది సర్వీసు క్రమబద్ధీకరణకు మార్గం సుగమమైంది. కాగా, ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, రెవెన్యూ సంఘాల నేతలు కె.రామకృష్ణ, ఎస్. రాములు, రమేశ్‌పాక, బాణాల రాంరెడ్డి, వి.భిక్షంలు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.


ముజ్జుగూడెంలో రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

అభివృద్ధి, సంక్షేమంపై వెనక్కు తగ్గేదే లేదు

రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి

నేలకొండపల్లి/తిరుమలాయపాలెం: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు విషయంలో వెనక్కు తగ్గేదే లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం ఆయన ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడే నాటికి ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని, బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు తీరుస్తూనే పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని వివరించారు. 11 లక్షల నూతన రేషన్ కార్డులు జారీ చేశామని, పాత కార్డుల్లో కొత్తగా 17 లక్షల పేర్లు నమోదు చేశామని చెప్పారు. రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ యాకోబు, ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు ఏఐసీసీ పరిశీలకులు

సాక్షి, హైదరాబాద్: జిల్లా పార్టీ (డీసీసీ) అధ్యక్షుల నియామకం కోసం ఏఐసీసీ నియమించిన వివిధ రాష్ట్రాలకు చెందిన పరిశీలకులు తెలంగాణకు వచ్చారు. వీరంతా వారం రోజులపాటు ఇక్కడే ఉంటారు. ఏఐసీసీ సూచనల మేరకు టీపీసీసీ సమన్వయంతో ఈ వారం రోజులు వారికి కేటాయించిన జిల్లాల్లో పర్యటించనున్న ఏఐసీసీ పరిశీలకులు.. బ్లాక్‌ల వారీగా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. తొలిరోజు శనివారం రాష్ట్రంలోని ఒకట్రెండు జిల్లా లు మినహా అన్ని చోట్లా ఈ బ్లాక్ స్థాయి సమావేశాలు ప్రారంభమయ్యాయి. డీసీసీ అధ్యక్ష నియామకం కోసం మొత్తం 22 మందిని పరిశీలకులుగా ఏఐసీసీ నియమించింది. వీరికి జిల్లాల వారీ బాధ్యతలు అప్పగించింది. మొత్తం 35 జిల్లాలు, 4 కార్పొరేషన్ల పరిధిలోని జిల్లా అధ్యక్షుల కోసం వీరు పేర్లు సిఫారసు చేయనున్నారు. ప్రతి జిల్లా నుంచి మూ డు పేర్లు ఇవ్వాలని ఏఐసీసీ సూచించగా, అనివార్యమైన చోట్ల 3–6 పేర్ల వరకు సిఫారసు చేయొచ్చని వెల్లడించింది. ఈ నేపథ్యంలో వారం రోజుల్లోగా క్షేత్రస్థాయి నాయకుల అభిప్రాయాలను సేకరించి డీసీసీ అధ్యక్షులుగా అర్హులైన వారి పేర్లను టీపీసీసీకి ఏఐసీసీ పరిశీలకులు సమర్పించనున్నారు.

'ఇందిరమ్మ'కు ఏఐ అండ

- ఇళ్ల నిధులు దారి మళ్లకుండా గృహ నిర్మాణ శాఖ జాగ్రత్తలు
- సాంకేతిక లోపాలను గుర్తించేలా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్



సాక్షి, హైదరాబాద్: ఒకరి ఖాతాల్లోకి చేరాల్సిన ఇందిరమ్మ ఆర్థిక సాయం, మరొకరి ఖాతాల్లోకి చేరుతుండటాన్ని గృహ నిర్మాణ శాఖ తీవ్రంగా పరిగణించింది. ఈ పరిస్థితిని నివారించేందుకు ఏఐ ఆధారిత పరిజ్ఞానాన్ని వినియోగించాలని నిర్ణయించింది. బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానించే సమయంలో బ్యాంకర్లు చేసిన తప్పిదాల వల్ల ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల ఆర్థిక సాయం పంపిణీలో తీవ్ర గందరగోళం నెలకొన్న విషయం తెలిసిందే. ఇదే విషయాన్ని వివరిస్తూ శనివారం సాక్షి పత్రికలో ''ఆధార్ ఒకరిది... ఖాతా మరొకరిది''అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఇందిరమ్మ లబ్ధిదారుల ఆధార్ నంబర్ ఇతరుల బ్యాంకు ఖాతాలతో అనుసంధానం కావటంతో, ఇందిరమ్మ లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ కావాల్సిన మొత్తం ఇతరుల ఖాతాల్లోకి జమ అవుతున్న తీరును సాక్షి సోదాహరణంగా వెలుగులోకి తెచ్చింది. లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు అందటంతో గృహనిర్మాణ శాఖ దీనిపై దృష్టి సారించింది.

చెల్లింపు విధానం మార్పు

ప్రస్తుతం ఇందిరమ్మ లబ్ధిదారులకు ఆర్థిక సాయాన్ని వారి ఆధార్ నంబర్ ఆధారంగా చెల్లిస్తున్నారు. ఆ ఆధార్ నంబర్ ఏ బ్యాంకు ఖాతాతో అనుసంధానమై ఉందో ఆ బ్యాంకు ఖాతాలోకి ఆటోమేటిక్‌గా నిధులు జమ అవుతాయి. అలా జరిగేలా ప్రత్యేక సాంకేతిక వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ బ్యాంకు ఖాతాలతో ఆధార్ నంబర్‌ను అనుసంధానించే సమయంలో చాలా బ్యాంకుల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఒకరి ఖాతాకు మరొకరి ఆధార్ నంబర్‌ను అనుసంధానించారు. దీంతో లబ్ధిదారులకు బదులు ఇతరుల ఖాతాల్లో సొమ్ము జమ అవుతోంది. ఇది బహిర్గతం కావడంతో చెల్లింపు విధానంలో మార్పులు తీసుకువస్తున్నారు.

సాంకేతిక వ్యవస్థలో మార్పులు

ఆధార్ నంబర్ ఆధారంగా చెల్లింపు జరిగే సమయంలో లబ్ధిదారు పేరును పరిశీలించేలా ఏఐ టెక్నాలజీతో అప్‌డేట్ చేస్తున్నారు. లబ్ధిదారు జాబితాలో ఉన్న పేరుతో అక్షరం అక్షరం సరిపోలేలా సాఫ్ట్‌వేర్‌ను ఫీడ్ చేస్తున్నారు. పేరులో ఏమాత్రం తేడా ఉన్నా ఆర్థిక సాయం బ్యాంకు ఖాతాలో జమ కాకుండా నిలిచిపోతుంది. లబ్ధిదారు పేరు, ఆధార్ నంబర్ జత అయిన మరో వ్యక్తి పేరు ఒకటే అయినప్పుడు.. ఇంటి పేరుతో సరిపోల్చి చూడనున్నారు. ఇంటి పేరు ఒకటే అయినప్పుడు ఇంటి నంబరుతో సరిపోల్చి చూసేలా కొత్తగా అప్‌డేట్ చేస్తున్నారు. దీంతో ఆర్థిక సాయం మొత్తం తప్పుడు ఖాతాలో జమ కాకుండా ఉండటమే కాకుండా, అధికారులకు కూడా ఆ విషయాన్ని తెలిపేలా సాంకేతిక వ్యవస్థలో మార్పులు చేస్తున్నారు.

'మైండ్ గేమ్స్ మంచివే' అంటున్నాయి పరిశోధనలు. 'మైండ్ గేమ్స్ అనేవి కేవలం టైమ్ పాస్, వినోదం కోసం ఆడే ఆటలు కావు. అంతకంటే ఎక్కువ. 'పజిల్స్, స్పెలింగ్ టెస్ట్‌లు, వర్చువల్ రియాలిటీ గేమ్స్... మొదలైనవి బ్రెయిన్ హెల్త్, జ్ఞాపకశక్తికి ఉపకరిస్తాయి' అంటున్నారు 'మైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్' ప్రెసిడెంట్ నందన్ ఝా.





శాంతి సమరం ఇంటి పాఠమే!

'ఇంటి నుంచే మొదలు కావాలి' అని నైతిక విలువలకు సంబంధించి చెప్పే మాట. నైతిక విలువల నుంచి సామాజిక నిబద్ధత, సాహస ప్రవృత్తి వరకు ఇంట్లో నుంచే నేర్చుకుంది నోబెల్ శాంతి పురస్కార గ్రహీత మరియా కొరినా. కుటుంబ వారసత్వం, కుటుంబ బంధాలు, ఉద్యమ బంధాల గురించి ఐరన్ లేడి మరియా మాటల్లోనే..

అమ్మ మాట

'నాకు దేవుడు ఎన్నో అద్భుత అవకాశాలు ఇచ్చాడు. నాకు ఎలాంటి లోటూ లేదు. నాకు ఎంతో మంది మద్దతు ఉంది... అనుకునే వాళ్లు తమ వంతుగా ఈ సమాజానికి తిరిగి ఇవ్వాలి' అని చిన్నప్పుడు అమ్మ చెబుతుండేది. అమ్మానాన్నల మాటల సారాంశం ఒక్కటే... మనం వ్యక్తిగతంగా ఏ స్థాయిలో ఉన్నా సమాజ హితాన్ని మరవకూడదు.

నాన్న అడుగు జాడల్లో నడవాలనుకున్నాను కానీ...

రాజకీయాల్లోకి రావాలని ఎప్పుడూ అనుకోలేదు. నాన్న గొప్ప ఇంజినీర్, వ్యాపారవేత్త, దార్శనికుడు. ఎన్నో కంపెనీలు ప్రారంభించాడు. ఎంతోమందికి ఉపాధి కల్పించాడు.

నాన్న ఎప్పుడూ ఒక మాట చెబుతుండేవారు...

'దేశభవిష్యత్, దాని శ్రేయస్సు ఒక సంస్థ అభివృద్ధి, లాభాల కంటే ఎక్కువ. కంపెనీని ఎవరైనా స్థాపించవచ్చు. డబ్బులు సంపాదించడం కూడా సులభం. అయితే నైతిక ప్రమాణాలు ముఖ్యం'

కుటుంబ వారసత్వం అనేది నా బలం. నా పూర్వీకులు, అనేక తరాల వాళ్లు తమ మాతృదేశం కోసం ప్రతీది చేశారు. జైలు జీవితం అనుభవించారు. తరతరాల సందేశం ఒక్కటే... దేశాన్ని ప్రేమించు, బాధ్యతతో ప్రవర్తించు.

దేశ చరిత్రను మా ఇల్లు చెప్పేది!

నా చిన్నప్పుడు మా ఇల్లు వెనెజువెలా చరిత్రను చెప్పే ఉపాధ్యాయురాలిగా అనిపించేది. ఆ ఇల్లు దేశచరిత్రలో ఎన్నో కీలక ఘట్టాలకు సాక్షిగా నిలిచింది. ఒక విధంగా చెప్పాలంటే వెనెజువెలా చరిత్రతో కలిసి పెరిగాను! మా అమ్మమ్మ ప్రఖ్యాత పుస్తకం 'వెనెజువెలా హీరోయిక్' రచయిత ఎడ్వర్డో బ్లాంకో మనవరాలు, వెనెజువెలా మొదటి అధ్యక్షుడు జోస్ ఆంటోనియో పేజ్ సహాయకురాలు.

చిన్నప్పుడు నేను విద్యార్థి నాయకుడు అరామండో జులోగా బ్లాంకో వీరాభిమానిని. విసెంటీ గోమేజ్ నియంతృత్వంలో 24 సంవత్సరాల వయసులో బ్లాంకో హత్యకు గురయ్యాడు.

భయం చుట్టుముట్టిన సమయం

ఒక సభలో ప్రభుత్వ అవినీతి గురించి మాట్లాడుతున్నాను. హఠాత్తుగా నా కుమార్తె గుర్తుకు వచ్చింది. మాటలు ఆగిపోయాయి. కొన్ని నిమిషాలు మౌనం దాల్చాను. నా కుమార్తె ఎక్కడ ఉంది? క్షేమంగా ఉందా? నేను సభల్లో ప్రభుత్వ అవినీతిపై గొంతెత్తడం వల్ల నా బిడ్డకు హాని జరుగుతుందా?... ఇలా ఎన్నో ఆలోచనలు నన్ను చుట్టుముట్టాయి. ఇంటికి వెళ్లి నా కుమార్తెను చూసుకునే వరకు నా మనసు మనసులో లేదు. 'కుటుంబ బాధ్యతలు, ఉద్యమం అనే రెండు పడవలపై ప్రయాణం చేస్తున్నాను. ఇలా చేస్తే రెండిటికీ న్యాయం చేయలేను' అనిపించింది.

నన్ను టెర్రరిస్ట్ అన్నారు!

నేను గెలుస్తానని మొదట్లో చాలామంది నమ్మలేదు. 'మీరు మహిళ కదా!' 'మీరు ఇంజినీర్ కదా!' 'మీది బాగా డబ్బున్న కుటుంబం కదా!'....ఇలాంటి మాటలే వినిపించేవి. లాటిన్ అమెరికాలోని పితృస్వామ్య భావజాల ప్రభావం వారి మాటల్లో కనిపించేది.

ఒకానొక సమయంలో నన్ను టెర్రరిస్ట్‌గా ముద్ర వేస్తూ బెదిరింపు మెసేజ్‌లు అదేపనిగా రావడం మొదలయింది. నన్ను నేను రక్షించుకోవడానికి జాగ్రత్త పడడం తప్పనిసరి అనిపించింది.

ఏ వ్యక్తీ అజ్ఞాతవాసంలో ఉండాలని నేను కోరుకోను. అయితే మరో కోణంలో చూస్తే మనల్ని మనం మరింతగా తెలుసుకోవడానికి, సవాళ్లను అధిగమించే శక్తిని సమకూర్చుకోవడానికి అజ్ఞాతవాసం అనేది ఒక అవకాశం.

మాటలు మాత్రమే చాలవు

రాజకీయాలు, రాజకీయ నాయకులను అదేపనిగా విమర్శించడం ఒక్కటే సరిపోదు. మనవంతు కార్యాచరణ తప్పనిసరిగా ఉండాలి. ప్రజాస్వామ్యం, న్యాయం, స్వాతంత్ర్యం కోసం పోరాడే సాహసికులు ఒక ప్రాంతం, దేశం అని కాదు ప్రపంచం నలుమూలలా ఉన్న ప్రజలకు తరగని స్ఫూర్తిని ఇస్తారు.

పిల్లలే ఆమె బలం!

వెనెజువెలా వ్యాపారవేత్త రికార్డో సోసా బ్రాంజర్‌ను వివాహం చేసుకున్నారు మరియా. బ్రాంజర్ రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ పిల్లల చదువు, సామాజిక కార్యక్రమాలలో మరియాకు అండగా ఉండేవారు. ఈ దంపతులకు ముగ్గురు పిల్లలు. మరియా–బ్రాంజర్‌లు విడాకులు తీసుకున్నారు. ఎలాంటి వివాదాలు లేకుండానే నిశ్శబ్దంగా విడిపోయారు.

తమ పిల్లలు అన్నా కొరినా, రికార్డో,



హెన్రిక్‌ల గురించి మరియా బహిరంగంగా మాట్లాడడం చాలా అరుదు.

స్వేచ్ఛాయుత వెనెజువెలా గురించి పోరాటానికి తన పిల్లలే ప్రేరణ, శక్తి అని ఆమె చెప్పేవారు.

'నా పిల్లలు ఈ దేశంలో భయం లేకుండా జీవించడానికి ప్రతిరోజూ పోరాడుతాను' అని కూడా ఆమె అనేవారు.

ఇన్ బ్రెయిన్

మెదడు పనితీరుపై విశ్లేషణ, కార్యాచరణ సమాచారాన్ని అందించే సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసి, మానసిక వైద్యులకు ఆధునాతన బ్రెయిన్ ఇమేజింగ్–బేస్డ్ ఇన్‌సైట్స్‌ను అందించే న్యూరో–ఇన్‌ఫార్మటిక్స్ ప్లాట్‌ఫామ్ 'బ్రెయిన్ సైట్ ఏఐ' నిర్మించారు రింఝిమ్ అగర్వాల్, ఇమ్మాన్యుయేల్...

గత సంవత్సరం ఇండియా సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీవో) నుంచి 'సాఫ్ట్‌వేర్–యాజ్–ఎ మెడికల్ డివైజ్' సర్టిఫికెట్ పొందడం ద్వారా 'బ్రెయిన్‌సైట్ ఏఐ' వాణిజ్యపరంగా కీలకమైన మైలురాయిని చేరింది. ఈ సంస్థకు ఇమ్మాన్యుయేల్ సీఈవో, రింఝిమ్ అగర్వాల్ సీటీవో.

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్ నుంచి రింజిమ్ అగర్వాల్ పీహెచ్‌డీ చేసింది. ఇమ్మాన్యుయల్ ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నుంచి ఎంబీఏ చేసింది. హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్, టెక్నాలజీ అండ్ పాలసీలలో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 15 సంవత్సరాల అనుభవాన్ని సంపాదించింది. ఆపరేటింగ్ సిస్టమ్ డిజైన్, పబ్లిక్ హెల్త్ అండ్ హెల్త్ కేర్ బిజినెస్‌లో ఆమెకు అపార అనుభవం ఉంది.

'సీడీఎస్‌సీవో లైసెన్స్ మాకు వాణిజ్యపరంగా ఉపయోగపడుతుంది. ఈ సంవత్సరం మా ఆదాయాన్ని పెంచుకోవడంపై దృష్టి పెట్టాం. మా ప్రాడక్ట్స్ వంద ఆస్పత్రులకు చేరువ కావాలనేది మా లక్ష్యం' అంటుంది ఇమ్మాన్యుయేల్.

'ఆసుపత్రులలో అత్యంత సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వైద్యులలో న్యూరోసర్జన్లు ఒకరు. మా సాంకేతికత మెదడుకు సంబంధించిన నిర్మాణాత్మక అంశాలకు మాత్రమే కాకుండా లాంగ్వేజ్, కాగ్నిషన్‌లాంటి వివిధ విధులపై కూడా ఇన్‌సైట్స్‌ను అందించగలదు. మా బ్రెయిన్‌సైట్ ఏఐ సామర్థ్యం సర్జన్‌లలో ఆసక్తి రేకెత్తించింది' అంటుంది అగర్వాల్

'బ్రెయిన్‌సైట్ ఏఐ' అందించే సమాచారం సర్జరీల సమయంలో వైద్యులకు ఉపయోగపడుతుంది. ఉదాహరణకు ఒక కణితి... దేహంలో ఏదైనా కీలక విధులు నిర్వహించే ప్రాంతానికి చాలా దగ్గరగా ఉంటే, వైద్యులు దానిని చేరుకోవడానికి వేరే ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లడానికి వీలవుతుంది.

బ్రెయిన్ ఏఐ ప్రాడక్ట్ 'వోక్సెల్‌బాక్స్' వేగంగా అభివృద్ధి చెందనుంది. మెదడుకు సంబంధించిన నాడీ కణాల కనెక్షన్‌లను మ్యాప్ చేయడానికి 'ఫంక్షనల్ మాగ్నెటిక్ రెసోనెన్స్ ఇమేజింగ్' (ఎఫ్ఎంఆర్ఐ) ఉపయోగపడుతుంది. ఆ డేటాను ప్రాసెస్ చేసేందుకు ఉపయోగపడేదే ఏఐ–పవర్డ్ ప్రాడక్ట్ వోక్సెల్



● టెక్నో ఉమెన్

రింఝిమ్ అగర్వాల్, ఇమ్మాన్యుయేల్

బాక్స్. రోగ నిర్ధారణ, శస్త్ర చికిత్సలను ప్లాన్ చేయడంలోనూ, చికిత్సను పర్యవేక్షించడంలో సహాయపడేందుకు వీలైన బ్రెయిన్ మ్యాప్స్‌ను తయారు చేయడంలో 'వోక్సెల్ బాక్స్' ఉపయోగపడుతుంది.

హెల్త్–టెక్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయం సాధించిన రింఝిమ్ అగర్వాల్, ఇమ్మాన్యుయేల్ 'స్నోడ్రాప్' అనే పేషెంట్ కేర్ యాప్‌ను కూడా అభివృద్ధి చేశారు. పేషెంట్ల ప్రొఫైల్స్ రూపొందించడంలో, వైద్యప్రకియను మెరుగుపరచడంలో ఇది ఉపయోగపడుతుంది.

హెల్త్

నోరు బాగుంటే ఊరు బాగుంటుందని సామెత. ఊరూ... ఊరి వ్యక్తులతో సంబంధాలే కాదు... నోటి పలువరస బాగుంటే, దంతాలకు సంబంధించిన వ్యాధులేమీ లేకపోతే వ్యక్తి చిరునవ్వు, ఇనుమడించిన ముఖపు అందం, మంచి పలువరస కారణంగా చక్కటి ఉచ్చారణ... ఇలా చాలా అంశాలు బాగుంటాయి. నోరూ లేదా దంతాలకు సంబంధించి ఏదైనా సమస్య వస్తే... అప్పటికప్పుడు ఆ సమస్యకు చికిత్స అందించడమన్నది కాకుండా... ఓ పూర్తి స్థాయి చికిత్సను 'సమగ్రం'గా అందించడం ద్వారా నోటి ఆరోగ్యాన్ని అన్ని విధాలా కాపాడే చికిత్స ప్రక్రియే 'ఫుల్ మౌత్ రీ–హ్యాబిలిటేషన్'. సంక్షిప్తంగా 'ఎఫ్ఎమ్ఆర్' అని పిలిచే ఈ చికిత్స ప్రక్రియ గురించి తెలిపేదే ఈ కథనం.

ఓపెన్ యువర్ మౌత్... హా.. హా.. హా!

● ఫుల్ మౌత్ రీహ్యాబిలిటేషన్



నోటిలోని పళ్లకూ, పలువరసకూ అనేక సమస్యలు వస్తూ ఉంటాయి. వయసు పెరుగుతున్నకొద్దీ పళ్లు అరిగిపోవడం, కొన్ని విరిగిపోవడం, కొన్ని చోట్ల సందులు రావడం వంటివి జరుగుతుండటం మామూలే. దీనికి తోడు కొందరిలో చిగుర్ల సమస్యలూ రావచ్చు. మరికొందరిలో ఒకటో రెండో పళ్లు ఊడిపోవచ్చు. అయితే ఇవన్నీ జరుగుతున్నప్పటికీ తమకు సంబంధించినంతవరకూ ఏ సమస్యా లేకపోతే కొందరు దంత వైద్యుడి వద్దకు వెళ్లరు. చికిత్స తీసుకోరు. కారణం... పని నడుస్తోంది కాబట్టి అలా రోజులు వెళ్లదీయడమే పనిగా పెట్టుకుంటారు.

కొన్ని సమస్యలు...

అలా నోటిలో పళ్లు అరగడం, విరగడం, దంతాలూ ఊడిపోవడం వల్ల సందులు రావడాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల మరికొన్ని సమస్యలు రావచ్చు. ఉదాహరణకు...

- పలువరసలోని కొన్ని పళ్లు ఊడటం వల్ల దంతాల మధ్య సందులు (గ్యాప్) వచ్చి అక్కడ ఆహారం చిక్కుకుపోయి, అది కుళ్లుతుండటం వల్ల దంతక్షయం మరింత వేగంగా జరగడం.
- అలా పళ్లు ఊడిన చోట ఆహారం చిక్కుకుపోయి కుళ్లుతుండటంతో నోటి దుర్వాసన వస్తుండటం.
- పళ్లు ఊడిన కారణంగా ముఖం ఆకృతి చెడిపోయి మునపటి కంటే అందవిహీనంగా కనిపించడం.
- పళ్లు ఊడటం లేదా పలువరసలో సందుల కారణంగా మాట్లాడుతున్నప్పుడు పళ్ల సందుల నుంచి గాలిపోతూ ఉచ్చారణ సరిగా లేకపోవడం, దాంతో సరైన కమ్యూనికేషన్ జరగక... ఎదుటివారికి మాట సరిగా అర్థం కాకపోవడం.
- ఊడినపళ్ల కారణంగా చిరునవ్వు నవ్వేందుకు ఇబ్బంది పడుతూ నలుగురిలో మనస్ఫూర్తిగా నవ్వలేకపోవడం.

ఆరోగ్యపరంగానూ మరికొన్ని నష్టాలు...

- ఊడిన పళ్ల కారణంగా ఆహారాన్ని సరిగా / పూర్తిగా నమలలేకపోవడం.
- పలువరసలో వచ్చిన గ్యాప్ కారణంగా పళ్లు ఉన్నచోటి నుంచి పక్కకు కదిలిపోతూ ఉండటం.
- ఊడిన పళ్ల వల్ల వచ్చిన సందుల కారణంగా పలువరస చెడిపోయి కొరికినప్పుడు పైవరస, కింది వరస పళ్లు సరిగా అమరకపోవడం (అలైన్‌మెంట్ సరిగా జరగకపోవడం). (రెండు దవడలూ కలిసినప్పుడు అవి సరిగా అమరకపోవడం).
- నములుతున్నప్పుడు కింది దవడ కదిలినప్పుడల్లా క్లిక్ క్లిక్ మంటూ శబ్దం (క్లికింగ్ సౌండ్) రావడం.

మానసిక సమస్యలకూ దారితీసే ప్రమాదం...

ఇలా పలువరసకు వచ్చే సమస్యలతో కేవలం భౌతికంగా కొన్ని ఆరోగ్యపరమైన సమస్యలు రావడం లుక్స్‌పరంగా ఇబ్బంది కలగడం మాత్రమే కారణంగా... ఆత్మవిశ్వాసం లోపించడం, చిరునవ్వు నవ్వలేకపోవడంతో కొన్ని సందర్భాల్లో కొందరిలో ఈ సమస్య మానసికమైన రుగ్మతలకూ కారణమయ్యేందుకూ అవకాశాలు లేకపోలేదు.

పై ప్రక్రియలన్నింటి సాయంతో కొన్ని కొన్ని సిట్టింగులలో నోటికి అవసరమైన పూర్తిస్థాయి సమగ్రమైన సంయుక్త చికిత్సను ఈ 'ఫుల్ మౌత్ రీ–హ్యాబిలిటేషన్'లో అందిస్తారు. దాంతో పేషెంట్లకు దంతపరంగా లేదా నోటి ఆరోగ్యపరంగా అవసరమైన అనేక అవసరాలు ఒకే సమగ్రచికిత్సలో తీరిపోవడం సాధ్యమవుతుంది.

అన్ని రకాల సమస్యలకూ కలిపి ఒక సమగ్ర చికిత్సే 'ఎఫ్ఎమ్ఆర్'...

దంతాల సమస్యలకు చికిత్సలు విడివిడిగా ఉంటాయి. ఉదాహరణకు పళ్లు అరిగినప్పుడు ఫిల్లింగ్ చేయడం లేదా క్యాప్ వేయడం, అలాగే చిగుర్లకు వచ్చే జింజివైటిస్, పెరియోడాంటైటిస్ వంటి సమస్యలకూ ఇవ్వాల్సిన చికిత్సలూ ఇలా రకరకాల సమస్యలకు నిర్దిష్టంగా చికిత్సలు ఇస్తుంటారు. అయితే అనేక రకాల సమస్యలు ఒకేసారి కనిపించినప్పుడు అనేక చికిత్సలను కలగలిపి ఒకే సమగ్ర చికిత్సగా ఇవ్వడమూ సాధ్యమవుతుంది. ఇందులో అరిగిన / విరిగిన పళ్లకు పైన దంతాన్ని పునర్నిర్మించడం (క్రౌన్స్), పన్నుకూ పన్నుకూ మధ్య మరో పన్ను పోయినప్పుడు బ్రిడ్జ్ చికిత్సలు, ఆర్థోడాంటిక్స్ (దవడ పళ్లు లేదా దవడల అమరిక సరిగా లేనప్పుడు ఇవ్వాల్సిన చికిత్సలూ), చిగుర్లకు చికిత్సలూ... వీటన్నింటినీ కలిపి సంయుక్తంగా చికిత్సలను అందించడాన్ని 'ఫుల్ మౌత్ రీ–హ్యాబిలిటేషన్' (ఎఫ్ఎమ్ఆర్)గా చెబుతారు.



డాక్టర్ సుధీర్ చౌదరి కరణం
ఆర్థోడాంటిస్ట్ & ఇంప్లాంట్ స్పెషలిస్ట్

ఎఫ్ఎమ్ఆర్‌లో ఏం జరుగుతుంది...

- ఈ సమగ్ర చికిత్స ప్రక్రియలో కంప్యూటర్ సహాయంతో నోటి తాలూకు పూర్తి చిత్రీకరణ... ఉదాహరణకు... కంప్యూటర్ ఎయిడెడ్ డిజైనింగ్ (క్యాడ్) అలాగే కంప్యూటర్ ఎయిడెడ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ (క్యామ్) లతో నోటి నిర్మాణాన్ని తొలుత రూపొందించుకుంటారు.
- అటు తర్వాత నోటిలో ఉన్న సమస్యలన్నింటినీ తెలుసుకుని, ఏయే రకాల సమస్యలకూ ఏయే చికిత్సలనే ఓ సమగ్ర ప్రణాళికను రచించుకుంటారు. అవసరాన్ని బట్టి ఎలాంటి కృత్రిమమైన ఇంప్లాంట్స్ అమర్చాలో నిర్ణయించుకుంటారు. ఇక అందానికీ, లుక్స్‌కు సంబంధించిన సమస్య అయితే దానికి తగ్గట్టుగా కాస్మటిక్ చికిత్స కోసం అవసరమైన వినీర్స్ (బాధితుల వ్యక్తిగత అవసరాల కోసం తగిన విధంగా రూపొందించిన పంటిపై అమర్చేందుకు ఆ పంటి రంగే కలిగిన పలుచటి పొరల్లాంటివి) సమకూర్చుకుంటారు. చిగుర్ల సమస్యలు ఉంటే దానికి ఇవ్వాల్సిన మందులను సూచిస్తారు.

నిర్వహణ: యాసీన్

● చిన్నారులకు ఆస్తమా

ఇన్‌హేలర్స్ నో... వర్రీస్



పిల్లల్లో ఆస్తమా వచ్చి వాళ్లు బాధపడుతుంటే చూసేవాళ్లకు ఆ దృశ్యం చాలా హృదయవిదారకంగా ఉంటుంది. అలా ఆయాసపడుతూ ఊపిరి అందని చిన్నారులను చూస్తే చాలా బాధగా ఉంటుంది. అయితే చిన్నవయసులో ఆస్తమా వచ్చిన చిన్నారుల విషయంలో అంతగా ఆందోళన పడాల్సిన అవసరం లేదంటూ డాక్టర్లు భరోసా ఇస్తున్నారు. నిజానికి పిల్లల్లో వచ్చే ఈ ఆరోగ్య సమస్యను 'రియాక్టివ్ ఎయిర్ వే డిసీజ్' అంటారు. కానీ సామాన్య జనవాడుకలో దీన్ని ఆస్తమాగా చెబుతుంటారు.

చిన్నారుల ఆస్తమా చికిత్సలో అవసరాన్ని బట్టి కొన్ని మందులు నెబ్యులైజేషన్ తర్వాత వారిలో ముమ్ముందు ఆస్తమా రాకుండా చూసేందుకు డాక్టర్లు రెండు రకాల ఇన్‌హేలర్స్ సూచిస్తుంటారు.

ఇందులో మొదటి రకం ఇన్‌హేలర్స్‌ను 'రిలీవర్స్' అంటారు. ఇవి తక్షణం ఊపిరి అందేందుకు మొట్టమొదటి చికిత్స (ఫస్ట్ లైన్ ట్రీటిమెంట్) కోసం వాడేవి. ఇవి అటాక్ నుంచి రిలీవ్ చేస్తాయి కాబట్టి వీటిని 'రిలీవర్స్' అంటారు. ఇవి ఊపిరితిత్తుల్లోకి వెళ్లే గాలిగొట్టాలను వెడల్పుగా విప్పారేలా చేసి పిల్లలు హాయిగా గాలితీసుకునేందుకు ఉపయోగపడతాయి.

ఇక ఆస్తమా అటాక్ వచ్చినప్పుడు ఊపిరితిత్తుల్లో కొన్ని ఇన్‌ఫ్లమేటరీ సెల్స్ పుడతాయి. వీటిని తొలగించడం రిలీవర్స్‌కు సాధ్యం కాదు. అలాంటి వాటిని తొలగిస్తూ ముమ్ముందుకు అటాక్ రాకుండా నివారించే ఇన్‌హేలర్స్‌ను 'ప్రివెంటర్స్' అంటారు. అవి నివారణకు ఉపయోగపడతాయి కాబట్టి వాటిని ప్రివెంటార్స్‌గా అభివర్ణిస్తారు.

ఇలా ఈ రెండు రకాల ఇన్‌హేలర్స్‌తో చిన్నారుల ఊపిరితిత్తుల కార్యకలాపాలు వీలైనంత నార్మల్‌గా పనిచేసేలా డాక్టర్లు చూస్తారు. ఇవి వాడుతూపోతుంటే క్రమంగా 'రిలీవర్స్' వాడాల్సిన అవసరం దాదాపుగా పూర్తిగా తగ్గిపోతుంది.

పిల్లల్లో వ్యాధి తీవ్రత ఎంతగా ఉందో, దాన్ని అదుపులో ఉంచేందుకు మందుల డోసేలు ఎంతెంత మార్చాలో తెలుసుకోవడం కోసం అవసరమైనప్పుడు డాక్టర్లు 'పల్మనరీ ఫంక్షన్ టెస్ట్ – పీఎఫ్‌టీ' అనే పరీక్ష చేస్తారు.

పిల్లలు పెరుగుతున్నకొద్దీ చాలామందిలో అటాక్స్ దాదాపు పూర్తిగా తగ్గిపోవడానికి అవకాశాలు చాలా ఎక్కువ. చాలామంది పిల్లల్లో ఆర్నెల్లలోనే ఆస్తమా పూర్తిగా అదుపులోకి వచ్చేసే అవకాశాలుంటాయి. ఒకసారి ఆస్తమా అదుపులోకి వచ్చాక ఇన్‌హేలర్స్ దాదాపు నిలిపివేయవచ్చు కూడా.

అయితే ఈ ఇన్‌హేలర్స్‌కు పిల్లలు అలవాటు పడిపోతారేమోనని కొంతమంది తల్లిదండ్రులు ఆందోళన పడుతుంటారు. ఇది కేవలం అపోహ మాత్రమే. పైగా ఇన్‌హేలర్స్ ఎంత సురక్షితమంటే నోటి నుంచి తీసుకునే మందులతో పోలిస్తే వాటిలోంచి దేహంలోకి వెళ్లే మందు కేవలం సమస్య ఉన్న చోటికే పరిమితమవుతుంది. దేహమంతటా తన దుష్ప్రభావాలు చూపదు. అందుకే అవి పూర్తిగా సురక్షితమని పేరెంట్స్ నమ్మవచ్చు.



సెమీఫైనల్లో అన్‌మోల్ పరాజయం

వాంటా (ఫిన్‌లాండ్): భారత రైజింగ్ షట్లర్ అన్‌మోల్ ఖరబ్... అర్కిటిక్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ సెమీఫైనల్లో పరాజయం పాలైంది. చక్కటి ఆటతీరుతో సెమీస్ వరకు చేరిన అన్‌మోల్... ప్రపంచ నాలుగో ర్యాంకర్ అకానె యామగుచి (జపాన్) చేతిలో ఓడింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 62వ ర్యాంకర్ అన్‌మోల్ 10-21, 13-21తో మూడుసార్లు ప్రపంచ చాంపియన్ యామగుచి చేతిలో ఓడింది. 29 నిమిషాల్లో ముగిసిన ఈ పోరులో ఫరీదాబాద్‌కు చెందిన 18 ఏళ్ల టీనేజ్ షట్లర్ అన్‌మోల్... యామగుచి ఎదుట నిలువలేకపోయింది. వరుస గేమ్‌ల్లో ఓడి టోర్నమెంట్ నుంచి నిష్క్రమించింది. రెండు గేమ్‌ల్లోనూ అన్‌మోల్ కాస్త పోరాటం కనబర్చినా... జపాన్ స్టార్ అనుభవం ముందు అది సరిపోలేదు. తొలిసారి సూపర్-500 టోర్నమెంట్‌లో సెమీస్‌కు చేరిన అన్‌మోల్ అక్కడితోనే వెనుదిరిగింది. ఈ ప్రదర్శనతో అన్‌మోల్‌కు 18,050 డాలర్ల (సుమారు 16 లక్షలు) ప్రైజ్‌మనీ లభించింది.

శుబ్ శతకం

గిల్ అజేయ సెంచరీ

- తొలి ఇన్నింగ్స్‌లో 518/5 డిక్లేర్డ్
- విండీస్ 140/4
- వికెట్ల వేట మొదలుపెట్టిన జడేజా

అనుకున్నట్లే రెండో రోజూ భారత్ జోరు కొనసాగింది. బ్యాటింగ్, బౌలింగ్‌తో కరీబియన్‌లను కష్టాల్లోకి నెట్టేసింది. మొదట కెప్టెన్ శుబ్‌మన్ గిల్ శతకంతో భారీ స్కోరులో భాగమయ్యాడు. 500 పైచిలుకు స్కోరు వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసిన భారత్... బౌలింగ్‌తోనూ అదరగొట్టింది. రెండో రోజే స్పిన్ తిరగడంతో భారత కెప్టెన్ గిల్... జడేజా, కుల్దీప్‌లతో అనుకున్న ఫలితాలు సాధించాడు.



జడేజా



శుబ్‌మన్ గిల్

న్యూఢిల్లీ: ఈ రెండో టెస్టును కూడా ముందే ముగించేందుకు భారత్ సిద్ధమైంది. రెండో రోజు ఆటలో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసింది. బ్యాటింగ్‌లో శుబ్‌మన్ గిల్, నితీశ్ కుమార్ రెడ్డి, ధ్రువ్ జురేల్‌లు కరీబియన్ బౌలర్లపై సులువుగా పరుగులు రాబట్టారు. తర్వాత రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్‌లు స్పిన్ ఉచ్చును బిగించారు. తద్వారా క్లీన్‌స్వీప్‌నకు రాచబాట వేశారు. కెప్టెన్ గిల్ (196 బంతుల్లో 129 నాటౌట్; 16 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీ సాధించాడు. దీంతో భారత్ 134.2 ఓవర్లలో 5 వికెట్లకు 518 పరుగుల భారీస్కోరు వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. నితీశ్ (54 బంతుల్లో 43; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), జురేల్ (79 బంతుల్లో 44; 5 ఫోర్లు) రాణించారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 43 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. అలిక్ అతనేజ్ (84 బంతుల్లో 41; 5 ఫోర్లు, 1 సిక్స్) భారత బౌలర్లను ఎక్కువసేపు ఎదుర్కొన్నాడు. జడేజా 3 వికెట్లు తీశాడు.

జైస్వాల్ రనౌట్

డబుల్ సెంచరీ చేస్తాడనుకున్న ఓపెనర్ యశస్వి జైస్వాల్ కేవలం తన క్రితం రోజు స్కోరుకు 2 పరుగులే జతచేసి రనౌటయ్యాడు. దీంతో శనివారం 318/2 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు **ఆటకొనసాగించిన భారత్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. సారథి గిల్ పరుగుకు ఉపక్రమించి వెనకడుగు వేయడంతో జైస్వాల్ నిష్క్రమించాల్సి వచ్చింది. నిరాశకు లోనైన యశస్వి తలకొట్టుకొని** అసహనంగా క్రీజు వీడాడు. తర్వాత గిల్‌కు జతయిన నితీశ్ వన్డే తరహా ఆటతీరుతో ధాటిగా పరుగులు సాధించాడు. శుబ్‌మన్ అర్ధసెంచరీని పూర్తిచేసుకోగా... జట్టు స్కోరు తొలిసెషన్‌లోనే 400 పరుగులు దాటింది. క్రీజులో పాతుకుపోయిన నితీశ్‌ను లంచ్ విరామానికి ముందు వారికెన్ అవుట్ చేశాడు. క్రీజులోకి ధ్రువ్ జురేల్ రాగా 427/4 స్కోరు వద్ద తొలిసెషన్ ముగిసింది.

శతక్కొట్టిన సారథి

రెండో సెషన్‌లో పూర్తిగా భారత బ్యాటర్ల జోరే కొనసాగింది. జురేల్ అండతో గిల్ టెస్టుల్లో పదో సెంచరీ సాధించాడు. అడపాదడపా బౌండరీలతో పరుగులు సాధించడంతో భారత్ స్కోరు సాఫీగా సాగిపోయింది. ఈ క్రమంలో జట్టు స్కోరు 500 పరుగుల్ని దాటింది. ఐదో వికెట్‌కు 102 పరుగులు జోడించాక జురేల్‌ను చేజ్ అవుట్ చేయడంతోనే గిల్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు. తర్వాత తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన విండీస్ ఆదిలోనే క్యాంప్‌బెల్ (10) వికెట్‌ను కోల్పోయినా... చాలాసేపు పోరాడింది. తేజ్ నారాయణ్ చందర్‌పాల్ (34; 4 ఫోర్లు, 1 సిక్స్), అతనేజ్ భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. జట్టు స్కోరు 87 వద్ద తేజ్‌ను జడేజా అవుట్ చేశాకే భారత్‌కు పట్టు దొరికింది. పరుగు తేడాతో అతనేజ్, చేజ్ (0) వికెట్లను స్పిన్నర్లు పడగొట్టేశారు. షై హోప్ (31 బ్యాటింగ్; 5 ఫోర్లు), ఇమ్లాచ్ (14 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. విండీస్ ఇంకా 378 పరుగుల వెనుకంజలో ఉంది.

స్కోరు వివరాలు

భారత్ తొలిఇన్నింగ్స్: జైస్వాల్ రనౌట్ 175; రాహుల్ (స్టంప్డ్) ఇమ్లాచ్ (బి) వారికెన్ 38; సాయి సుదర్శన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) వారికెన్ 87; శుబ్‌మన్ (నాటౌట్) 129; నితీశ్ రెడ్డి (సి) సీల్స్ (బి) వారికెన్ 43; జురేల్ (బి) చేజ్ 44; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (134.2 ఓవర్లలో) 518/5 డిక్లేర్డ్. వికెట్ల పతనం:** 1-58, 2-251, 3-325, 4-416, 5-518. **బౌలింగ్:** సీల్స్ 22-2-88-0, ఫిలిప్ 17-2-71-0, గ్రీవెస్ 14-1-58-0, పియర్ 30-2-120-0, వారికెన్ 34-6-98-3, చేజ్ 17.2-0-83-1.

వెస్టిండీస్ తొలిఇన్నింగ్స్: క్యాంప్‌బెల్ (సి) సుదర్శన్ (బి) జడేజా 10; తేజ్ (సి) రాహుల్ (బి) జడేజా 34; అతనేజ్ (సి) జడేజా (బి) కుల్దీప్ 41; షై హోప్ (బ్యాటింగ్) 31; చేజ్ (సి) అండ్ (బి) జడేజా 0; ఇమ్లాచ్ (బ్యాటింగ్) 14; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (43 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి) 140. వికెట్ల పతనం:** 1-21, 2-87, 3-106, 4-107. **బౌలింగ్:** బుమ్రా 6-3-18-0, సిరాజ్ 4-0-9-0, జడేజా 14-3-37-3, కుల్దీప్ 12-3-45-1, సుందర్ 7-1-23-0.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భారత్‌కు కాస్త కంగారు

మహిళల వరల్డ్ కప్‌లో నేడు కీలక పోరు

- వైజాగ్‌లో ఆస్ట్రేలియాతో భారత జట్టు ఢీ
- విజయంపై హర్మన్ సేన గురి
- మ.గం.3.00 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం



వేర్‌హామ్



హర్మన్‌ప్రీత్, స్మృతి

మహిళల క్రికెట్‌లో భారత జట్టు స్థాయిని చూపించే మ్యాచ్‌కు నేడు విశాఖ వేదిక అవుతోంది. దక్షిణాఫ్రికా చేతిలో అనూహ్య ఓటమి తర్వాత అత్యంత పటిష్టమైన ఆస్ట్రేలియాను ఎదుర్కొనేందుకు భారత్ సై అంటోంది. ఇటీవల ఇదే జట్టుతో జరిగిన వన్డే సిరీస్‌ను కోల్పోయినా... పోరు హోరాహోరీగా సాగింది. అయితే వరల్డ్ కప్‌కు ముందు అసాధారణంగా కనిపించిన హర్మన్ సేన మెగా టోర్నీలో ఒక్కసారిగా ఫామ్ కోల్పోయినట్లుగా అనిపిస్తోంది. ఇప్పటికే సఫారీల చేతిలో ఓడిన నేపథ్యంలో సెమీస్ రేసులో నిలవాలంటే పెద్ద జట్టుపై గెలుపు తప్పనిసరి. మరో వైపు అన్ని రంగాల్లో పటిష్టంగా ఉన్న ఆసీస్ తమ ఎనిమిదో టైటిల్ వేటలో భారీ విజయాన్ని ఆశిస్తోంది.

తుది జట్లు (అంచనా)

భారత్: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి, ప్రతీక, హర్లీన్, జెమీమా, దీప్తి, అమన్‌జోత్, రిచా ఘోష్, స్నేహ్, క్రాంతి, శ్రీచరణి.
ఆస్ట్రేలియా: అలీసా హీలీ (కెప్టెన్), లిచ్‌ఫీల్డ్, ఎలైస్ పెరీ, మూనీ, సదర్లాండ్, గార్డ్‌నర్, తాహిలా, వేర్‌హామ్, గార్త్, అలానా కింగ్, మెగాన్ షుట్.

పిచ్, వాతావరణం

గత మ్యాచ్ తరహాలోనే బ్యాటింగ్‌కు అనుకూలం. మంచి బౌన్స్ కూడా ఉండటంతో పాట్లకు అవకాశం ఉంది. మ్యాచ్ రోజు వర్ష సూచన లేదు. ఆదివారం కూడా కావడంతో స్టేడియం పూర్తి సామర్థ్యం మేరకు నిండే అవకాశం ఉంది.

విశాఖపట్నం, సాక్షి క్రీడా ప్రతినిధి: వన్డే వరల్డ్ కప్‌లో భారత జట్టు నేడు కీలక మ్యాచ్‌కు సన్నద్ధమైంది. వైజాగ్‌లోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో నేడు జరిగే లీగ్ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో భారత మహిళల బృందం తలపడుతుంది. రెండు విజయాల తర్వాత దక్షిణాఫ్రికా చేతిలో భారత్ ఓటమి చవి చూడగా...రెండు మ్యాచ్‌లు గెలిచిన కంగారూలు శ్రీలంకతో మ్యాచ్ రద్దు కావడంతో కీలకమైన రెండు పాయింట్లు సాధించే అవకాశం కోల్పోయారు. ఈ నేపథ్యంలో మ్యాచ్ ఆసక్తికరంగా సాగే అవకాశం ఉంది. మ్యాచ్‌కు ముందు ఒక స్టాండ్‌కు మిథాలీ రాజ్ పేరు పెట్టే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

ఈ ముగ్గురు చెలరేగితేనే...

వరల్డ్ కప్‌లో ఆడిన మూడు మ్యాచ్‌లలో స్మృతి చేసిన స్కోర్లు 8, 23, 23...హర్మన్ ప్రీత్ వరుసగా 21,19, 9 పరుగులు చేయగా...ఒక మ్యాచ్‌లో 32 పరుగులు చేసిన జెమీమా మరో రెండు సార్లు డకౌటైంది. మన జట్టులోని ముగ్గురు స్టార్ బ్యాటర్ల స్కోర్లను కలిపి చూస్తే 9 ఇన్నింగ్స్‌లలో ఒక్క హాఫ్ సెంచరీ కూడా నమోదు కాలేదు. వరల్డ్ కప్ టైటిల్‌పై భారీ ఆశలు పెట్టుకున్న భారత జట్టుకు ఈ స్థితి ఆందోళనకరంగా మారింది. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో పూర్తిగా తడబడ్డ హర్మన్ 9 పరుగుల కోసం 23 బంతులు ఆడగా, స్మృతి తొలి బౌండరీ కొట్టేందుకు 21 బంతులు తీసుకుంది. జెమీమా 3 సార్లూ లెఫ్టార్మ్ స్పిన్నర్ బౌలింగ్‌లోనే అవుట్ కావడం ఆమె బలహీనతను చూపిస్తోంది. ఈ ముగ్గురితో పాటు ప్రతీక, హర్లీన్ కూడా అంతంతమాత్రం ప్రదర్శనే చేశారు. ప్రతీసారి లోయర్ ఆర్డర్ జట్టును ఆదుకోవడం సాధ్యం కాకపోవచ్చు. దక్షిణాఫ్రికాతో ఇన్నింగ్స్ రిచాలో ఆత్మవిశ్వాసం పెంచగా... దీప్తి, అమన్‌జోత్ కూడా కీలకం కానున్నారు. గత మ్యాచ్ చివర్లో డి క్లెర్క్ చెలరేగే వరకు మన బౌలర్లంతా చక్కటి బౌలింగ్ చేశారు. ఐదుగురు రెగ్యులర్ బౌలర్లతో పాటు హర్మన్ కూడా నాలుగు ఓవర్లు వేసింది. అందుకే ప్రత్యామ్నాయంగా ఆరో బౌలర్ అవసరం ఉండకపోవచ్చు. ఈ నేపథ్యంలో తుది జట్టులో మార్పులు లేకుండానే భారత్ బరిలోకి దిగే అవకాశం ఉంది. గత మ్యాచ్‌లో పొదుపుగా బౌలింగ్ చేసిన ఆంధ్ర బౌలర్ శ్రీచరణి నిరూపించుకునేందుకు ఇది మరో మంచి అవకాశం.

ఒకరిని మించి మరొకరు...

ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లో అయినా మ్యాచ్‌ను మలుపు తిప్పే సామర్థ్యం ఆస్ట్రేలియాకు ఉంది. పాకిస్తాన్‌తో మ్యాచ్ అందుకు ఉదాహరణ. పాక్ బలహీన జట్టే అయినా 76 పరుగులకు 7 వికెట్లు కోల్పోయిన తర్వాత కూడా 200పైగా పరుగులు చేయడంతో పాటు బౌలింగ్‌లో చెలరేగి భారీ విజయం సాధించడం ఆసీస్‌కే చెల్లింది. కివీస్‌పై 326 పరుగులు చేసిన ఆ జట్టు...అంతకు ముందు భారత్‌పై చివరి వన్డేలో ఏకంగా 412 పరుగులు నమోదు చేసిన విషయం మరచిపోవద్దు. టోర్నీలో ఇప్పటికే మూనీ, గార్డ్‌నర్ శతకాలు నమోదు చేశారు. మిగతా ప్రధాన బ్యాటర్లు ఇంకా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. హీలీ, పెరీ తమ స్థాయికి తగినట్లుగా చెలరేగితే భారత్‌కు కష్టాలు తప్పవు. సదర్లాండ్ రూపంలో చక్కటి ఆల్‌రౌండర్ జట్టులో ఉంది.



నేను చాలా లక్కీ

- రాశీ ఖన్నా

"ప్రస్తుతం తెలుగు, హిందీ చిత్ర పరిశ్రమలను బ్యాలెన్స్ చేస్తూ సినిమాలు చేస్తున్నాను. నేను చాలా లక్కీ. టాలీవుడ్‌కి తిరిగొచ్చి, మళ్ళీ వరుస సినిమాలు చేస్తుండటం అనేది తెలుగు ప్రేక్షకుల ప్రేమ, ఓ నటిగా నాకు దర్శక- నిర్మాతల్లో ఏర్పడిన గుర్తింపు వల్లేనని నమ్ముతున్నా'' అని హీరోయిన్ రాశీ ఖన్నా అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన చిత్రం 'తెలుసు కదా'. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటించగా, కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకరుల సమావేశంలో రాశీ ఖన్నా పంచుకున్న సంగతులు.

● 'తెలుసు కదా' కథను దర్శకురాలు నీరజ గారు చెప్పినప్పుడు షాక్ అయ్యాను. ఇది రెగ్యులర్ లవ్‌స్టోరీ కాదు. అందుకే ఒప్పుకున్నాను. నాకు తెలిసి ఈ తరహా ప్రేమ కథా చిత్రం ఇప్పటివరకు రాలేదు. ఇందులో మేం ఓ కొత్త పాయింట్‌ని టచ్ చేశాం. ● 'తెలుసు కదా'లో నేను అంజలి అనే పాత్రలో కనిపిస్తాను. కథలో మా ముగ్గురి (సిద్ధు, అంజలి, రాశీ) పాత్రలు చాలా డిఫరెంట్‌గా ఉంటాయి. ఈ సినిమా ఆడియన్స్‌కు ఓ కొత్త అనుభూతిని ఇస్తుంది. నీరజ బాగా డైరెక్ట్ చేశారు. ఓ మహిళా దర్శకురాలితో నేను పని చేయడం ఇదే తొలిసారి. అయినా డైరెక్షన్‌కి మేల్, ఫీమేల్ అనే తేడాల్లేవ్. ● క్రమశిక్షణతోనే జీవితంలో ఎదగగలమని నమ్ముతాను. అందుకే నేను ఎప్పుడూ క్రమశిక్షణగా ఉంటాను. అలాగే సినీ ఇండస్ట్రీలో హీరోయిన్ ఫిట్‌గా ఉండటం ముఖ్యం. నేను ఎప్పుడూ వర్కౌట్స్, సరైన డైట్‌తో ఫిట్‌గా ఉండాలనుకుంటాను. ఇక 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్'పై నాకు నమ్మకం లేదు. అదో ఆకర్షణ అనుకుంటాను. ప్రేమ అంటే ఏమిటి? ప్రేమకు ఉన్న పరిమితులు వంటి అంశాలను 'తెలుసు కదా'లో ప్రస్తావించాం. ● పవన్ కల్యాణ్‌గారి 'ఉస్తాద్ భగత్‌సింగ్' చేస్తున్నాను. హిందీలో చేసిన '120 బహదూర్' చిత్రం నవంబరు 21న విడుదలవుతుంది. విక్రాంత్ మెస్సేతో లవ్ స్టోరీ ఫిల్మ్, మాధవన్‌తో టైమ్ ట్రావెల్ బ్యాక్‌డ్రాప్ మూవీ చేశాను. 'ఫర్జీ 2' సిరీస్ చేస్తున్నాను. అలాగే ఒక ఓటీటీ ప్రాజెక్ట్‌లో లీడ్‌గా నటించాను.



నా ఫస్ట్ చాయిస్ డైరెక్షన్

- రిషబ్ శెట్టి

"భారతదేశం జానపద కథలకు నిలయం. నాకు జానపద కథలు చేయడం అంటే ఇష్టం. 'కాంతార' సినిమా కథను నిజాయితీగా చెప్పాలనుకున్నా. అది ప్రేక్షకులకు నచ్చింది'' అని దర్శక-నిర్మాత-నటుడు రిషబ్ శెట్టి అన్నారు. రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కాంతార:చాప్టర్ 1'. 'కాంతార' (2022) సినిమాకు ప్రీక్వెల్‌గా 'కాంతార:చాప్టర్ 1' రూపొందింది. విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 2న విడుదలైంది. ఇప్పటికే ఈ సినిమా రూ. 509 కోట్ల వసూళ్లు సాధించి, సక్సెస్‌ఫుల్‌గా ప్రదర్శితమవుతోందని యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా శనివారం విలేకరులతో రిషబ్ శెట్టి చెప్పిన విశేషాలు.

● 'కాంతార' సినిమాకు ఎలాంటి స్పందన లభించిందో, 'కాంతార: చాప్టర్ 1'కూ అలాంటి గొప్ప రెస్పాన్సే ప్రేక్షకుల నుంచి లభిస్తోంది 'కాంతార' చేసేటప్పుడే 'కాంతార: చాప్టర్ 1' గురించిన ఆలోచన ఉంది. 'కాంతార' చిత్రానికి వచ్చిన అద్భుతమైన స్పందన చూసి, 'కాంతార: చాప్టర్ 1' కథ రాయడం మొదలుపెట్టాను. ● చిన్నప్పట్నుంచి మా ఊరి (కుందాపూర్) కథలు చెప్పాలని ఉండేది. 'కాంతార' మా ప్రాంతంలో జరిగిన కథ. అందుకే లొకేషన్స్‌ను మా ప్రాంతంలోనే తీసుకోవడం జరిగింది. మేజర్ షూటింగ్‌ని మా ఊర్లో వేసిన ఓ ప్రత్యేకమైన సెట్‌లో జరిపాం. ● నాలో దర్శకుడు ఉన్నాడు... యాక్టర్ ఉన్నాడు. ఈ రెండింటిలో ఏది ఫస్ట్ అంటే డైరెక్షనే అని చెబుతాను. ● ముంబైలోని ఓ నిర్మాణ సంస్థలో డ్రైవర్‌గా పని చేశాను. ఇప్పుడు మంచి సక్సెస్‌లో ఉన్నాను. ఆర్టిస్టుగా జాతీయ అవార్డు అందుకున్నాను. నా జర్నీలో భాగమైన అందరికీ ధన్యవాదాలు. అలాగే 'కాంతార' జర్నీలో, నా జీవితంలో నా భార్య (ప్రగతి శెట్టి) ఇచ్చిన సపోర్ట్‌ను మర్చిపోలేను. ఒక వైపు 'కాంతార' సినిమాలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా చేస్తూనే, మరోవైపు నన్ను, నా పిల్లలను జాగ్రత్తగా చూసుకుంది. తను డబుల్ రోల్ చేసింది. ● ప్రస్తుతం తెలుగులో ఓ పీరియాడికల్ మూవీ, హిందీలో ఛత్రపతి శివాజీ మహారాజ్ బయోపిక్ చిత్రాల అనౌన్స్‌మెంట్ వచ్చాయి. కానీ నా నెక్స్ట్ ప్రాజెక్ట్ 'జై హనుమాన్'.

ఎన్టీఆర్‌గారు నాకు సోదరుడు లాంటివారు. మా కుందాపూర్ మూలాలు ఉన్న అబ్బాయి. ఆయన చేసిన సపోర్ట్‌కి రుణపడి ఉంటాను. ఇక ప్రశాంత్ నీల్‌గారితో ఎన్టీఆర్‌గారు చేస్తున్న సినిమాలో నేను నటిస్తున్నానన్న విషయంపై ప్రస్తుతానికి నేను 'మ్యూట్'.

రూరల్ యాక్షన్ డ్రామా షురూ



● విజయ్ దేవరకొండ, కీర్తి సురేష్

విజయ్ దేవరకొండ హీరోగా, కీర్తి సురేష్ హీరోయిన్‌గా 'రాజావారు రాణిగారు' ఫేమ్ రవికిరణ్ కోలా దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమా ప్రారంభోత్సవం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత నిరంజన్ రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ ఇచ్చారు. దర్శకుడు హను రాఘవపూడి గౌరవ దర్శకత్వం వహించారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై 'దిల్' రాజు, శిరీష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రూరల్ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 16న ప్రారంభం కానుందని, వచ్చే ఏడాదిలో ఈ సినిమాను రిలీజ్ చేస్తామని చిత్రబృందం పేర్కొంది. కాగా, ఈ సినిమాకు 'రౌడీ జనార్దన' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లుగా 'దిల్' రాజు ఓ సందర్భంలో పేర్కొన్న విషయం గుర్తుండే ఉంటుంది.

థియేటర్స్‌లో గట్టిగా నవ్వుకుంటారు

- కిరణ్ అబ్బవరం



● జైన్స్ నాని, కిరణ్

"కొత్త స్క్రిప్ట్‌తో సినిమా చేద్దామని 'క' చిత్రం చేశాను. కానీ 'కె-ర్యాంప్' మాత్రం నా అభిమానుల కోసం చేశాను. ఈ చిత్రంలో నా క్యారెక్టరైజేషన్ ఇప్పటి యువతరానికి దగ్గరగా ఉంటుంది. ప్రేక్షకులు థియేటర్స్‌లో గట్టిగా నవ్వుకుంటారు. ఈ సినిమాకు కర్త, కర్మ, క్రియ ఈ చిత్రదర్శకుడు నానియే'' అని కిరణ్ అబ్బవరం అన్నారు. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన చిత్రం 'కె-ర్యాంప్'. యుక్తీ తరేజా హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో వీకే నరేశ్, సాయికుమార్, 'వెన్నెల' కిశోర్ ప్రధాన పాత్రల్లో నటించారు. జైన్స్ నాని దర్శకత్వంలో రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో జైన్స్ నాని మాట్లాడుతూ - "ట్రైలర్‌లోని ఎనర్జీకి సినిమా ఏ మాత్రం తగ్గదు'' అని చెప్పారు. "మా సినిమా విడుదల తేదీని చాలా రోజుల క్రితమే ప్రకటించాం. ఈ దీపావళికి పెద్ద బ్యానర్స్ నుంచి సినిమాలు వస్తున్నాయి. అయినా మా సినిమాకు థియేటర్స్ దొరుకుతాయి'' అని పేర్కొన్నారు రాజేశ్ దండా. "ఈ చిత్రంలో ఓ వైవిధ్యమైన పాత్ర చేశాను'' అని తెలిపారు వీకే నరేశ్. సినిమాటోగ్రాఫర్ సతీష్ రెడ్డి, రైటర్ రవి మాట్లాడారు.



● త్రినాథ్, సత్యదేవ్, వైకుంఠ్ బోను

ధర్మాన్ని కాపాడేందుకు...

మాస్టర్ మహేంద్రన్ హీరోగా నటిస్తున్న చిత్రం 'వసుదేవసుతం'. అంబికా వాణి హీరోయిన్‌గా నటిస్తున్నారు. వైకుంఠ్ బోను దర్శకత్వంలో బేబీ చైత్ర శ్రీ బాదర్ల, మాస్టర్ యువాంశ్ కృష్ణ బాదర్ల సమర్పణలో ధనలక్ష్మి బాదర్ల నిర్మిస్తున్న ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ను హీరో సత్యదేవ్ విడుదల చేశారు. "ఈ కథ ధర్మానికి అడ్డొస్తే.. మేనమామ అయినా, లక్షల బంధుగణమైనా, ఎదురుగా కోట్ల సాయుధులే ఉన్నా... ధర్మ హింస తథావచ అన్న శ్రీ కృష్ణుడిదే కాదు. ధర్మాన్ని కాపాడేందుకు ఎంతటి మారణ హోమానికైనా ఎదుర్కొనే ఓ యువకుడిది' అనే డైలాగ్ 'వసుదేవసుతం' సినిమా టీజర్‌లో ఉంది. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ.

మోగ్లీ వస్తున్నాడు



● సాక్షి, రోషన్

రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న తాజా చిత్రం 'మోగ్లీ 2025'. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ రొమాంటిక్ యాక్షన్ డ్రామాకు సందీప్ రాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్, కృతీప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ తుది దశకు చేరుకుంది. ఈ సినిమాను డిసెంబరు 12న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. "ఓ ఎమోషనల్ క్యారెక్టర్‌లో రోషన్ నటించాడు. హీరో, హీరోయిన్ల కెమిస్ట్రీ, బండి సరోజ్ విలనిజమ్ ఈ సినిమాకు మేజర్ హైలైట్స్‌గా ఉంటాయి'' అని చిత్రబృందం పేర్కొంది.

ముగ్గురు స్నేహితుల కథ



● హరి, మనోజ్, శశిధర్

ఎంసీ హరి, మనోజ్, శశిధర్ హీరోలుగా, వేదశ్రీ, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయి యోగి కీలక పాత్రలు పోషిస్తున్న చిత్రం 'అమీర్ లోగ్'. రమణా రెడ్డి సోమ దర్శకత్వంలో మాధవి రెడ్డి సోమ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్‌ను హీరో శ్రీ విష్ణు విడుదల చేశారు. "ముగ్గురు స్నేహితుల చుట్టూ తిరిగే వినోదాత్మకమైన కథ ఇది. హైదరాబాద్ నేపథ్యంలో సాగుతుంది'' అని యూనిట్ పేర్కొంది.

నవంబరులో సంతాన ప్రాప్తిరస్తు



● విక్రాంత్, 'వెన్నెల' కిశోర్, చాందిని

విక్రాంత్, చాందినీ చౌదరి హీరో హీరోయిన్లుగా, 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'. సంజీవ్ రెడ్డి దర్శకత్వంలో 'మధుర' శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. ఈ సినిమాను నవంబరు 14న రిలీజ్ చేయనున్నట్లుగా శనివారం మేకర్స్ ప్రకటించారు. "నేటి సమాజంలో యూత్ కపుల్స్ ఎదుర్కొంటున్న ఓ సమస్య నేపథ్యంలో వినోదాత్మకంగా రూపొందిన సినిమా ఇది. ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: సునీల్ కశ్యప్.

ప్రజల నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత మాపై ఉంది





భువనగిరిలో జిల్లా కోర్టు భవన సముదాయానికి శంకుస్థాపన చేస్తున్న సీజే అపరేష్‌కుమార్‌సింగ్. చిత్రంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.శరత్, జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ కె.సుజన, జస్టిస్ వి.రామకృష్ణారెడ్డి, జిల్లా జడ్జి, అధికారులు ● చీఫ్ జస్టిస్, న్యాయమూర్తులకు వేద ఆశీర్వచనం చేస్తున్న ఆలయ ప్రధానార్చకులు



నస్పూర్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే సింగ్
- భువనగిరిలో జిల్లా కోర్టు భవన సముదాయానికి శంకుస్థాపన
- మంచిర్యాల జిల్లా కోర్టు భవనాలకు వర్చువల్‌గా శంకుస్థాపన

భువనగిరి టౌన్/యాదగిరిగుట్ట/నస్పూర్: 'న్యాయ వ్యవస్థ ప్రతి పౌరుడికి సమానమే.. ప్రజల నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత మాపై ఉంది'అని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ అన్నారు. శనివారం ఆయన భువనగిరి జిల్లా కేంద్రంలో జిల్లా కోర్టు నూతన భవన సముదాయం నిర్మాణానికి హైకోర్టు న్యాయమూర్తులతో కలసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, 'రాజ్యాంగం నిర్ణయించిన లక్ష్యాలను నిర్వర్తించటం మన కర్తవ్యం'అని స్పష్టం చేశారు. న్యాయ వ్యవస్థలు రాజ్యాంగ లక్ష్యాలను చేరుకోవటానికి, ప్రజలకు న్యాయం అందించటానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయ శాఖలోని ఉద్యోగులు చిత్త శుద్ధితో కృషిచేయాలని సూచించారు. హైకోర్టు న్యాయమూర్తులు మాట్లాడుతూ.. 10 ఎకరాల స్థలంలో అన్ని విభాగాలు ఒకే దగ్గర ఉండేలా ఆధునిక హంగులతో ఈ భవన నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి, భువనగిరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కె.శరత్, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ కె.సుజన, జస్టిస్ వి.రామకృష్ణారెడ్డి, భువనగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు, జిల్లాలోని పలువురు జడ్జీలు, న్యాయవాదులతో పాటు కలెక్టర్ హనుమంతరావు పాల్గొన్నారు. హైకోర్టు చీఫ్ జస్టిస్‌తో పాటు ఇతర న్యాయమూర్తులను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనకు వచ్చిన బాలికలకు జస్టిస్ ఏకే సింగ్.. జాతీయ బాలికా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి వారిని ప్రశంసించారు.

శ్రీనృసింహుడిని దర్శించుకోవడం ఎంతో అదృష్టం..

యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోవడం ఎంతో అదృష్టమని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ అన్నారు. శనివారం ఆయన హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ కె.శరత్, జస్టిస్ కె.సుజన, జస్టిస్ వి.రామకృష్ణారెడ్డిలతో కలసి యాదగిరీశుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు న్యాయమూర్తులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్.. విజిటర్స్ బుక్‌లో సంతకం పెట్టి తన అనుభూతిని పంచుకున్నారు. యాదగిరీశుడి ఆలయ నిర్మాణం అద్భుతమని, ఆలయ నిర్వహణ బాగుందని పేర్కొన్నారు.

భవిష్యత్ అవసరాల దృష్ట్యా కోర్టు భవనాల ఏర్పాటు

రాష్ట్ర ప్రజల భవిష్యత్ అవసరాల దృష్ట్యా అన్ని న్యాయ సేవలు ఒకేచోట అందించే విధంగా జిల్లాల్లో కోర్టు భవనాల నిర్మాణాలు చేపడుతున్నట్లు హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ అన్నారు. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో జిల్లా కోర్టు భవన సముదాయం నిర్మాణ పనులను శనివారం ఆయన యాదగిరిగుట్ట ఆలయ అతిథి గృహం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. కాగా, హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక నస్పూర్‌లో శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తర్వాత భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ నగేశ్ భీమపాక మాట్లాడుతూ.. ఈ సముదాయంలో 12 కోర్టులను రూ.81 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.వీరయ్య, కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల డీసీపీ భాస్కర్, జిల్లా ఫారెస్టు అధికారి శివ్‌ఆశిష్ సింగ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండవరం జగన్ తదితరులు పాల్గొన్నారు.

అందరూ ఆరోగ్య క్రమశిక్షణ అలవర్చుకోవాలి

కన్హా హెల్త్ అండ్ వెల్ బీయింగ్ కాన్ఫరెన్స్‌లో కేంద్రమంత్రి ప్రతాప్‌రావు



కన్హాలో మాట్లాడుతున్న కేంద్ర ఆయుష్ శాఖమంత్రి ప్రతాప్ రావు జాదవ్

నందిగామ: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని, ఆరోగ్య క్రమశిక్షణను అలవర్చుకోవాలని కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ అన్నారు. కన్హా శాంతి వనంలో శనివారం నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ హెల్త్ అండ్ వెల్ బీయింగ్–2025 కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైద్యం, యోగా, ఆయుర్వేదంతో పాటు ధ్యానంలో ప్రముఖ నిపుణులను ఏకం చేసే విధంగా 3వ అంతర్జాతీయ ఇంటిగ్రేటెడ్ హెల్త్ అండ్ వెల్ బీయింగ్ కాన్ఫరెన్స్‌కు ముందుకొచ్చిన హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ కృషి అభినందనీయమని ప్రశంసించారు. ఆధునిక, సంప్రదాయ ఆరోగ్య విధానాలను క్రమబద్ధంగా, శాస్త్రీయ పద్ధతిలో ఏకీకృతం చేసేందుకు అన్ని రంగాల ప్రముఖులు ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతిఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగా, ధ్యానం చేయాలని మంత్రి సూచించారు. అనంతరం పలు రంగాల్లో నిపుణులైన వైద్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

భూ సమస్యలపై తీర్పు అధికారం సివిల్ కోర్టులదే

రెవెన్యూ అధికారులది కాదని తేల్చిచెప్పిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: భూ సమస్యలకు సంబంధించిన వివాదాలపై తీర్పులిచ్చే అధికారం సివిల్ కోర్టులదేనని.. రెవెన్యూ అధికారులది కాదని హైకోర్టు తేల్చిచెప్పింది. గచ్చిబౌలిలోని వివాదాస్పద 36.25 ఎకరాల భూములపై రక్షిత కౌలుదారులకు హక్కులు ఉంటాయని స్పష్టం చేసింది. ఆ మేరకు 2013లో రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్ ఇచ్చిన ఉత్తర్వులను సమర్థించింది. 2016లో సబ్ కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తూ, దాదాపు 40 పిటిషన్‌లలో విచారణను ముగించింది. పిటిషనర్ల పూర్వీకులు చట్టప్రకారం రక్షిత కౌలుదారులు, ఆంధ్రప్రదేశ్ (తెలంగాణ ప్రాంతం) అద్దె, వ్యవసాయ భూముల చట్టం–1950 ప్రకారం యాజమాన్య ధ్రువీకరణ పత్రాలకు అర్హులని 2013లో ఆర్డీవో ఉత్తర్వులు ఇచ్చారు. చట్టంలోని సెక్షన్ 19 కింద అద్దె హక్కులను చట్టబద్ధంగా వేరొకరికి అప్పగించినట్లు ఆధారాల్లేవన్నారు. తర్వాత సబ్–కలెక్టర్ ఈ ఉత్తర్వును పక్కన పెడుతూ.. భూములను నివాస వినియోగానికి మార్చిన తర్వాత అద్దె చట్టం వర్తించదని ప్రకటించారు. 2016లో సబ్ కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ అద్దెదారులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. సుదీర్ఘ వాదనలు విన్న న్యాయమూర్తి ఆ భూమిపై అద్దెదారులకే హక్కులుంటాయని తాజాగా 156 పేజీల తీర్పు వెలువరించారు. సెలవులో ఉన్నా సబ్ కలెక్టర్ సుదీర్ఘ ఉత్తర్వులు జారీ చేయడం తొందరపాటు నిర్ణయమని, ఇది సందేహాలను లేవనెత్తిందని అన్నారు. సబ్–కలెక్టర్ తన అధికార పరిధిని అధిగమించి.. న్యాయపరమైన అంశాల్లోనూ జోక్యం చేసుకున్నారని చెప్పారు. అద్దె చట్టం ప్రకారం ఆర్డీవో కాంపిటెంట్ అథారిటీ అని, పిటిషనర్ల యాజమాన్య హక్కులను గుర్తించడంలో సరిగ్గా వ్యవహరించారన్నారు. ప్రైవేట్ పార్టీల సేల్ డీడ్‌లకు సంబంధించిన సమస్యలను సివిల్ కోర్టులు మాత్రమే తీర్పు ఇవ్వగలవని, రెవెన్యూ అధికారులు కాదని స్పష్టం చేశారు.

గంజాయి పట్టుకునేందుకు వెళ్లిన అధికారులపై దాడి

- మొబైల్ ఫోన్లు లాక్కొన్న తండావాసులు
- 64 గంజాయి మొక్కలు, 4 కిలోల ఎండు గంజాయి స్వాధీనం



అధికారులను చుట్టుముట్టి దాడిచేస్తున్న చల్లగిద్ద తండావాసులు

నారాయణఖేడ్: గంజాయి పట్టుకునేందుకు వెళ్లిన ఎక్సైజ్ అధికారులను గిరిజనులు అడ్డుకొని అధికారులపై తిరగబడ్డారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం చల్లగిద్ద తండాలో శనివారం చోటుచేసుకుంది. జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ శంకర్, ఎక్సైజ్ సిబ్బంది వివరాల ప్రకారం.. తండాకు చెందిన జానకీరామ్ తన పత్తిచేనులో అంతర పంటగా గంజాయిని సాగుచేస్తున్నాడన్న విశ్వసనీయ సమాచారం మేరకు సీఐతోపాటు ఎస్సైలు హన్మంతు, అరుణజ్యోతి, సిబ్బంది ప్రభాకర్, అంజిరెడ్డి అనుమానిత చేనుపై దాడిచేశారు. పత్తిలో సాగైన 64 గంజాయి మొక్కలను పట్టుకున్నారు. అనంతరం తండాలోనూ ఎండుగంజాయి ఉంటుందేమోనన్న అనుమానంతో వెళ్లి వడిత్యా మోహన్ ఇంట్లో తనిఖీ చేయగా 4 కిలోల ఎండుగంజాయి, కిలోన్నర గంజాయి విత్తనాలు దొరికాయి. అంతలోనే అక్కడికి చేరుకున్న తండావాసులు అధికారులను చుట్టుముట్టి పిడిగుద్దులతో దాడిచేశారు. వారి మొబైల్ ఫోన్లను లాక్కున్నారు. అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, కంగ్టి సీఐ దమ్మ వెంకట్‌రెడ్డి, ఖేడ్ ఎస్సై శ్రీశైలం సిబ్బందితో కలిసి వెళ్లి తండాలో పికెట్‌ను ఏర్పాటు చేసి దాడిచేసిన వారిని గుర్తించేందుకు విచారణ జరుపుతున్నారు.

బాంబు పేలి జవాన్‌కు గాయాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ బాంబు పేలి జవాన్‌కు తీవ్ర గాయాలైన ఘటన శనివారం చోటుచేసుకుంది. బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ సమీప అటవీ ప్రాంతంలో కోబ్రా 206 బెటాలియన్‌కు చెందిన బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ బాంబును ఓ జవాన్ తొక్కడంతో అది పేలి కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి.

సిరిసిల్లలో తమిళనాడు చీరలు

నేతన్నలకు చేతినిండా పని





సిరిసిల్లలో ఉత్పత్తి అయిన తమిళనాడు చీరలు, తమిళనాడు చీరల బట్ట నూలు

సిరిసిల్ల: తమిళనాడు ప్రభుత్వం నుంచి సిరిసిల్ల నేతన్నలకు 25 లక్షల మీటర్ల చీరల బట్ట ఉత్పత్తి ఆర్డర్లు (సుమారు 4 లక్షల చీరలు) వచ్చాయి. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళాశక్తి చీరల ఆర్డర్లు ఇవ్వడంతో ఆ చీరలను నేస్తూనే.. మరోవైపు తమిళనాడు ఆర్డర్ల చీరలను ఉత్పత్తి చేస్తున్నారు. తమిళనాడు చీరల ఆర్డర్లతో ఐదు నెలలపాటు నేతన్నలకు ఉపాధి లభించనుంది. తమిళనాడు ప్రభుత్వం ఏటా దీపావళికి, సంక్రాంతి(పొంగల్)కు పేదలకు చీరలను పంపిణీ చేస్తుంది. దీంతో అక్కడి చీరల వెరైటీకి సంబంధించిన నూలును దిగుమతి చేసుకుని భీములు పోసి సాంచాలు ఎక్కించి చీరల ఉత్పత్తి సాగిస్తున్నారు.

తక్కువ సమయం ఉండడంతో..

తమిళనాడు ప్రభుత్వం ముందే చీరల ఆర్డర్లు ఇవ్వడంతో ఇప్పటికే నెల రోజులుగా సిరిసిల్లలో చీరల ఉత్పత్తి సాగుతోంది. దీపావళికి చీరలను అందించాల్సి ఉంది. సమయం తక్కువగా ఉండడంతో వేగంగా చీరల ఉత్పత్తి సాగుతోంది.



మాకు 2 లక్షల చీరల బట్ట ఆర్డర్ వచ్చింది

మాకు రెండు లక్షల చీరల ఆర్డర్లు ఇచ్చారు. 20 మంది ఆసాములకు 160 భీములు అందించాం. చీరల బట్ట ఉత్పత్తి సాగుతోంది. ఒక్కో భీము 1,600 మీటర్లు ఉంటుంది. ఒక్క భీము ఎక్కితే నెల రోజులపాటు నడుస్తుంది. సిరిసిల్లలో వస్త్రోత్పత్తిదారులకు చేతి నిండా పని ఉంది. ప్రభుత్వ ఆర్డర్లు, తమిళనాడు చీరల ఆర్డర్లతో పని లభిస్తుంది.

– నల్ల నవీన్, భీముల సరఫరాదారుడు, సిరిసిల్ల

ఐఆర్‌ఏ రియల్టీ కార్యాలయంలో 'హై టీ మీట్-అండ్-గ్రీట్'

సాక్షి, హైదరాబాద్: ఐఆర్‌ఏ రియల్టీ ఇండియా ఫౌండేషన్ సభ్యులు కృష్ణచైతన్య బాలం, నళినీధర్‌రెడ్డి కొట్టాతో కలిసి తన కార్యాలయంలో హై టీ మీట్-అండ్-గ్రీట్ కార్యక్రమం నిర్వహించింది. ఇందులో ఉన్నత స్థాయి అమెరికా ప్రతినిధి బృందం, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపార నేతలకు ఆతిథ్యం ఇచ్చింది. ఈ కార్యక్రమం.. హడ్సన్ ఇన్‌స్టిట్యూట్ బోర్డు సభ్యులు, విధాన నిర్ణేతలు, పౌర నాయకులు, దేశాన్ని సందర్శిస్తున్న ప్రముఖ పెట్టుబడిదారులను ఒకే వేదికపైకి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా ఐఆర్‌ఏ రియల్టీ సీఈఓ నర్సిరెడ్డి పోషం మాట్లాడుతూ 'ప్రతిష్టాత్మక హడ్సన్ ఇన్‌స్టిట్యూట్, అమెరికా నుంచి వచ్చిన ఇతర ప్రముఖులకు ఆతిథ్యం ఇవ్వడం ఐఆర్‌ఏ రియల్టీకి గౌరవంగా భావిస్తున్నాం. రెండు దేశాల మధ్య సంబంధాలను, ముఖ్యంగా వాణిజ్యరంగంలో బలపరిచే చర్చలకు మా వంతు సహకారం అందించడం ఆనందంగా ఉంది. నేడు హైదరాబాద్ ప్రపంచ దృష్టిని ఆకర్షించే కేంద్రంగా నిలిచి ప్రతిభ, ఆవిష్కరణలు, ఐటీ, ఫార్మా రంగాల్లో సాధించిన ప్రగతితో స్థిరమైన అభివృద్ధికి ఒక మోడల్‌గా అవతరించింది' అని పేర్కొన్నారు.



స్కాట్లాండ్‌లో నృసింహుని కల్యాణం

యాదగిరిగుట్ట: స్కాట్లాండ్‌లోని ఎడింగ్‌బరోలో యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ముందుగా సుప్రభాత సేవ, ఆరాధన, అభిషేకం వంటి పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని హిందూ మందిర్‌లో పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనృసింహ వైభవం నృత్య నాటిక, పేరిణి నృత్యం నిర్వహించారు.


విద్యార్థినులను ఇంటికి తీసుకెళ్తున్న దృశ్యం

బిల్లు రాదు.. భోజనం లేదు

విద్యార్థినులను ఇళ్లకు పంపేసిన కేజీబీవీ

మంచిర్యాల రూరల్ (హాజీపూర్): బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ రేషన్ సరుకులు పంపించడం మానేశాడు. వారం రోజుల పాటు ఎస్‌వో స్వప్న విద్యార్థినుల ఆకలి తీర్చినా ఆర్థిక ఇబ్బందులు తాళలేక వారిని ఇళ్లకు పంపించేశారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం కర్ణమామిడి కేజీబీవీలో.. ఆరు నుంచి ఇంటర్ వరకు 240 మంది విద్యార్థినులు చదువుతున్నారు. సరుకులను కాంట్రాక్టర్ రాజేందర్ సరఫరా చేస్తుంటాడు. నాలుగు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో.. సరఫరా నిలిపివేశాడు. శనివారం సరుకులు ఖాళీ కావడంతో విద్యార్థులకు భోజన వసతి కల్పించడం కష్టంగా మారింది. ఇప్పటికే వారం రోజులు విద్యార్థులకు అల్పాహారం, భోజనం ఎస్‌వో ఏర్పాటు చేశారు. ఆర్థికభారం కావడం, రెండో శనివారం, ఆదివారం సెలవులు రావడంతో స్వప్న ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు.. విద్యార్థినుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి తీసుకెళ్లే ఏర్పాటు చేశారు. ఇంటర్, 10వ తరగతి విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తుండగా.. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులను ఇళ్లకు పంపించారు.


ప్రీ ప్రైమరీ విద్యార్థులకోసం ఇలా..

సర్కారు వారి పబ్లిక్ స్కూల్

పబ్లిక్ స్కూల్ అంటే మనకు వెంటనే గుర్తుకొచ్చేది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్. అక్కడ చదువుతోపాటు ఆటపాటలు, సరికొత్త ఆలోచనలతో కూడిన బోధన, అభ్యసన కార్యక్రమాలు కొనసాగుతాయి. ఇలాంటి పాఠశాలను ఏకంగా ప్రభుత్వమే నిర్వహిస్తే ఇంకేముంది.. పేద, మధ్యతరగతి పిల్లలంతా పరుగెత్తి అందులో చేరిపోతారు. అలాంటిదే ఇక్కడా జరిగింది. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి మార్గనిర్దేశంలో ఏర్పాటైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఇప్పుడు ఈ ప్రాంతంలో అత్యంత ప్రాచుర్యం పొందింది. ఒకవైపు మౌలిక వసతుల కల్పన కొనసాగుతుండగానే... వందల మంది విద్యార్థులతో ఇప్పుడు ఈ పాఠశాల కళకళలాడుతోంది. పూర్వ ప్రాథమికం నుంచి ఇంటర్ వరకు ఒకే ప్రహరీలో బోధన సాగుతోంది.

సాక్షి, హైదరాబాద్: రెసిడెన్షియల్ విధానంలో కాకుండా డే స్కాలర్ పద్ధతిలో మరిన్ని స్కూళ్లు ఏర్పాటు చేసే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్)పై కొన్ని సూచనలు చేశారు. దీంతో రాష్ట్రంలో నాలుగు చోట్ల టీపీఎస్‌లు ఏర్పాటయ్యాయి. ఒకే ప్రాంగణంలోకి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను జత చేయడంతోపాటు అక్కడే పూర్వప్రాథమిక పాఠశాలతో పాటు జూనియర్ కాలేజీ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఇలా రంగారెడ్డి జిల్లాలో ఆరుట్ల, మంచాల, నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు, పోల్కంపల్లిలో వీటిని ఏర్పాటు చేశారు. ఆరుట్ల టీపీఎస్‌లో ఇప్పటికే వివిధ మౌలిక వసతుల కల్పన ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది.

నాలుగు చోట్ల ఇలా...

- **ఆరుట్ల టీపీఎస్:** ప్రాథమిక, ఉన్నత పాఠశాలతోపాటు తెలంగాణ మోడల్ స్కూల్‌ను ఒకే చోటకు తీసుకొచ్చారు. ఇక్కడ నర్సరీ నుంచి ఇంటర్‌వరకు తరగతులు నిర్వహిస్తున్నారు.
- **మంచాల టీపీఎస్:** ప్రాథమిక పాఠశాలతో పాటు జెడ్పీహెచ్‌ఎస్(బాలికలు), జెడ్పీహెచ్‌ఎస్(బాలురు)లను ఒకే చోటకు తీసుకొచ్చారు. ఇక్కడ నర్సరీ నుంచి పదోతరగతి వరకు ఉంది.
- **వంగూరు టీపీఎస్:** ఎంపీపీఎస్ వంగూరు, జెడ్పీహెచ్‌ఎస్(బాలికలు), జెడ్పీహెచ్‌ఎస్(బాలురు), కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కాలేజీలను ఒకే చోటకు తీసుకొచ్చారు. ఇక్కడ నర్సరీ నుంచి ఇంటర్ వరకు తరగతులు కొనసాగుతాయి.
- **పోల్కంపల్లి టీపీఎస్:** ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఒకే చోటకు చేర్చాలని ఆదేశించింది. ఇక్కడ నర్సరీ నుంచి పదోతరగతి వరకు బోధన జరుగుతోంది.

రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు చోట్ల ఏర్పాటు

- డే స్కాలర్ తరహాలో విద్యా సంస్థల నిర్వహణ
- ఆరుట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థులతో కళకళ
- నర్సరీ నుంచి ఇంటర్ వరకు విద్యాబోధన
- అత్యాధునిక స్థాయిలో వసతుల కల్పన



ఎస్‌డీఎంసీ కీలకం...

తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో పాఠశాల అభివృద్ధి నిర్వహణ కమిటీ (ఎస్‌డీఎంసీ)లే కీలక పాత్ర పోషిస్తాయి. పాఠశాల పరిధిలో ఎలాంటి పనులైనా టెండర్లు లేకుండా కేవలం ఎస్‌డీఎంసీల ఆమోదం, పర్యవేక్షణలోనే నిర్వహించాలి. ప్రస్తుతం ఆరుట్ల టీపీఎస్‌లో ఇదే తరహాలో అభివృద్ధి పనులు సాగుతున్నాయి. ఎస్‌డీఎంసీలో 23 మంది సభ్యులున్నారు.

- ఇప్పటికే బాస్కెట్‌బాల్ కోర్టు, బాక్స్ క్రికెట్ , కోకో గ్రౌండ్ పూర్తయ్యాయి.
- గ్రంథాలయం, డైనింగ్ హాళ్లు, సీసీరోడ్డు పనులు కొనసాగుతున్నాయి.
- క్లాస్‌రూమ్‌లు కూడా రంగురంగుల్లో అత్యాధునిక ఫర్నిచర్‌తో ఏర్పాటు చేశారు.
- వివిధ రకాల ఆటవస్తువులు అందుబాటులో ఉండడంతో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా బడికి వస్తున్నారు.



అప్పుడు 700 మంది.. ఇప్పుడు 1,629 మంది విద్యార్థులు

ప్రస్తుతం ఆరుట్ల టీపీఎస్ పరిధిలో పూర్వ ప్రాథమిక పాఠశాలను కొత్తగా ఏర్పాటు చేశారు. ఇందులో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలు రెండేసి సెక్షన్లున్నాయి. మొత్తం ఆరు సెక్షన్ల పరిధిలో 126 మంది చిన్నారులున్నారు.

- ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్ ముందు నుంచే కొనసాగుతున్నాయి. ఈ మూడింటిలో 700 మంది ఉండగా... టీపీఎస్ తర్వాత విద్యార్థుల సంఖ్య 1,629కు చేరింది.
- ప్రాథమిక పాఠశాలలో ఇదివరకు 90 మంది విద్యార్థులుండగా... ఇప్పుడా సంఖ్య 514కు చేరింది.
- ఉన్నత పాఠశాలలో విద్యార్థులు 250 నుంచి 360కి పెరిగారు. మోడల్ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య 350 నుంచి 629కి చేరింది.
- ప్రీప్రైమరీ టీచర్లను కమిటీ ఆధ్వర్యంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించారు. ఒక్కో టీచర్‌కు రూ.15 వేలు, ఆయాకు రూ.10 వేలు వేతనాలిస్తున్నారు.

బస్సుల నిర్వహణకు రాయితీ



బస్సుల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. ఒక్కో బస్సుపై గరిష్టంగా రూ.12.5 లక్షలు రాయితీ ఉంది. ఆరుట్లలో మూడు బస్సులు నడుపుతూ 200 మంది విద్యార్థులను సమీప గ్రామాల నుంచి రోజూ స్కూల్‌కు చేర్చుతున్నారు. బస్సు నిర్వహణ కోసం వాటిల్లో వచ్చే విద్యార్థుల నుంచి నామమాత్రంగా ఫీజులు తీసుకుంటున్నారు.

సీఎస్‌ఆర్ కింద రూ.3 కోట్లు వచ్చాయి



పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం ఇచ్చే నిధులకు అదనంగా సీఎస్‌ఆర్ నిధులు కూడా దాదాపు రూ. 3 కోట్ల వరకు రాగా, అభివృద్ధి పనులకు ఖర్చు చేశాం. పనులను విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. **-ఎస్.గిరిధర్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు**

టీచర్ల పిల్లలూ ఇక్కడే...



మా పాఠశాలలో దాదాపు 20 మంది పిల్లల తల్లిదండ్రులు ఇక్కడ టీచర్లుగా పనిచేస్తున్నారు. ప్రతి శనివారం ఎస్‌డీఎంసీ సమావేశం జరుగుతుంది. కమిటీ సభ్యులు తప్పకుండా హాజరవుతారు. ఆ సమావేశంలో చర్చలు జరిపి అవసరాలకు అనుగుణంగా తీర్మానం చేసి కార్యాచరణ మొదలుపెడతాం. **- కంబాలపల్లి భాస్కర్, ఎస్‌డీఎంసీ సభ్యుడు**

ప్రధాని మోదీతో రామ్‌చరణ్, ఉపాసన, అనిల్ కామినేని



ప్రధాని మోదీని కలిసిన రామ్‌చరణ్

ఆర్చరీ ప్రీమియర్ లీగ్ తొలి సీజన్ పూర్తయిన సందర్భంగా భేటీ

సాక్షి, హైదరాబాద్: గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్, ఆర్చరీ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) చైర్మన్ అనిల్ కామినేని, ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు వీరేందర్ సచ్‌దేవాతో కలిసి ఢిల్లీలో శనివారం ప్రధాని నరేంద్రమోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో భాగంగా ఏపీఎల్ తొలి సీజన్ విజయవంతంగా పూర్తయిన సందర్భంగా ప్రధానికి ఒక సింబాలిక్ బౌని అందజేశారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ మాట్లాడుతూ ప్రధానమంత్రిని కలిసి ఆర్చరీ ప్రీమియర్ లీగ్ వెనుక ఉన్న విజన్‌ను పంచుకోవడం గర్వంగా ఉందన్నారు. విలువిద్య మన సాంస్కృతిక వారసత్వంలో ఒక ముఖ్యమైన భాగమని, ఆర్చరీ ప్రీమియర్ లీగ్ ద్వారా దీన్ని తిరిగి ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా చేయాలన్నది తమ ఆశయమని ప్రధానికి వివరించినట్లు తెలిపారు. దేశంలో అద్భుతమైన ప్రతిభ ఉందని, ఈ వేదిక వారిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో సహాయపడుతుందని సంతోషాన్ని వ్యక్తంచేశారు. ఈ భేటీలో రామ్‌చరణ్‌తో పాటు ఆయన భార్య ఉపాసన కామినేని కొణిదెల కూడా పాల్గొన్నారు. ఆమె రామ్‌చరణ్ తల్లిదండ్రులు చిరంజీవి, సురేఖ తరఫున ప్రధానికి బాలాజీ విగ్రహం, సంప్రదాయ పూజా కిట్‌ని బహూకరించారు.



అదరహో ఆదివాసీ బడి

సంస్కృతీసంప్రదాయ చిత్రాలతో పాఠశాల నిర్మాణం

ఎస్‌ఎస్‌తాడ్వాయి: చుట్టూ గోడలకు ఎర్రటి మట్టి అలికి రకరకాల చిత్రాలతో అదిరిందయ్యా.. ఆదివాసీ బడి అన్నట్లు ఉంది. ములుగు జిల్లా ఎస్‌ఎస్ తాడ్వాయి మండలం జలగలంచ, కొండపర్తి క్రాస్ వద్ద చెన్నాపురం తొగు గొత్తికోయ గూడెంలో మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఆదివాసీ సంస్కృతీసంప్రదాయా చిత్రాలతో జిల్లా అధికారులు పాఠశాలలను నిర్మించారు. ఒక్కో గూడెంలో రూ.3 లక్షల చొప్పున ఖర్చు చేశారు. గోడలను మాత్రమే సిమెంట్‌తో కట్టారు. పాఠశాల పైభాగంలో కర్రలతో వాసాలను ఏర్పాటు చేసి పెంకులను అమర్చారు. పాఠశాల లోపల గొత్తికోయ, ఆదివాసీ చిన్నారులకు సులభంగా చదువు అర్థమయ్యేలా బొమ్మలతోపాటు మహనీయుల చిత్రాలను గోడలపై పెయింటింగ్ వేశారు. గూడెంలోని పాఠశాలలను చూసిన వారికి ఇవి చూడముచ్చటగా దర్శనమిస్తున్నాయి.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

శ్రీవారి దర్శనానికి 20 గంటలు



తిరుమల: తిరుమలలో శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్టుమెంట్లు అన్నీ నిండిపోయాయి. భక్తులు వేచి ఉన్న క్యూ కృష్ణ తేజ అతిథి గృహం వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 74,468 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,878 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.86 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 20 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

కమనీయం..కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్య కల్యాణ మండపంలో కొలువుదీర్చి ఆభరణాలు, పుష్పాలతో అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చరణలతో కల్యాణం నిర్వహించారు. సాయంత్రం స్వామిఅమ్మ వార్లను తిరుచ్చిలో సహస్ర దీపాలంకరణ మండపంలోకి తీసుకొచ్చి అర్చకులు ఊంజల్ సేవ నిర్వహించారు.

ద్వారకా తిరుమలకు పోటెత్తిన భక్తులు



అనివేటి మండపంలో భక్తుల రద్దీ

ద్వారకా తిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని శ్రీవారి దివ్య క్షేత్రం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దీంతో క్షేత్ర పరిసరాలు భక్తజన సంద్రమయ్యాయి. దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కల్యాణకట్ట, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ తదితర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం ఐదు గంటల వరకు దర్శనం టికెట్లు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.32 లక్షల ఆదాయం లభించినట్టు ఆలయ అధికారులు తెలిపారు. శ్రీవారి క్షేత్రంతో పాటు పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి,శనివారం ఉదయం అధిక సంఖ్యలో వివాహాలు జరిగాయి. దీంతో కొత్త జంటలు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకొన్నారు.

పారిజాతగిరి ప్రదక్షిణలో వేలాదిగా భక్తులు

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి ప్రీతికరమైన రోజు శనివారం కావడంతో వేకువజామున సుప్రభాత సేవ, తోమాల సేవ, ఆరాధన, తీర్థ ప్రసాద గోష్టి, బాల భోగ నివేదన అనంతరం శ్రీ స్వామివారికి ప్రత్యేక పూల అలంకరణతో భక్తులకు విశేష దర్శనం కల్పించారు. భక్తులు వేలాది సంఖ్యలో గిరిప్రదక్షిణ, కంకణ ధారణ, తిరునామంతో కాలినడకన శ్రీస్వామివారి కొండ పైకి వెళ్లి ప్రత్యేక దర్శనం, అష్టోత్తర పూజలు జరిపించుకున్నారు. శ్రీ స్వామివారి తీర్థ ప్రసాదం స్వీకరించి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కలగల శ్రీనివాస్ ఏర్పాట్లు చేశారు. శనివారం వివిధ రూపాల్లో మొత్తం రూ.1,19,852 ఆదాయం వచ్చినట్టు కార్యనిర్వహణాధికారి తెలిపారు.

కోడికి పందెం పాఠాలు



సంక్రాంతి కోడి పందేలకు మూడు నెలల ముందు నుంచే పుంజులకు శిక్షణ



పందేంకోళ్లకు అందించే ప్రత్యేక మెనూ

- ఉదయాన్నే వేడి నీరు, వాకింగ్, స్విమ్మింగ్, వార్మప్
- మేతగా మటన్, గుడ్లు, బాదం, ఎండు ఖర్జూరం, వెల్లుల్లితో ప్రత్యేక మెనూ
- ఒక్కో పుంజుకు రూ.30 వేల వరకు శిక్షణ వ్యయం
- పశ్చిమగోదావరిలో 200కు పైగా పెంపకం కేంద్రాలు
- సంక్రాంతి సీజన్‌కు రూ.10 కోట్లకు పైనే వ్యాపారం

పుంజులకు పందెం పాఠాలేంటీ అనుకుంటున్నారా? సంక్రాంతి కోడిపందేలకు పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం ఎంత ఫేమస్సో తెలిసిందే. రూ.కోట్లలో చేతులు మారడం ఒకెత్తయితే.. తమ కోడి.. పందెం కొట్టడం ప్రతిష్టాత్మకంగా భావించడం మరో ఎత్తు. పుంజులను పందేలకు సిద్ధం చేసేందుకు మూడు నెలల ముందు నుంచి పెద్ద కసరత్తే జరుగుతుంది. రానున్న సంక్రాంతి కోసం దసరా నుంచే పందెంరాయుళ్లు తమ పుంజులకు శిక్షణ ప్రారంభించారు. సంక్రాంతి పండుగ రోజుల్లో భీమవరం, కోనసీమ ప్రాంతాల్లో రూ.కోట్లు వెచ్చించి ప్రత్యేకంగా బరులు ఏర్పాటుచేసి కోడిపందేలు నిర్వహిస్తుంటారు. వీటిని చూసేందుకు సినీ, రాజకీయ ప్రముఖులు ఎందరో తరలివస్తుంటారు. అందుకు తగ్గట్టే పుంజుల పెంపకంలో పందేలరాయుళ్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. అధిక శాతం మంది తమ ఇళ్లు, మకాంల వద్ద పుంజులను పెంచితే.. పండుగలకు దేశ విదేశాల నుంచి వచ్చేవారు తెలిసిన ట్రైనర్లతో శిక్షణ ఇప్పిస్తుంటారు.

సాక్షి, భీమవరం

మెనూ ప్రత్యేకమే..

పుంజులో శక్తి, సామర్థ్యం పెంచేందుకు, శరీరంలో కొవ్వు చేరకుండా తేలిగ్గా ఎగురుతూ ప్రత్యర్థిపై విరుచుకుపడేందుకు మూడునెలలు ప్రత్యేక మేత అందిస్తారు. పుంజు బరువును బట్టి ఉదయం పూట 20 నుంచి 40 గ్రాముల వరకు ఉడకబెట్టిన మటన్, మూడు నుంచి ఐదు వరకు బాదం, రెండు వెల్లుల్లి, ఒక ఎండు ఖర్జూరం, కోడిగుడ్డు ముక్కలు చేసి పెడతారు. తిరిగి సాయంత్రం ఎప్పటి మాదిరి రాగులు, గంటులు, అరికలు మొదలైన వాటిని అందిస్తారు. పుంజు అనారోగ్యం, వైరస్‌ల బారిన పడకుండా తరచూ పశువైద్యుడిని తీసుకువచ్చి పరీక్షలు చేయించి మందులు వేయించడం, మరెన్నో సంప్రదాయ ఆయుర్వేద పద్ధతులు అవలంబించడం చేస్తుంటారు.

అంతా గోప్యమే

కాకి, నెమలి, అబ్రాస్, డేగ, పచ్చకాకి, కేతువ తదితర జాతుల నుంచి రెండేళ్ల వయస్సు కలిగిన పుంజులను పందేలకు వినియోగిస్తుంటారు. పుంజుకు పోరాట పటిమ, శరీర పటుత్వం, శక్తిని పెంచేందుకు మూడు నెలల ముందు నుంచి ఎవరికి వారు ఎన్నో సంప్రదాయ, ఆధునిక పద్ధతులు పాటిస్తుంటారు. వాటికిచ్చే ఆహారం, మందుల నుంచి శిక్షణ వరకు ప్రతి విషయంలోనూ గోప్యత పాటిస్తారు.

శిక్షణ మొదలవుతుందిలా..

ఉదయాన్నే పుంజును బయటకు తెచ్చి కొద్దిగా వేడి నీటిని పట్టిస్తారు. కాళ్లలో పటుత్వం, ఆయాసం రాకుండా, అనారోగ్య సమస్యలుంటే గుర్తించేందుకు నెలరోజుల పాటు రోజు విడిచి రోజు చెరువులు, నీటి తొట్టెల్లో ఈత కొట్టిస్తారు. 'వి' (ఇంగ్లిష్ లెటర్) ఆకారంలో నెట్‌లు కట్టి పుంజు అందులోనే తిరిగే విధంగా బేటా (నిర్ణీత పద్ధతిలో వాకింగ్) చేయిస్తారు. మరికొందరు ఖాళీ జాగాలో వాటి వెనుకే ఉండి తరుముతూ పరుగులు పెట్టిస్తారు. కోడి నోటి నుంచి వచ్చే కఫాన్ని తొలగించి శుభ్రం చేస్తారు. మేత పెట్టి 11 గంటల సమయం వరకు ఎండలో కట్టేసిన తర్వాత మకాంలోకి మార్చేస్తుంటారు. పండుగలు దగ్గరపడే కొద్దీ పుంజు శరీరం గట్టిపడేందుకు, నొప్పులు తగ్గడానికి ప్రత్యేక ట్రైనర్లతో వేప, జామాయిల్, కుంకుడు తదితర ఆకులు, తుమ్మ బెరడు, తోక మిరియాలు, పసుపు కొమ్ములు తదితర 20 రకాలతో గంటల కొద్దీ మరిగించిన ద్రావణాన్ని కోడి తట్టుకునే వేడి వరకు చల్లార్చి పుంజును అందులో ఉంచి పైనుంచి ద్రావణం పోస్తారు. వారంలో ఒకటి రెండు సార్లు ఇలా చేస్తారు. చివరిగా పొయ్యిపై మూకుడు వేడిచేస్తూ అందులో చీప్ లిక్కర్ చిమ్మినప్పుడు వచ్చిన ఆవిరిని మెత్తటి గుడ్డకు పట్టించి దానిని కోడి శరీరం అంతా అద్దుతూ శాఖల చేయిస్తారు. పందేలకు ముందు అలసిపోకుండా నాలుగైదు రోజుల ముందు నుంచి పుంజుకు పూర్తి విశ్రాంతినిచ్చి మకాంలో కట్టేసి ఉంచుతారు. ఈ ప్రక్రియలన్నిటినీ నిర్ణీత పద్ధతుల్లో చేయిస్తుంటారు.



కోడిపుంజును నీటిలో ఈతకొట్టిస్తున్న ట్రైనర్



పందెంకోళ్లను ఆరుబయట కట్టిన దృశ్యం

కోట్లలో వ్యాపారం..



మకాంల వద్ద పనిచేసే వారికి నెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు జీతాలుంటాయి. వీరు ఒక్కొక్కరు 12 నుంచి 15 పుంజులను మాత్రమే పర్యవేక్షిస్తారు. నీళ్ల పోతలు, శాఖల కోసం వచ్చే ట్రైనర్లకు సిట్టింగ్‌కు కొంత మొత్తం మాట్లాడుకుంటారు. ఇవి కాకుండా కోడికి అందించే ప్రత్యేక మేత, మందులతో ఒక్కో పందెం పుంజుకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చవుతుందంటున్నారు. వీటి జాతి, రంగు, ఎత్తును బట్టి రూ.50 వేల నుంచి లక్షల్లో అమ్ముతుంటారు. మామూలుగా ఇళ్ల వద్ద పెంచిన పుంజులు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు అమ్మకాలు చేస్తుంటారు. పండుగల కోసం నాలుగు వేలకు పైగా పందెం కోళ్ల అమ్మకాలు జరుగుతుంటాయి. వీటి ద్వారా రూ.10 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందని అంచనా. పుంజులకు ఉన్న డిమాండ్‌తో జిల్లాలోని భీమవరం, ఉండి, ఆకివీడు, పాలకోడేరు, పాలకొల్లు, కాళ్ల తదితర మండలాల్లో 200కు పైగా నాటుకోళ్ల పెంపకం కేంద్రాలు ఉన్నాయి. కొందరు స్థలాలను లీజుకు తీసుకుని వీటి పెంపకం సాగిస్తుంటారు. సామర్థ్యాన్ని బట్టి ఒక్కోచోట వంద నుంచి 250 వరకు వివిధ రకాల జాతుల పుంజులు, కోళ్లను పెంచుతుంటారు.




మకాంలోని కోడి పుంజులు



పుంజుకు నీళ్ల పోతలు చేయిస్తున్న దృశ్యం (ఫైల్)

చీనీ మనుగడ ప్రశ్నార్థకం



- గడ్డిమందు పిచికారీ వల్ల తగ్గుతున్న జీవితకాలం
- తెగుళ్లు, చీడపీడల వ్యాప్తితో దిగుబడిపై ప్రభావం
- పెరిగిన పెట్టుబడులతో రైతులకు దక్కని లాభం
- ఉద్యానశాఖ అధ్యయనంలో బహిర్గతం
- ఉమ్మడి జిల్లాలో 52 వేల హెక్టార్లలో చీనీతోటలు

చీనీ సాగుకు ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రసిద్ధి. ఇక్కడి నేలల్లో పండే చీనీ రుచికరంగా ఉంటుందని పేరు. దేశంలోనే అత్యధిక విస్తీర్ణంలో ఇక్కడే సాగవుతోంది. ఇక్కడి నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. అలాంటి చీనీ తోటల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. రైతులు అవలంబిస్తున్న సాగు పద్ధతులే ఇందుకు కారణం. ఇదే విషయాన్ని ఉద్యానశాఖ అధ్యయన బృందం తేల్చి చెప్పింది.

అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం జిల్లాలో చీనీ తోటల స్థితిగతులపై ఉద్యానశాఖ కమిషనరేట్ జేడీ డాక్టర్ దేవమునిరెడ్డి, తిరుపతి చీనీ, నిమ్మ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరెడ్డితో కూడిన బృందం ఈ నెల 7, 8, 9 తేదీల్లో అధ్యయనం చేసింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఉద్యానశాఖ డీడీలు ఉమాదేవి, చంద్రశేఖర్, ఇతర క్షేత్రస్థాయి అధికారులతో కలిసి గార్లదిన్నె, నార్పల, కూడేరు, శింగనమల, రాప్తాడు, పుట్లూరు, యల్లనూరు, తాడిమర్రి, బత్తలపల్లి తదితర మండలాల్లో సాగు చేసిన చీనీతోటలను పరిశీలించి రైతుల అనుభవాలు తెలుసుకున్నారు. ప్రధానంగా మొక్కల ఎంపిక, పంటకాలంలో ఆచరిస్తున్న సాగు పద్ధతులు, చీడపీడల నివారణకు చేస్తున్న సస్యరక్షణ చర్యలు, నీటి నిర్వహణ, పంట కాలాలు, సీజన్లవారీగా పంట కోతలు, మార్కెటింగ్, గిట్టుబాటు ధరలు తదితర అన్ని అంశాలపై లోతుగా అధ్యయనం చేశారు. మూడు రోజుల అధ్యయనంలో అనేక సమస్యలను గుర్తించారు. ఇదే పరిస్థితి కొనసాగితే ముమ్ముందు చీనీతోటల మనుగడకు విఘాతం కలిగే పరిస్థితి ఉందని చెబుతున్నారు. వారి అధ్యయనంలో షాకింగ్ విషయాలు వెలుగుచూశాయి.

కలుపు మందుతో సమస్య..

చీనీలో కలుపు నివారణకు ఇటీవలి కాలంలో రైతులు ఎక్కువగా నిషేధిత గ్లైపోసేట్ (గ్లైసిల్)తో పాటు మరికొన్ని ప్రమాదకర గడ్డి మందులు వాడుతుండటం వల్ల తోటల జీవితకాలం తగ్గిపోతున్నట్లు గుర్తించారు. ట్రాక్టర్ లేదా కూలీల ద్వారా కలుపు నివారణ చర్యలు చేపడితే భూమి గుల్లబారిపోయి పంటకు ఉపయోగపడుతుంది. ప్రమాదకరమైన గడ్డి మందు వాడటం వల్ల చెట్లు తొందరగా చనిపోతున్నాయి. లైఫ్‌టైం (జీవిత కాలం) 20 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాలకు పడిపోయే ప్రమాదం ఉంది. విచ్చలవిడి రసాయన ఎరువులు, మోతాదుకు మించి పురుగు మందులు వాడుతుండటం వల్ల వైరస్ వ్యాప్తి పెరుగుతోంది. దీనివల్ల ఎండుతెగులు, వేరుకుళ్లు తెగులు, పొలుసు పురుగు, నల్లి, మంగు, బంకతెగులు లాంటి చీడపీడలు పెరిగిపోతున్నాయి. కాపునకు వచ్చిన పెద్ద పెద్ద చెట్లు సైతం ఉన్నఫళంగా ఎండిపోతున్నాయి.



గార్లదిన్నె సమీపంలో చీనీ రైతులతో మాట్లాడుతున్న ఉద్యానశాఖ జేడీ దేవమునిరెడ్డి, శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరెడ్డి

- మొక్కల ఎంపికలో కూడా రైతులు పొరపాట్లు చేస్తున్నారు. నర్సరీల నుంచి వైరస్ ఉన్న మొక్కలను తెచ్చుకోవడం వల్ల తోటలు దెబ్బతింటున్నాయి. సూక్ష్మపోషకాల లోపం ఎక్కువగా ఉంది. రంగపూర్ రకం కాకుండా జంబేరి అంట్లు కట్టిన మొక్కలనే నిర్వాహకులు రైతులకు అంటగడుతుండటంతో చీనీ తోటల జీవితకాలం గణనీయంగా తగ్గిపోతోంది. ఎకరాకు రూ.50 వేలు ఉండాల్సిన పెట్టుబడి ఇప్పుడు రూ.లక్ష వరకు పెరిగింది. దీంతో పంటకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. దిగుబడులు కూడా ఎకరాకు 15 టన్నులు రావాల్సి ఉండగా 10 టన్నులకు పడిపోతోంది. రంగపూర్ అంటు మొక్కలతో పాటు సాగు పద్ధతుల్లో మేలైన యాజమాన్యం పాటిస్తే తప్ప రైతులకు చీనీ తోటలు గిట్టుబాటయ్యే పరిస్థితి లేదని బృందం సభ్యులు చెబుతున్నారు.

చీనీ సాగులో అగ్రస్థానం..

రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా అనంతపురం జిల్లాలో 37 వేల హెక్టార్లు, శ్రీసత్యసాయి జిల్లాలో 15 వేల హెక్టార్లు.. వెరసి 52 వేల హెక్టార్ల భారీ విస్తీర్ణంలో చీనీ తోటలు సాగులో ఉన్నాయి. ఏటా అనంతపురం జిల్లాలో 7.43 లక్షల మెట్రిక్ టన్నులు, శ్రీసత్యసాయి జిల్లాలో 3 లక్షల మెట్రిక్ టన్నులు.. మొత్తంగా 10.43 లక్షల మెట్రిక్ టన్నుల ఫలసాయంతో దేశంలోనే అత్యధికంగా ఈ ప్రాంత రైతులు చీనీ పండిస్తున్నారు. జిల్లా నుంచి 70 శాతం పంట దిగుబడులు ఢిల్లీలో ఉన్న ప్రధాన మార్కెట్ అజాద్‌పూర్ మండీతో పాటు గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్తాన్ లాంటి పలు ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో చీనీ ద్వారా ఏటా రూ.2 వేల కోట్ల వరకు టర్నోవర్ జరుగుతున్నట్లు ఉద్యాన నివేదికలు చెబుతున్నాయి.

శ్యాంపిల్స్ సేకరణ

అధ్యయన బృందం సిఫారసు మేరకు ఎండుతెగులు, వేరుకుళ్లు తెగులు లాంటి ప్రధాన చీడపీడల వ్యాప్తికి స్పష్టమైన కారణాలు తెలుసుకునే నిమిత్తం చీనీ తోటల నుంచి శ్యాంపిల్స్ సేకరించి తిరుపతి పరిశోధన కేంద్రానికి పంపుతున్నట్లు జిల్లా అధికారి ఉమాదేవి తెలిపారు. అలాగే నర్సరీ నుంచి తెచ్చిన మొక్కల్లోనే వైరస్ ఉందా లేదా తెలుసుకునేందుకు 'వైరల్ ఇండెక్సియన్' కింద తల్లి మొక్కతో పాటు చిన్న మొక్కల శ్యాంపిల్స్ సేకరించామన్నారు. అలాగే జిల్లాలో ఉన్న చీనీ రైతుల వివరాల సేకరించి వాట్సాప్ గ్రూప్ తయారు చేసి రైతులకు అవసరమైన సలహాలు, సాగు పద్ధతులు తెలియజేస్తామన్నారు.

ఆదాయం వద్దు.. ప్రయివేట్ ముద్దు

శ్రీశైల దేవస్థానం ఎకరం భూమిలో హరిత రిసార్ట్ ఏర్పాటు

- వైఎస్సార్సీపీ హయాంలో రూ.14.75 కోట్లతో అభివృద్ధి
- 98 శాతం ఆక్యుపెన్సీతో నెలకు రూ.57 లక్షల ఆదాయం
- అయినా ప్రైవేట్‌పరం చేసేందుకు ప్రభుత్వం అడుగులు



శ్రీశైలం హరిత రిసార్ట్ ముఖ ద్వారం

శ్రీశైలం టెంపుల్: పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీ టీడీసీ) యూనిట్లను కూటమి ప్రభుత్వం ప్రయివేట్‌కు అప్పగించేందుకు అడుగులు వేస్తోంది. ప్రసిద్ధ శ్రీశైలం దేవస్థానం పరిధిలో ఉన్న ఏపీ టూరిజంకు చెందిన హరిత రిసార్ట్‌ను ఇలానే వ్యక్తులకు కట్టబెట్టనుంది. 2002లో దాదాపు రూ.కోటితో 32 రూములతో ఈ రిసార్ట్ ప్రారంభమైంది. అంచలంచెలుగా అభివృద్ధి చెందుతూ వచ్చింది. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం టూరిజంపై ప్రత్యేక శ్రద్ధ చూపి మరింత మెరుగుపరిచింది. ప్రస్తుతం 124 రూములతో భక్తులకు సేవలందిస్తోంది. 98 శాతం ఆక్యుపెన్సీతో టూరిజం శాఖకు నెలకు రూ.57 లక్షల ఆదాయం ఒక్క హరిత రిసార్ట్ నుంచే వస్తోంది. అయినా, ప్రైవేట్‌కు ఇచ్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తుండడంతో టూరిజం ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు.

- శ్రీశైల దేవస్థానానికి చెందిన ఎకరం భూమిలో ఏపీ టూరిజం శాఖ ఆధ్వర్యంలో హరిత రిసార్ట్ ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలందించాలనే ఉద్దేశం, లక్ష్యంతో నామమాత్ర రుసుము, భూమి అద్దెతో ఈ భూమిని 23 ఏళ్ల క్రితం టూరిజం శాఖకు కేటాయించారు. 2002లో రూ.కోటితో 32 వసతి గదులు, హోటల్ నిర్మించారు. సామాన్య భక్తులకు సైతం వసతి గదులు అందుబాటులో ఉండేలా హరిత రిసార్ట్ ఏర్పాటు చేశారు. ఆదరణ బాగుండడంతో 2009లో మరో 44 గదులను నిర్మించారు.
- హరిత రిసార్ట్‌ను మరింత అభివృద్ధి చేసి పర్యాటకులకు మెరుగైన సేవలు అందించాలని వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో సీఎం వైఎస్ జగన్ సంకల్పించారు. అందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో రూ.14.97 కోట్లతో టెండర్లను పిలిచి 2024 మార్చిలో పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేశారు. ప్రస్తుతం శ్రీశైలం హరిత రిసార్ట్‌లో పాత, కొత్త భవనాల్లో 124 వసతి గదులు ఉన్నాయి.
- వీటిలో 12 నాన్ ఏసీ గదులు (రోజుకు రూ.1,232), 44 ఏసీ గదులు (రోజుకు రూ.1,904), 24 డీలక్స్ గదులు (రోజుకు రూ.2,128), ఇవికాక 8 ఎగ్జిక్యూటివ్ గదులు (రోజుకు రూ.2,688) ఉన్నాయి. వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో నిర్మించిన 36 గదులు, కొత్త హంగులతో నిర్మించిన రెస్టారెంట్ ఇంకా ప్రారంభించాల్సి ఉంది.
- శ్రీశైలం హరిత రెస్టారెంట్ పర్యటకుల మన్ననలు పొందుతోంది. 2022లో నెలకు రూ.32 లక్షలున్న ఆదాయం అప్పటి వైఎస్సార్సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టడంతో మరింత పెరిగింది. కేవలం ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్న హరిత రిసార్ట్ 98 శాతం ఆక్యుపెన్సీ సాధించింది. రిసార్ట్ నుంచి నెలకు రూ.57 లక్షల ఆదాయం టూరిజం శాఖకు లభిస్తోంది.
- రిసార్ట్‌లో 23 ఏళ్ల నుంచి వివిధ కేటగిరీల్లో 45 మంది విధులు నిర్వహిస్తున్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో 26, ఔట్‌సోర్సింగ్‌లో 9, సెక్యూరిటీలో ముగ్గురు పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేస్తానని ప్రకటించడంతో వీరంతా ఆందోళన చెందుతున్నారు.



శ్రీశైలం హరిత రిసార్ట్‌లో నూతనంగా నిర్మించిన గదులు, రెస్టారెంట్

ప్రైవేట్‌కు అప్పగిస్తే క్షేత్ర పవిత్రతకు ముప్పు!

శ్రీశైల మహాక్షేత్రంలో ఉన్న హరిత రిసార్ట్‌ను ప్రైవేట్ వ్యక్తుల చేతిలో పెడితే పవిత్రతకు ముప్పు వాటిల్లుతుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది. ధరలు అందుబాటులో ఉండకపోగా, వసతి గదుల్లో అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రమాదం లేకపోలేదు. ప్రస్తుతం హరిత రిసార్ట్ స్థలం దేవస్థానానికి చెందినది. ప్రభుత్వం ప్రైవేట్‌కు అప్పగించాలనే ఉద్దేశంలోనే ఉంటే.. హరిత రిసార్ట్‌ను దేవస్థానమే నిర్వహించేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.



● త్రిష ● చిరంజీవి ● నయనతార ● వెంకటేశ్ ● మీనా ● నాగార్జున ● టబు



● ప్రభాస్ ● శ్రుతీ హాసన్ ● ప్రియాంకా మోహన్, నాని

సిల్వర్ స్క్రీన్‌పై కొన్ని జంటల మధ్య కెమిస్ట్రీ బాగుంటుంది. ఆ జంటను మరిన్ని సినిమాల్లో చూడాలనేంతగా వారి మధ్య కెమిస్ట్రీ వర్కవుట్ అవుతుంది. పైగా ఈ పెయిర్ నటించిన సినిమా హిట్ అయితే... 'హిట్ జోడీ' అనే పేరు కూడా వస్తుంది. అలా వెండితెరపై తమ కెమిస్ట్రీతో ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు హిట్ కూడా అందుకున్న కొన్ని జంటలు మళ్లీ కలిసి నటిస్తున్నాయి. ఒకరు రెండోసారి జత కడితే... మరొకరు మూడోసారి... ఇంకొకరు ఏకంగా ఏడో సారి... ఇలా హిట్ మేజిక్‌ని రిపీట్ చేయడానికి రిపీట్ అవుతున్న జోడీల గురించి తెలుసుకుందాం.



● రవితేజ, శ్రీలీల



● శర్వానంద్



● అనుపమ ● రెబా మోనిక



● శ్రీవిష్ణు



● రష్మిక, విజయ్ దేవరకొండ



● వైష్ణవీ చైతన్య, ఆనంద్ దేవరకొండ

జోడీ మేజిక్ రిపీట్

ఎన్నాళ్లకెన్నాళ్లకు...

హీరో చిరంజీవి, హీరోయిన్ త్రిష కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'స్టాలిన్'. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2006 సెప్టెంబరు 20న విడుదలై, హిట్‌గా నిలిచింది. ఆ తర్వాత వీరి కాంబోలో మరో సినిమా రాలేదు. 19 ఏళ్ల తర్వాత వీరి జోడీ 'విశ్వంభర' సినిమాతో రిపీట్ అవుతోంది. 'బింబిసార' మూవీ ఫేమ్ మల్లిడి వశిష్ఠ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. విక్రమ్ రెడ్డి సమర్పణలో వంశీకృష్ణా రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో త్రిష మెయిన్ హీరోయిన్ కాగా ఆషికా రంగనాథ్ మరో హీరోయిన్. సోషియో ఫ్యాంటసీ అడ్వెంచరస్ ఫిల్మ్‌గా రూపొందుతోన్న 'విశ్వంభర' 2026 వేసవిలో విడుదల కానుంది.

రెండోసారి...

హీరో చిరంజీవి- హీరోయిన్ నయనతార కాంబినేషన్ రెండోసారి రిపీట్ అవుతోంది. వీరిద్దరూ తొలిసారి 'సైరా నరసింహారెడ్డి' సినిమాలో నటించారు. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమా 2019 అక్టోబరు 2న రిలీజైంది. ఆ తర్వాత చిరంజీవి, నయనతార కలిసి 'గాడ్ ఫాదర్' (2022) చిత్రంలో అన్నా-చెల్లెలుగా నటించారు. తాజాగా వీరిద్దరూ జంటగా నటిస్తున్న సినిమా 'మన శంకర వరప్రసాద్ గారు'. ఈ చిత్రానికి అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల ఈ మూవీ నిర్మిస్తున్నారు. దసరా సందర్భంగా ఈ సినిమా నుంచి చిరంజీవి-నయనతార సందడి చేసిన 'మీసాల పిల్ల...' అంటూ సాగే తొలి పాట ప్రోమోని విడుదల చేయగా అద్భుతమైన స్పందన వస్తోంది. ఈ సినిమా 2026 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది.

27 ఏళ్ల తర్వాత...

కొన్ని జంటలు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆసక్తిని రేకెత్తిస్తుంటాయి. హీరో నాగార్జున, హీరోయిన్ టబు జోడీ కూడా అలాంటిదే. కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'నిన్నే పెళ్లాడతా' సినిమాలో తొలిసారి కలిసి నటించారు నాగార్జున-టబు. 1996 అక్టోబరు 4న విడుదలైన ఈ చిత్రం బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ మూవీలో వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఆ తర్వాత నాగార్జున-టబు కలిసి నటించిన రెండో చిత్రం 'ఆవిడా మా ఆవిడే'. ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వం వహించిన ఈ సినిమా 1998 జనవరి 14న విడుదలైంది. ఈ చిత్రంలోనూ తమదైన నటనతో సందడి చేసిన వీరిద్దరూ ముచ్చటగా మూడోసారి కలిసి నటించనున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. నాగార్జున కెరీర్‌లో 100వ సినిమాగా రూపొందుతోన్న చిత్రానికి తమిళ డైరెక్టర్ కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్‌పై నాగార్జున ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'కింగ్ 100' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు టాక్. ఈ చిత్రం కోసం 27 ఏళ్ల తర్వాత మరోసారి జోడీగా నటించనున్నారట నాగార్జున-టబు. నాగార్జున కెరీర్‌లో మైలురాయిలాంటి ఈ చిత్రంలో ముగ్గురు కథానాయికలు నటించనున్నారని, వారిలో టబు ఓ కథానాయికగా ఎంపికైనట్టు సమాచారం. ఇదిలా ఉంటే.. 'సిసింద్రి' (1995) సినిమాలో నాగార్జున-టబు 'ఆటాడుకుందాం రా అందగాడా...' అంటూ సాగే స్పెషల్ సాంగ్‌లో స్టెప్పులేసిన విషయం తెలిసిందే.

ఏడోసారి...

హీరో వెంకటేశ్, హీరోయిన్ మీనాలది ప్రత్యేకమైన జోడీ. వీరిద్దరి కాంబినేషన్‌లో ఇప్పటికే 'చంటి, సుందరకాండ, అబ్బాయిగారు, సూర్యవంశం, దృశ్యం, దృశ్యం 2' వంటి అరడజను సినిమాలు ప్రేక్షకుల ముందుకొచ్చాయి. ఆ సినిమాలన్నీ సూపర్ హిట్ కావడంతో వీరి జోడీపై ఇటు ఇండస్ట్రీలో అటు ప్రేక్షకుల్లో ఫుల్ క్రేజ్ నెలకొంది. ఇప్పటికే డబుల్ హ్యాట్రిక్ విజయాలు అందుకున్న వీరిద్దరూ 'దృశ్యం 3' సినిమా కోసం మరోసారి జోడీగా నటించనున్నారు. ఇప్పటికే విడుదలైన 'దృశ్యం' (2014), 'దృశ్యం 2' (2021) సినిమాలు అద్భుతమైన హిట్స్ అందుకున్నాయి. ఈ సిరీస్‌లో రానున్న తాజా చిత్రం 'దృశ్యం 3'. జీతూ జోసెఫ్ దర్శకత్వంలో మోహన్‌లాల్, మీనా జోడీగా మలయాళంలో 'దృశ్యం 3' సినిమా షూటింగ్ ఇప్పటికే మొదలైన సంగతి తెలిసిందే. తెలుగులోనూ రూపొందనున్న 'దృశ్యం 3'లో వెంకటేశ్-మీనా మరోసారి జంటగా నటించి, ప్రేక్షకులను అలరించనున్నారు. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా ఓ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రం పూర్తయ్యాక 'దృశ్యం 3' సెట్స్‌పైకి వెళ్లనుంది.

థియేటర్లలో జాతర

హీరో రవితేజ, హీరోయిన్ శ్రీలీల కలిసి థియేటర్లలో 'మాస్ జాతర' చూపించేందుకు సిద్ధం అయ్యారు. వీరి కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'ధమాకా'. నక్కిన త్రినాథరావ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా 2022 డిసెంబరు 23న విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రంలో రవితేజ-శ్రీలీల డ్యాన్సులు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. 'ధమాకా' వంటి హిట్ మూవీ తర్వాత వీరిద్దరూ కలిసి నటించిన ద్వితీయ చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది. రవితేజ కెరీర్‌లో 75వ చిత్రంగా 'మాస్ జాతర' రూపొందడం.. రవితేజ-శ్రీలీల హిట్ జోడీ రిపీట్ అవుతుండటం.. భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతానికి ఇప్పటికే అద్భుతమైన స్పందన రావడం... వంటి కారణాలతో ఈ చిత్రంపై ఇటు ఇండస్ట్రీలో అటు ప్రేక్షకుల్లో ఫుల్ క్రేజ్ నెలకొంది.

సలార్: శౌర్యాంగపర్వంలో...

'బాహుబలి' చిత్రం తర్వాత వరుస పాన్ ఇండియా సినిమాలు చేస్తూ దూసుకెళుతున్నారు ప్రభాస్. ప్రస్తుతం ఆయన 'ది రాజా సాబ్, ఫౌజి, స్పిరిట్' వంటి చిత్రాలు చేస్తున్నారు. ఆ తర్వాత 'సలార్: శౌర్యాంగపర్వం' మూవీ చేస్తారు. ప్రభాస్, శ్రుతీహాసన్ జోడీగా నటించిన తొలి చిత్రం 'సలార్: పార్ట్ 1 సీజ్‌ఫైర్'. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో హోంబలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరంగదూర్ నిర్మించిన ఈ మూవీ 2023 డిసెంబరు 22న విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. ప్రభాస్ యాక్షన్... ప్రశాంత్ నీల్ టేకింగ్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి. ఈ సినిమాకి సీక్వెల్‌గా 'సలార్: పార్ట్ 2 శౌర్యాంగపర్వం' రూపొందనున్న సంగతి తెలిసిందే. తొలి భాగంలో అలరించిన ప్రభాస్- శ్రుతీహాసన్ జోడీ ద్వితీయ భాగంలోనూ అలరించబోతుందని ఫిల్మ్‌నగర్ టాక్. ప్రస్తుతం ఎన్టీఆర్ హీరోగా 'ఎన్టీఆర్‌నీల్' (వర్కింగ్ టైటిల్) అనే సినిమా తెరకెక్కిస్తున్నారు ప్రశాంత్ నీల్. ఈ సినిమాతో ఫుల్ బిజీగా ఉన్నారాయన. ఈ మూవీ షూటింగ్ పూర్తయిన తర్వాత 'సలార్: పార్ట్ 2 శౌర్యాంగపర్వం' పై దృష్టి పెడతారట. 'సలార్: పార్ట్ 1 సీజ్‌ఫైర్' చూసిన వారందరూ 'సలార్: పార్ట్ 2 శౌర్యాంగపర్వం' కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

మరోసారి...

నాని హీరోగా నటించిన 'నానీస్ గ్యాంగ్‌లీడర్' (2019) చిత్రం ద్వారా తెలుగులో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు ప్రియాంకా మోహన్. ఆ తర్వాత మరోసారి వీరిద్దరూ 'సరిపోదా శనివారం' (2024) సినిమాలో నటించారు. ఇప్పటికే రెండు సినిమాల్లో సందడి చేసిన ఈ జంట మరోసారి జోడీగా కనిపించనున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. 'సాహో, ఓజీ' చిత్రాల ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో నాని హీరోగా ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రం ఇటీవలే పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ సినిమాలో నానీకి జోడీగా ప్రియాంకా మోహన్ నటించనున్నారట. పవన్ కల్యాణ్ హీరోగా సుజీత్ దర్శకత్వం వహించిన 'ఓజీ' చిత్రంలో హీరోయిన్‌గా నటించారు ప్రియాంక. తాజాగా నాని సినిమాలో ఆమెని హీరోయిన్‌గా తీసుకోనున్నారట సుజీత్. పైగా నాని-ప్రియాంక కాంబినేషన్‌కి కూడా ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ ఉండటంతో వీరు మూడోసారి నటించడం పక్కా అనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రానికి 'బ్లడీ రోమియో' అనే టైటిల్ పరిశీలనలో ఉందట.

ముచ్చటగా మూడోసారి...

హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మికా మందన్నా కలిసి ముచ్చటగా మూడోసారి జోడీగా నటిస్తున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'గీత గోవిందం'. పరశురాం దర్శకత్వం వహించిన ఈ సినిమా 2018 ఆగస్టు 15న విడుదలై సూపర్ హిట్‌గా నిలవడంతో పాటు వంద కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఆ మూవీ తర్వాత విజయ్-రష్మిక నటించిన ద్వితీయ చిత్రం 'డియర్ కామ్రేడ్'. భరత్ కమ్మ దర్శకత్వం వహించిన ఈ సినిమా 2019 జూలై 16న ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆ సినిమా విడుదలైన ఆరేళ్ల తర్వాత వీరిద్దరూ మూడోసారి జంటగా నటిస్తున్న చిత్రం 'వీడీ 14' (వర్కింగ్ టైటిల్). గతంలో విజయ్ దేవరకొండతో 'టాక్సీవాలా' (2018) వంటి హిట్ మూవీ తెరకెక్కించిన రాహుల్ సంకృత్యాన్ 'వీడీ 14'కి దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ మూవీ చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ చిత్రం లోనే మరోసారి విజయ్-రష్మిక పెయిర్‌గా మారారు. ఇదిలా ఉంటే రీల్ లైఫ్‌లో జోడీగా నటించిన విజయ్ దేవరకొండ, రష్మిక రియల్ లైఫ్‌లో ఒక్కటి కాబోతున్న విషయం తెలిసిందే. ఈ నెల 3న వీరి నిశ్చితార్థం జరిగింది. 2026 ఫిబ్రవరిలో విజయ్-రష్మికల వివాహం జరగనుంది.

ఎనిమిదేళ్ల తర్వాత...

హీరో శర్వానంద్, హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్ ఎనిమిదేళ్ల తర్వాత మరోసారి జోడీగా నటిస్తున్నారు. వీరిద్దరూ తొలిసారి నటించిన చిత్రం 'శతమానం భవతి'. సతీశ్ వేగేశ్న దర్శకత్వం వహించిన ఈ సినిమా 2017 జనవరి 14న రిలీజై, సూపర్ హిట్‌గా నిలవడంతో పాటు జాతీయ అవార్డు అందుకుంది. ఈ సినిమాలో క్యూట్ జోడీగా ఆకట్టుకున్న శర్వానంద్, అనుపమ మరోసారి జంటగా నటిస్తున్న చిత్రం 'శర్వా 38' (వర్కింగ్ టైటిల్). సంపత్ నంది దర్శకత్వంలో లక్ష్మీ రాధా మోహన్ సమర్పణలో కేకే రాధామోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 1960ల కాలంలోని ఉత్తర తెలంగాణ- మహారాష్ట్రల సరిహద్దు ప్రాంతంలో జరిగిన సంఘటనల నేపథ్యంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఈ మూవీ రూపొందుతోంది. కాగా ఈ మూవీలో హీరోయిన్ డింపుల్ హయతి ఓ కీలక పాత్ర చేస్తున్నారు.

క్రేజీ కాంబినేషన్

హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవీ చైతన్యలది క్రేజీ కాంబినేషన్ అనే చెప్పాలి. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'బేబీ'. సాయి రాజేశ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా 2023 జూలై 14న విడుదలై కల్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. మొదటి చిత్రంతోనే వంద కోట్లకుపైగా వసూళ్లు రాబట్టిన వీరి జోడీ రెండో సారి ప్రేక్షకులను అలరించనుంది. ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య జంటగా '90ని'(ఎ మిడిల్ క్లాస్ బయోపిక్) వెబ్ సిరీస్ ఫేమ్ ఆదిత్య హాసన్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ జరుపుకుంటోంది. ఓ మధ్య తరగతి యువకుడి ప్రేమకథ నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతోంది. 'బేబీ'తో బ్లాక్‌బస్టర్ అందుకున్న ఆనంద్-వైష్ణవి రెండోసారి కలిసి నటిస్తున్న ఈ సినిమాపై యువతలో మంచి ఆసక్తి నెలకొంది.

రెండోసారి...

హీరో శ్రీవిష్ణు, హీరోయిన్ రెబా మోనికాజాన్‌లది హిట్ పెయిర్. వీరిద్దరూ తొలిసారి కలిసి నటించిన చిత్రం 'సామజ వరగమన'. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2023 జూన్ 29న విడుదలై, ప్రేక్షకులను నవ్వించింది. ఆ మూవీ తర్వాత శ్రీవిష్ణు, రెబా మోనికాజాన్ కలిసి నటించిన ద్వితీయ చిత్రం 'మృత్యుంజయ్'. హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వంలో ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపొందింది. రమ్య గుణ్ణం సమర్పణలో సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మించారు. తొలి చిత్రం 'సామజ వరగమన'తో నవ్వులు పంచిన శ్రీవిష్ణు, రెబా 'మృత్యుంజయ్'తో మాత్రం భయపెట్టనున్నారు.

- దేరంగుల జగన్ మోహన్



ఆ ఫొటోలను షేర్ చేయడం ఆపండి - ప్రియాంకా మోహన్

''ఏఐ టెక్నాలజీతో కొందరు నా నకిలీ ఫొటోలను సృష్టించారు. నా ఫొటోలంటూ నెట్టింట వైరల్ అవుతున్నవి నిజమైనవి కాదు. ఇలాంటి నకిలీ ఫొటోలను షేర్ చేయడం, వైరల్ చేయడం దయచేసి ఆపండి'' అంటూ హీరోయిన్ ప్రియాంకా మోహన్ కోరారు. 'నానీస్ గ్యాంగ్‌లీడర్, శ్రీకారం, సరిపోదా శనివారం, ఓజీ' వంటి చిత్రాల ద్వారా తెలుగులోనూ మంచి గుర్తింపు సొంతం చేసుకున్నారు ప్రియాంకా మోహన్. ప్రస్తుతం తెలుగు, తమిళ చిత్రాలతో బిజీగా ఉన్నారామె. కాగా డీప్ ఫేక్ ఏఐ టెక్నాలజీతో సృష్టించిన ఆమె ఫొటోలు కొన్ని నెట్టింట వైరల్ అవుతున్నాయి. దీనిపై సోషల్ మీడియా వేదికగా స్పందించారు ప్రియాంకా మోహన్. ''నన్ను తప్పుగా చిత్రీకరించే కొన్ని ఏఐ జనరేటెడ్ చిత్రాలు ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అవుతున్నాయి. ఇలాంటి నకిలీ ఫొటోలను వైరల్ చేయడం, షేర్ చేయడం దయచేసి ఆపేయండి. ఏఐని నైతిక సృజనాత్మకత కోసం ఉపయోగించాలి. ఇలాంటి తప్పుడు వాటి కోసం కాదు. ఇతరులను బాధపెట్టే విధంగా ఏఐని వినియోగించడం తప్పు'' అంటూ షేర్ చేశారామె. ఇదిలా ఉంటే... ప్రియాంకా మోహన్‌కి మద్దతుగా పలువురు నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

బిజినెస్ రీల్

టాటా ఎంఎఫ్ యాప్‌లో పోర్ట్‌ఫోలియో 360 ఫీచర్



న్యూఢిల్లీ: ఈక్వల్–వన్‌మనీ సంస్థతో కలిసి టాటా మ్యుచువల్ ఫండ్ యాప్‌లో పోర్ట్‌ఫోలియో 360 ఫీచరును ప్రవేశపెట్టినట్లు టాటా అసెట్ మేనేజ్‌మెంట్ వెల్లడించింది. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025 సందర్భంగా దీన్ని ఆవిష్కరించింది. వివిధ బ్యాంకు ఖాతాలు, ఫండ్స్, ఈక్విటీలు, ఎఫ్‌డీలు మొదలైన వాటి వివరాలన్నీ ఒకే దగ్గర చూసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని సంస్థ సీఈవో ప్రతీత్ భోబె తెలిపారు. రిటైర్మెంట్‌లాంటి ఆర్థిక ప్రణాళికలు వేసుకునేందుకు ఇన్వెస్టర్లకి సహాయకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రవేశపెట్టిన కొద్ది నెలల్లోనే టాటా మ్యుచువల్ ఫండ్ యాప్ డౌన్‌లోడ్‌లు 6 లక్షల పైగా నమోదైనట్లు వివరించారు. పారదర్శకత, ఆవిష్కరణలపరంగా అత్యుత్తమ ప్రమాణాలను పాటిస్తూ పోర్ట్‌ఫోలియో 360ని తీర్చిదిద్దినట్లు ఈక్వల్–వన్‌మనీ వ్యవస్థాపకుడు కృష్ణ ప్రసాద్ తెలిపారు.

బ్రూక్‌ఫీల్డ్ ఫండ్ 20 బిలియన్ డాలర్ల సమీకరణ



న్యూఢిల్లీ: బ్రూక్‌ఫీల్డ్ గ్లోబల్ ట్రాన్సిషన్ ఫండ్ 2 (బీజీటీఎఫ్ 2) మొత్తం 20 బిలియన్ డాలర్ల నిధులు సమీకరించినట్లు అసెట్ మేనేజ్‌మెంట్ దిగ్గజం బ్రూక్‌ఫీల్డ్ తెలిపింది. భారత్‌లో 10 గిగావాట్ల పవన, సౌర విద్యుత్, స్టోరేజ్ ప్రాజెక్టులను వేగవంతం చేయడంతో పాటు అంతర్జాతీయంగా కూడా ఈ నిధులను ఇన్వెస్ట్ చేయనున్నట్లు పేర్కొంది. ఇప్పటికే యాక్సిస్ ఎనర్జీతో జాయింట్ వెంచర్ సంస్థ ఎవ్రెన్ ద్వారా 5 బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెట్టినట్లు వివరించింది. గతంలో బీజీటీఎఫ్ 1 ద్వారా 15 బిలియన్ డాలర్లు సమీకరించగా రెన్యూవబుల్స్, పర్యావరణహిత ఏవియేషన్ ఇంధనాలు, బ్యాటరీ స్టోరేజీ తదితర రంగాల్లో ఇన్వెస్ట్ చేసినట్లు సంస్థ తెలిపింది.

బీమా రంగానికి ఏజంట్ల రిటెన్షన్ సవాళ్లు

టాటా ఏఐఏ సీడీవో అమిత్ దవే



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీవిత బీమా కంపెనీలకు ఏజంట్ల రిటెన్షన్ (వారు వైదొలగకుండా అట్టే పెట్టుకోవడం) సవాలుగా ఉంటోందని టాటా ఏఐఏ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ (ప్రొప్రైటరీ బిజినెస్, అలైడ్ చానల్స్) అమిత్ దవే తెలిపారు. బీమా రంగ నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ 2023–24 వార్షిక నివేదిక ప్రకారం పరిశ్రమలో కొత్తగా 9.7 లక్షల మంది జీవిత బీమా ఏజంట్లు చేరగా, 6.9 లక్షల మంది నిష్క్రమించినట్లు చెప్పారు. సత్వర ప్రయోజనాలు లభిస్తాయంటూ పరిశ్రమపై నెలకొన్న అభిప్రాయమే ఇందుకు కారణంగా ఉంటోందని తెలిపారు. ఇలా ఏజంట్ల నిష్క్రమణ అనేది వ్యాపారాన్ని స్థిరంగా కొనసాగించడానికి, కస్టమర్ల నమ్మకాన్ని పొందడానికి సవాలుగా ఉంటోందని దవే తెలిపారు. ఈ నేపథ్యంలో ఏజంట్లను రిటైన్ చేసుకునేందుకు పరిశ్రమ పలు ప్రయత్నాలు చేస్తోందని పేర్కొన్నారు. క్లయింట్ కమ్యూనికేషన్, డిజిటల్ టూల్స్ మొదలైన వాటిల్లో కంపెనీలు శిక్షణనిస్తున్నాయని తెలిపారు. అధునాతన టెక్నాలజీ, మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచుతున్నాయన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

12-10-2025

విశాఖ	500–00
చిత్తూరు	553–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	505–00
విజయవాడ	515–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	500–00
వరంగల్	502–00
రిటైల్ ధర	5.60

రిటైల్ షాపులకు భలే డిమాండ్

- మాల్స్‌లో లీజింగ్ 45 శాతం అప్
- టాప్–8 నగరాల్లో నమోదు
- హైదరాబాద్‌లో 3.5 శాతం వృద్ధి
- కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక

న్యూఢిల్లీ: రిటైల్ వాణిజ్య వసతులకు డిమాండ్ బలంగా కొనసాగుతోంది. హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రముఖ నగరాల్లో షాపింగ్ మాల్స్, ప్రముఖ ప్రాంతాల్లోని రిటైల్ వసతుల (ప్రధాన రహదారుల వెంట/హైస్ట్రీట్) లీజింగ్ సెప్టెంబర్ త్రైమాసికంలో క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చిచూస్తే 45 శాతం పెరిగింది. దేశవ్యాప్తంగా టాప్– 8 నగరాల్లో 2.41 మిలియన్ చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) లీజింగ్ నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లీజింగ్ 1.66 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉంది. రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఈ వివరాలను విడుదల చేసింది. ''భారత రియల్ ఎస్టేట్ మార్కెట్ వృద్ధి క్రమంలో కొనసాగుతోంది. వినియోగదారుల ప్రాధాన్యతలు విస్తరిస్తుండడంతో నాణ్యమైన రిటైల్ వసతులకు డిమాండ్ పెరుగుతోంది'' అని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ ఎండీ గౌతమ్ సరాఫ్ తెలిపారు.



నగరాల వారీ లీజింగ్..

- హైదరాబాద్‌లో 0.51 మిలియన్ ఎస్ఎఫ్‌టీ మేర రిటైల్ వసతుల లీజింగ్ నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లీజింగ్ 0.49 మిలియన్ ఎస్ఎఫ్‌టీతో పోల్చి చూస్తే 3.5 శాతం పెరిగింది.
- ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో ఏకంగా 87 శాతం అధికంగా 0.51 మిలియన్ ఎస్ఎఫ్‌టీ రిటైల్ లీజింగ్ జరిగింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది 0.27 మిలియన్ ఎస్ఎఫ్‌టీగానే ఉంది.
- ముంబై మార్కెట్‌లో క్రితం ఏడాది ఇదే కాలంలో లీజింగ్ 0.22 మిలియన్ ఎస్ఎఫ్‌టీతో పోల్చి చూస్తే రెట్టింపై 0.59 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి చేరింది.
- పుణెలోనూ 85 శాతం అధికంగా 0.33 మిలియన్ ఎస్ఎఫ్‌టీ మేర రిటైల్ వసతుల లీజింగ్ నమోదైంది.
- బెంగళూరులో లీజింగ్ 13 శాతం తగ్గి 0.18 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి పరిమితమైంది.
- చెన్నై మార్కెట్లో 8 శాతం వృద్ధితో రిటైల్ లీజింగ్ 0.16 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా నమోదైంది.
- అహ్మదాబాద్‌లో 27 శాతం తక్కువగా 0.06 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి లీజు పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో లీజింగ్ 0.09 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉంది.
- కోల్‌కతాలో 12 శాతం పెరిగి 0.06 మిలియన్ ఎస్ఎఫ్‌టీ మేర లీజింగ్ లావాదేవీలు జరిగాయి.

ప్రీమియం వసతులకు డిమాండ్..

కొత్త మాల్స్ నిర్మాణం పూర్తి అయి అందుబాటులోకి రావడంతోపాటు, క్రితం ఏడాది ఇదే కాలంలో లీజింగ్ తక్కువగా ఉండడం, అధిక వృద్ధికి కారణమైనట్టు డీఎల్ఎఫ్ వైస్ చైర్మన్, ఎండీ శ్రీరామ్ ఖట్టర్ తెలిపారు. ''వినియోగదారులు కేవలం ఉత్పత్తినే కాకుండా మెరుగైన అనుభవం (వసతులు) కోసం చూస్తున్నారు. దీంతో మేము ప్రీమియం వసతులను ఆఫర్ చేయడంపై దృష్టి సారించాం'' అని ఖట్టర్ వివరించారు. భారత వినియోగ మార్కెట్ పట్ల దేశ, విదేశీ బ్రాండ్లలో విశ్వాసం పెరగడం వల్ల బలమైన లీజింగ్ నమోదైనట్టు నెక్సస్ సెలక్ట్ మాల్స్ ప్రెసిడెంట్ నిజార్ జైన్ తెలిపారు. దేశ మధ్యతరగతి వర్గం పెరుగుతుండంతో వినియోగ మార్కెట్ విషయమై రిటైలర్లలోనూ బలమైన విశ్వాసం నెలకొన్నట్టు ఆరోబ్ గ్రూప్ ఎండీ నిమిష్ అరోరా తెలిపారు. డీ2సీ బ్రాండ్లు ఇప్పుడు ఆఫ్‌లైన్ మార్కెట్‌లోనూ విస్తరణపై దృష్టి పెట్టినట్టు చెప్పారు.

డీమార్ట్ క్యూ2 నికరలాభం రూ.685 కోట్లు



న్యూఢిల్లీ: డీమార్ట్ పేరుతో సూపర్ మార్కెట్లు నిర్వహించే అవెన్యూ సూపర్‌మార్ట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసిక ఫలితాలు ప్రకటించింది. ఈ క్యూ2లో కన్సాలిడేషన్ ప్రాతిపదికన రూ.684.85 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది రెండో త్రైమాసికంలో నమోదు చేసిన రూ.659.44 కోట్లతో పోలిస్తే ఇది 4% అధికం. ఇదే క్యూ2లో కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం 15% పెరిగి రూ.14,444.50 కోట్ల నుంచి 16,218.79 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు 16% వృద్ధి చెంది రూ.15,751.08 కోట్లుగా నమోదయ్యాయి. ఇతర ఆదాయాలతో కలిపి మొత్తం ఆదాయం 15.3% పెరిగి రూ.16,695.87 కోట్లకు చేరింది. ''అవసరమైన చోట్ల ధరలు తగ్గిస్తూ జీఎస్‌టీ క్రమబద్ధీకరణ ఫలాలు కస్టమర్లకు అందిస్తున్నాము. ఈ క్వార్టర్‌లో 8 కొత్త స్టోర్లను ప్రారంభించడంతో 2025 సెప్టెంబర్ 30 నాటికి మొత్తం స్టోర్ల సంఖ్య 432కి చేరింది. ప్రస్తుతం మాకున్న మార్కెట్లలో 10 ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేశాము'' అని సీఈవో అన్షుల్ అసావా తెలిపారు.

6జీ వ్యవస్థపై ఢిల్లీ డిక్లరేషన్

సంతకాలు చేసిన భారత్ 6జీ అలయెన్స్, 9 గ్లోబల్ సంస్థలు

న్యూఢిల్లీ: 6జీ వ్యవస్థను సురక్షితంగా, స్వేచ్ఛగా, సమ్మిళితంగా ఉంచేందుకు ఉపయోగపడే సూత్రాలకు సంబంధించిన ఢిల్లీ డిక్లరేషన్‌పై భారత్ 6జీ అలయెన్స్‌తో పాటు తొమ్మిది అంతర్జాతీయ సంస్థలు సంతకాలు చేశాయి. నెక్స్‌జీ అలయెన్స్, 6జీ బ్రెజిల్, జపాన్‌కి చెందిన ఎక్స్‌జీ మొబైల్ ప్రమోషన్ ఫోరం మొదలైనవి వీటిలో ఉన్నాయి. ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో భాగంగా నిర్వహించిన ఇంటర్నేషనల్ భారత్ 6జీ సింపోజియంలో దీన్ని ప్రకటించారు. డిజిటల్ అంతరాలను భర్తీ చేసే విధంగా, పట్టణ, గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోనూ విశ్వసనీయమైన.. అఫోర్డబుల్ కవరేజీని అందించే విధంగా 6జీ ఉండాలని సంయుక్త ప్రకటనలో తెలిపాయి. స్వేచ్ఛాయుతమైన, పారదర్శకమైన, నిష్పాక్షికమైన వాతావరణంలో ప్రపంచ దేశాల, ప్రాంతాల, భాగస్వాముల సమాన ప్రాతినిధ్యంతో ప్రమాణాలను రూపొందించాల్సి ఉంటుందని వివరించాయి. పరిశోధనలు, అభివృద్ధి కార్యకలాపాలు, టెస్ట్‌బెడ్స్, పైలట్ ప్రాజెక్టుల విషయంలో కలిసి పనిచేయాలని పేర్కొన్నాయి. విశ్వసనీయమైన టెక్నాలజీలను, ఓపెన్ ప్రమాణాలను, సుస్థిర నెట్‌వర్క్‌లను సమిష్టిగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యతను ఈ డిక్లరేషన్ సూచిస్తోందని భారత్ 6జీ అలయెన్స్ డైరెక్టర్ జనరల్ ఆర్‌కే పాఠక్ తెలిపారు. 6జీ ట్రయల్స్ 2028లో ప్రారంభమవుతాయని, వాణిజ్యపరంగా వినియోగంలోకి తేవడానికి మరికొన్నాళ్లు పడుతుందనే అంచనాలు నెలకొన్నాయి.

ఏఐతో కస్టమర్లకు మెరుగైన సర్వీసులు ..

టెలికం సేవలు 5జీ నుంచి 6జీకి మారుతున్న తరుణంలో సమస్యలేవైనా వస్తే టెలికం నెట్‌వర్క్ దానంతటదే పరిష్కరించుకునేలా, కస్టమర్లకు మరింత మెరుగైన సర్వీసులను అందించేలా కృత్రిమ మేధ (ఏఐ) ఉపయోగపడుతుందని ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో పాల్గొన్న సందర్భంగా కేంద్ర టెలికం శాఖ కార్యదర్శి నీరజ్ మిట్టల్ తెలిపారు. ఏఐని మంచికే ఉపయోగిస్తున్నప్పటికీ దుర్వినియోగమయ్యే రిస్కులు కూడా ఉన్నందున, ఈ టెక్నాలజీ వినియోగంపై అప్రమత్తత వహించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. 'ఏఐ ఆధారిత టూల్స్ ఏ విధంగా డీప్ ఫేక్స్, వాయిస్ క్లోనింగ్, ఆర్థిక మోసాలు చేసేందుకు దుర్వినియోగమవుతున్నాయో మనం చూస్తూనే ఉన్నాం. కాబట్టి మనం టెలికం నెట్‌వర్క్‌లో ఏఐ విషయంలో చాలా అప్రమత్తంగా కూడా ఉండాలి' అని మిట్టల్ వివరించారు. టెలికం శాఖ రూపొందించిన ఏఐ ఆధారిత ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్ టూల్‌ని ఉపయోగించి 48 లక్షల అనుమానాస్పద లావాదేవీలను బ్లాక్ చేసినట్లు, రూ. 200 కోట్ల నష్టాన్ని నివారించినట్లు పేమెంట్ యాప్స్ అయిన ఫోన్‌పే, పేటీఎం ప్రకటించాయి.



ఏఐతో టెక్నాలజీ రంగంలో పెనుమార్పులు

- సత్వర చర్యలు అవసరం
- లేదంటే ఉపాధిపై ప్రభావం
- నీతి ఆయోగ్ నివేదిక



న్యూఢిల్లీ: భారత్‌లోని 245 బిలియన్ డాలర్ల విలువైన టెక్నాలజీ, కస్టమర్ ఎక్స్‌పీరియెన్స్ (అనుభవం) రంగాల్లో ఉద్యోగాల స్వరూపాన్ని కృత్రిమ మేధ (ఏఐ) సమూలంగా మార్చనుందని.. సత్వర చర్యలు అవసరమని నీతి ఆయోగ్ పేర్కొంది. లేదంటే క్వాలిటీ అష్యూరెన్స్ (నాణ్యతకు హామీనిచ్చే) ఇంజనీర్లు, సపోర్ట్ ఏజెంట్ల ఉద్యోగాలు వేగంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంటుందని నీతి ఆయోగ్ హెచ్చరించింది. 'ఏఐ ఆధారిత ఆర్థిక వ్యవస్థలో ఉపాధి కల్పన' పేరుతో నివేదికను విడుదల చేసింది. 2031 నాటికి టెక్నాలజీ సేవల రంగంలో ఉపాధి సమూల మార్పులకు నోచుకోనున్నట్టు పేర్కొంది. అదే సమయంలో వచ్చే ఐదేళ్ల కాలంలో 40 లక్షల కొత్త ఉద్యోగాల కల్పనకు సైతం ఏఐ అవకాశాలు కల్పించనున్నట్టు తెలిపింది. నైపుణ్య కల్పన, ఆవిష్కరణలతో.. ఏఐ ఉద్యోగాలైన ఎథికల్ ఏఐ స్పెషలిస్టులు, ఏఐ ట్రెయినర్లు, అనలిస్టులు, ఏఐ డెవ్ఆప్స్ (డెవలప్‌మెంట్ అండ్ ఆపరేషన్స్) ఇంజనీర్లకు భారత్ ప్రపంచ కేంద్రంగా అవతరించొచ్చని అభిప్రాయపడింది. ఏఐ కారణంగా ఏర్పడే అంతరాయాలను అవకాశాలుగా మలుచుకునేందుకు.. జాతీయ స్థాయిలో ఏఐ నైపుణ్య కార్యక్రమాన్ని ప్రారంభించాలని నీతి ఆయోగ్ సూచించింది. పాఠశాలలు, యూనివర్సిటీల్లో ఏఐ నైపుణ్యాలపై అవగాహన కల్పించడం, వొకేషనల్ కార్యక్రమాలు, జాతీయ స్థాయిలో నైపుణ్యాల కల్పన, పెంపునకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొంది. విద్యా రంగం, ప్రభుత్వం, పరిశ్రమ మధ్య భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని ముందుకు నడిపించాలని కోరింది.

విశ్వాసంతో కూడిన పన్ను వ్యవస్థ..

నిబంధనలను స్వచ్ఛందంగా పాటించడం, పారదర్శకత, విశ్వసనీయమైన పాలనతో ఆధునిక పన్ను నిర్మాణం ఉండాలని నీతి ఆయోగ్ సూచించింది. దీనిపై చర్చా పత్రాన్ని విడుదల చేసింది. ఆధునిక, ఊహించతగిన (సులభతర), పౌరుల కేంద్రంగా పన్ను వ్యవస్థ అన్నది ఎంతో అవసరమని, ఇది సులభతర వ్యాపార నిర్వహణను, జీవనానికి వీలు కల్పిస్తుందని పేర్కొంది. నిజాయితీపరులైన పన్ను చెల్లింపుదారులను గౌరవించే విధంగా ఉండాలని, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాకారానికి అనుగుణంగా ఉండాలని సూచించింది.

హైదరాబాద్‌లో ఆఫీస్ వసతులకు డిమాండ్

- సెప్టెంబర్ క్వార్టర్‌లో 33 శాతం పెరిగిన లీజింగ్
- టాప్–8 నగరాల్లో మాత్రం క్షీణత
- నైట్‌ఫ్రాంక్ ఇండియా నివేదిక



న్యూఢిల్లీ: హైదరాబాద్ ఆఫీస్ మార్కెట్లో బలమైన డిమాండ్ కొనసాగుతోంది. సెప్టెంబర్ త్రైమాసికంలో 2.9 మిలియన్ చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) లీజింగ్ నమోదైంది. ఈ ఏడాది మొదటి తొమ్మిది నెలల్లో లీజింగ్ 8.8 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి చేరుకున్నట్టు నైట్‌ఫ్రాంక్ ఇండియా తెలిపింది. దేశవ్యాప్తంగా టాప్–8 పట్టణాల్లో సెప్టెంబర్ క్వార్టర్‌లో ఆఫీస్ లీజింగ్ క్రితం ఏడాది ఇదే కాలంలోని గణాంకాలతో పోల్చిచూస్తే 6% తగ్గి 17.8 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉన్నట్టు పేర్కొంది. ఈ నగరాల్లో స్థూల లీజింగ్ మాత్రం 24 శాతం పెరిగి 66.7 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి చేరిందని, పూర్తి ఏడాదికి రికార్డు స్థాయిలో 85 మిలియన్ ఎస్ఎఫ్‌టీ లీజింగ్ నమోదు కావొచ్చని అంచనా వేసింది.

పట్టణాల వారీగా..

- బెంగళూరులో ఆఫీస్ లీజింగ్ సెప్టెంబర్ క్వార్టర్‌లో 21 శాతం క్షీణించి 4.2 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉంది.
- చెన్నై మార్కెట్లో ఆఫీసు వసతుల లీజింగ్ 9% పెరిగి 2.8 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా నమోదైంది.
- ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లో మాత్రం సెప్టెంబర్ త్రైమాసికంలో 15 శాతం తగ్గి 2.7 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి పరిమితమైంది.
- పుణెలో 9 శాతం తగ్గి 2.3 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి ఆఫీస్ లీజింగ్ పరిమితమైంది.
- ముంబైలో సెప్టెంబర్ క్వార్టర్‌లో లీజింగ్ 27 శాతం తగ్గి 1.9 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉంది. తొమ్మిది నెలల కాలంలో చూసినా 12 శాతం తగ్గి 7.4 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి పరిమితమైంది.
- కోల్‌కతాలో ఆఫీస్ లీజింగ్ సెప్టెంబర్ క్వార్టర్‌లో 190 శాతం పెరిగి 0.5 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా నమోదైంది.
- అహ్మదాబాద్ మార్కెట్లో 13 శాతం పెరిగి సెప్టెంబర్ త్రైమాసికంలో 0.4 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉంది.

కియా కారెన్స్ క్లావిస్‌లో కొత్త వెర్షన్

హెచ్‌టీఎక్స్ (ఓ) ధర రూ. 19.26 లక్షలు



న్యూఢిల్లీ: ఆటోమొబైల్ దిగ్గజం కియా తాజాగా కారెన్స్ క్లావిస్‌లో కొత్త వెర్షన్ హెచ్‌టీఎక్స్ (ఓ)ని ప్రవేశపెట్టింది దీని ధర రూ. 19,26,717 (ఎక్స్‌షోరూం)గా ఉంటుందని సంస్థ తెలిపింది. ఇందులో బోస్ ప్రీమియం సౌండ్ సిస్టం, డ్రైవ్ మోడ్ సెలెక్ట్, స్మార్ట్ కీ రిమోట్ ఇంజిన్ స్టార్ట్, ఎలక్ట్రిక్ పార్కింగ్ బ్రేక్ తదితర ఫీచర్లు ఉంటాయి. ఇది 6,7 సీటర్ కాన్ఫిగరేషన్లలో లభిస్తుంది. అలాగే హెచ్‌టీకే ప్లస్, హెచ్‌టీకె ప్లస్ (ఓ)లో 6 సీటర్ వేరియంట్లను కూడా ప్రవేశపెట్టినట్లు కంపెనీ తెలిపింది. ఇవి అక్టోబర్ 13 నుంచి దేశవ్యాప్తంగా తమ షోరూమ్‌లలో లభిస్తాయని పేర్కొంది.

టాటా మోటార్స్‌తో థండర్‌ప్లస్ జట్టు



హైదరాబాద్: ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) చార్జింగ్ సొల్యూషన్స్ అందించే థండర్‌ప్లస్ తాజాగా వాహనాల దిగ్గజం టాటా మోటర్స్‌తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. దీని ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడుతో పాటు మరో అయిదు రాష్ట్రాల్లో చిన్న వాణిజ్య వాహనాల చార్జింగ్ కోసం కొత్తగా 5,000 పబ్లిక్ చార్జింగ్ స్టేషన్లను థండర్‌ప్లస్ ఇన్‌స్టాల్ చేయనుంది. వాణిజ్య వాహనాల పోర్ట్‌ఫోలియోను విద్యుదీకరించుకోవాలన్న టాటా మోటర్స్ ప్రయత్నాలకు ఇది సహాయకరంగా ఉండనుంది. నిరాటంకమైన, విశ్వసనీయమైన, విస్తరించతగిన విధంగా ఈవీ చార్జింగ్ స్టేషనలను అందుబాటులోకి తేవడం తమ లక్ష్యమని థండర్‌ప్లస్ సీఈవో రాజీవ్ వైఎస్ఆర్ తెలిపారు

తెలుగు రాష్ట్రాల్లో టాటా పంచ్‌కు డిమాండ్

తెలుగు రాష్ట్రాల్లో ఎస్‌యూవీలకు అప్‌గ్రేడ్ కావాలనుకునే కస్టమర్లు తమ పంచ్ వాహనం వైపు మొగ్గు చూపే ధోరణి నెలకొందని టాటా మోటర్స్ ప్యాసింజర్ వెహికల్స్ (టీఎంపీవీ) తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య కాలంలో తమ మొత్తం అమ్మకాలకు సంబంధించి తెలంగాణలో 21 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 25 శాతం వాటా పంచ్‌దే ఉందని పేర్కొంది. హైదరాబాద్, విజయవాడలో ఈ ఎస్‌యూవీ విక్రయాలు రెండింతలు పెరిగాయని కంపెనీ వివరించింది. నవరాత్రుల సందర్భంగా దేశవ్యాప్తంగా టాటా మోటర్స్ విక్రయాల్లో పంచ్ వాటా 33 శాతంగా నమోదైనట్లు పేర్కొంది. సెప్టెంబర్‌లో దేశీయంగా టాప్ 5 కార్లలో ఒకటిగా నిల్చిందని వివరించింది.

45 నిమిషాల్లో ఎస్ఎంఈ డిజిటల్ రుణాలు: ఎస్‌బీఐ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: చిన్న, మధ్య తరహా సంస్థలకి (ఎస్ఎంఈలు) రూ. 5 కోట్ల వరకు రుణాల కోసం 2023–24లో ప్రారంభించిన ఎస్ఎంఈ డిజిటల్ బిజినెస్ లోన్స్‌కి గణనీయంగా స్పందన లభిస్తోందని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తెలిపింది. రుణ మంజూరీకి సంబంధించి టర్నెరౌండ్ సమయం కేవలం 45 నిమిషాలకు తగ్గిందని పేర్కొంది. వచ్చే అయిదేళ్లపాటు వృద్ధి, లాభదాయకత కోసం ఎంఎస్ఎంఈ రుణాలపై మరింతగా దృష్టి పెట్టాలని నిర్ణయించినట్లు వివరించింది. సుమారు రూ. 3,242 కోట్ల విలువ చేసే 67,299 ఎంఎస్ఎంఈ ముద్రా రుణాలు కూడా ఇందులో భాగంగా ఉన్నట్లు వివరించింది. అవసరమైన వివరాలన్నీ సమర్పించాక, 10 సెకన్ల వ్యవధిలోనే, మానవ జోక్యం లేకుండా, కేవలం పది సెకన్ల వ్యవధిలోనే రుణ మంజూరు నిర్ణయాలు తీసుకునే డేటా ఆధారిత క్రెడిట్ అసెస్‌మెంట్ ఇంజిన్‌ను రూపొందించినట్లు తెలిపింది. రూ. 50 లక్షల వరకు రుణాల మదింపు కోసం లావాదేవీల చరిత్ర, జీఎస్‌టీ రిటర్నులనే పరిగణనలోకి తీసుకుంటూ, ఆర్థిక పత్రాలు సమర్పించాల్సిన నిబంధన నుంచి మినహాయింపునిస్తున్నట్లు బ్యాంకు పేర్కొంది.

డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐదే పెద్ద పాత్ర

వీటిపై జెనరేటివ్, ఏజెంటిక్ ఏఐల ప్రభావం

- క్రెడిట్ కార్డు చెల్లింపులూ పెరుగుతాయ్
- పీడబ్ల్యూసీ ఇండియా నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: దేశంలో శరవేగంగా పెరుగుతున్న డిజిటల్ చెల్లింపులపై జెనరేటివ్ ఏఐ, ఏజెంటిక్ ఏఐ గణనీయమైన ప్రభావం చూపించనున్నట్టు పీడబ్ల్యూసీ ఇండియా నివేదిక తెలిపింది. యూపీఐ ఇకపైనా కీలకంగా ఉంటుందంటూ.. అదే సమయంలో తదుపరి దశ డిజిటల్ చెల్లింపులను క్రెడిట్ కార్డులు, భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్ (బీబీపీఎస్) నడిపించొచ్చని అంచనా వేసింది. ఫిన్‌టెక్, చెల్లింపుల రంగంలో కీలక స్థానాల్లో ఉన్న 175 మంది అభిప్రాయాలను పీడబ్ల్యూసీ ఇండియా తన సర్వేలో భాగంగా తెలుసుకుంది. క్రెడిట్ కార్డు కీలక విభాగంగా ఉంటుందని 65 శాతం మంది చెప్పారు. కార్డు చెల్లింపులు బలంగా వృద్ధి చెందుతాయని 95 శాతం మంది భావిస్తున్నారు. చెల్లింపుల వ్యవస్థ ముఖచిత్రంపై జెనరేటివ్ ఏఐ, ఏజెంటిక్ ఏఐ ఎంతో ప్రభావం చూపించనున్నట్టు 73 శాతం మంది చెప్పారు.

ఐదేళ్లలో మూడింతలు

భారత్‌లో డిజిటల్ చెల్లింపులు ఇక మీదట అధిక వృద్ధి వేగంతో కొనసాగుతాయని పీడబ్ల్యూసీ ఇండియా నివేదిక తెలిపింది. 2030 మార్చి నాటికి మూడింతలు అవుతాయని అంచనా వేసింది. ఆవిష్కరణలకుతోడు రుణ సేవల విస్తరణ, నియంత్రణ సంస్థల మద్దతు, సరికొత్త టెక్నాలజీలను స్వీకరించడం, మారుతున్న వినియోగదారుల వైఖరి డిజిటల్ చెల్లింపుల వేగాన్ని నడిపిస్తాయని పేర్కొంది. ''భారత్‌లో చెల్లింపుల ఎకోవ్యవస్థ కొత్త దశలోకి అడుగుపెడుతోంది. వచ్చే ఐదేళ్లలో యూపీఐ ఆవిష్కరణలు, సేవల విస్తరణ కొనసాగుతుంది. రుణాల్లో వృద్ధి, బీమా, సంపద కలయికతో డిజిటల్ చెల్లింపులు పెరుగుతాయి''అని పీడబ్ల్యూసీ ఇండియా పార్ట్‌నర్ మిహిర్‌గాంధీ తెలిపారు. వివిధ సాధనాల మధ్య అనుసంధానత ద్వారా ఆవిష్కరణలు–విస్తరణ మధ్య సమతూకం ఉండేలా చూడడం అవసరమన్నారు.

90% చెల్లింపులవే..

భారత డిజిటల్ చెల్లింపులకు యూపీఐ వెన్నెముకగా నిలుస్తున్నట్టు, 2024–25లో రిటైల్ డిజిటల్ చెల్లింపుల్లో 90 శాతం యూపీఐ రూపంలోనే ఉన్నట్టు పీడబ్ల్యూసీ ఇండియా నివేదిక తెలిపింది. క్రెడిట్ కార్డు లావాదేవీలు 2023–24లో 100 మిలియన్ దాటగా, 2030 మార్చి నాటికి 200 మిలియన్‌కు చేరుకుంటాయని పేర్కొంది. వినియోగదారులు యూపీఐ, క్రెడిట్‌కార్డులకు ప్రాధాన్యం ఇస్తుండడంతో డెబిట్ కార్డుల వినియోగం ఇకమీదటా తగ్గనున్నట్టు తెలిపింది.

మారుతీ సర్వీసు నెట్‌వర్క్ విస్తరణ

అదనంగా 500 కొత్త సర్వీసు



న్యూఢిల్లీ: మారుతీ సుజుకీ ఇండియా నెట్‌వర్క్ విస్తరణపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26)లో అదనంగా 500 కొత్త సర్వీసు వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేయనుంది. కోయంబత్తూర్‌లో తన 5,000వ అరీనా సర్వీసు టచ్‌పాయింట్ ప్రారంభించినట్లు తెలిపింది. ''భవిష్యత్తులోనూ మా నెట్‌వర్క్‌ను మరింత విస్తరిస్తాము. గత ఆర్థిక సంవత్సరంలో అరీనా, నెక్సా నెట్‌వర్క్‌ల కింద 460 సర్వీస్ టచ్‌పాయింట్లను ఏర్పాటు చేశాయి. 2025–26లో అదనంగా 500 సర్వీసు వర్క్‌షాప్‌లను ప్రారంభించే యోచనలో ఉన్నాము'' అని మారుతీ సుజుకీ ఎండీ, సీఈవో హిసాషీ టకేయుచి తెలిపారు. కొత్త టచ్ పాయింట్ల ఏర్పాటుతో మారుతీ సుజుకీ సర్వీస్ నెట్‌వర్క్ 5,640కి చేరనుంది.

చాంపియన్ కాస్పరోవ్

క్లచ్ చెస్ లెజెండ్స్ మ్యాచ్‌లో ఆనంద్ ఓటమి



సెయింట్ లూయిస్ (అమెరికా): భారత చదరంగ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ క్లచ్ చెస్ లెజెండ్స్ మ్యాచ్‌లో రష్యా దిగ్గజం గ్యారీ కాస్పరోవ్ చేతిలో పరాజయం పాలయ్యాడు. ఈ ఇద్దరు దిగ్గజాల మధ్య జరిగిన పోరులో 62 ఏళ్ల కాస్పరోవ్ 13–11 పాయింట్ల తేడాతో ఆనంద్‌పై గెలుపొందాడు. అధికారికంగా ఆనంద్, కాస్పరోవ్ చివరిసారి 1995లో న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ 107వ అంతస్తులో క్లాసికల్ వరల్డ్ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం పోటీపడ్డారు. కాస్పరోవ్ 10.5–7.5తో ఆనంద్‌పై గెలిచి ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ దక్కించుకున్నాడు. కాస్పరోవ్ 30 ఏళ్ల తర్వాత కూడా అదే ఆటతీరు చూపెట్టాడు. ఈ పోరులో మొత్తం 12 గేమ్‌లు నిర్వహించాల్సి ఉండగా... చివరి రెండు బ్లిట్జ్ గేమ్‌లకంటే ముందే కాస్పరోవ్ గెలిచాడు. విజేత కాస్పరోవ్‌కు 70 వేల డాలర్లు (రూ. 62 లక్షలు), రన్నరప్ ఆనంద్‌కు 50 వేల డాలర్లు (రూ. 44 లక్షలు) ప్రైజ్‌మనీ లభించింది. ఈ పోరు నిబంధనల ప్రకారం తొలి రోజున గేమ్‌లో గెలిస్తే ఒక పాయింట్... 'డ్రా' చేసుకుంటే అర పాయింట్ కేటాయించారు. రెండో రోజు జరిగిన గేమ్‌లో గెలిస్తే 2 పాయింట్లు... 'డ్రా' చేసుకుంటే ఒక పాయింట్ ఇచ్చారు. మూడో రోజు శనివారం గేమ్ గెలిచిన వారికి 3 పాయింట్లు కేటాయించారు. 'ఇది చాలా ముఖ్యమైనది అని చెప్పలేను... కానీ విజయం సాధిస్తానని ఊహించలేదు. చాలా మంది అభిమానులు ఈ మ్యాచ్‌ను ఫాలో అయ్యారు. సామాజిక మాధ్యమాల్లో ఇది చాలా ప్రాధాన్యత సంతరించుకుంది. రెండో గేమ్ అనంతరం రిలాక్స్ అయ్యాను. నా అంచనాలకు మించి రాణించాను' అని కాస్పరోవ్ అన్నాడు.

నాట్ సీవర్ సెంచరీ

- బౌలింగ్‌లో అదరగొట్టిన సోఫీ
- లంకపై 89 పరుగులతో ఇంగ్లండ్ జయభేరి
- ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్


సోఫి

కొలంబో: ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ 'హ్యాట్రిక్' విజయాన్ని నమోదు చేసింది. శనివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో నాట్ సీవర్ బ్రంట్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఇంగ్లండ్ అమ్మాయిల జట్టు 89 పరుగుల తేడాతో శ్రీలంకపై జయభేరి మోగించింది. బ్యాటింగ్‌లో వీరోచిత శతకం సాధించిన కెప్టెన్ బ్రంట్ (117 బంతుల్లో 117; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), బౌలింగ్‌తో 2 వికెట్లు పడగొట్టింది. టాస్ నెగ్గిన లంక ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 253 పరుగులు చేసింది. టాపార్డర్‌లో అమీ జోన్స్ (11), బ్యూమోంట్ (29 బంతుల్లో 32; 6 ఫోర్లు), హీథర్‌నైట్ (47 బంతుల్లో 29; 2 ఫోర్లు) ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లే చేయలేదు. ఇలాంటి స్థితిలో నాట్ సీవర్ బ్రంట్ ఒంటరి పోరాటం చేసింది. సోఫియా డన్క్లే (18), ఎమ్మా లాంబ్ (13), చార్లీ డీన్ (19)లతో కలిసి జట్టు స్కోరును నడిపించింది. 110 బంతుల్లో శతకాన్ని పూర్తి చేసింది. లంక బౌలర్లలో ఇనోక రణవీర 3 వికెట్లు పడగొట్టగా, ఉదేశిక ప్రబోధని, సుగంధిక కుమారి చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన శ్రీలంక 45.4 ఓవర్లలో 164 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ హాసిని పెరిర (60 బంతుల్లో 35; 3 ఫోర్లు), మిడిలార్డర్‌లో హర్షిత సమరవిక్రమ (37 బంతుల్లో 33; 5 ఫోర్లు) మాత్రమే మెరుగ్గా ఆడారు. మిగతా వాళ్లంతా ఇంగ్లండ్ బౌలింగ్‌కు తలొంచారు. నీలాక్షిక సిల్వా (23) మినహా ఇంకెవరూ రెండు పదుల స్కోరైనా చేయలేకపోయారు. సోఫి ఎకిల్‌స్టోన్ (10–3–17–4) తన మ్యాజిక్ స్పెల్‌తో లంకను కూల్చేసింది. నాట్ సీవర్, చార్లీ డీన్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఇంగ్లండ్ ఆడిన మూడు గెలిచి పట్టికలో అగ్రస్థానంలో నిలువగా, ఇంకా బోణీ చేయలేకపోయిన శ్రీలంక ఏడో స్థానంలో ఉంది. లంక మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడింది.


నాట్ సీవర్

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ మహిళల ఇన్నింగ్స్: అమీ జోన్స్ రనౌట్ 11; బ్యూమోంట్ (సి)హర్షిత (బి) సుగంధిక 32; హీథర్‌నైట్ (సి) విహంగ (బి) ఇనొక 29; నాట్ సీవర్ (సి) నీలాక్షిక (బి) ప్రబోధని 117; సోఫియా (సి) అండ్ (బి) కవిశా 18; ఎమ్మా లాంబ్ (బి) ఇనొక 13; క్యాప్సీ (స్టంప్డ్) సంజీవని (బి) ఇనొక 0; చార్లీ డీన్ (సి) విహంగ (బి) ప్రబోధని 19; సోఫి ఎకిల్‌స్టోన్ (స్టంప్డ్) సంజీవని (బి) సగంధిక 3; లిన్సే స్మిత్ నాటౌట్ 5; లారెన్ బెల్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 253. వికెట్ల పతనం:** 1–24, 2–49, 3–109, 4–146, 5–168, 6–168, 7–206, 8–216, 9–252. **బౌలింగ్:** ప్రబోధని 9–0–55–2, సుగంధిక 10–0–66–2, చమరి 5–0–21–0, ఇనొక 10–1–33–3, విహంగ 8–0–42–0, కవిశా 8–0–34–1.

శ్రీలంక మహిళల ఇన్నింగ్స్: హాసిని (సి) క్యాప్సీ (బి) సోఫి 35; చమరి (బి) సోఫి 15, విష్మీ (బి) చార్లీ డీన్ 10; హర్షిత (సి) బెల్ (బి) సోఫి 33; కవిశా (బి) సోఫి 4; నీలాక్షిక (సి)హీథర్‌నైట్ (బి) క్యాప్సీ 23; అనుష్క (ఎల్బీడబ్ల్యూ) (బి) నాట్ సీవర్ 10; విహంగ (సి) చార్లీ డీన్ (బి) నాట్ సీవర్ 3; సుగంధిక (బి) చార్లీ డీన్ 4; ప్రబోధని (సి) నాట్ సీవర్ (బి) లిన్సే స్మిత్ 0; ఇనొక నాటౌట్ 3; ఎక్స్‌ట్రాలు 24; **మొత్తం (45.4 ఓవర్లలో ఆలౌట్) 164. వికెట్ల పతనం:** 1–37, 2–95, 3–98, 4–103, 5–116, 6–134, 7–145, 8–157, 9–157, 10–164. **బౌలింగ్:** లారెన్ బెల్ 8–1–32–0, లిన్సే స్మిత్ 8.4–1–22–1, నాట్ సీవర్ 5–0–25–2, చార్లీ డీన్ 9–1–47–2, అలైస్ క్యాప్సీ 5–1–15–1, సోఫి 10–3–17–4.



దక్షిణాఫ్రికాకు నమీబియా షాక్

- ఏకైక టి20లో ఘనవిజయం
- 4 వికెట్లతో సఫారీ జట్టు ఓటమి

విన్‌ఢోక్ (నమీబియా): అంతర్జాతీయ క్రికెట్‌లో నమీబియా జట్టు సంచలనం నమోదు చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఏకైక టి20 పోరులో నమీబియా జట్టు 4 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తుచేసింది. ఐసీసీ శాశ్వత సభ్యదేశాలపై నమీబియాకు ఇదే తొలి విజయం కావడం విశేషం. ఏ ఫార్మాట్‌లో అయినా దక్షిణాఫ్రికాతో నమీబియాకు ఇదే తొలి మ్యాచ్ కాగా... మొదటి మ్యాచ్‌లోనే విజయం సాధించింది. సొంతగడ్డపై తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన నమీబియా... దక్షిణాఫ్రికాను తక్కువ స్కోరుకే పరిమితం చేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. జేసన్ స్మిత్ (30 బంతుల్లో 31; 2 ఫోర్లు), రుబిన్ హెర్మన్ (18 బంతుల్లో 23; 2 ఫోర్లు, 1 సిక్స్), లువాన్ డ్రె ప్రిటోరియస్ (22) తలా కొన్ని పరుగులు చేశారు. కెప్టెన్ డొనొవన్ ఫెర్రీరా (4), క్వింటన్ డికాక్ (1), రీజా హెన్‌డ్రిక్స్ (7) విఫలయ్యారు. ఆదివారం నుంచి దక్షిణాఫ్రికా జట్టు పాకిస్తాన్ పర్యటన ప్రారంభించనుండగా... ఈ మ్యాచ్‌లో సఫారీ జట్టు తరఫున టి20 స్పెషలిస్టులు బరిలోకి దిగారు. అయితే నమీబియా కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆకట్టుకోవడంతో... సఫారీ జట్టు పరుగులు చేసేందుకు తీవ్రంగా ఇబ్బంది పడింది. డికాక్, హెన్‌డ్రిక్స్ వంటి స్టార్లు నమీబియా బౌలర్లను ఎదుర్కోలేకపోయారు. రూబెన్ 28 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా... మ్యాక్స్ హెయింగో 32 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. అనంతరం లక్ష్యఛేదనలో నమీబియా 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 138 పరుగులు చేసింది. జానె గ్రీన్ (23 బంతుల్లో 30 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా... కెప్టెన్ గెర్‌హార్డ్ ఎరాస్మస్ (21; 3 ఫోర్లు), మలన్ క్రుగర్ (18; 1 సిక్స్) కీలక పరుగులు చేశారు. బౌలింగ్‌లో మూడు వికెట్లు పడగొట్టడంతో పాటు చివరి ఓవర్‌లో కీలక పరుగులు చేసిన రూబెన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

యువ భారత్ శుభారంభం

- 3-2 గోల్స్ తేడాతో గ్రేట్ బ్రిటన్‌పై విజయం
- సుల్తాన్ జొహార్ కప్ హాకీ టోర్నమెంట్





జొహర్ బహ్రు (మలేసియా): భారత జూనియర్ పురుషుల హాకీ జట్టు... సుల్తాన్ ఆఫ్ జొహర్ కప్‌లో శుభారంభం చేసింది. టోర్నీలో భాగంగా శనివారం జరిగిన పోరులో రోహిత్ సారథ్యంలోని యువ భారత జట్టు 3–2 గోల్స్ తేడాతో గ్రేట్ బ్రిటన్‌ను చిత్తుచేసింది. కెప్టెన్ రోహిత్ (45వ, 52వ నిమిషాల్లో) రెండు గోల్స్‌తో విజృంభించగా... రణ్‌వీత్ సింగ్ (23వ నిమిషంలో) ఓ గోల్ సాధించాడు. గ్రేట్ బ్రిటన్ తరఫున మైఖేల్ రాయ్‌డెన్ (26వ నిమిషంలో), కాడెన్ డ్రాసే (46వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. తొలి క్వార్టర్‌లో ఇరు జట్లు హోరాహోరీగా పోరాడగా... ఏ జట్టూ ఖాతా తెరవలేకపోయింది. మ్యాచ్ 13వ నిమిషంలో భారత జట్టుకు తొలి పెనాల్టీ కార్నర్ అవకాశం రాగా... దాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది. 16వ నిమిషంలో వచ్చిన మరో అవకాశాన్ని కూడా గోల్‌గా మలచలేకపోయింది. రెండో క్వార్టర్ మధ్యలో గుర్‌జ్యోత్ సింగ్ ప్రత్యర్థులను బోల్తా కొట్టిస్తూ బంతిని రణ్‌వీత్‌కు అందించగా... అతడు దాన్ని గోల్‌పోస్ట్‌లోకి పంపి భారత్‌కు మొదటి గోల్ అందించాడు. కాసేపటికే ఇంగ్లండ్ స్కోరు సమం చేయగా... మూడో క్వార్టర్‌లోనూ ఇరు జట్లు గోల్స్ కోసం తీవ్రంగా శ్రమించాయి. 45వ నిమిషంలో బ్రిటన్ స్ట్రయికర్లు చేసిన ప్రయత్నాల్ని భారత గోల్‌కీపర్ ప్రిన్స్‌దీప్ సింగ్ సమర్థవంతంగా అడుకున్నాడు. అదే సమయంలో రోహిత్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచడంతో భారత్ ఆధిక్యం రెట్టింపు కాగా... తర్వాతి నిమిషంలోనే పెనాల్టీ స్ట్రోక్‌ను వినియోగించుకున్న గ్రేట్ బ్రిటన్ స్కోరును మరోసారి సమం చేసింది. ఇక చివరి క్వార్టర్‌లో వరుసగా మూడు పెనాల్టీ కార్నర్ అవకాశాలు దక్కించుకున్న భారత్... మూడోదాన్ని గోల్‌గా మలచి విజయంతో మ్యాచ్‌ను ముగించింది. టోర్నీలో భాగంగా ఆదివారం న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది.

బెంగళూరు హ్యాట్రిక్

సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) 4వ సీజన్‌లో బెంగళూరు టార్పడోస్ జోరు కొనసాగుతోంది. లీగ్‌లో భాగంగా శనివారం జరిగిన పోరులో బెంగళూరు 3–1 (13–15, 17–15, 15–9, 15–12)తో కొచ్చి బ్లూ స్పైకర్స్‌పై గెలుపొందింది. బెంగళూరు జట్టుకు ఇది వరుసగా మూడో విజయం. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు జట్టు తమ సర్వీస్‌లో 20 పాయింట్లు సాధించగా... కొచ్చి బ్లూ స్పైకర్స్11 పాయింట్లకే పరిమితమైంది. ముఖ్యంగా బెంగళూరు తరఫున సేతు సూపర్ సర్వీస్‌లతో ఆకట్టుకున్నాడు. ఇక బెంగళూరు కెప్టెన్ మాథ్యూ తన షాట్‌లతో ఆకట్టుకున్నాడు. బెంగళూరు జట్టు స్పైక్‌లో 25 పాయింట్లు సాధించగా... బ్లూ స్పైకర్స్ 20 పాయింట్లు ఖాతాలో వేసుకుంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన బెంగళూరు 8 పాయింట్లతో పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది. కొచ్చి నాలుగు మ్యాచ్‌ల్లో ఒక విజయం, 3 పరాజయాలతో 3 పాయింట్లతో 9వ స్థానంలో ఉంది. లీగ్‌లో భాగంగా ఆదివారం ఢిల్లీ తూఫాన్స్‌తో కాలికట్ హీరోస్, హైదరాబాద్ బ్లాక్ హాక్స్‌తో అహ్మదాబాద్ డిఫెండర్స్ తలపడనున్నాయి.



బెంగళూరు బుల్స్ జోరు

- 47-26తో జైపూర్ పింక్ పాంథర్స్‌పై జయభేరి
- ప్రొ కబడ్డీ లీగ్

న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్–12)లో ప్లేఆఫ్స్ రేసులో పడేందుకు బెంగళూరు బుల్స్ జోరు పెంచుతోంది. ఈ సీజన్‌లో ఏడో విజయాన్ని సాధించి పాయింట్ల పట్టికలో టాప్–5లో నిలిచింది. శనివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జైపూర్ పింక్‌పాంథర్స్‌పై ఘనవిజయం సాధించింది. బుల్స్ 47–26తో రెండుసార్లు చాంపియన్ అయిన జైపూర్‌ను చిత్తు చేసింది. బెంగళూరు ఆల్‌రౌండర్ అలీరెజా మిర్జాయిన్ ప్రత్యర్థి జట్టును బెంబేలెత్తించాడు. 22 సార్లు కూతకెళ్లిన అతను 12 పాయింట్లను తెచ్చిపెట్టాడు. కెప్టెన్, డిఫెండర్ యోగేశ్ (8) జైపూర్ రెయిడర్లను వణికించాడు. రెయిడర్లను 8 సార్లు విజయవంతంగా టాకిల్ చేశాడు. అతనితో పాటు డిఫెన్స్‌లో దీపక్ శంకర్ (5), సంజయ్ (3) రాణించారు. రెయిడర్లలో ఆశిష్ మాలిక్ (5), ఆకాశ్ షిండే (4)లు అదరగొట్టారు. పింక్‌పాంథర్స్ జట్టులో రెయిడర్లు అలీ సమది (9), వినయ్ (6) ఆకట్టుకున్నారు. కానీ సహచరుల నుంచి మద్దతు లేకపోవడంతో టాకిల్‌లో పదేపదే వెనుకబడింది. ఈ సీజన్‌లో జైపూర్ జట్టుకు ఇది ఏడో పరాజయం!

ప్లేఆఫ్స్ చేరిన పుణేరి పల్టన్

మాజీ చాంపియన్ (2023) పుణేరి పల్టన్ 12వ సీజన్‌లో ప్లేఆఫ్స్‌కు చేరింది. శనివారం జరిగిన రెండో మ్యాచ్‌లో పుణేరి జట్టు 36–23తో తమిళ్ తలైవాస్‌పై గెలుపొందింది. రెయిడర్ పంకజ్ మోహితే (9), కెప్టెన్ అస్లామ్ ఇనామ్‌దార్ (7), ఆల్‌రౌండర్ గుర్‌దీప్ (5), డిఫెండర్ విశాల్ భరద్వాజ్ (4) క్రమం తప్పకుండా పాయింట్లు చేసి పుణేరి పల్టన్ విజయంలో కీలకపాత్ర పోషించారు. తలైవాస్ తరఫున కెప్టెన్ అర్జున్ దేశ్వాల్ (6), అరుళ్ (4), నితీశ్ కుమార్ (3) రాణించారు. లీగ్‌లో 14 పోటీలాడిన పుణేరి 11 మ్యాచ్‌ల్లో గెలిచి కేవలం 3 మ్యాచ్‌ల్లోనే ఓడింది. ఇప్పటికే ప్లేఆఫ్స్ చేరిన దబంగ్ ఢిల్లీ, పుణేరి పల్టన్ జట్లు నేడు జరిగే తొలి మ్యాచ్‌లో తలపడనున్నాయి. మరో పోరులో బెంగాల్ వారియర్స్‌తో బెంగళూరు బుల్స్ పోటీపడుతుంది.

పాకిస్తాన్ X దక్షిణాఫ్రికా

నేటి నుంచి తొలి టెస్టు



లాహోర్: ప్రధాన ప్లేయర్లు లేకుండానే దక్షిణాఫ్రికా జట్టు... పాకిస్తాన్ పర్యటనకు సిద్ధమైంది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం పాకిస్తాన్, దక్షిణాఫ్రికా మధ్య తొలి టెస్టు ప్రారంభం కానుంది. రెగ్యులర్ కెప్టెన్ తెంబా బవుమా, స్టార్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్ గాయాల కారణంగా ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేకుండా పోయారు. దీంతో సఫారీ జట్టుకు ఎయిడెన్ మార్క్‌రమ్ సారథ్యం వహిస్తున్నాడు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2025–27 సర్కిల్‌లో డిఫెండింగ్ చాంపియన్ దక్షిణాఫ్రికాకు ఇదే తొలి మ్యాచ్ కాగా... ఈ సారి కూడా మెరుగైన ఆరంభం దక్కించుకోవాలని చూస్తోంది. ఇరు జట్లు పేస్ బౌలింగ్‌కు పెట్టింది పేరు కాగా... ఇటీవలి కాలంలో పాకిస్తాన్ జట్టు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడంలో విఫలమవుతోంది. గత డబ్ల్యూటీసీలో దక్షిణాఫ్రికా విజేతగా నిలవగా... పాకిస్తాన్ జట్టు ఆఖరి స్థానంతో సరిపెట్టుకుంది. మార్క్‌రమ్ సారథ్యంలోని సఫారీ జట్టు... వరుసగా 11 విజయాలు సాధించి ఈ మ్యాచ్ బరిలోకి దిగుతుండగా... గత 12 మ్యాచ్‌ల్లో పాకిస్తాన్ మూడింట మాత్రమే నెగ్గింది. మార్క్‌రమ్, రికెల్టన్, ముల్డర్, బ్రేవిస్, వెరిన్, యాన్సన్‌తో సఫారీ బ్యాటింగ్ లైనప్ బలంగా ఉండగా... పాకిస్తాన్ జట్టు షాన్ మసూద్, బాబర్ ఆజమ్, సాద్ షకీల్, మొహమ్మద్ రిజ్వాన్‌లను నమ్ముకుంది. పరిమిత ఓవర్లలో జట్టుకు దాదాపు దూరమైన బాబర్ ఆజమ్, రిజ్వాన్ సుదీర్ఘ ఫార్మాట్‌లో ఎలాంటి ప్రదర్శన చేస్తారనేది కీలకం. ఈ పర్యటనలో భాగంగా దక్షిణాఫ్రికా జట్టు మొదట టెస్టులు, ఆతర్వాత టి20లు, అనంతరం వన్డేలు ఆడనుంది.

ఏసీఏ అండర్-23 జట్టు మేనేజర్‌గా వెంకటేశ్

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్ర అండర్–23 పురుషుల క్రికెట్ జట్టుకు వై.వెంకటేశ్ మేనేజర్‌గా ఎంపికయ్యాడు. ప్రస్తుతం ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్‌లో భాగంగా విశాఖపట్నంలో జరుగుతున్న మ్యాచ్‌లకు మీడియా మేనేజర్‌గా కొనసాగుతున్న వెంకటేశ్... ఈ సీజన్‌లో అండర్–23 జట్టుతో కలిసి పనిచేయనున్నాడు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నిర్వహించే సుదీర్ఘ ఫార్మాట్ మ్యాచ్‌లకు అతడు ఆంధ్ర జట్టు మేనేజర్‌గా వ్యవహరించనున్నాడు. ఈ సందర్భంగా ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) ప్రతినిధులు శనివారం వెంకటేశ్‌ను అభినందించారు. కొత్త పాత్రలో మరింత ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు.





చాంపియన్ చైనా

- ఫైనల్లో ఇండోనేసియాపై గెలుపు
- భారత్, జపాన్‌లకు కాంస్య పతకాలు



గువాహటి: ప్రపంచ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో చైనా విజేతగా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో చైనా 2–0 (45–30, 45–44)తో డిఫెండింగ్ చాంపియన్ ఇండోనేసియాపై విజయం సాధించింది. గువాహటి వేదికగా జరిగిన ఈ సుహందినాథ కప్‌లో చైనా జట్టు రికార్డు స్థాయిలో 15వ సారి ట్రోఫీ చేజిక్కించుకుంది. ఆరంభం నుంచే జోరు కనబర్చిన చైనా... రెండు గంటల్లోపే ఇండోనేసియా ఆటకట్టించింది. చైనా తరఫున బాలికల డబుల్స్‌లో కావ్ జీ హన్–చెన్ ఫన్ షూ జంట శుభారంభం అందించగా... మిగిలిన వాళ్లు దాన్ని ముందుకు తీసుకెళ్లారు. ఇండోనేసియాకు రజత పతకం దక్కగా... సెమీఫైనల్స్‌లో ఓడిన భారత్, జపాన్ కాంస్యాలు గెలుచుకున్నాయి. ఆదివారం విశ్రాంతి కాగా... సోమవారం నుంచి ఇక్కడే వ్యక్తిగత చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం కానున్నాయి.






ఉత్తర కొరియా బలప్రదర్శన

ఉత్తర కొరియా రాజధాని ప్యాంగ్‌యాంగ్‌లో శుక్రవారం రాత్రి జరిగిన అధికార వర్కర్స్ పార్టీ 80వ వార్షికోత్సవంలో అబ్బురపరిచిన అత్యాధునిక ఆయుధ సంపత్తి.



ప్రేమ ఎంత గరళం!

ప్రాప్తమనుకో ఈ క్షణమే బతుకులాగా.. పండెననుకో ఈ బతుకే మనసు తీరా.. అన్నాడొక కవి. ఆ కుర్రాడు కూడా ప్రేమించాడు. ప్రేమను పండించుకోవాలనుకున్నాడు. శాశ్వతంగా నిలబెట్టుకోవాలనుకున్నాడు. అదే నేరమైంది. గరళమైంది. ఇరవయ్యేళ్లకే నూరేళ్లు నింపింది. గులాబీలు ఇచ్చిన చేతులతోనే గటగట గరళం తాగాడు. ప్రేమను నిరూపించుకోవాలనే పెద్దల శాసనం.. అతనికి మృత్యు శాసనమయ్యింది.

ఇరవయ్యేళ్లకే నూరేళ్లు

ఇది సినిమా కథ కాదు.. ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బాలో జరిగిన ఒక హృదయాన్ని మెలిపెట్టే విషాదం. కృష్ణకుమార్ పాండో (20).. సోనారి గ్రామానికి చెందిన ఒక యువతిని ప్రేమించాడు. వారిద్దరి గాఢమైన ప్రేమబంధం అమ్మాయి కుటుంబానికి తెలిసిపోయింది. ఆ రోజు సెప్టెంబర్ 25.. ఆ యువతి కుటుంబం కృష్ణను తమ ఇంటికి పిలిపించింది. తన ప్రేయసి కుటుంబం ముందు కృష్ణ ధైర్యంగా నిలబడ్డాడు. అతని ధైర్యమల్లా.. ఆ క్షణంలో తన గుండె నిండా ఉన్న నిస్వార్థమైన, నిండైన ప్రేమే. కానీ ఆ కుటుంబం అతని ప్రేమను నమ్మడానికి ఒక అగ్నిపరీక్ష పెట్టింది. కాదుకాదు బలిపీఠం ఎక్కించింది.

విషం తాగి నిరూపించుకో..

'నీ ప్రేమ నిజమే అయితే విషం తాగి నిరూపించుకో'.. అన్న పెద్దల మాటలు అతని చెవుల్లో ఎలా ఉరిమి ఉంటాయో ఊహించండి. ప్రేమ కోసం ఏదైనా చేస్తాననే యువకుడి ఆరాటాన్ని ఆ కుటుంబం దారుణంగా ఉపయోగించుకుంది. బహుశా ఆ క్షణంలో అతనికి తన జీవితం కంటే, తన ప్రేమ నిజమని రుజువు చేయడమే ముఖ్యం అనిపించిందేమో. వెనకా ముందూ ఆలోచించలేదు.. కృష్ణకుమార్ విషం తాగేశాడు. విషం.. అతని శరీరంలోకి ప్రవహించింది. ప్రతి కణాన్ని నాశనం చేయడం మొదలుపెట్టింది.

నరకయాతన అనుభవించి..

ఆ తరువాత, జరిగిన విషయం తన కుటుంబ సభ్యులకు చెప్పగా, వారు కృష్ణను వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి జిల్లా ఆసుపత్రికి మార్చినా, అతని పరిస్థితి విషమంగానే ఉంది. అతని గుండె, ఊపిరితిత్తులు ఆ విష ప్రభావానికి లొంగిపోతుంటే, చివరి క్షణాల్లో ఏం గుర్తుకొచ్చిందో.. ఎంతగానో ప్రేమించిన అమ్మాయి ముఖమా.. లేదా తన ప్రేమను బలిపీఠం ఎక్కించిన పెద్దల పైశాచిక వ్యాఖ్యలా.. చివరికి అక్టోబర్ 8న మృత్యువు ఒడిలోకి చేరుకున్నాడు. కృష్ణ కుటుంబ సభ్యులు.. అమ్మాయి తరఫు వారు బలవంతం చేయడమో, లేదా ప్రేరేపించడమో వల్లే తమ కుమారుడు విషం తాగాడని ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ప్రేమంటే పవిత్రత, త్యాగం.. కానీ దాన్ని ఇంతటి భయంకరమైన పరీక్షతో నిరూపించుకోవాలని పెద్దలు కోరడం, దానికి అమాయకపు యువకుడు బలైపోవడం.. నిజంగా ఇది గుండెల్ని పిండేసే విషాదం.

చావు తెలివితేటలు

నకిలీ మరణ ధ్రువపత్రంతో కోర్టుకు దొంగ టోకరా

న్యూఢిల్లీ: న్యాయం నుంచి తప్పించుకోవడానికి ఒక దొంగగారు ఎంత దూరం వెళ్లారో తెలుసా? ఏకంగా యమలోకం వరకూ!.. అవును, దొంగతనాలు చేసిచేసి.. విచారణలంటే విసుగొచ్చిన ఒక మహా మేధావేం చేశాడో తెలుసా? తాను చనిపోయినట్లు నకిలీ పత్రాలు సృష్టించాడు. రెండేళ్లుగా 'చనిపోయినవాడి' హోదాలో హాయిగా బతికేస్తున్నాడు. ఈ టెక్నాలజీ ఉంది చూశారూ.. అదిమాత్రం మనోడిని రెండేళ్ల తర్వాత పట్టించేసింది పాపం.

కోర్టులు, కేసులు నా వల్లకాదెహే..

ఆ ఘనుడి పేరు వీరేందర్ విమల్ (35). ఇతను దొంగతనాలు, తుపాకుల కేసుల్లో రెగ్యులర్ కస్టమర్. కోర్టులో నాన్-బెయిలబుల్ వారెంట్లు వస్తూ ఉంటే, విమల్‌కు ఒళ్లు మండింది. 'ఈ కోర్టులు, పోలీసులు, కేసులు... నా వల్ల కాదసలు! నేను ఇంకో దారి చూసుకోవాలి,' అనుకున్నాడు. సాధారణంగా మనుషులు చనిపోతే స్వర్గానికి వెళ్తారు. కానీ ఈ వీరేందర్ విమల్ మాత్రం.. న్యాయం నుంచి తప్పించుకోవడానికి చనిపోయినట్లు నటిస్తూ, 'భూలోక స్వర్గానికి' వెళ్లిపోయాడు!

కళ్లు మూసుకుని.. 'కన్ను మూసినట్లు' ఇచ్చేశారు

2021లో, విమల్ ఒక అద్భుతమైన ఆలోచన చేశాడు. పాత సినిమాల్లో విలన్లు చేసే పనిని, ఈయన ఏకంగా ప్రభుత్వంతోనే చేయించాడు. మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ జారీ చేసినట్లు నకిలీ డెత్ సర్టిఫికెట్‌ను సృష్టించాడు. ఆ సర్టిఫికెట్‌లో, 'ఈ వీరేందర్ విమల్ అనే వ్యక్తి ఇక లేరు, ఆగస్టు 24, 2021న మరణించితిరి' అని ఉంది! కోర్టులో ఆ 'చావు పత్రం' సమర్పించగానే, జడ్జి గారు కూడా 'మరణించిన వ్యక్తిని ఏం విచారించగలంలే' అనుకుని కేసులను క్లోజ్ చేసేశారు. అక్కడ విమల్, 'చనిపోయిన వారి' జాబితాలో చేరి, హాయిగా బతికేస్తున్నాడు. పోలీసులు కూడా, 'పాపం, వాడు పోయాడు' అని సైలెంట్ అయ్యారు.

కానీ ట్విస్ట్ ఏంటంటే..

పాత ఫైళ్లు దుమ్ము దులిపి చూస్తుంటే.. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (క్రైమ్) ఆదిత్య గౌతమ్ గారికి డౌటనుమానం వచ్చింది. వెంటనే 'విమల్ మరణ మిస్టరీని' తెరిచారు. తీరా చూస్తే.. 'అసలు చావలేదని.. ఆ మరణ ధ్రువపత్రం అంతా నకిలీది!' అని తేలింది. పోలీసులేమో... అసలు ఎవడీడు? చావు పేరిట కూడా మమ్మల్ని మోసం చేస్తాడా?' అని పళ్లు కొరికారు.

గోరఖ్‌పూర్‌లో 'బతికున్న దెయ్యం'

పోలీసులు అతన్ని వెతకడానికి.. పాత పద్ధతులు వదిలేశారు. 'క్రైమ్ కుండ్లీ' (బయోమెట్రిక్ డేటాబేస్), ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ అనే సైన్స్ ఫిక్షన్ టెక్నాలజీని వాడారు. అంతే మనోడు అడ్డంగా దొరికిపోయాడు. విమల్ తాజా ఫోటోని ఆ సాఫ్ట్‌వేర్‌లో పడేయగానే.. 'ఇతను చనిపోలేదు, ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్లో బిందాస్‌గా బతికేస్తున్నాడు' అని చూపించింది! పోలీసులు గోరఖ్‌పూర్ వెళ్ళి, రెండేళ్లుగా ఖుషీఖుషీగా బతికేస్తున్న ఆ 'బతికున్న దెయ్యాన్ని' పట్టుకుని లోపలేసేశారు.

నీతి: దొంగతనాలు చేయకండి. ఒకవేళ చేసినా.. దయచేసి 'చచ్చిపోయినట్లు' నటించకండి. ఎందుకంటే, ఢిల్లీ పోలీసుల టెక్నాలజీ... మీరెక్కడున్నా జాతకం పట్టేస్తుంది.

అడవి పందిని తింటే పంట సేఫ్!

కేరళ మంత్రి అతి తెలివి!

అలప్పుళ (కేరళ): అడవి పందుల బెడద నుంచి తమ పంటలను కాపాడుకోవడానికి కేరళ రైతులకు.. ఆ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పి.ప్రసాద్ వినూత్నమైన సలహా ఇచ్చారు. ఆయన శనివారం పాలమేల్ గ్రామ పంచాయతీలో మాట్లాడుతూ... 'అడవి పందులు పంటలను నాశనం చేస్తున్నాయి కదా?. మీరంతా వాటి మాంసాన్ని తినండి!. ఈ సమస్య చాలా వేగంగా పరిష్కారమవుతుంది!' అని సెలవిచ్చారు. పంట పొలాల్లో హతమైన అడవి పందుల మాంసాన్ని ప్రజలు తినడానికి అనుమతించాలని అభిప్రాయపడ్డారు. ఆయన దీనికి లాజిక్ కూడా చెప్పారు. 'ప్రజలకు అడవి పందులను చంపి, వాటి మాంసాన్ని తినేందుకు అనుమతి ఉంటే, ఈ సమస్య చాలా తొందరగా పరిష్కారమవుతుంది. కానీ, ప్రస్తుత చట్టం దీనికి ఒప్పుకోవట్లేదు'.. అని వాపోయారు. 'అడవి పంది ఏమంత అంతరించిపోతున్న జంతువు కాదు కదా!' అని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి వ్యాఖ్యలు.. రాష్ట్రంలో మానవ-జంతు సంఘర్షణలను తగ్గించేందుకు ఉద్దేశించిన వన్యప్రాణి సంరక్షణ చట్టం, 1972ను సవరించడానికి కేరళ అసెంబ్లీ ఒక బిల్లును ఆమోదించిన కొద్ది రోజుల తర్వాత రావడం విశేషం.

రాహుల్ లాగే తేజస్వీకి ఓటమి తప్పదు

జన్‌సురాజ్ పార్టీ చీఫ్ ప్రశాంత్ కిషోర్ జోస్యం

రఘోపూర్ నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభం

వారసత్వ పాలనకు ముగింపు పలకాలని పిలుపు

రాయపూర్: ఆరేళ్ల క్రితం అమేథీ నుంచి రాహుల్ గాంధీ ఓడినట్లుగానే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌కు పరాజయం తప్పదని జన్‌సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ జోస్యం చెప్పారు. వైశాలి జిల్లా రఘోపూర్‌లో తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన సందర్భంగా ప్రశాంత్ కిశోర్ మీడియాతో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో తేజస్వీ ఒకటి కంటే ఎక్కువ స్థానాల నుండి పోటీ చేయవచ్చని పుకార్లు వస్తున్నాయని విలేకరులు అడగ్గా.., ప్రశాంత్ కిషోర్ నవ్వుతూ సమాధానం ఇచ్చారు. ''మా పార్టీ ఇక్కడ బలమైన అభ్యర్థిని పోటీకి దింపుతుందనే ఊహాగానాలకే తేజస్వీ భయపడుతున్నారు. వారిని రెండు చోట్ల పోటీ చేయనీయండి. 2019లో రాహుల్ గాంధీ కూడా వయనాడ్, అమేథీలో పోటీ చేశారు. కాంగ్రెస్‌కు 15 ఏళ్లుగా కంచుకోటగా ఉన్న అమేథీలో రాహుల్ గాంధీ, బీజేపీ నేత స్మృతి ఇరానీ చేతిలో అవమానకర రీతిలో ఓడిపోయారు. ఇప్పుడు ఆర్జేడీకి, తేజస్వీ యాదవ్‌కు కూడా అదే గతి పడుతుంది'' అన్నారు. రఘోపూర్ నియోజకవర్గంలో తేజ్వసీ కుటుంబం దశాబ్దాలుగా ఆధిపత్యం చెలాయిస్తోందని ఆరోపించారు. అయినప్పటికీ ఈ ప్రాంతంలో కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని విమర్శించారు. ఈ ఎన్నికల్లో కచ్చితంగా వారసత్వ పాలనకు ముగింపు పలకాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

పవన్ సింగ్ శత్రువు కాదు

భోజ్‌పురి సూపర్‌స్టార్ పవన్ తనకు శత్రువు కాదన్నారు. ఆయన వ్యక్తిగతంగా మిత్రుడేనని, బీజేపీలో ఉన్నారనేదానిపై తనకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. పవన్ సింగ్ భార్య తన అభద్రతా భావాలను పంచుకోవడానికి వచ్చినప్పుడు, తాను ఒక సోదరుడిలా హామీ ఇచ్చానన్నారు. తాను కానీ, జన్ సురాజ్ పార్టీ వారి వివాహ వివాదంలో ఎలాంటి జోక్యం చేసుకోమని స్పష్టం చేశారు.

ఆశావహుల్లో అసంతృప్తి సహజం

రెండురోజుల క్రితం పార్టీ 51 మంది అభ్యర్థుల మొదటి జాబితాను విడుదల చేసిన తర్వాత అసంతృప్తి వ్యక్తం చేసిన ఆశావహులను తేలికగా తీసుకున్నారు. ఇది ప్రతిపార్టీలోనూ సహజమని అన్నారు. వేలాది మంది రక్తం, కన్నీళ్లు, చెమటతో జన్ సురాజ్ పార్టీ నిర్మాణం జరిగిందన్నారు. అసెంబ్లీలో కేవలం 243 సీట్లు మాత్రమే ఉన్నప్పుడు వారందరికీ అవకాశం కల్పించడం ఎప్పటికీ సాధ్యం కాదన్నారు. తమ పార్టీ అత్యంత పారదర్శక ప్రజాస్వామ్య పార్టీ సిద్ధాంతాలు కలిగి ఉందన్నారు. ప్రతీ సమస్య పరిష్కరిస్తామన్నారు.

పోటీపై పార్టీదే తుది నిర్ణయం

జన్ సురాజ్ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం ఆదివారం(ఇవాళ) జరుగుతుందన్నారు. రఘోపూర్ నుంచి తనకు వచ్చే అభిప్రాయం కూడా చర్చకు వస్తుందన్నారు. దాని ఆధారంగా, అత్యంత అనుకూలమైన అభ్యర్థిని నిర్ణయిస్తారని, అది తానేనేనా అని చెప్పలేనని అన్నారు. ఆ నిర్ణయం పార్టీ తీసుకోవాలని చెప్పారు.

ఐపీఎస్ అధికారి ఆత్మహత్య

రోహ్‌తక్ ఎస్పీపై బదిలీ వేటు

చండీగఢ్: హరియాణాలో ఐపీఎస్ అధికారి వై.పూరన్ సింగ్ ఆత్మహత్య ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. తన భర్త బలవన్మరణానికి ఉన్నతాధికారుల వేధింపులే కారణమని ఆయన భార్య ఆరోపించిన నేపథ్యంలో రోహ్‌తక్ జిల్లా ఎస్పీ నరేంద్ర బిజర్ణియాపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. పూరన్ సింగ్ ఆత్మహత్య కేసులో దర్యాప్తు కొనసాగుతోందని, దోషులు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హరియాణా ముఖ్యమంత్రి నాయబ్‌సింగ్ సైనీ హెచ్చరించారు. బాధితుడిపై కులపరమైన వివక్ష చూపి, అతడి ఆత్మహత్య కారణమైనట్లు ఆరోపణలు వస్తున్నాయని చెప్పారు. పూరన్ కుమార్ మంగళవారం తన నివాసంలో ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. తనను తాను తుపాకీతో కాల్చుకొని ఆయన మృతిచెందారు. హరియాణా డీజీపీ శత్రుజీత్ కపూర్, నరేంద్ర బిజర్ణియా సహా పలువురి ఉన్నతాధికారుల పేర్లతో ఆయన ఒక సూసైడ్ నోటు రాసినట్లు సమాచారం. నరేంద్ర బిజర్ణియాకు ప్రభుత్వం ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. ఆయన స్థానంలో కొత్త ఎస్పీగా సురీందర్‌సింగ్ భోరియాను నియమించింది.

బిహార్‌లో 100 స్థానాల్లో పోటీ చేస్తాం: ఎంఐఎం

పాట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు 100 స్థానాల్లో పోటీ చేయబోతున్నామని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ నేతృత్వంలోని ఎంఐఎం ప్రకటించింది. రాష్ట్రంలో తాము మూడో ప్రత్యామ్నాయంగా అవతరించబోతున్నామని తేల్చిచెప్పింది. ఎంఐఎం బిహార్ అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమాన్ శనివారం మీడియాతో మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ కూటములు తమ ఉనికిని బలవంతంగానైనా ఒప్పుకోక తప్పదని అన్నారు. 2020 నాటి అసెంబ్లీ ఎన్నికల్లో సెక్యులర్ ఓట్లు చీలిపోవడానికి కాంగ్రెస్ కూటమే కారణమని ఆరోపించారు. ఆర్జేడీతో పొత్తు కోసం ప్రయత్నించామని తెలిపారు. కానీ, ఆ పార్టీ నేతలు లాలూ ప్రసాద్ యాదవ్, తేజస్వీ యాదవ్ స్పందించలేదని అన్నారు. అందుకే సొంతంగా 100 సీట్లలో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నామని తేల్చిచెప్పారు. భావసారూప్యం కలిగిన పార్టీలతో కలిసి మూడో ఫ్రంట్ ఏర్పాటు చేస్తామన్నారు.

డిజిటల్ యుగంలో బాలికల భద్రతకు ప్రమాదం

భారత ప్రధాన న్యాయమూర్తి గవాయ్ ఆందోళన

ఆన్‌లైన్ వేధింపులు, బెదిరింపులు, డీప్‌ఫేక్ వీడియోల వంటి సమస్యల ప్రస్తావన

వీటి నియంత్రణకు ప్రత్యేక చట్టాల రూపకల్పన అవశ్యమని ఉద్ఘాటన

విచారణా సంస్థలు, విధాన నిర్ణేతలకు ప్రత్యేక శిక్షణ అవసరమని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: డిజిటల్ యుగంలో బాలికల భద్రత ప్రమాదంలో పడే పరిస్థితులు తలెత్తాయని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బీఆర్ గవాయ్ శనివారం ఆందోళన వెలిబుచ్చారు. ఆన్‌లైన్ వేధింపులు, బెదిరింపులు, డీప్‌ఫేక్ వీడియోలు, వ్యక్తిగత డేటా దుర్వినియోగం వంటి సమస్యలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. వీటి నియంత్రణకు ప్రత్యేక చట్టాల రూపకల్పన అవశ్యమని ఉద్ఘాటించారు. అలాగే విచారణా సంస్థలు, విధాన నిర్ణేతలకు ప్రత్యేక శిక్షణ అవసరమన్నారు. డిజిటల్ గవర్నెన్స్‌లో బాలికల రక్షణకు ప్రధాన ప్రాధాన్యత కల్పించాలని స్పష్టం చేశారు. యూనిసెఫ్ ఇండియాతో కలిసి జువెనైల్ జస్టిస్ కమిటీ (జేజేసీ) ఆధ్వర్యంలో 'భారతదేశంలో బాలిక రక్షణ- సురక్షిత, ప్రోత్సాహక వాతావరణం' అనే అంశంపై ఇక్కడ జాతీయ వార్షిక భాగస్వామ్య సదస్సు జరిగింది. ఈ సదస్సులో సీజేఐ చేసిన ప్రసంగంలో ముఖ్యాంశాలు...

- రాజ్యాంగపరమైన, చట్టపరమైన హామీలు ఉన్నప్పటికీ, దేశవ్యాప్తంగా అనేక మంది బాలికలు ఇప్పటికీ తమ మౌలిక హక్కులను, బతుకుదెరువు కోసం అవసరమైన ప్రాథమిక సదుపాయాలను దురదృష్టవశాత్తూ కోల్పోతున్నారు. ఈ బలహీన స్థితి వారిని లైంగిక వేధింపులు, దోపిడీలు, హానికరమైన ఆచారాల చక్రబంధంలోకి తోసేస్తోంది. పోషకాహార లోపం, లింగ ఆధారిత గర్భస్రావాలు, అక్రమ రవాణా, బాల్య వివాహాలు వంటి తీవ్రమైన సమస్యలను వారు ఎదుర్కొంటున్నారు.
- భద్రత అంటే కేవలం శరీరాన్ని రక్షించడం మాత్రమే కాదు. ఇది మరెన్నో అంశాలతో మిళితమై ఉంటుంది. గౌరవంగా తలెత్తి నిలబడగల సమాజాన్ని నిర్మించడం, అక్కడ ఆమె ఆశయాలు విద్యా సమానత్వంతో వికసించడం వంటి ఎన్నో అంశాలు ఇక్కడ మనం ప్రస్తావించుకోవాలి. బాలికలకు, మహిళలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా కొన్నిచోట్ల కొనసాగుతున్న పితృస్వామ్య ఆచారాలను మనం ఎదుర్కొనాలి.
- రబీంద్రనాథ్ ఠాగూర్ రచించిన 'భయములేని మనసు ఉన్న చోట' అనే కవితలోని భావమే బాలిక రక్షణ లక్ష్యంగా ముందుకు సాగాలి.
- సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అడ్డంకులు మహిళల జీవితాలకు అడ్డంకులు సృష్టిస్తున్నాయి. కనుక వీటిపై లోతైన విశ్లేషణ అవసరం.

'చైల్డ్ రైట్స్ అండ్ ది లా..' పుస్తక పరిచయం

జువెనైల్ జస్టిస్ కమిటీ సభ్యులు న్యాయమూర్తి పార్దీవాలా ఈ సందర్భంగా 'చైల్డ్ రైట్స్ అండ్ ది లా' అనే హ్యాండ్‌బుక్‌ను కార్యక్రమంలో ప్రవేశపెట్టారు. ఈ పుస్తకం జేజేసీ మార్గదర్శకంలో సుప్రీంకోర్టు పరిశోధనా, ప్రణాళికా వ్యవహారాల విభాగం రూపొందించింది. జేజేసీ చైర్మన్ జస్టిస్ బి.వి. నాగరత్న, కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి వ్యవహారాల మంత్రి అయునిసెఫ్-ఇండియా దేశ ప్రతినిధి సిథ్నియా మక్కాఫ్రే తదితరులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

భారత్ గడ్డపై తాలిబాన్‌లకు ఇంత వివక్షా!

- అఫ్గాన్ విదేశాంగ మంత్రి ఢిల్లీ ప్రెస్ కాన్ఫరెన్స్‌కు మహిళా జర్నలిస్టులను ఆహ్వానించని వైనం
- దీనిపై ప్రధాని మోదీ మౌనంపై కాంగ్రెస్ ఆగ్రహం

న్యూఢిల్లీ: భారత్ గడ్డపై అఫ్గాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాకీ నిర్వహించిన పత్రికా సమావేశం ఇప్పుడు రాజకీయంగా పెద్ద దుమారమే రేపింది. దీనిపై భారత్ విదేశాంగ శాఖ వివరణ ఇచ్చుకునేంతవరకూ పరిస్థితి వెళ్లింది.

ఏమి జరిగింది..

ఆఫ్గాన్ విదేశాంగ మంత్రి శుక్రవారం న్యూఢిల్లీ ఆఫ్గాన్ దౌత్య కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొనడానికి మహిళా పాత్రికేయులు ఎవ్వరికీ ఆహ్వానం అందలేదు. దీనితో భారత్‌గడ్డపైనా కూడా తాలిబాన్‌లు 'లింగ భేదం' కొనసాగించారనడానికి ఇది ప్రత్యక్ష ఉదాహరణ అని రాజకీయ పార్టీలు, నేతలు, పాత్రికేయుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు ప్రారంభమయ్యాయి.

తీవ్ర విమర్శలు

ఇది ఎంతమాత్రం ఆమోదనీయంకాని అంశమని, మహిళలకు అవమానకరమైనదని ప్రతిపక్షం విమర్శించింది. దీనిపై ప్రధాని మోదీ మౌనంగా ఉండడాన్ని చూస్తే, 'నారీ శక్తి' అంటూ ఆయన ప్రసంగాల్లోని డొల్లతనం బట్టబయలవుతోందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'భారతదేశంలో అత్యంత ప్రతిభావంతమైన మహిళలకు ఇది అవమానం' అంటూ 'ఎక్స్'లో చేసిన మరో పోస్ట్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రియాంక గాంధీ వాద్రా విమర్శించారు. ఇది అత్యంత వివక్షతతో కూడిన చర్యని ఇండియన్ ఉమెన్స్ ప్రెస్ కాన్ఫరెన్స్ ఆందోళన వెలిబుచ్చింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఈ వ్యవహారాన్ని అఫ్గాన్ దౌత్య కార్యాలయం దృష్టికి తీసుకుని వెళ్లాలని ప్రభుత్వాన్ని కోరింది.

తన ప్రమేయం లేదన్న భారత్

ఈ వివాదంపై భారత్ విదేశాంగశాఖ ఒక ప్రకటన చేస్తూ, ఈ విషయంలో తన ప్రమేయం ఏదీ లేదని స్పష్టం చేసింది. కాగా, ఇది ఉద్దేశపూర్వకంగా జరగలేదని అఫ్గాన్ తాలిబాన్ ప్రతినిధి ఒకరు పేర్కొన్నట్లు వార్తలు వెలువడ్డాయి.

జీవశాస్త్ర పరిచయం

భూమిపై ఎన్నో వైవిధ్యభరితమైన జీవులుంటాయి. జీవుల శాస్త్రీయ అధ్యయనమే బయాలజీ. సుమారు 4.5–5 బిలియన్ ఏళ్ల క్రితం భూమి ఏర్పడింది. భూమి ఏర్పడిన 1 నుంచి 1.5 బిలియన్ ఏళ్ల తర్వాత జీవం ఆవిర్భవించింది. ఆ తర్వాత జరిగిన జీవ పరిణామం ద్వారా ఎన్నో రకాలు జీవులు ఆవిర్భవించాయి.

- భూమిపై జీవ ఆవిర్భావాన్ని వివరించే సిద్ధాంతాల్లో ప్రధానమైంది పాన్‌స్పెర్మియ, జీవావిర్భావ సిద్ధాంతాలు. పాన్‌స్పెర్మియ సిద్ధాంతం ప్రకారం భూమిపై జీవులు ఆవిర్భవించనే లేదు. భూమి వెలుపల నుంచి గ్రహ శకలాల ద్వారా లేదా గ్రహాంతర వాసుల ద్వారా భూమిపైకి చేరి ఆ తర్వాత పరిణామం చెందాయని ఈ సిద్ధాంతం వివరిస్తోంది. స్వాంటె అర్హీనియస్ దీన్ని వివరించాడు. ప్రస్తుతం అధిక ఆమోదంలో ఉన్న సిద్ధాంతం Theory of orgin of life(జీవావిర్భావ సిద్ధాంతం). దీన్ని A.I. ఒపారిన్ అనే రష్యాకు చెందిన జియోకెమిస్ట్, జేబీఎస్ హాల్డేన్ అనే బ్రిటన్ జన్యుశాస్త్రవేత్తలు స్వతంత్రంగా ప్రతిపాదించారు. వీరు ప్రతిపాదించిన వివరాల ప్రకారం భూమిపై జీవావిర్భావానికి ముందు జీవ రసాయనాలు ఆవిర్భవించాయి.
- పూర్వభూమి వాతావరణం కార్బన్, హైడ్రోజన్, నత్రజని వాయువుల మిశ్రమంగా ఉండేది. నీరు, నీటి ఆవిరి ఉన్నప్పటికీ స్వేచ్ఛా ఆక్సిజన్ ఉండేది కాదు. ఇలాంటి వాతావరణాన్ని క్షయకరణ (Reducing) వాతావరణం అంటారు. అప్పటి అధిక ఉష్ణోగ్రతల ప్రభావానికి కార్బన్, హైడ్రోజన్, నత్రజని మధ్య రసాయన చర్యలు జరిగి మీథేన్, హైడ్రోజన్ సయనైడ్, అమోనియా లాంటివి ఏర్పడ్డాయి. వీటితో నీటి ఆవిరి చర్యపొందడం ద్వారా ప్రస్తుతం కేవలం జీవుల్లో మాత్రమే కనిపించే అమైనో ఆమ్లాలు, చక్కెరలు, కొవ్వు ఆమ్లాలు, నత్రజని క్షారాలు లాంటి సరళ జీవ రసాయనాలు ఏర్పడ్డాయి. ఈ సరళమైన అణువుల మధ్య చర్యల ద్వారా ప్రోటీన్లు, కొవ్వులు, కేంద్రకామ్లాలు, పిండి పదార్థాలు తయారయ్యాయి. సముద్ర నీటిలో ఈ రసాయనాలు కలిసిపోయి జరిగిన కొన్ని చర్యల ద్వారా పూర్వపర జీవకణం ఏర్పడింది.
- భూమిపై ఏర్పడిన మొదటి జీవులన్నీ అవాయుజీవులు (Anaerobes). వీటి చర్యల ద్వారా నీటి అణువు విచ్ఛిన్నమై క్రమంగా స్వేచ్ఛా ఆక్సిజన్ విడుదలైంది. ఆ తర్వాత మొక్కలు ఆవిర్భవించి వాటిలోని కిరణజన్య సంయోగక్రియ ద్వారా మరింత ఆక్సిజన్ వాతావరణంలోకి విడుదలైంది. ప్రస్తుతం భూమిపై ఉన్న 21 శాతం ఆక్సిజన్‌కు ప్రధాన మూలం మొక్కల్లోని కిరణజన్య సంయోగ క్రియ. భూమిపై జీవం ఆవిర్భవించిన తర్వాత, జీవ పరిణా మం జరిగింది. సరళ స్థాయి నుంచి సంక్లిష్ట స్థాయి జీవులు ఎలా పరిణామం చెందాయన్నది మూడు ప్రధాన సిద్ధాంతాలు వివరిస్తాయి. వీటిలో మొదటిది 'ఫ్రాన్స్‌కు చెందిన జంతుశాస్త్రవేత్త జె.బీ. లామార్క్ ప్రతిపాదించిన ఆర్జిత లక్షణాల అనువంశిక సిద్ధాంతం (Theory of Inheritance of Aquired characters). పర్యావరణ ప్రభావం ద్వారా జీవుల్లో కొత్త లక్షణా లు ఏర్పడి అవి తర్వాతి తరాలకు అవిచ్ఛిన్నంగా సంక్రమించడం ద్వారా కొత్త జాతు లు ఆవిర్భవిస్తాయని ఈ సిద్ధాంతం వివరిస్తుంది. ఇంగ్లండ్‌కు చెందిన ఛార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన సిద్ధాంతం ప్రకృతివరణ సిద్ధాంతం. దీని ప్రకారం ప్రకృతిలోని పోటీ ఫలితంగా ఆ పోటీ తట్టుకొని నిలిచే జీవజాతులను ప్రకృతి వరిస్తుంది.హ్యూగోడిప్రీస్ అనే డచ్ వృక్ష శాస్త్రవేత్త ఉత్పరివర్తన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.
- భూమిపై ఉన్న జీవులను వర్గీకరించడం ద్వారా వాటిపై సమగ్ర అవగాహన సాధ్యమవుతుంది. అన్ని జీవులు పెరుగుదల, జీవక్రియ, ప్రత్యుత్పత్తి లాంటి సమాన లక్షణాలను ప్రదర్శించినప్పటికీ వాటిలోని కొన్ని ప్రత్యేకతల కారణంగా వాటిని విభజించాల్సిన అవసరముంటుంది. భూ మిపై ఉన్న జీవులన్నింటినీ మొక్కలు, జంతువులు అనే రెండు రకాలుగా అరిస్టాటిల్ వర్గీకరించాడు. అనంతరం అనేక సూక్ష్మజీవులను గుర్తించిన తర్వాత వాటిని కూడా కలుపుకొని అర్థవంతంగా వర్గీకరించాల్సిన అవసరం ఏర్పడింది. రాబర్ట్ విట్టేకర్ అనే జీవశాస్త్రవేత్త జీవులన్నింటినీ ఐదు ప్రధాన రాజ్యాలుగా వర్గీకరించాడు. ప్రస్తుతం ఈ వర్గీకరణే ప్రపంచవ్యాప్తంగా వినియోగంలో ఉంది. కణ సంక్లిష్టత, శరీర సంక్లిష్టత, పోషణ ఆధారంగా జీవులను ఐదు రాజ్యాలుగా వర్గీకరించాడు.

I. **మొనీరా రాజ్యం:** కేంద్రక పూర్వ జీవులన్నింటినీ ఈ రాజ్యంలో వర్గీకరించారు. ఇవన్నీ ఏక కణజీవులు. ఇవి కేంద్రక పూర్వ కణాలతో నిర్మితమై ఉంటాయి.
ఉదా: బ్యాక్టీరియా, సయనో బ్యాక్టీరియా (పూర్వనామం: నీలి ఆకుపచ్చ శైవలాలు)

II. **ప్రొటిస్టా రాజ్యం:** నిజ కేంద్రక జీవుల్లో ఏక కణ జీవులను ఈ రాజ్యంలో చేర్చారు. జంతువుల్లో ప్రోటోజోవా అనే ఏక కణ జీవులను,మొక్కల్లోని ఏకకణ శైవలాలను ఈ రాజ్యంలో చేర్చారు.

III. **శిలీంధ్ర రాజ్యం:** మొక్కలు, జంతువులు కానీ శిలీంధ్రాలు (Fungi) ఈ వర్గంలో చేర్చారు. శిలీంధ్రాలు పరపోషకాలు. అత్యధిక శిలీంధ్రాలు విచ్ఛిన్నకారులు. జంతు, వృక్ష కళేబరాలపై ఆధారపడతాయి. శిలీంధ్రాల ద్వారా మానవుల్లో, పంట మొక్కల్లో అనేక వ్యాధులు కలుగుతాయి. ఉదా: కాండిడా, పెన్సిలియం.

IV. **వృక్ష రాజ్యం:** అన్ని బహుకణ మొక్కలను ఈ వర్గంలో చేర్చారు. కిరణ జన్య సంయోగక్రియ ద్వారా వాటి ఆహారాన్ని అవే తయారు చేసుకుంటాయి. ఇవన్నీ స్వయం పోషకాలు.
ఉదా: బహుకణ శైవలాలు, బ్రయోఫైట్స్, టెరిడోఫైట్స్, వివృత బీజాలు, ఆవృత బీజాలు.

V. **జంతురాజ్యం (Animalia):** అన్ని బహుకణ జంతువులను ఈ రాజ్యంలో వర్గీకరించారు. ఇవన్నీ పరపోషకాలు. అత్యధికంగా స్వేచ్ఛా జీవులు.కొన్ని పరాన్న జీవులు కూడా ఉంటాయి.
ఉదా: రక్తాన్ని పీల్చే ఆడదోమలు, పేగులోని బద్దెపురుగులు. అత్యధిక జంతువులు శాకాహారులు. కొన్ని మాంసాహారులు, మరికొన్ని సర్వభక్షకాలు కూడా ఉంటాయి.

బట్టమేక పక్షి శాస్త్రీయ నామం?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ



వివిధ జీవుల శాస్త్రీయ అధ్యయనాల పేర్లు

శిలీంధ్రాలు	మైకాలజీ
శైవలాలు	ఫైకాలజీ
మొక్కలు	ఫైటాలజీ/బోటనీ
జంతువులు	జువాలజీ
స్పంజికలు	పొరాజువాలజీ
గడ్డి మొక్కలు	అగ్రోస్టాలజీ
వృక్షాలు	డెండ్రాలజీ
క్షీరదాలు	మామియోలజీ
పక్షులు	ఆర్నిథాలజీ
సరీసృపాలు	హెర్పటాలజీ
సర్పాలు	సర్పెంటాలజీ/ఒఫియాలజీ
కప్పలు	బాట్రకాలజీ
చేపలు	ఇక్రియాలజీ
కీటకాలు	ఎంటమాలజీ
తిమింగలాలు	సెటాలజీ
సీతాకోక చిలుకలు	లెపిడో టెరాలజీ
సాలీడు	అరెనియాలజీ

మాదిరి ప్రశ్నలు

1. ప్రకృతి అధ్యయనం కోసం 1831–36 మధ్య కాలంలో డార్విన్ ఏ నౌకలో ప్రయాణించాడు?
   1) HMS బీగిల్ 2) టైటానిక్
   3) KSK జైగాంట్ 4) TTS పర్ల్
2. ఏ మొక్కపై పరిశోధన ద్వారా హ్యూగో డిబ్రీస్ ఉత్పరివర్తన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు?
   1) తోట బఠాని 2) గులాబీ
   3) ఈనోథిర 4) ఏదీకాదు
3. భూమిపై ఆవిర్భవించిన తొలి కణాలకు ఒపారిన్ పెట్టిన పేరు?
   1) ప్రొటినాయిడ్ 2) కొయసర్వేట్
   3) కణం 4) న్యూక్లియాయిడ్
4. కిందివాటిలో సరైంది?
   ఎ) ప్రస్తుత భూమి వాతావరణం ఆక్సీకరణ వాతావరణం
   బి) పూర్వభూమిలోని సముద్రనీరు అంతస్సారు జలం
   1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
   3) ఎ, బి 4) ఏదీకాదు
5. కిందివాటిలో శిలీంధ్రం ఏది?
   1) ఈస్టు 2) పుట్టగొడుగు
   3) పెన్సిలియం 4) పైవన్నీ
6. అతిపెద్ద జంతు వర్గం?
   1) మొలస్కా 2) ఆర్థ్రోపొడా
   3) కార్డేటా 4) నిడేరియా
7. జంతు, మొక్క లక్షణాలు రెండూ ఉన్న జీవి?
   1) అమీబా 2) పారమీసియం
   3) ప్లాస్మోడియం 4) యూగ్లీన
8. బట్టమేక పక్షి శాస్త్రీయ నామం?
   1) ప్లటనిస్ట గాంజిటిక
   2) ఆర్డియోటిస్ నైగ్రిసెప్స్
   3) అకినోనిక్స్ జుబేటస్
   4) సిట్టాకుల క్రామెరీ
9. కింది ఏ పక్షులను డార్విన్ పేరుతో పిలుస్తారు?
   1) స్వాలోస్ 2) ఫించ్
   3) వల్చర్ 4) సీగల్
10. మొక్కలన్నింటిలో ఉన్నతమైనవి?
    1) ఆవృత బీజాలు 2) వివృత బీజాలు
    3) బ్రయోఫైట్స్ 4) టెరిడోఫైట్స్
11. కిందివాటిలో ద్విదళబీజం ఏది?
    1) కొబ్బరి 2) మొక్కజొన్న
    3) వరి 4) మామిడి
12. వృక్ష శాస్త్ర పితామహుడు?
    1) అరిస్టాటిల్ 2) థియోఫ్రాస్టస్
    3) లిన్నెయస్ 4) డార్విన్
13. 'డిసెంట్ ఆఫ్ మ్యాన్' గ్రంథ రచయిత?
    1) ఛార్లెస్ డార్విన్ 2) జె.బి. లామార్క్
    3) హ్యూగో డెవ్రీస్ 4) జి.జె. మెండెల్
14. కిందివాటిలో నిజమైన చేప ఏది?
    1) స్కార్పియాన్ ఫిష్
    2) స్టోన్ ఫిష్ 3) పఫర్ ఫిష్
    4) పైవన్నీ
15. కిందివాటిలో బ్యాక్టీరియం ఏది?
    1) నాస్టాక్ 2) అనబీన
    3) రైజోబియం 4) క్యాలోథ్రిక్స్
16. ఈస్టు శాస్త్రీయ నామం?
    1) సెకరో మైసిస్ సెరివిజియే
    2) పెన్సిలియం నొటేటం
    3) కాండిడా అల్బికన్స్ 4) ఏదీకాదు
17. కిందివాటిలో పాక్షిక జల క్షీరదం ఏది?
    1) సీల్ 2) వాల్‌రస్
    3) ఆటర్ 4) పైవన్నీ
18. జీవ వైవిధ్యం అత్యధికంగా ఉన్న దేశాల్లో భారత్ స్థానం?
    1) 1 2) 6 3) 12 4) 24
19. శిలీంధ్రం, మొక్క వేర్ల మధ్య ఏర్పడే సహజీవనం?
    1) లైకెన్ 2) మైకోరైజా
    3) మైకోబియాంట్ 4) ఫైకోబియాంట్
20. ప్రస్తుతం ప్రపంచంలో ఎన్ని పులుల ఉపజాతులు ఉన్నాయి?
    1) 6 2) 8 3) 10 4) 12

సమాధానాలు

1) 1; 2) 3; 3) 2; 4) 3; 5) 4; 6) 2; 7) 4; 8) 2; 9) 2; 10) 1; 11) 4; 12) 2; 13) 1; 14) 4; 15) 3; 16)1; 17) 4; 18) 2; 19) 2; 20) 1.

విద్య, ఉద్యోగ సమాచారం

నిట్ ఢిల్లీలో జూనియర్ ట్రాన్స్‌లేటర్ పోస్టులు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) ఢిల్లీ ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ ట్రాన్స్‌లేటర్(హిందీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ(హిందీ, ఇంగ్లిష్)లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 40 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.10.2025.
» **వెబ్‌సైట్:** https://nitdelhi.ac.in

ఎయిమ్స్ బిలాస్‌పూర్‌లో మెడికల్ ఫిజిసిస్ట్ పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) బిలాస్‌పూర్‌లో మెడికల్ ఫిజిసిస్ట్(రేడియోథెరపీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎమ్మెస్సీ(ఫిజిక్స్)లో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 21 నుంచి 35 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.81,906.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**15.10.2025
» **వెబ్‌సైట్:** www.aiimsmangalagiri.edu.in

నిట్ రూర్కెలాలో ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టులు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ(ఫిజిక్స్/మ్యాథ్‌మేటిక్స్/కెమిస్ట్రీ), ఎమ్మెస్సీ(ఫిజిక్స్/మ్యాథ్‌మేటిక్స్), బీటెక్ /ఎంఈ(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణతతో పాటు గేట్/నెట్‌లో అర్హత సాధించి ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.20,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** jenad@nitrkl.ac.in
» **దరఖాస్తులకు చివరితేది:** 12.10.2025.
» **ఇంటర్వ్యూ తేది:** 14.10.2025.
» **వెబ్‌సైట్:** https://www.nitrkl.ac.in

ఒక కాంతి సంవత్సరం (కి.మీ.లలో)?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఎస్‌జీటీ - ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్

మన విశ్వం

- నక్షత్ర వీధుల్లో చిన్న, చిన్న గుంపుల్లో ఉన్న నక్షత్ర సముదాయాలను తారాగణం లేదా నక్షత్రరాశి అంటారు.
- నక్షత్రరాశుల్లో కొన్నింటిని ఉత్తరార్ధగోళం నుంచి చూడగలిగితే, మరికొన్నింటిని దక్షిణార్ధగోళం నుంచి మాత్రమే చూడగలం. ఇప్పటివరకు మొత్తం 88 నక్షత్ర రాశులను శాస్త్రజ్ఞులు అధ్యయనం చేశారు.
- సూర్యుడు తిరిగే దారిని సంవత్సర కాలం మొత్తం 12 భాగాలుగా విభజించి, వాటి ఆకారాలను బట్టి నక్షత్ర సముదాయాలను 12 పేర్లతో పిలుస్తున్నారు. ఈ పన్నెండు రాశులను కలిపి రాశిచక్రం అంటారు.
- జ్యోతిష్య శాస్త్రజ్ఞులు ఈ రాశుల తేదీలను బట్టి కాలాలను, రుతువులను, పంచాగాలను గుణిస్తారు.
- రాకెట్లు రెండు రకాలు అవి.. 1. యుద్ధ రాకెట్లు, 2. రోదసీ రాకెట్లు.
- కృత్రిమ ఉపగ్రహం భూమ్యాకర్షణ శక్తిని అధిగమించి నిర్దిష్ట కక్ష్యలో ప్రవేశించేందుకు సెకనుకు 11.2 కి.మీల. వేగం అవసరం.
- కృత్రిమ ఉపగ్రహాలు భూమికి ఉపగ్రహాలుగా పనిచేస్తే, స్పేస్ ప్రోబ్స్ అనేవి ఇతర గ్రహాలను శోధించేందుకు తోడ్పడతాయి.
- ప్రప్రథమంగా రష్యా.. 1957, అక్టోబర్ 4న మానవుడు లేని స్పుత్నిక్–1 అనే అంతరిక్ష నౌకను రోదసీలోకి పంపింది.
- 1961, ఏప్రిల్ 12న రష్యాకు చెందిన కల్నల్ యూరీ గగారిన్.. వస్తోక్ అనే అంతరిక్ష నౌక ద్వారా 83.34 ని॥ల్లో మొట్టమొదటిసారిగా భూ ప్రదక్షిణం చేశాడు.
- 1963లో వస్తోక్–6 అనే అంతరిక్ష నౌకలో రష్యా మహిళ లెఫ్టినెంట్ కల్నల్ వాలెంటీనా టెరిస్కోవా అంతరిక్ష యానం చేసింది.
- 1969, జూలై 21న అమెరికాకు చెందిన అపోలో–11 అనే అంతరిక్ష నౌక ద్వారా నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఎడ్విన్ ఆల్డ్రిన్‌లు ప్రప్రథమంగా చంద్రుడిపై కాలుమోపారు.
- 1984, ఏప్రిల్ 3న భారతదేశానికి చెందిన స్క్వాడ్రన్ లీడర్ రాకేష్‌శర్మ.. సోయూజ్–టి–11 అనే రోదసీ నౌక ద్వారా అంతరిక్షయానం చేశాడు.
- భారతదేశం కూడా రోదసీ పరిశోధనల్లో ఎంతో ప్రగతిని సాధించింది. ఆర్యభట్ట, భాస్కర 1, 2, రోహిణి, ఐఆర్ఎస్, ఇన్‌శాట్ - 1ఎ, 1బి, 1సి, 1డి, 2ఎ, 2బి; పీఎస్ఎల్‌వీ - డి2 మొదలైన ఉపగ్రహాలను ప్రయోగించింది.
- ఆంధ్రప్రదేశ్‌లో శ్రీహరికోట వద్ద రాకెట్ లాంచింగ్ స్టేషన్ (షార్) ఉంది.
- మన విశ్వం వేలకొద్దీ గెలాక్సీలను కలిగి ఉంది. ప్రతి గెలాక్సీలోనూ మిలియన్ల నక్షత్రాలున్నాయి.
- నక్షత్రాలకు వాటి చుట్టూ తిరిగే గ్రహ కూటములున్నాయి.
- గ్రహాలకు వాటి చుట్టూ తిరుగుతూ ఉండే ఉపగ్రహాలుంటాయి. అందువల్ల మన విశ్వం చాలా విశాలమైంది.
- సూర్యుడు పాలపుంత అనే గెలాక్సీకి చెందిన ఒక సామాన్య నక్షత్రం. సూర్యుడు, గ్రహాలు, వాటి ఉపగ్రహాలు, ఆస్టరాయిడ్స్ అన్నింటినీ కలిపి సూర్య కుటుంబం అంటారు.
- గ్రహాలన్నీ సూర్యుడి చుట్టూ వివిధ దీర్ఘ వృత్తాకార మార్గాల్లో తిరుగుతున్నాయి.
- భూమి సహజ ఉపగ్రహం చంద్రుడు.
- భూమి సూర్యుడి చుట్టూ ఒక పరిభ్రమణం పూర్తి చేయడానికి ఒక సంవత్సరం పడుతుంది. అంటే 365 1/4 రోజులు. భూమి తన అక్షం చుట్టూ తాను తిరగడానికి 24 గంటలు పడుతుంది.



- సూర్యుడికి, భూమికి మధ్య దూరాన్ని ఖగోళ ప్రమాణం అంటారు.
  $1AU = 1.496\times10^{11}$ మీ॥
- కాంతి ఒక సంవత్సర కాలంలో శూన్యం లో ప్రయాణించే దూరాన్ని కాంతి సంవత్సరం అంటారు.
- ఒక కాంతి సంవత్సరం = 9.3×10^{15} మీ॥ = 6.33×10^{4} AU
- పార్‌సెక్ అనేది దూరం ప్రమాణాలన్నింటిలోనూ పెద్దది. ఇది 3.26 కాంతి సంవత్సరాలకు సమానం.
- బుధ గ్రహం పరిభ్రమణ కాలం - 88 రోజులు.
- అత్యధిక పరిభ్రమణ కాలం కలిగిన గ్రహం ప్లూటో (248 సం॥లు).
- గ్రహాలన్నింటిలో పెద్ద గ్రహం - గురుడు (బృహస్పతి)
- గ్రహాలన్నింటిలో చిన్న గ్రహం - బుధుడు.
- సూర్యుడి నుంచి కనిష్ట దూరంలో బుధుడు, గరిష్ట దూరంలో ప్లూటో ఉన్నాయి.
- అత్యధిక ఉపగ్రహాలు ఉన్న గ్రహం–శని (30)
- ఉపగ్రహాలు లేని గ్రహాలు - బుధుడు, శుక్రుడు.
- భూమి మీద మినహా మిగతా గ్రహాలపై ప్రాణులు ఉండటానికి అనుకూల వాతావరణ పరిస్థితులు లేవు.
- బుధ గ్రహం సూర్యుడికి అతి సమీపంలో ఉండటం వల్ల దాని మీద పగలు అతి వేడిగా, రాత్రి అతి చల్లగా ఉంటుంది.
- శుక్ర గ్రహం అతి దట్టమైన మేఘాలతో కప్పి ఉండటం వల్ల సూర్యకాంతి దాని తలాన్ని చేరలేదు.
- శని గ్రహం కిలోమీటర్ల మందం ఉన్న మంచు పొరలతో కప్పి ఉండటం వల్ల అతి చల్లగా ఉంటుంది. కాబట్టి ప్రాణులుండేందుకు అవకాశం లేదు.
- కుజ గ్రహం మాత్రం ఆక్సిజన్, నీటి ఆవిరిలతో కూడిన వాతావరణం కలిగి ఉంది. దాని ఉష్ణోగ్రత 25^0 సెంటీగ్రేడ్ నుంచి 40^0 సెంటీగ్రేడ్‌కి మధ్యలో ఉంటుంది.
- ధ్రువ నక్షత్రాన్ని ఆంగ్లంలో పోలారిస్ అంటారు. ఇది భూమి ఉత్తర ధ్రువానికి ఎదురుగా ఉంది.
- ధ్రువ నక్షత్ర స్థానాన్ని సప్తర్షి మండలం సహాయంతో తెలుసుకోవచ్చు.
- సప్తర్షి మండలాన్ని ఇంగ్లిష్‌లో గ్రేట్‌బేర్ అంటారు.
- గ్రేట్‌బేర్ అనేది నాగలి లేదా గాలిపటం ఆకారంలో ఉంటుంది.
- సూర్యుడు తన చుట్టూ తాను ఒకసారి తిరిగి రావడానికి 25 రోజులు పడుతుంది.
- లీప్ సంవత్సరంలో 366 రోజులుంటాయి. ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి.
- సూర్యుడి తర్వాత భూమికి అత్యంత సమీపంలోని నక్షత్రం- ప్రాక్సిమాసెంటౌరి
- హేలీ తోకచుక్క 76 సంవత్సరాలకు ఒకసారి కనిపిస్తుంది.
- రాశులన్నింటిలో పెద్ద తారాగణం - హైడ్రా
- చంద్రుడిపై వస్తువుల బరువు భూమిపై బరువులో ఆరో వంతు ఉంటుంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. చంద్రుడు తన చుట్టూ తాను, అలాగే భూమి చుట్టూ తిరగడానికి పట్టే రోజులు? (డీఎస్సీ–2000)
   1) 30 రోజులు 2) 29 1/2 రోజులు
   3) 92 1/2 రోజులు 4) 29 రోజులు
2. ధ్రువ నక్షత్రం నావికులకు దేన్ని తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది? (డీఎస్సీ - 2000)
   1) గెలాక్సీ 2) గాలి
   3) దిక్కు 4) వాతావరణం
3. ఒక కాంతి సంవత్సరం (కి.మీ.లలో)? (డీఎస్సీ–2001)
   1) $3\times10^4\times60\times60\times24\times365.25$
   2) $3\times10^2\times60\times60\times24\times365.25$
   3) $3\times10^5\times60\times60\times24\times365.25$
   4) $3\times10^3\times60\times60\times24\times365.25$
4. నక్షత్రాలు కాంతిని నలుదిశలకు వెదజల్లాలంటే వాటిలో ఉండాల్సిన ఉష్ణోగ్రత? (డీఎస్సీ–2002)
   1) 10 మిలియన్ డిగ్రీల ఫారన్‌హీట్
   2) 5 మిలియన్ డిగ్రీల సెంటీగ్రేడ్
   3) 5 మిలియన్ డిగ్రీల ఫారన్‌హీట్
   4) 10 మిలియన్ డిగ్రీల సెంటీగ్రేడ్
5. 1994లో విజయవంతంగా ప్రయోగించిన భారతీయ ఉపగ్రహ నౌక? (డీఎస్సీ–2002)
   1) ఇన్‌శాట్–1బి 2) పీఎస్ఎల్‌వీడీ–2
   3) భాస్కర–2 4) ఆర్యభట్ట
6. సూర్యుడికి, భూమికి మధ్య ఉన్న సగటు దూరం?
   1) 149,000,000 కి.మీ.
   2) 149,598,500 కి.మీ.
   3) 149,593,300 కి.మీ
   4) 149,895,500 కి.మీ.
7. ఏ అంతరిక్ష నౌకల ద్వారా అంగారక గ్రహంపై జీవరాశి లేదని నిరూపించారు? (డీఎస్సీ–2003)
   1) స్కాటర్న్ - 5, స్కాటర్న్ - 6
   2) అపోలో - 11, సోయూజ్–టీ–11
   3) వైకింగ్–1, వైకింగ్–2
   4) సోయూజ్ –టీ–11, శాల్యూట్
8. బుధ గ్రహం పరిభ్రమణ కాలం? (డీఎస్సీ–2006)
   1) 88 రోజులు 2) 248 రోజులు
   3) 365 రోజులు 4) 243 రోజులు
9. స్క్వాడ్రన్ లీడర్ రాకేశ్ శర్మ అంతరిక్ష యానం చేసిన రోజు? (డీఎస్సీ–2006)
   1) 3–6–1984 2) 3–4–1984
   3) 3–4–1985 4) 3–6–1985
10. భూమధ్య రేఖ వద్ద భూమి వ్యాసం కి.మీ.లలో? (డీఎస్సీ - 2008)
    1) 12,576 2) 12,657
    3) 12,756 4) 12,765
11. సూర్యుడి చుట్టూ పరిభ్రమించే గ్రహాల్లో ద్రవ్యరాశిలో రెండో స్థానంలో ఉన్న గ్రహం, ఆత్మభ్రమణ కాలం అన్నింటి కంటే ఎక్కువ ఉన్న గ్రహం వరుసగా? (డీఎస్సీ - 2008)
    1) బృహస్పతి, భూమి
    2) బుధుడు, అంగారకుడు
    3) శని, శుక్రుడు 4) నెప్ట్యూన్, యురేనస్
12. స్పేస్ ప్రోబ్‌కు ఉదాహరణ? (డీఎస్సీ–2008)
    1) పయనీర్ 2) ఆర్యభట్ట
    3) భాస్కర - 2 4) అట్లాంటిస్
13. ఏ గ్రహం మీద ఆక్సిజన్, నీటి ఆవిరితో కూడిన వాతావరణం ఉంది? (డీఎస్సీ–2012)
    1) కుజుడు 2) బుధుడు
    3) బృహస్పతి 4) యురేనస్

సమాధానాలు

1) 2; 2) 3; 3) 3; 4) 4; 5) 2; 6) 2; 7) 3; 8) 1; 9) 2; 10) 3; 11) 3; 12) 1; 13) 1.

మాదిరి ప్రశ్నలు

1. భారతదేశం మొదటగా భూకక్ష్యలోకి ప్రయోగించిన కృత్రిమ ఉపగ్రహం?
   1) ఆర్యభట్ట
   2) భాస్కర–1
   3) ఇన్‌శాట్ - 1బి
   4) భాస్కర - 2
2. అన్నింటికంటే ప్రకాశంగా కనిపించే గ్రహం?
   1) శని 2) భూమి
   3) శుక్రుడు 4) బుధుడు
3. పగలు, రాత్రి ఏర్పడడానికి కారణం?
   1) భూ పరిభ్రమణం
   2) భూ భ్రమణం
   3) ఉల్కాపాతం
   4) ఏదీకాదు
4. సూర్య గ్రహణం ఏ సందర్భంలో ఏర్పడుతుంది?
   1) భూమి.. చంద్రుడికి, సూర్యుడికి మధ్య వచ్చినప్పుడు
   2) చంద్రుడు.. భూమికి, సూర్యుడికి మధ్య వచ్చినప్పుడు
   3) సూర్యుడు భూమి, చంద్రుడి మధ్య వచ్చినప్పుడు
   4) అన్నీ
5. రాశుల్లో అన్నింటికంటే పెద్ద తారాగణం?
   1) సెరస్ 2) ఇంకారస్
   3) హైడ్రా 4) హేలీ
6. రష్యా సహకారంతో భారతదేశంలో రాకెట్ లాంచింగ్ స్టేషన్‌లు ఏర్పర్చిన ప్రదేశాలు?
   1) తుంబా 2) శ్రీహరికోట
   3) ఢిల్లీ 4) 1, 2
7. అత్యధిక ఉపగ్రహాలు కలిగిన గ్రహం?
   1) శని 2) బృహస్పతి
   3) బుధుడు 4) శుక్రుడు
8. ఇప్పటివరకు గుర్తించిన నక్షత్రాల్లో అతిపెద్దది?
   1) సెరస్ 2) ఎప్సిలాన్ అరిగ
   3) హైడ్రా 4) ఇంకారస్
9. మొట్టమొదటి స్పేస్ షటిల్?
   1) అపోలో 2) స్పుత్నిక్
   3) కొలంబియా
   4) వస్తోక్
10. స్కైలాబ్ అనే ప్రయోగాత్మక అంతరిక్ష ప్రయోగ కేంద్రాన్ని ఏ దేశం ఏర్పాటు చేసింది?
    1) రష్యా 2) అమెరికా
    3) ఇండియా 4) సింగపూర్

సమాధానాలు

1) 1; 2) 3; 3) 2; 4) 2; 5) 3; 6) 4; 7) 1; 8) 2; 9) 3; 10) 2.

మొదటి ఆర్థిక సంఘం అధ్యక్షుడు ఎవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ



మాదిరి ప్రశ్నలు

1. వివిధ ప్రకరణలకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?

ఎ) ప్రకరణ 43ఎ – కార్మికులకు యాజమాన్యంలో భాగస్వామ్యం కల్పించడం
బి) ప్రకరణ 43బి: సహకార సంఘాలను ప్రోత్సహించడం
సి) ప్రకరణ 48ఎ – అడవులు, వన్యప్రాణి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలి
డి) ప్రకరణ 39ఎ – సమన్యాయం, ఉచిత న్యాయ సహాయం

1) ఎ, బి, సి 2) బి, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

2. స్పీకర్‌కు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?

1) స్పీకర్‌ను రాష్ట్రపతి తొలగించవచ్చు
2) ఎన్నిక సమయంలో స్పీకర్ సభలో సభ్యుడు కానవసరం లేదు. కానీ నియమించిన ఆరు నెలల్లో పార్లమెంట్‌కు ఎన్నికవ్వాలి
3) సభ సాధారణ కాలపరిమితి కంటే ముందే రద్దయితే దానితో పాటే స్పీకర్ కూడా తన పదవిని కోల్పోతారు
4) రాజీనామా పత్రాన్ని డిప్యూటీ స్పీకర్‌కు సమర్పించాలి

3. కింది వాటిలో భారత ఎన్నికల సంఘం విధులు ఏవి?

ఎ) లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, రాజ్యసభ ఉపాధ్యక్షుడి ఎన్నిక నిర్వహించడం
బి) కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికల నిర్వహణ
సి) ఎన్నికలకు సంబంధించిన అనుమానాలు, వివాదాలపై నిర్ణయం

1) ఎ, బి 2) ఎ, సి
3) బి, సి 4) పైవేవీకావు

4. అతి తక్కువ కాలం పదవిలో ఉన్న రాష్ట్రపతి ఎవరు?

1) సర్వేపల్లి రాధాకృష్ణన్
2) జాకీర్ హుస్సేన్ 3) జ్ఞానీ జైల్ సింగ్
4) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్

5. రాజ్యసభ ద్రవ్యబిల్లుకు సవరణలు సూచించినప్పుడు..?

1) లోక్‌సభ ఆ సవరణలను ఆమోదించవచ్చు, తిరస్కరించవచ్చు
2) లోక్‌సభ ఆ ద్రవ్య బిల్లును వదిలేస్తుంది
3) లోక్‌సభ ఆ ద్రవ్య బిల్లును రాజ్యసభకు పునఃపరిశీలనకు పంపిస్తుంది
4) రాష్ట్రపతి ఆ ద్రవ్య బిల్లు గురించి ఉభయ సభల సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తారు

6. కింది వాక్యాల్లో సరైంది ఏది?

1) ఒక వ్యక్తిని ఏక కాలంలో రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలకు గవర్నర్‌గా నియమించరాదు
2) సుప్రీంకోర్టు న్యాయమూర్తులను రాష్ట్రపతి నియమించిన విధంగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులను గవర్నర్ నియమిస్తారు
3) గవర్నర్‌ను పదవి నుంచి తొలగించే విధానం రాజ్యాంగంలో పేర్కొనలేదు
4) కేంద్రపాలిత ప్రాంతాలకు శాసనసభ ఉంటే లెఫ్టినెంట్ గవర్నర్ మెజార్టీ పార్టీ నాయకుడిని సీఎంగా నియమిస్తారు

7. వివిధ ప్రకరణలకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?

ఎ) ప్రకరణ 123–ఆర్డినెన్సులను జారీ చేయడానికి రాష్ట్రపతికి ఉన్న అధికారం
బి) ప్రకరణ 213 – గవర్నర్ ఆర్డినెన్సును జారీ చేసే అధికారం
సి) ప్రకరణ 262 – అంతర్రాష్ట్రీయ మండలి ఏర్పాటు

1) ఎ, బి, సి 2) బి, సి
3) ఎ, బి 4) ఎ, సి

8. రాజ్యాంగ పరిషత్ కమిటీలు, వాటి అధ్యక్షులకు సంబంధించి కింది వాటిని జతపరచండి.

జాబితా – I
i) సారథ్య సంఘం
ii) క్రెడెన్షియల్ కమిటీ
iii) ప్రాథమిక హక్కుల ఉపకమిటీ
iv) యూనియన్ పవర్స్ కమిటీ

జాబితా – II
a) అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
b) రాజేంద్ర ప్రసాద్ c) జె.బి. కృపలానీ
d) జవహర్ లాల్ నెహ్రూ

1) i-b, ii-a, iii-c, iv-d
2) i-a, ii-b, iii-c, iv-d
3) i-b, ii-c, iii-a, iv-d
4) i-c, ii-a, iii-b, iv-d

9. అటార్నీ జనరల్‌కు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?

ఎ) లోక్‌సభ చర్చలో పాల్గొనవచ్చు
బి) లోక్‌సభ కమిటీ సభ్యుడు
సి) లోకసభలో మాట్లాడొచ్చు
డి) లోక్‌సభలో ఓటు వేయవచ్చు

1) ఎ మాత్రమే 2) బి, డి
3) ఎ, బి, సి 4) ఎ, సి

10. 'భారత సార్వభౌమత్వం, ఐక్యత, అఖండతలను సమర్థించడం, సంరక్షించడం'లను దేనిలో పేర్కొన్నారు?

1) రాజ్యాంగ ప్రవేశిక
2) ఆదేశిక సూత్రాలు
3) ప్రాథమిక హక్కులు
4) ప్రాథమిక విధులు

11. మొదటి ఆర్థిక సంఘం అధ్యక్షుడు ఎవరు?

1) కె. సంతానం 2) ఎ.కె. చాంద్
3) కె.సి. నియోగి 4) వై.బి. చవాన్

12. కింది వాటిలో అఖిల భారత సర్వీసులకు సంబంధించి నియామకాలు చేసేది?

1) రాష్ట్రపతి
2) ఏ రాష్ట్రానికి చెందితే ఆ రాష్ట్ర గవర్నర్లు
3) యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్
4) ఆయా రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు

13. 'జీరో అవర్' అని దేన్ని అంటారు?

1) సభ ప్రారంభమైన తొలి గంట
2) సభ్యులు ఎవరూ హాజరుకాని సమయం
3) ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన తర్వాత, సభా కార్యక్రమాల ప్రారంభానికి ముందు ఉన్న సమయం
4) ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభానికి, సభా కార్యక్రమాల ముగింపునకు మధ్య సమయం

14. రాజ్యాంగ రిట్లలో 'ఆజ్ఞ' అనేది దేని అర్థం?

1) ప్రొహిబిషన్ 2) మాండమస్
3) సెర్షియోరరి 4) కో వారెంటో

15. కేంద్రంలో ఏర్పాటైన మొదటి సంకీర్ణ ప్రభుత్వం ఏది?

1) జనతా ప్రభుత్వం
2) యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం
3) నేషనల్ డెమొక్రటిక్ ప్రభుత్వం
4) నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం

16. కింది వారిలో ఉన్నతాధికార, దౌత్య సంబంధ పదవులు చేపట్టి ఉపరాష్ట్రపతులుగా కొనసాగిన వారెవరు?

1) డా.ఎస్.రాధాకృష్ణన్ 2) జి.ఎస్. పథక్
3) వి.వి. గిరి 4) బి.డి. జెట్టి

17. పీఠికలోని 'స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం' అనే భావాలను ఏ విప్లవం నుంచి గ్రహించారు?

1) రష్యా 2) ఫ్రెంచ్
3) అమెరికా 4) జర్మనీ

18. 'సామ్యవాదం, లౌకికవాదం' అనే పదాలను భారత రాజ్యాంగంలో ఎన్నో సవరణ ద్వారా చేర్చారు?

1) 44 2) 40 3) 38 4) 42

19. 'కో వారెంటో' అంటే..?

1) బంధీ ప్రత్యక్ష 2) అధికార పృచ్ఛ
3) పరమాదేశ 4) ఉత్ప్రేషణ

20. 'స్థానిక సంస్థల పితామహుడు' అని ఎవరిని పిలుస్తారు?

1) లార్డ్ రిప్పన్ 2) లార్డ్ కానింగ్
3) లార్డ్ రిప్పన్ 4) లార్డ్ మౌంట్ బాటన్

21. 'ఒక తప్పునకు రెండుసార్లు శిక్షార్హం కాదు' అని తెలిపే సిద్ధాంతం ఏది?

1) రిపగ్నన్సీ సిద్ధాంతం
2) ద్వంద్వ శిక్ష నిషేధ సిద్ధాంతం
3) గ్రహణ సిద్ధాంతం
4) రెట్రిబ్యూషన్ సిద్ధాంతం

22. కమిటీలు, అవి సిఫారసు చేసిన అంశాలకు సంబంధించి కింది వాటిని జతపరచండి.

జాబితా – I
i) బల్వంతరాయ్ మెహతా కమిటీ
ii) అశోక్ మెహతా కమిటీ
iii) సి.హెచ్. హనుమంతరావు కమిటీ
iv) ఎల్.ఎం. సింఘ్వి కమిటీ

జాబితా – II
a) రెండంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటు
b) జిల్లా ప్రణాళికా బోర్డుల ఏర్పాటు
c) మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటు
d) పంచాయతీరాజ్ సంస్థలను రాజ్యాంగ బద్ధం చేయాలి

1) i-b, ii-a, iii-c, iv-d
2) i-c, ii-b, iii-a, iv-d
3) i-c, ii-a, iii-b, iv-d
4) i-d, ii-a, iii-b, iv-c

23. కింది వాటిలో సరైన వాక్యం ఏది?

ఎ) జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఏటా జనవరి 25న నిర్వహిస్తారు
బి) ఎన్నికల సంఘం తన నివేదికను రాష్ట్రపతికి సమర్పిస్తుంది
సి) ఎన్నికల సంఘం తన నివేదికను పార్లమెంట్‌కు సమర్పిస్తుంది
డి) ఎన్నికల సంఘం తన నివేదికను ఎవరికీ సమర్పించాల్సిన అవసరంలేదు

1) ఎ, డి 2) బి, డి
3) ఎ, సి 4) సి, డి

24. కింది వాటిలో సమాఖ్య ప్రభుత్వ లక్షణాలు ఏవి?

ఎ) ఏక పౌరసత్వం
బి) ద్వంద్వ ప్రభుత్వం
సి) లిఖిత రాజ్యాంగం
డి) ద్విసభా పద్ధతి
ఇ) ఒకే రాజ్యాంగం
ఎఫ్) కేంద్రం రాష్ట్రాలను పునర్వ్యవస్థీకరించడం

1) ఎ, బి, సి, ఎఫ్ 2) బి, సి, డి
3) డి, ఇ, ఎఫ్ 4) ఎ, సి, డి, ఇ

25. కింది వాటిలో ఏక కేంద్ర లక్షణాలు ఏవి?

ఎ) అఖిల భారత సర్వీసులు
బి) అత్యవసర అధికారాలు
సి) అధికార విభజన
డి) స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న న్యాయవ్యవస్థ
ఇ) గవర్నర్ వ్యవస్థ
ఎఫ్) రాజ్యాంగేతర సంస్థలు

1) ఎ, బి, ఇ, ఎఫ్ 2) బి, సి, డి
3) డి, ఇ, ఎఫ్ 4) ఎ, సి, డి, ఇ

26. కింది వాటిలో సరైన జత ఏది?

ఎ) జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం – ఏప్రిల్ 24
బి) ప్రవాస భారతీయ దివస్ – జనవరి 9
సి) ప్రాథమిక విధుల దినోత్సవం – జనవరి 3

1) ఎ, బి 2) బి, సి
3) ఎ, బి, సి 4) సి, డి

27. జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలి పదవీ కాలం ఎన్నేళ్లు?

1) రెండేళ్లు 2) మూడేళ్లు
3) నాలుగేళ్లు 4) ఐదేళ్లు

28. ప్రాంతీయ పార్టీలు, వాటి వ్యవస్థాపక అధ్యక్షులకు సంబంధించి కింది వాటిని జతపరచండి?

జాబితా – I
i) శివసేన
ii) ద్రవిడ మున్నేట్ర కజగం
iii) ఆలిండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం
iv) దేశీయ ముర్పొక్కు ద్రవిడ మున్నేట్ర కజగం

జాబితా – II
a) సి.ఎన్. అన్నాదురై
b) ఎం.జి. రామచంద్రన్
c) బాల్‌థాకరే d) విజయ్‌కాంత్

1) i-b, ii-a, iii-c, iv-d
2) i-c, ii-b, iii-a, iv-d
3) i-c, ii-a, iii-b, iv-d
4) i-d, ii-a, iii-b, iv-c

29. ప్రాంతీయ పార్టీలు, వాటిని ఏర్పాటు చేసిన సంవత్సరాలకు సంబంధించి కింది వాటిని జతపరచండి.

జాబితా – I
i) ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్
ii) అసోం గణ పరిషత్
iii) తెలంగాణ రాష్ట్ర సమితి
iv) తెలుగుదేశం పార్టీ

జాబితా – II
a) 2001 b) 1985
c) 1998 d) 1982

1) i-b, ii-a, iii-c, iv-d
2) i-c, ii-b, iii-a, iv-d
3) i-b, ii-c, iii-a, iv-d
4) i-d, ii-c, iii-a, iv-b

30. షెడ్యూల్ 12లో పేర్కొన్న అంశాలు ఎన్ని?

1) 19 2) 18 3) 29 4) 28

31. అధికరణ 136 ప్రకారం సుప్రీంకోర్టుకు ఉన్న అధికారం?

1) సివిల్ జూరిస్‌డిక్షన్
2) అప్పిలేట్ జూరిస్‌డిక్షన్
3) స్పెషల్ లీవ్ పిటిషన్
4) ట్రాన్స్‌ఫర్డ్ జూరిస్‌డిక్షన్

32. ఏ రాజ్యాంగ సవరణ ప్రకారం 2020 వరకు రిజర్వేషన్లు పొడిగించారు?

1) 77 2) 98 3) 95 4) 84

33. కింది వాటిలో రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు హక్కు లేనివారు?

1) లోక్‌సభ సభ్యులు
2) రాజ్యసభ సభ్యులు
3) ఢిల్లీ, పుదుచ్చేరి శాసన సభల సభ్యులు
4) రాష్ట్ర శాసన మండలి సభ్యులు

34. స్వతంత్ర భారత తొలి ఆర్థిక మంత్రి?

1) ఆర్.కె. షణ్ముగం చెట్టి
2) జాన్ మత్తాయ్ 3) సి.డి. దేశ్‌ముఖ్
4) టి.టి. కృష్ణమాచారి

35. వివిధ జాతీయ పార్టీలు, అవి ఏర్పాటైన సంవత్సరాలకు సంబంధించి కింది వాటిని జతపరచండి.

జాబితా – I
i) బహుజన్ సమాజ్ పార్టీ
ii) నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ
iii) కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా
iv) భారతీయ జనతా పార్టీ

జాబితా – II
a) 1925 b) 1980
c) 1999 d) 1984

1) i-b, ii-a, iii-c, iv-d
2) i-a, ii-b, iii-c, iv-d
3) i-b, ii-c, iii-a, iv-d
4) i-d, ii-c, iii-a, iv-b

సమాధానాలు

1) 4	2) 4	3) 4	4) 2	5) 1
6) 3	7) 3	8) 1	9) 3	10) 4
11) 3	12) 1	13) 3	14) 2	15) 1
16) 1	17) 2	18) 4	19) 2	20) 1
21) 2	22) 3	23) 1	24) 2	25) 1
26) 3	27) 2	28) 3	29) 2	30) 2
31) 3	32) 3	33) 4	34) 1	35) 4

Who among them is taller...

BANK EXAMS

REASONING

Directions(Q.1-4): **Five friends Lokesh, Manoj, Gopal, Raveesh and Rohit have agreed to work together on a part-time job offered by a local restaurant. The restaurant opens 5 days a week and this group have following schedules when they can work.**

- Neeraj and Raveesh can work on Monday, Tuesday and Wednesday
- Raveesh and Rohit can work on Monday, Wednesday and Thursday
- Rohit and Lokesh can work on Monday, Friday and Thursday
- Lokesh and Manoj can work on Friday, Tuesday and Thursday.
- Neeraj and Manoj can work on Friday, Tuesday and Wednesday.

Based on the above passage, answer the following questions.

1. Which one of the five friends cannot work on Thursday?
a) Neeraj
b) Raveesh
c) Rohit
d) Lokesh
e) Manoj

2. Which is the one who cannot work on Tuesday?
a) Neeraj
b) Raveesh
c) Rohit
d) Lokesh
e) Manoj

3. Name the person who cannot work on Friday?
a) Neeraj b) Rohit
c) Manoj d) Raveesh
e) Lokesh

4. Name the person who cannot work on Monday?
a) Rohit b) Manoj
c) Raveesh d) Lokesh
e) Neeraj

Answers(1-4): To answer this kind of questions, tabulating the given information is very useful.

- People working on monday- Neeraj, Raveesh, Rohit and Lokesh.
- People working on Tuesday- Neeraj, Raveesh, Lokesh and Manoj
- People working on Wednesday - Neeraj, Raveesh, Rohit and Manoj
- People working on Thursday - Raveesh, Rohit, Lokesh and Manoj
- People working on Friday - Rohit, Lokesh, Manoj and Neeraj

1. **Ans:** a.
From the above table, it is clear that Neeraj Cannot work on Thursday.
2. **Ans:** c.
Rohit Cannot work on Tuesday.
3. **Ans:** d.
Raveesh Cannot work on Friday.
4. **Ans:** b.
Manoj cannot work on Monday.

Directions(Q.5-7): **Four couples are invited to a dinner party. They will be seated at a circular table. Follo- wing are the seating conditions.**

- Geeta refuses to sit next to Ali
- Lata wants to sit in between Tilak and Hari
- Champa refuses to sit next to Farooq
- Niti is seated on Ali's right hand side
- Farooq and Tilak are seated exactly opposite to each other
- The seating arrangement is such that one women is always between two men.

5. Which of the following is the only possible seating arrange-ment to suit the above condi-tions?
a) Niti is to the right of Tilak
b) Lata is in between Geeta and Farooq
c) Champa is opposite to Geeta
d) Farooq is adjacent to Champa
e) Ali is to the right of Geeta

6. Which of the following combi- nations is not as per the instru- cted sitting arrangement?
a) Geeta, Farooq, Lata
b) Ali, Champa, Tilak
c) Hari, Lata, Tilak
d) Farooq, Niti, Ali
e) Hari, Geeta, Farooq

7. Which of the following state- ments are correct?
I. Ali is on Champa's right
II. Lata is on Tilak's left
III. Farooq is between Niti and Geeta
1) I 2) II
3) III 4)

Answers(5-7):
Male members:
Ali, Tilak, Hari and Farooq
Female members:
Geeta, Lata, Champa and Niti.
From the given data the seating arrangement of the 4 couples is as follows.



5. **Ans:** c.
From the above arrangement, it is clear that Champa and Geeta are exactly opposite.
6. **Ans:** a.
Geeta, Farooq, Lata are not seated in this order.
7. **Ans:** e.
From the above arrangement, it is clear that Ali is on Champa's right, Lata is on Tilak's left and Farooq is between Niti and Geeta.



Directions(Q.8-12): **Read the following information carefully and answer the questions.**

- Six friends P,Q,R,S,T and U are members of a club and play a different game of Football, Cricket, Tennis, Basket ball, Badminton and Volleyball.
- 'T' who is taller than 'P' and 'S' plays Tennis.
- The tallest among them plays Basketball
- The shortest among them plays Volleyball
- 'Q'&'S' neither plays Volleyball nor Basketball
- 'R' plays Volleyball
- 'T' is between Q who plays Football and 'P' in order of height

8. What does 'S' play?
a) Football
b) Either cricket or Badminton
c) Cricket d) Badminton
e) None of these

9. Who among them is taller than 'R' but shorter than P?
a) T b) Data inadequate
c) Q d) U
e) None of these

10. Which of the following state- ments is not true?
a) 'T' is taller than 'R'
b) 'U' is taller than 'Q'
c) 'P' is shorter than 'R'
d) 'Q' is taller than 'S'
e) 'S' is taller than 'P'

11. Who among the following plays Basketball?
a) S b) U c) Q d) K
e) None of these

12. Who will be at the third place if they are arranged in descen- ding order of their height?
a) T b) Q c) P d) S
e) None of these

Answers(8-12): From the given information, it is clear that 'R' plays Volleyball, 'T' plays Tennis and 'Q' plays Football. 'S' plays either Cricket or Badminton.

Order of Heights
Q>T>P and T>P&S
Þ Q>T>P> S>P
(\R is the shortest)

The tallest person shall plays Basketball, so it is only 'U' who can play Basketball. Hence 'P' also plays either Cricket or Badminton. Tabulating the above information...

Name	Game	Rank in Height
U	Basketball	1
Q	Football	2
T	Tennis	3
P	Cricket &	4
S	Badminton	5
R	Volley ball	6

8. **Ans:** b.
'S' plays either cricket or Badminton
9. **Ans:** e.
'S' is taller than 'R' but shorter than 'P'
10. **Ans:** c.
From the above table, it is clear that 'P' is taller than 'R'
11. **Ans:** b.
'U' Plays Basketball.
12. **Ans:** a.
From the table, it is clear that 'T' is third from top if they are arranged in descending order.

Directions(Q.13): **Persons X,Y,Z and Q live in red, green, yellow and blue coloured houses not necessarily in the same order. 'Z' lives in a yellow house. The green house is adjacent to the blue house. 'X' does not live adjacent to 'Z'. The yellow house is in between the green and red houses. The colour of the house X lives in is ______**
a) blue b) green
c) red d) can't be determined

Ans: a.
From the given information, Z lives in a yellow house, which is in between green and red houses. and also 'X' is not adjacent to 'Z'. Therefore 'X' lives in blue house.

Directions(Q.14): Five persons with names P, M, U, T and 'X' live separately in A palace, a hut, a fort, a house, a hotel. Each one likes two different colours from among the Blue, Black, Red, Yellow, Green. 'U' likes red and blue. 'T' likes black. The person living in a palace does not like black or blue. 'P' likes blue and red. 'M' likes yellow. 'X' lives in a hotel.

14. 'M' lives in a ———?
a) hut b) fort
c) palace d) house

Ans: c.
Given information can be tabulated as follows.

Person:	U	T	P	M	X
Colours:	Red/ Blue	Black	Blue/ Red	Yellow	–

It is given that the person living in palace does not like black or blue. so U, T and P cannot live in palace. Also it is given that 'X' lives in a hotel. Therefore the only person left over is 'M' and he lives in palace.